గురువారం 26-10-2023

సత్యమేవ జయతే
సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 215



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసిన తర్వాత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



మ్యాక్స్‌వెల్ విధ్వంసం
వరల్డ్‌కప్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ. నెదర్లాండ్స్‌పై 309 పరుగులతో నెగ్గిన ఆసీస్. - 14లో



ఎవరికి వారే మహిళా'మణు'లే
శిక్షణ పూర్తి చేసుకున్న 32 మంది మహిళా ఐపీఎస్ ట్రైనీలపై కథనం. - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'కేసీఆర్ భరోసా'

ఆ పేరుతోనే జనంలోకి మేనిఫెస్టో: మంత్రి కేటీఆర్

కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని ఆగం చేసింది..



- కష్టపడి సాధించుకున్న తెలంగాణను గద్దల పాలు చేయొద్దు
- ప్రజలను పదే పదే మోసం చేయడమే ఆ పార్టీ నైజం
- తెలంగాణ ఏర్పాటు తర్వాత సాగు, తాగునీరు, విద్యుత్ కష్టాలు దూరం
- బీఆర్ఎస్ రాష్ట్రంలోని ప్రతి మనిషి, ప్రతి ఇంటి పార్టీగా మారింది
- కేటీఆర్ సమక్షంలో కారెక్కిన పెద్దపల్లి, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 17 అంశాలతో 'కేసీఆర్ భరోసా' పేరిట జనంలోకి వెళ్లనున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు తెలిపారు. కేసీఆర్ భరోసా పేరిట మేనిఫెస్టోను పార్టీ శ్రేణులు గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి 11 పర్యాయాలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని ఆగం చేశారని, కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని గద్దల పాలు చేయొద్దని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు అన్ని రంగాల్లో పురోగమిస్తున్న రాష్ట్రాన్ని దగుల్బాజీ, దొంగల పార్టీ అయిన కాంగ్రెస్ చేతిలో పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో పెద్దపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు.. కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ ఎప్పుడో ప్రజలకు దూరమైంది

కాంగ్రెస్ పార్టీని ఎవరూ సొంతం చేసుకోరని, ఆ పార్టీ ఎప్పుడో ప్రజలకు దూరమైందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలను పదే పదే మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజమని, 'అమ్మకు అన్నం పెట్టనోడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడట' అనే రీతిలో కాంగ్రెస్ హామీలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటకలో ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ఆ పార్టీ విఫలమయ్యిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత మిగతా 2వ పేజీలో ▶

ఎన్నికల సమయంలో 'రైతుబంధు' ఆపండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి
- ఈసీతో ఠాక్రే, జైరాం రమేశ్, రేవంత్, భట్టి, ఉత్తమ్ భేటీ

3లో

రైతుబంధు ఆపేయాలనడం కాంగ్రెస్ వైఖరికి నిదర్శనం

- కాంగ్రెస్‌పై మండిపడ్డ భారత్ రాష్ట్ర సమితి
- ఈసీకి రాసిన లేఖను ఉపసంహరించుకోవాలని డిమాండ్

3లో

నేడు మునుగోడుకు కేసీఆర్

ఎన్నికల ప్రచార సభకు ఏర్పాట్లు పూర్తి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం నల్లగొండ జిల్లా మునుగోడులో ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని 10 ఎకరాల వ్యవసాయ భూమిలో ప్రజా ఆశీర్వాద సభ పేరుతో బహిరంగ సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల తరువాత సభ ప్రారంభం కానుంది. సభకు నియోజకవర్గంలోని 176 గ్రామాల్లో ఒక్కో గ్రామం నుంచి 500 మందిని తరలించేలా బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాహనాలను మిగతా 2వ పేజీలో ▶

ఏ క్షణమైనా మలి జాబితా

మిగిలిన 50కిపైగా స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

- సుదీర్ఘంగా కసరత్తు చేసి జాబితా సిద్ధం చేసిన సీఈసీ
- సీపీఎం, సీపీఐకి ఇచ్చే స్థానాలు, కొత్తగా నేతలు చేరే స్థానాలపై మరోసారి కసరత్తు
- కేసీ వేణుగోపాల్ నివాసంలో స్క్రీనింగ్ కమిటీ నేతల చర్చ
- పోటీ ఉన్న సీట్లపై పీటముడి
- స్పష్టత రాగానే మరో జాబితా



ఖర్గే అధ్యక్షతన జరిగిన సీఈసీ సమావేశంలో అగ్రనేతలు సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్, మురళీధరన్, ఠాక్రే రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం దాదాపుగా ఖరారు చేసింది. కమ్యూనిస్టులకు వదిలేసిన స్థానాలు, కొత్తగా నేతల చేరిక ఉండే సీట్లు, పోటీ ఎక్కువగా ఉన్న కొన్ని స్థానాలు మినహా 50కిపైగా అభ్యర్థుల పేర్లతో మలి జాబితాను సిద్ధం చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో ఆమోదించిన ఈ జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఇక పొత్తు, ఇతర అంశాలతో పెండింగ్ పెట్టిన మిగతా స్థానాలకు సంబంధించి బుధవారం రాత్రి కేసీ వేణుగోపాల్ నివాసంలో రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పెండింగ్ స్థానాల్లో అభ్యర్థులు, చేరికలపై చర్చించి, పలు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు తెలిసింది. గురువారం జరిగే సీఈసీ భేటీలో ఈ సిఫార్సులను అందజేయనున్నట్టు సమాచారం. సీఈసీ దీన్ని పరిశీలించి, పొత్తు సీట్లు, అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందని తెలిసింది.

గెలుపు అవకాశాలు, విధేయత ఆధారంగానే..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఇప్పటికే ఒకసారి భేటీ అయిన సీఈసీ.. 55మందితో తొలి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. మిగతా స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో మలి జాబితాపై జాప్యం జరుగుతూ వచ్చింది. మురళీధరన్ నేతృత్వంలో స్క్రీనింగ్ కమిటీ గత వారం రెండుసార్లు భేటీ అయి అభ్యర్థుల వడపోతను పూర్తిచేసింది. ఇటీవలే అభ్యర్థుల జాబితాను సీఈసీకి నివేదించింది. బుధవారం ఏఐసీసీ కార్యాలయంలో ఖర్గే అధ్యక్షతన సీఈసీ భేటీ జరిగింది. ఇందులో పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్, మురళీధరన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మిగతా 3వ పేజీలో ▶

ఎన్నికల చివరి వారమంతా ఇక్కడే! 3లో

తిరిగి కాంగ్రెస్ గూటికి రాజగోపాల్‌రెడ్డి

బీజేపీకి రాజీనామా చేస్తూ జేపీ నడ్డాకు లేఖ

కేసీఆర్, కౌరవ మూక ఆటకట్టించే లక్ష్యంతోనే నిర్ణయం

- ప్రజల కోరిక మేరకు రాజకీయ మార్గాన్ని మారుస్తున్నా..
- బీజేపీ కవితను అరెస్ట్ చేయలే.. కేసీఆర్ అవినీతిని అడ్డుకోలే..
- బీఆర్ఎస్–బీజేపీ ఒక్కటేనన్న భావన ప్రజల్లో ఉంది
- బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెసేనని ప్రజలు భావిస్తున్నారు
- మళ్లీ మునుగోడు నుంచే పోటీ చేస్తానని వెల్లడి
- అవకాశమిస్తే గజ్వేల్‌లో పోటీచేసి కేసీఆర్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని వ్యాఖ్య
- బీజేపీ డీలా పడిందన్న రాజగోపాల్ వ్యాఖ్యలు సరికాదన్న కిషన్‌రెడ్డి



మొయినాబాద్‌లో మీడియాతో రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రజాకంటకుడిగా మారిన కేసీఆర్, కౌరవ మూక ఆటకట్టించే లక్ష్యంతో బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. రాష్ట్రాన్ని ప్రజా తెలంగాణగా మార్చేదిశగా ప్రజల కోరిక మేరకు తన రాజకీయ మార్గాన్ని మార్చుకోవాల్సి వస్తోందని మిగతా 5వ పేజీలో ▶

రాజగోపాల్ బాటలో డీకే అరుణ కూడా?



- బీజేపీ తరఫున గద్వాల నుంచి పోటీకి నో
- వేరే అభ్యర్థిని నిలబెడితే మద్దతిస్తానని వెల్లడి
- డీకే అరుణ కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ ప్రచారం

- వివరాలు 5లో

కమలం పార్టీలో 'కొత్త' రేకల ఉక్కపోత!

- బీజేపీలో ప్రాధాన్య పదవులు ఇచ్చినా కుదురుకోని సీనియర్లు
- ఇప్పటికే జిట్టా, యెన్నం, నాగం, స్వామిగౌడ్, మోత్కుపల్లి బయటికి
- తాజాగా పార్టీని వీడిన రాజగోపాల్‌రెడ్డి.. ఆ బాటలో మరికొందరు అంటూ ప్రచారం

- వివరాలు 5లో

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో 'ఇండియా' బదులు 'భారత్'



➤ అన్ని పాఠ్య పుస్తకాల్లోనూ 'ఇండియా' స్థానంలో 'భారత్' పదాన్ని ప్రవేశపెట్టాలని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) భావిస్తోంది. పాఠశాల పాఠ్య ప్రణాళికలో మార్పుచేర్పుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ చైర్‌పర్సన్ సి.ఇసాక్ మాట్లాడుతూ 'ముఖ్యంగా ఇండియా పేరును అన్ని తరగతుల పాఠ్య పుస్తకాల్లోనూ భారత్‌గా మార్చాలని కమిటీ ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది' అని తెలిపారు. అయితే, కమిటీ సిఫార్సుల అమలుపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ దినేశ్ సక్లానీ స్పష్టం చేశారు. మరోపక్క కమిటీ సిఫార్సులను విపక్షాలు దుయ్యబట్టాయి. - 6లో



బైడెన్ నుంచి అవార్డులు అందుకున్న భారతీయ అమెరికన్ శాస్త్రవేత్తలు అశోక్ గాడ్గిల్, సుబ్రా సురేశ్

ఇద్దరు భారత అమెరికన్లకు అత్యున్నత పురస్కారాలు

బైడెన్ చేతుల మీదుగా అందుకున్న గాడ్గిల్, సురేశ్ - 6లో



గాజాలో కన్నీటి చుక్కలు

ఇజ్రాయెల్ ఆంక్షలతో నిలిచిపోయిన పెట్రోల్, డీజిల్ సరఫరా
మూలనపడ్డ వాహనాలు.. ఆగిపోతున్న సహాయక చర్యలు

➤ ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులతో దద్దరిల్లుతున్న గాజా స్ట్రిప్‌లో పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయి. ఇంధన కొరతతో సహాయక చర్యలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. శిథిలాలను తొలగించే అవకాశం లేకుండా పోవడంతో వాటికింద చిక్కుకుపోయిన మృతదేహాలు కుళ్లిపోతున్నాయి. మరోవైపు ఆసుపత్రుల్లో జనరేటర్లు పనిచేయక శస్త్రచికిత్సలు నిలిచిపోతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో మృతదేహాలు ఆసుపత్రుల నుంచి శ్మశానాలకు చేరుతున్నాయి. ఈ పరిణామాలపై 'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' ఆందోళన వ్యక్తం చేసింది. మరోపక్క పెట్రోల్, డీజిల్‌ను గాజాలోకి అనుమతించే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ సైన్యం తెగేసి చెబుతోంది. - 6లో

పగలు భగభగ.. రాత్రి గజగజ



రాష్ట్రంలో క్రమంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
పగటి పూట మాత్రం సాధారణ స్థితిలో నమోదు
30 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా గరిష్ట ఉష్ణోగ్రతలు
మరో నాలుగు రోజులపాటు ఇదే తరహా వాతావరణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. గత వారం వరకు సాధారణం కంటే 5 డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా... ఇప్పుడు గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గాయి. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ పూర్తి కావడంతో వాతావరణంలో వేగంగా మార్పులు చోటుచేసుకున్నాయి. మరోవైపు బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం తోడు కావడం, రాష్ట్రానికి ఈశాన్య దిశ నుంచి చల్లని గాలులు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగినట్లు కనిపిస్తోంది. ఉష్ణోగ్రతలు పతనం కావడంతో పాటు ఈశాన్య దిశల నుంచి వస్తున్న గాలుల ప్రభావంతో చలి పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఉత్తర ప్రాంత జిల్లాల్లో తక్కువగా..

సెప్టెంబర్ నెలాఖరుతో వానాకాలం ముగిసినప్పటికీ... అక్టోబర్ రెండో వారం వరకు నైరుతి ప్రభావం ఉంటుంది. తాజాగా నాలుగో వారం వరకు చలి తీవ్రత పెద్దగా లేకపోగా... రెండ్రోజులుగా వాతావరణంలో వేగంగా మార్పులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తగ్గుదల నమోదవుతోంది. మెదక్, వరంగల్ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మధ్యన నమోదయ్యాయి. ఆదిలాబాద్, హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో మిగతా 2వ పేజీలో ▶

'కూన'పై ఎమ్మెల్యే వివేకానంద దాడి

భూకబ్జాలపై పరస్పర ఆరోపణలు..
రచ్చగా మారిన చర్చా కార్యక్రమం



శ్రీశైలం గౌడ్‌పై దాడి చేస్తున్న వివేకానంద

కుత్బుల్లాపూర్: ఓ టీవీ చానల్ ఏర్పాటు చేసిన చర్చా వేదిక రసాభాసగా మారింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పలు సమస్యలను లేవనెత్తుతూ ఓ టీవీ చానల్ సూరారం రామ్‌లీలా మైదానంలో బుధవారం బహిరంగ చర్చ నిర్వహించింది. ఈ వేదికలో భూకబ్జాల విషయంపై బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఎమ్మెల్యే వివేకానంద మధ్య వాడివేడిగా చర్చ జరగ్గా, ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఎమ్మెల్యే వివేకానంద సహనం కోల్పోయి శ్రీశైలంగౌడ్ పై దాడి చేసి గొంతు పట్టుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. ఓ వైపు బీజేపీ, మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఇదే చర్చావేదికలో కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి కూడా ఉన్నారు. కాగా, ఎమ్మెల్యే వివేకానంద బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్‌పై దాడి చేయడాన్ని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి తీవ్రంగా ఖండించారు.

జంగ్ తెలంగాణ

చేదోడు లేని ఆ నలభై ఏడు!

- కాంగ్రెస్ పార్టీకి గతం ఓ చేదు జ్ఞాపకం
- చాలా కాలంగా రాష్ట్రంలోని 47 స్థానాల్లో పార్టీకి ఎదురుగాలి

తడారిన ఎడారి గొంతు వినండి!

- 21 సెగ్మెంట్లలో 8.3 లక్షల మంది గల్ఫ్ ఓటర్లు
- డిమాండ్ల సాధనకు గల్ఫ్ విడోస్‌తో పోటీ చేయించే యోచనలో సంఘాలు

సిటీ ఓటేస్తదా.. టూరేస్తదా..

పార్టీల్లో గుబులు పుట్టిస్తున్న 'పట్టణం'

- వివరాలు 7,8లో

న్యూస్‌రీల్

జప్తు చేసింది రూ.1.7 కోట్లే!



శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు కలిపి మొత్తం రూ.59.93 కోట్ల నగదు, 156 కిలోల బంగారం, 454 కిలోల వెండిని స్వాధీనం చేసుకోగా... అందులో రూ.1.76 కోట్లు మాత్రమే లెక్కలు లేని నగదుగా తేల్చి జప్తు చేశామని ఆదాయ పన్ను శాఖ తెలిపింది. - 16లో

సునీతకే నర్సాపూర్ టికెట్



నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనే దానిపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరదించుతూ మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పేరును పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. ప్రగతిభవన్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి చేతుల మీదుగా కేసీఆర్.. సునీతకు బీ ఫారం అందజేశారు. - 2లో

ఇదండీ సంగతి



ఇండియా కూటమి నిండా ప్రధాని అభ్యర్థులున్నట్లే మన పార్టీ నిండా సీఎం అభ్యర్థులున్నార్సార్

మేనిఫెస్టోకు న్యాయప్రాతిపదిక లేదు

అమలు చేయకున్నా అధికార పార్టీని చట్టపరంగా ప్రశ్నించలేం

- ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయడంలేదు
- ఎన్నికల పిటిషన్లలో ఆరు నెలల్లో తీర్పు ఇవ్వాలి
- ఈసీ అధికారుల నియామకానికి అత్యున్నత కమిటీ ఉండాలి
- ఎన్నికల్లో సంస్కరణలు రావాలంటే ఈసీ పనితీరు మారాలి

'సాక్షి'తో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోకు న్యాయప్రాతిపదిక లేదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల పిటిషన్లను ఆరు నెలల్లో విచారించాల్సి ఉందన్నారు. అయితే సిబ్బందిలేమి, ఇతర కారణాలతో ఏళ్లకు ఏళ్లు వాయిదా పడుతూ బాధితుడికి న్యాయం అందడం లేదని చెప్పారు. స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఈసీ).. కేంద్ర ప్రభుత్వ ఆధీన సంస్థగా పనిచేయడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల కమిషన్ అధికారుల నియామకం ప్రభుత్వాల పరిధి నుంచి ఏదైనా అత్యున్నత స్థాయి కమిటీకి అప్పగిస్తే స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో జస్టిస్ రామలింగేశ్వర్‌రావు 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఎన్నికల సమయంలో పార్టీలు సాధ్యాసాధ్యాలను చూడకుండా మేనిఫెస్టో ప్రకటిస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచాక వీటిని అమలుచేయకుంటే ప్రజలు ఏమి చేయాలి?

జవాబు: ఎన్నికల సమయంలో పార్టీలు ఉచితాల పేరుతో ఇష్టం వచ్చినట్లు మేనిఫెస్టో ప్రకటిస్తున్నాయి. దీన్ని ఈసీకి అందజేస్తాయి. అయితే, వాటిని అమలు చేయాల్సిన చట్టబద్ధత పార్టీలకు లేదు. చట్టప్రకారం ఎవరూ ప్రశ్నించలేరు. మేనిఫెస్టో అమలు చేసి తీరాల్సిందేనని తాము కూడా ఉత్తర్వులు ఇవ్వలేమని సుప్రీంకోర్టు కూడా చెప్పింది.

ప్రశ్న: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సంస్కరణలు రావాల్సి ఉంది?

జవాబు: డబ్బున్న వారే ఎక్కువగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. వారే విజయం సాధించి ప్రజలను ఏలుతున్నారు. ఇప్పుడున్న వ్యవస్థలో పేద, మధ్య తరగతికి చెందిన వారు అసెంబ్లీ మెట్లెక్కేందుకు ఆస్కారం లేకుండా ఉంది. పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పర్యవేక్షించడానికి మాజీ న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్‌ల సేవలు వినియోగించుకోవాలి. ఎన్నికల పరిశీలకులుగా అధికారంలో ఉన్న వారు ఉంటే పార్టీకి అనుకూలంగా పనిచేసే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: ఎన్నికల పిటిషన్లపై విచారణ ఏళ్లకు ఏళ్లు ఎందుకు పడుతోంది?

జవాబు: ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 86(7) ప్రకారం రోజువారీ విచారణ చేపట్టయినా ఆరు నెలల్లో తీర్పునివ్వాలి. దురదృష్టవశాత్తు ఇది ఎక్కడా అమలు కావట్లేదు. ఐదేళ్లు దాటినా విచారణ సాగుతుండటంతో బాధితుడికి న్యాయం అందడం లేదు. ఇందులో మార్పు రావాలంటే న్యాయమూర్తులు చొరవ తీసుకోవాలి. హైకోర్టులో ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ చేపట్టి తీర్పు వెల్లడించాలి. దీనిపై సుప్రీంకోర్టు ఎప్పటి నుంచో చెబుతున్నా.. అడుగు ముందుకు పడట్లేదు. దీంతో ఇది అక్రమార్కులకు వరంలా మారింది.

ప్రశ్న: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఎలా ఉంది?

జవాబు: కొన్ని దేశాల్లో ఎన్నికల కమిషన్‌ను ప్రజలే ఎన్నుకునే వ్యవస్థ ఉంది. మన వద్ద కూడా అలాంటి వ్యవస్థ వస్తే.. ఈసీ స్వతంత్రంగా పనిచేస్తుంది. టీఎన్ శేషన్, లింగ్డో హయాంలో ఉన్న ఈసీకి.. ఇప్పటికీ చాలా తేడా కనిపిస్తోంది. ఈసీ అనేది రాజ్యాంగబద్ధ సంస్థ. దీని నిర్ణయాలు ఎవరికీ లోబడి ఉండవు. అధికారుల నియామకం ప్రభుత్వాల పరిధిలో ఉండటంతో వారు స్వామి భక్తి పరాయణులుగా మారుతున్నారు. ఈ విధానం మారాలి.

ప్రశ్న: ఈసీ అధికారాల్లో కోర్టులు కలుగజేసుకోగలవా?

జవాబు: ఎన్నికల నిర్వహణ పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశం. ఆర్టికల్ 324 ప్రకారం ఈసీ స్వతంత్రంగా పనిచేయాలి. ఇందులో కోర్టు కలుగజేసుకోవడం స్వల్పమే. ఏవైనా పిటిషన్లు వచ్చినప్పుడు కోర్టులు విచారణ చేపడతాయి తప్ప.. నేరుగా ఈసీ అధికారాల్లో వేలుపెట్టవు. ఎన్నికల సంస్కరణలు రావాలంటే ఈసీ మారాలి. అప్పుడే ఎన్నికల అక్రమాలకు చెక్ పెట్టే అస్కారం ఉంటుంది.

ప్రశ్న: ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో సీజేఐ కూడా ఉండాలన్న చర్చ జరిగింది.. కానీ అది అమలు కాలేదు?

జవాబు: ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఓ కమిటీని ఏర్పాటు చేయాలని.. ఆ ప్యానెల్‌లో ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఉండాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అయితే దీన్ని ప్రభుత్వం వ్యతిరేకిస్తుండటంతో కార్యరూపం దాల్చలేదు. ఓ అత్యున్నత కమిటీని ఏర్పాటు చేసి ఈసీ అధికారుల నియామకాన్ని దానికి అప్పగిస్తే సంస్కరణలకు అవకాశం ఉంటుంది.

ప్రశ్న: ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి వెళ్లినప్పుడు బాధిత పార్టీ ఫిర్యాదు చేసినా ప్రభుత్వ కాలపరిమితి ముగిసే వరకు స్పీకర్ చర్యలు తీసుకోవట్లేదు ఎందుకు?

జవాబు: స్పీకర్ అంశం శాసనసభకు సంబంధించినది. రాజ్యాంగంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేస్తాయి. ఒకదాని పరిధిలో మరొకటి కలుగజేసుకోవడం స్వల్పమే. ఒకదానిపై మరొకటి గౌరవంతో మెలగాలి. దీంతో స్పీకర్ విధుల్లో ఎక్కువగా కోర్టులు కలుగజేసుకోవు. సూచనలు చేస్తాయి తప్ప.. ఆదేశాలివ్వలేవు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 దీని గురించి స్పష్టంగా చెప్పింది.



"స్వచ్ఛమైన, పారదర్శకమైన ఎన్నికలను నిర్వహించడమే ఎన్నికల కమిషన్ లక్ష్యం. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల సరళి స్వచ్ఛంగా లేకపోతే.. అది వినాశకర పరిణామాలకు దారి తీస్తుంది. ఎన్నికల కమిషన్ న్యాయబద్ధంగా వ్యవహరించాలి.
-సుప్రీంకోర్టు

'సమత' కేసుతో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి

జస్టిస్ రామలింగేశ్వర్‌రావు 1982లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 1983–84లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్‌లో ఫెలోగా ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అడవుల రక్షణ కోసం ఈయన వాదించిన కేసు దేశమంతా 'సమత'కేసుగా ప్రసిద్ధి చెందింది. న్యాయమూర్తిగా 20 వేలకుపైగా తీర్పులిచ్చారు. వీటిలో వందకుపైగా తీర్పులు లా జర్నల్‌లో ప్రచురించారు. ఆయనకు సాహిత్యం, కళలపై మక్కువ ఎక్కువ.

కాంగ్రెస్, బీజేపీల బంధం బయటపడింది

- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామాపై మంత్రి హరీశ్ వ్యాఖ్య
- బీజేపీ నేతలను కాంగ్రెస్‌లోకి పంపడమే కిషన్‌రెడ్డి పని..
- కోమటిరెడ్డి బ్రదర్స్ ఏ పార్టీలో ఉన్నా ఒకరి కోసం మరొకరు పనిచేస్తారు..



సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/సదాశివపేట: బీజేపీకి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరికతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల స్నేహబంధం బయటపడిందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తమ పార్టీ నాయకులను కాంగ్రెస్‌లోకి పంపడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల్లో ఉన్న కోమటిరెడ్డి అన్నదమ్ములిద్దరూ ఒకరి గెలుపు కోసం మరొకరు పని చేసినప్పటికీ ఆ రెండు పార్టీలూ వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆ పార్టీల మధ్య ఉన్న స్నేహబంధమే కారణమన్నారు. సీఎం కేసీఆర్‌ను దెబ్బతియాలని కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీలో ఒప్పందం చేసుకొని గల్లీల్లో రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణలో జరిగిన మూడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్‌లు గల్లంతయ్యాయని, ఆ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ గెలుపు కోసం పనిచేసిందని నిందించారు.

రేవంత్, కిషన్‌రెడ్డిలు రోజూ మాట్లాడుకుంటారు

రెండు పార్టీల అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డిలిద్దరూ కలిసి ప్రతి రోజూ మాట్లాడుకుంటున్నారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌ను తట్టుకునే శక్తి లేక బీజేపీ కాంగ్రెస్‌తో చేతులు కలిపిందన్నారు. రాహుల్‌గాంధీ కాంగ్రెస్‌లో ఉంటేనే నరేంద్రమోదీకి బలమని బీజేపీ నాయకులు భావిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం 60 ఏళ్లు వెనక్కి పోతుందని, మూడోసారి కేసీఆర్‌ను గెలిపించుకోకపోతే తెలంగాణ ఆగం అవుతుందని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



భారత చైతన్య యువజన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన రామచంద్ర యాదవ్

- రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని వెల్లడి

బంజారాహిల్స్ (హైదరాబాద్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుటుంబం దోపిడీ తారాస్థాయికి చేరిందని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమాన్ని గాలికి వదిలేశారని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ విమర్శించారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలో బుధవారం తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో అధికార ప్రతిపక్షపార్టీలను ప్రజలు నమ్మడం లేదని, వారంతా మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయన శూన్యత ఏర్పడిందని ఆ ఖాళీని పూరించేందుకే భారత చైతన్య యువజన పార్టీ ఆవిర్భవించిందన్నారు. సీఎం కేసీఆర్ దోపిడీపై ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు ఆయన ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి నోరు విప్పడం లేదని మండిపడ్డారు. అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా నవంబర్ 1న తమ పార్టీ విధివిధానాలు,మేనిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. అదేరోజు పార్టీ అభ్యర్థుల ప్రకటన కూడా ఉంటుందని, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, యువత, నిరుద్యోగులు తమ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు.

గజ్వేల్‌లో బీఆర్ఎస్‌కు మాజీ ప్రజాప్రతినిధుల గుడ్‌బై

ఈటల గెలుపు కోసం పనిచేయాలని నిర్ణయం

గజ్వేల్: సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో అసమ్మతి గళం వినిపిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు గురువారం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, సీనియర్ నాయకులు చెట్టి సురేశ్‌గౌడ్, వెంకటరెడ్డి, కొన్నె రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ రాంచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బోస్ తదితరులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో సమావేశమై తమ రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. గజ్వేల్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈటల గెలుపు కోసం పనిచేస్తామన్నారు. ఇందుకోసం గురువారం గజ్వేల్‌లో నిర్వహించనున్న 'విజయ శంఖారావం 'సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరతామని వెల్లడించారు. అలాగే కాంగ్రెస్‌లో టికెట్ ఆశించి నిరాశచెందిన టీపీసీసీ డేలిగేట్ మెంబర్ జశ్వంత్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఈటల గెలుపునకు పనిచేయడానికి నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

కేటీపీపీలో నిలిచిన విద్యుదుత్పత్తి

సాంకేతికలోపంతో అంతరాయం


గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం రెండో దశ 600 మెగావాట్ల ప్లాంట్‌లో సాంకేతిక లోపంతో బుధవారం విద్యుదుత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ప్రధాన ప్లాంటులోని బాయిలర్ ట్యూబ్ లీకేజీతో ఈ పరిస్థితి ఎదురైందని, మరమ్మతులు జరుగుతున్నట్లు కేటీపీపీ అధికారులు తెలిపారు. త్వరలోనే విద్యుదుత్పత్తిని పునఃప్రారంభిస్తామని వెల్లడించారు.

'కేసీఆర్ భరోసా'

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో సాగు, తాగునీరు సమస్యలతో పాటు విద్యుత్ కష్టాలు తీరాయని చెప్పారు. బీఆర్ఎస్ కులమతాలకతీతంగా ప్రతి మనిషి, ప్రతి ఇంటి పార్టీగా మారిందన్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ.. 'మూడు పంటలు కావాలా.. మూడు గంటలు కావాలా' ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.16 వేలు, రైతు బీమా, దివ్యాంగులు, ఆసరా పింఛన్ పెంపు, అన్నపూర్ణ ద్వారా సన్నబియ్యం, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు రూ.3 వేలు జీవన భృతి, అసైన్డ్ భూములపై హక్కులు, జాబ్ క్యాలెండర్, రూ.400 కే గ్యాస్ సిలిండర్ వంటి అంశాలను కేసీఆర్ భరోసా పేరిట ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

గుర్తింపు ముఖ్యం



సత్యనారాయణరెడ్డి

త్యాగాల పునాదులపై తెలంగాణ నిర్మించాలనే లక్ష్యంతో గతంలో కేసీఆర్ వెంట నడిచామని, కొన్ని పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో చేరినా అక్కడ ఇమడలేక పోయామని పెద్దపల్లి నేత సి.సత్యనారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ చిత్తశుద్ధి చూసి మళ్లీ బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. తమకు పదవుల కంటే గుర్తింపు ముఖ్యమన్నారు. పెద్దపల్లి నేత గుర్రాల మల్లేశం, మహబూబ్‌నగర్ డీసీసీ మాజీ అధ్యక్షుడు ముత్యాల ప్రకాశ్ బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు సర్దార్ రవీందర్ సింగ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పగలు భగభగ.. రాత్రి గజగజ

▶ మొదటి పేజీ తరువాయి

కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ఇక గరిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే దక్షిణ ప్రాంత జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... ఉత్తర ప్రాంతంలో మాత్రం 2 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవా రం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణో గ్రత ఖమ్మంలో 35.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 15 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

కేంద్రం	గరిష్ట	కనిష్ట	కేంద్రం	గరిష్ట	కనిష్ట
ఖమ్మం	35.8	20.0	మహబూబ్‌నగర్	32.2	20.1
భద్రాచలం	35.5	21.5	మెదక్	32.2	15.0
నల్లగొండ	34.5	20.0	హైదరాబాద్	32.1	18.0
ఆదిలాబాద్	32.8	16.2	దుండిగల్	32.0	17.0
నిజామాబాద్	32.5	18.9	హకీంపేట్	31.8	17.8
రామగుండం	32.4	18.2	హనుమకొండ	31.5	17.0

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలైతే తప్పకుంటా..

ఎమ్మెల్సీ అభ్యర్థి కడియం సవాల్



స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ చెబుతున్న ఆరు గ్యారంటీ పథకాలను.. ప్రస్తుత కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు నిరూపిస్తే ఎన్నికల బరి నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి సవాల్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఈనెల 28న నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ, సమన్వయ సమావేశం సందర్భంగా సభాస్థలిని కడియం బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల మాటలు చూస్తే నవ్వాలో.. జాలిపడాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రజలతో ఛీకొట్టించుకున్న రేవంత్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వారి నియోజకవర్గాల్లో కేసీఆర్‌ను పోటీ చేయాలని సవాల్ చేయడం హాస్యాస్పదమన్నారు.

నేడు మునుగోడుకు కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

సిద్ధం చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో భాగంగా 2022 అక్టోబర్ 30న చండూరు మండలం బంగారిగడ్డలో జరిగిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా మునుగోడును కడుపులో పెట్టి చూసుకుంటానని ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని, డిమాండ్లను నెరవేర్చుతానని హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ఇచ్చిన హామీల్లో రోడ్లు, చండూరు రెవెన్యూ డివిజన్, 100 పడకల ఆసుపత్రి వంటి డిమాండ్లు నెరవేరాయి. చౌటుప్పల్ ఆసుపత్రి పనులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లోన్నూ దాదాపు రూ.500 కోట్ల తో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. కృష్ణా జలాల విషయంలో న్యాయ వివాదాల కారణంగా సాగునీటి సమస్య అలాగే ఉంది. రిజర్వాయర్ల పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ నేపథ్యంలో మునుగోడు నుంచి మళ్లీ కూసుకుంట్ల పోటీ చేయనున్నారు. మునుగోడులో 30 పడకల ఆసుపత్రి, ఇంటర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా మార్చాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

పార్టీ మారాల్సిన అవసరం నాకు లేదు: గుత్తా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కొంతమంది తమ తప్పిదాలను ఇతరులపై నెడతారని, అందులో భాగంగానే తనపైనా నెట్టారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తమ స్వార్థం కోసం తప్పులు చేస్తూ, తన స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్టానం ఒప్పుకుంటే తాను లేదా, తన కుమారుడు అమిత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పారు. నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం గుత్తా మీడియాతో మాట్లాడారు. కొంతమంది నేతలు సొంత పార్టీ వారిపైనే విమర్శలు, ఆరోపణలు చేయడం కొత్త ట్రెండ్‌గా మారిందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను, సీఎం కేసీఆర్‌ను దృష్టిలో పెట్టుకొని కలిసి పని చేయాలని గుత్తా పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలతో విభేదాల కారణంగానే తనతో ఉన్న కొంతమంది విడిపోతున్నారని చెప్పారు. తాను ఏ పార్టీలో ఉన్నా పార్టీ విజయం కోసమే పని చేస్తానన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. అన్ని నియోజక వర్గాల్లో తనకు అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, మిత్రులు ఉన్నారని తెలిపారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టు ఘటన విషయంలో రాజకీయం చేయడం మంచిది కాదని, సాంకేతిక సమస్యలు అప్పుడప్పుడు వస్తాయని గుత్తా పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో గుర్రపు స్వారీ పోటీలు

- హార్స్ పవర్ స్పోర్ట్స్ లీగ్‌కు వేదికగా నిలువనున్న భాగ్యనగరం
- ఆర్నెల్లకు ఒకసారి ప్రధాన నగరాల్లో గుర్రపు స్వారీ పోటీలు



ప్రీ లాంచ్ కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీఎస్ఎల్ లీగ్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఇప్పటికే పలు అంతర్జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా నిలిచిన హైదరాబాద్ నగరం ఈసారి గుర్రపు స్వారీ పోటీలకు వేదికగా మారనుంది. దేశంలో ఈ తరహా హార్స్ పవర్ స్పోర్ట్స్ లీగ్ నిర్వహించడం భాగ్యనగరంలో ఇదే తొలిసారి కానుంది. నగరంలోని హోటల్ తాజ్ డెక్కన్‌లో బుధవారం హార్స్ పవర్ స్పోర్ట్స్ లీగ్ (హెచ్‌పీఎస్ఎల్) ఆధ్వర్యంలో మొదటి లీగ్ ప్రీ లాంచ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిలిప్పీన్ ట్రిపుల్ క్రౌన్ మీడియా ఇంక్ అధిపతి అల్జాండ్రో జేమ్స్ చింగ్బియన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌పీఎస్ఎల్ నిర్వాహకులు సురేశ్ పాలడుగు మాట్లాడుతూ...గుర్రాలకు, మానవులకు ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ తరానికి తెలియజేసే ఉద్దేశంతో ఈ స్పోర్ట్స్ లీగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ లీగ్ ప్రతి ఆరు నెలలకొకసారి దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ప్రధాన రేస్ క్లబ్‌ల అనుబంధంతో కలిసి నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలు నవంబర్‌లో వెల్లడిస్తామని తెలిపారు. హైదరాబాద్ రేస్ క్లబ్ చైర్మన్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో ఈ గుర్రపు ఆటలకు కొంత వెసులబాటు కల్పించి ప్రోత్సహించాలని ఆయన కోరారు.

సునీతా లక్ష్మారెడ్డికే నర్సాపూర్ టికెట్

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా బీఫాం

- మెదక్ లోక్‌సభ అభ్యర్థిగా మదన్‌రెడ్డికి చాన్స్
- కీలక సమయంలో సర్దుబాట్లు చేసుకుందాం: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనే దానిపై సుమారు మూడు నెలలుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరదించుతూ మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పేరును పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. ప్రగతిభవన్‌లో నర్సాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి చేతుల మీదుగా కేసీఆర్ సమక్షంలోనే బుధవారం సునీతా లక్ష్మారెడ్డికి పార్టీ బీఫాం అందజేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దించాలని నిర్ణయించారు. పార్టీ ఎన్నికల కోర్ కమిటీ సభ్యులు, మంత్రులు కేటీ రామారావు, హరీశ్‌రావు సమక్షంలో ప్రగతిభవన్‌లో మదన్‌రెడ్డి, సునీత రెడ్డి మధ్య టికెట్ వివాదానికి తెరదించారు.

సీఎం సమక్షంలో హామీ ఇవ్వడంతో...

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ఆగస్టు 21న పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించినా నర్సాపూర్‌ను పెండింగ్ జాబితాలో పెట్టారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డికి సుమారు నెల రోజుల క్రితం గ్రీన్ సిగ్నల్ లభించినా అధికారికంగా ఆమె పేరును ప్రకటించలేదు. మదన్‌రెడ్డికే అవకాశం ఇవ్వాలంటూ ఆయన అనుచరులు మంత్రి హరీశ్‌రావు నివాసం ఎదుట ఆందోళన కూడా చేశారు. మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రగతిభవన్‌కు తరచూ వెళ్తూ తనకు టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పలుమార్లు మదన్‌రెడ్డితో భేటీ అయి ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. తాజాగా సీఎం కేసీఆర్ సమక్షంలో మదన్‌రెడ్డికి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు ఆయన సునీతా లక్ష్మారెడ్డికి మద్దతు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

మదన్‌రెడ్డి సీనియారిటీని గుర్తిస్తాం: కేసీఆర్

'మదన్ రెడ్డి నాతో పార్టీలో మొదటి నుంచీ కొనసాగుతున్న సీనియర్ నాయకుడు. 35 ఏండ్ల నుంచి నాతో సన్నిహితంగా కొనసాగుతున్న నేతగా నాకు అత్యంత ఆప్తుడు. నాకు కుడి భుజం లాంటి వాడు. సోదర సమానుడు. పార్టీ ఆలోచనలను గౌరవించి నర్సాపూర్ ఎన్నికలను తన భుజస్కంధాలమీద వేసుకుని సునీతా లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా వుంది. ప్రస్తుతం మెదక్ ఎంపీగా కొనసాగుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున ఆయన స్థానంలో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మదన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మదన్‌రెడ్డికి వివాద రహితుడిగా పేర్కొంది. చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటూ కీలక సమయంలో ఐక్యంగా ముందుకు పోవడం ద్వారా మదన్‌రెడ్డి పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసినందుకు ధన్యవాదాలు' అని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

అలంపూర్, పాత బస్తీ మినహా!

మిగిలిన అందరికీ బీఫాంలు ఇచ్చేసిన బీఆర్ఎస్

- అలంపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వంపై సస్పెన్స్
- ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ చల్లా
- కొలిక్కిరాని గోషామహల్, నాంపల్లి సెగ్మెంట్ల అభ్యర్థులు
- పాతబస్తీలో ఖరారైన అభ్యర్థులకూ అందని బీఫాంలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థులందరికీ బీఫాంల పంపిణీ పూర్తి కావస్తున్నా.. హైదరాబాద్ పాతబస్తీలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు అలంపూర్ నియోజకవర్గం అభ్యర్థికి బీఫాంలు ఇప్పటివరకు అందించలేదు. రెండు నెలల కిందటే అభ్యర్థులను స్వయంగా పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించి, ఈ నెల 15వ తేదీ నుంచి బీఫాంల పంపిణీ ప్రారంభించారు.

అలంపూర్‌లో చక్రం తిప్పుతున్న ఎమ్మెల్సీ...

మరోవైపు అలంపూర్ (ఎస్సీ) నియోజకవర్గం అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం పేరును ఆగస్టు 21న ప్రకటించిన జాబితాలో ఖరారు చేసినా నేటికీ బీఫాం ఇవ్వలేదు. గతంలో టీడీపీ నుంచి ఆలంపూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన అబ్రహం 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. తిరిగి ఆయనకే మరోమారు పోటీ అవకాశం ఇస్తూ ఆలంపూర్ అభ్యర్థిగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కేటీఆర్‌ను తరచూ ప్రగతిభవన్, తెలంగాణలో భవన్‌లో కలిసి బీ ఫారం కోసం విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే అలంపూర్ రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న చల్లా వెంకట్రామ్‌రెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తన అనుచరుడు విజయుడుకి టికెట్ ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్సీ చల్లా ప్రతిపాదించినట్లు తెలిసింది. అబ్రహంకు టికెట్ ఇస్తే పార్టీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఇతర క్షేత్ర స్థాయి నాయకులు పార్టీని వీడుతారని ఎమ్మెల్సీ చల్లా పార్టీ అధిష్టానానికి చెప్పినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే అబ్రహం మాత్రం పార్టీ కేడర్ తన వెంటే ఉందని ఇటీవల కేటీఆర్‌కు విన్నవించుకున్నారు. మొత్తంగా ఒకటి రెండు రోజుల్లో అలంపూర్ టికెట్ వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఆ తొమ్మిది సీట్లు మినహా..

119 అసెంబ్లీ స్థానాలకు గానూ కేసీఆర్ సహా 110 మంది అభ్యర్థులు బీ ఫాంలు కూడా అందుకున్నారు. నర్సాపూర్ అభ్యర్థి పేరుపై కూడా రెండు నెలలుగా కొనసాగిన సస్పెన్స్‌కు తెరదించుతూ మాజీమంత్రి సునీతా లక్ష్మారెడ్డికి బీ ఫాం అందజేశారు. పాతబస్తీలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కావాల్సి ఉంది. తీగల అజిత్‌రెడ్డి (మలక్‌పేట), అయిందాల కృష్ణ (కార్వాన్), ఇబ్రహీంలోడీ (చార్మినార్), ఎం.సీతారాంరెడ్డి (చాంద్రాయణగుట్ట), సామ సుందర్‌రెడ్డి (యాకుత్‌పురా), అలీ బాక్రీ (బహదూర్‌పురా)కు టికెట్లు ఖరారు చేసినా బీ ఫాంలు జారీ చేయలేదు. ఇక నాంపల్లి నుంచి ఆనంద్‌గౌడ్, గోషామహల్ నుంచి నందకిషోర్ వ్యాస్ పేర్లు ఖరారైనట్లు ప్రచారం జరుగుతున్నా పార్టీ నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి బీజేపీ టికెట్ ఇచ్చిన నేపథ్యంలో ఇక్కడ బీఆర్ఎస్ ప్రతివ్యూహానికి పదును పెడుతోంది.

క్లుప్తంగా...

ధరణిపై ఎన్నికలకు సిద్ధమా..?: జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను సమీక్షించి భూ సమస్యలు పరిష్కరిస్తామని, వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను పునరుద్ధరించి 30వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కరీంనగర్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ధరణితో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ధరణి దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, ధరణి సమస్యపైనే ఎన్నికలకు వెళ్లేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమా..? అని సవాల్ విసిరారు. ప్రస్తుతం ధరణి సమస్య లేని గ్రామం లేదని, పార్టీ అధికారంలోకి రాగానే జిల్లాకో రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి సమస్య చెప్పుకొనేందుకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. రెవెన్యూ రికార్డుల్లో కాస్తు కాలం తొలగించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తుందన్న మంత్రి హరీశ్ వ్యాఖ్యలను ఖండించారు. అనంతరం అల్లీపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలన్నదే ప్రజా నిర్ణయం: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని, అందుకే బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు తమ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎంపీ మల్లు రవి అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన రావాలంటే కాంగ్రెస్‌కు.. పెత్తందారీ పాలన కావాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని రాహుల్‌గాంధీ అన్న మాటలను గుర్తు చేశారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ తన పార్టీ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేందుకే రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారని స్పష్టం చేశారు. నాగం జనార్దన్‌రెడ్డి అసంతృప్తి అంశాన్ని కాంగ్రెస్ హైకమాండ్ చూసుకుంటుందని మల్లు రవి పేర్కొన్నారు.

వార్డు సభ్యులకు గౌరవ వేతనం

కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో ఎన్నికయ్యే వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ నిర్ణయించింది. ఈ అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చనుంది. గాంధీభవన్‌లో బుధవారం టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ భేటీ అయ్యింది. కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలనే అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని నిర్ణయించారు.

7 స్థానాల్లో ప్రత్యక్ష పోటీ

సీపీఐ ప్రజాపంథా నిర్ణయం

ఖమ్మం మయూరిసెంటర్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ బలంగా ఉన్న స్థానాల్లో నేరుగా పోటీ చేయడమే కాక ఇతర నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఖమ్మం జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల జనరల్ బాడీ సమావేశం అనంతరం రాష్ట్ర కార్యవర్గం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీతో పాటు, పోటీ చేయని ప్రాంతాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు నుంచి ఏడు స్థానాల్లో ప్రత్యక్షంగా పోటీ చేయాలని, అందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువ స్థానాల్లో అభ్యర్థులను దించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రెండ్రోజుల్లో ప్రజాపంథా తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించనుండగా.. ఉమ్మడి జిల్లా నుంచి ఇల్లెందు, పాలేరు, పినపాక నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు తెలిసింది.

40 స్థానాల్లో పోటీ

యూసీసీఆర్‌ఐ–ఎంఎల్ కార్యదర్శి వినోద్

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నాయని, వీటిని తిప్పికొట్టేందుకు ఈ ఎన్నికల్లో 40 స్థానాల్లో పోటీ చేస్తున్నామని భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యూసీసీఆర్‌ఐ–ఎంఎల్) కార్యదర్శి వినోద్ పేర్కొన్నారు. పాలకవర్గాల అభివృద్ధి నిరోధక విధానాలను ఎండగడుతూ ప్రచారం సాగిస్తామని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తొమ్మిదేళ్ల పాలన అంతా పెట్టుబడిదారీశక్తులకు, విదేశీ, భూస్వామ్య వర్గాలకు సేవలందిస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కంటితుడుపు చర్యలేగాని వారెదుర్కొంటున్న సమస్యలేవీ పరిష్కారం కాలేదని ఆరోపించారు. మేనిఫెస్టో పేరుతో పార్టీలు ప్రజల డబ్బుతో ఓట్లుకొనే పథకాలను ప్రకటిస్తున్నాయన్నారు. ప్రజలు భ్రమలు వీడి తమ సమస్యల పరిష్కారానికి పోరాడాలని కోరారు.

ఎన్నికల సమయంలో 'రైతుబంధు' ఆపండి

కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

- గతంలో పోలింగ్ రోజు నిధులు విడుదల చేసి ఓటర్లను ప్రభావితం చేశారు
- ఈసీకి ఠాక్రే, జైరాం రమేశ్, రేవంత్, భట్టి, ఉత్తమ్ ఫిర్యాదు
- కొందరు అధికారులను బీఆర్‌ఎస్ సొంత పార్టీ నాయకులుగా వాడుకుంటోందన్న రేవంత్
- మద్యంపై నిషేధం విధించాల్సిందిగా ఈసీని కోరినట్లు వెల్లడి



కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం ఇచ్చి వస్తున్న మాణిక్‌రావ్‌ఠాక్రే, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు నిధులను రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు కానీ, నవంబర్ 30న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కానీ విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. పింఛన్లు మినహా ఇతర నగదు ప్రయోజనాల పంపిణీని నోటిఫికేషన్ రోజు నుండి పోలింగ్ రోజు వరకు 27 రోజుల పాటు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుబంధు పథకం రెండోవిడత నిధులను ఇప్పటివరకు విడుదల చేయలేదని తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిధులు విడుదల చేయడం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని చెప్పారు. 2018 ఎన్నికల సమయంలో పోలింగ్ రోజున రైతుబంధు నిధులు విడుదల చేసి ఓటర్లను ప్రభావితం చేశారని ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సల్మాన్ ఖుర్షీద్, జైరామ్ రమేష్‌లు బుధవారం ఢిల్లీలో ఈసీని కలిశారు. ఈ భేటీ అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడారు. పలు అంశాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తెలిపారు.

కేసీఆర్ ప్రైవేట్ సైనికులుగా..: రేవంత్

రాష్ట్రంలోని కొంతమంది అధికారులను బీఆర్‌ఎస్ సొంత పార్టీ నాయకులు మాదిరి ఉపయోగించుకుంటోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన డీజీపీ అంజనీ కుమార్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో పాటు రిటైర్డ్ ఆఫీసర్లు వేణుగోపాలరావు, నర్సింగరావు, భుజంగరావు, జగన్మోహన్ రావులు ఈ జాబితాలో ఉన్నారన్నారు. సర్వీసులో ఉన్న వాళ్లను సిట్, ఇంటెలిజెన్స్‌లో నియమించి ప్రతిపక్ష పార్టీలపై నిఘా పెట్టాల్సిందిగా ఆదేశించారని, టెలిఫోన్లు ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అధికారులందరూ కేసీఆర్ ప్రైవేట్ సైనికులుగా పని చేస్తున్నారని ఈసీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. అధికారులు అరవింద్ కుమార్, సోమేశ్ కుమార్, స్మిత సబర్వాల్, రాజశేఖర్‌లు బీఆర్‌ఎస్ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారని ఆరోపించారు. దీర్ఘకాలంగా ఒకే పదవిలో కొనసాగుతున్న వారిపై దృష్టి పెట్టాల్సిందిగా ఈసీని కోరామన్నారు. తెలంగాణ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచడం, లిక్కర్ సరఫరా విపరీతంగా జరుగుతోందని, గతంలో మునుగోడు ఉప ఎన్నిక సమయంలో 20 రోజుల్లో రూ.300 కోట్ల మద్యం అమ్మారని అన్నారు. ఓటర్లను మద్యంలో ముంచి ఓట్లు వేయించుకోవాలని కేసీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నామినేషన్లు మొదలు ఓటింగ్ ముగిసేవరకు మద్యాన్ని నిషేధించాల్సిందిగా ఈసీని కోరినట్లు తెలిపారు.

ఖర్గే కార్యక్రమాల సమన్వయకర్తగా...

తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యక్రమాల సమన్వయకర్తగా ఏఐసీసీ కార్యదర్శి బీఎం సందీప్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

బీఆర్‌ఎస్‌పై ఫిర్యాదు: ఉత్తమ్

తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలు అత్యంత అవినీతిమయంగా మారాయని ఈసీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలమైన అధికారులను కీలక ఎన్నికల విధుల్లో పెట్టడంపై ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రభుత్వ భవనాలైన ముఖ్యమంత్రి అధికారిక నివాసం, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారని కూడా ఫిర్యాదు చేశామన్నారు.

రాహుల్‌గాంధీకి ఇల్లు కూడా లేదు

- కాంగ్రెస్‌కు ఈసారి 70–80 సీట్లు కచ్చితంగా వస్తాయి
- నేడు అభ్యర్థుల ప్రకటనకు అవకాశం
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే నైతిక అర్హత మంత్రి కేటీరామారావుకు లేదని టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తరతరాలుగా దేశాన్ని పాలించే అవకాశం వచ్చిన రాహుల్‌గాంధీ కుటుంబానికిగానీ, ఆయనకు గానీ ఇంతవరకు సొంత ఇల్లు కూడా లేదని తెలిపారు. తొమ్మిదేళ్ల రాష్ట్రంలో అధికారం చెలాయించిన కేటీఆర్, ఆయన కుటుంబానికి మాత్రం వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాకముందు ఆ కుటుంబ ఆస్తులెంతో, ఇప్పుడు ఎన్ని ఆస్తులున్నాయో చెప్పాలని బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే వేరే పార్టీల నుంచి నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రకటించిన స్థానాలు పోను మిగిలిన అన్ని స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామని, ఆరు స్థానాల్లో మాత్రం ఇబ్బందులున్నాయని చెప్పారు. చాలా స్థానాలకు గురువారం అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందన్నారు. వామపక్షాలకు నాలుగు స్థానాలు ఇవ్వడం తక్కువేమీ కాదని, మిర్యాలగూడ లాంటి చోట్ల ఇరు పార్టీల మధ్య ఓట్లు ఎంతవరకు బదిలీ అవుతాయన్నది చూడాల్సి ఉందని వ్యాఖ్యానించారు.

రేవంత్‌రెడ్డిపై డీజీపీకి ఫిర్యాదు

ప్రాణ రక్షణ కల్పించాలని కోరిన కురువ విజయ్‌కుమార్



డీజీపీ కార్యాలయం ఎదుట కురువ విజయ్‌కుమార్

నాంపల్లి (హైదరాబాద్): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, అతడి అనుచరులతో తనకు ప్రాణ హాని ఉందని, తనకు ఎలాంటి హాని జరిగినా రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యతని బహిష్కృత టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, ఆయన అనుచరుల నుంచి తనకు ప్రాణరక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ....గద్వాల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌తో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా ఉండే కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్లను రేవంత్‌రెడ్డి కోట్లాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు అమ్ముకోలేదని రేవంత్‌రెడ్డి భావిస్తే భాగ్యలక్ష్మి దేవాలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి అక్రమాస్తులపై విచారణ చేపట్టాలని ఇటీవల ఈడీకి ఫిర్యాదు చేశానని, అప్పటినుంచి ఆయన అనుచరులు చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత 15 ఏళ్లుగాకాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బహదూర్‌పురా నియోజకవర్గం బహిష్కృత కాంగ్రెస్ నేత బాబా కలీముద్దీన్ పాల్గొన్నారు.

పద్యకవి జీవీ కృష్ణమూర్తి కన్నుమూత



కరీంనగర్ కల్చరల్: పద్యకవి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, ఆధ్యాత్మికవేత్త జోగా వెంకట కృష్ణమూర్తి (77) బుధవారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆయన చాలా ఏళ్లుగా కరీంనగర్ రాఘవేంద్ర నగర్‌లో నివాసం ఉంటున్నారు. పద్యపటుత్వ రచనాశక్తి గల కవిగా, గాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. శ్రీవేంకటేశ్వర, రాజరాజేశ్వర, బాలవెన్నెల, దేవీశతకాలు, వెలుగురేఖలు పద్య ఖండకావ్యం, కూచాద్రి క్షేత్ర మహాత్మ్యం వంటి పుస్తకాలు రచించారు. తాజాగా 'ఆద్య మకుటంతో..నీవు పేరుతో'శతకం రచించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా, సాహితీవేత్తగా ఉభయ రాష్ట్రాల్లో అనేక సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందిన కృష్ణమూర్తి...ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకున్నారు. ఆయన మృతికి ఉపాధ్యాయ, సాహితీలోకం నివాళి అర్పించింది. కవులు, రచయితలు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రైతుబంధు నిలిపేయాలనడం కాంగ్రెస్ వైఖరికి నిదర్శనం

- కాంగ్రెస్ పార్టీపై బీఆర్‌ఎస్ ధ్వజం
- రైతుబంధుపై ఈసీకి రాసిన లేఖను ఉపసంహరించుకోవాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలంటూ కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడంపై బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ మనస్తత్వంతో నడిచే కాంగ్రెస్ పార్టీ ఈ లేఖ ద్వారా తన కర్కశ, రైతు, పేదల వ్యతిరేక వైఖరిని నిస్సిగ్గుగా బయట పెట్టుకుందని విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ప్రారంభించిన రైతుబంధు దేశవ్యాప్తంగా స్ఫూర్తినిస్తోందని, రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ మాత్రం ఓట్ల కోసమే చూస్తోందని దాసోజు విమర్శించారు. ఎన్నికలు వస్తూ పోతుండటం సహజమని, వాటి కోసం రైతులు వ్యవసాయాన్ని ఆపలేరని పేర్కొన్నారు. చిల్లర రాజకీయాల కోసం సమాజం కోసం నిస్వార్థంగా కష్టపడే రైతుల జీవనోపాధిపై దెబ్బకొట్టడం అత్యంత దుర్మార్గమని అన్నారు. రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, భవిష్యత్తు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బలి కాకూడదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పట్ల జాగ్రత్తగా ఉంటూ గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రైతులను వేధించకూడదనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు అర్థం చేసుకోవాలన్నారు. ఎలాంటి జాలి, దయ లేకుండా ఈసీకి రాసిన క్రూరమైన లేఖను కాంగ్రెస్ వెంటనే ఉపసంహరించుకోవాలని దాసోజు డిమాండ్ చేశారు.

ఎన్నికల చివరి వారమంతా ఇక్కడే!

- ఇతర రాష్ట్రాల్లో ప్రచారం ముగిశాక తెలంగాణలోనే కాంగ్రెస్ పెద్దల మకాం
- అగ్రనేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు అంతా ఇక్కడికే..
- రాహుల్‌గాంధీ కూడా వారం పాటు ఉండే అవకాశం..
- భారీ ప్రచార వ్యూహానికి తెరలేపుతున్న కాంగ్రెస్



సాక్షి, హైదరాబాద్: ఈసారి ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో అధికారం దక్కించుకోవాలన్న లక్ష్యంతో భారీ ప్రచార వ్యూహానికి కాంగ్రెస్ పార్టీ రూపుదిద్దుతోంది. ఇప్పటికే అగ్రనేతలతో బస్సు యాత్ర నిర్వహిస్తోన్న టీపీసీసీ.. కాంగ్రెస్ పార్టీ పెద్దలను పూర్తిస్థాయిలో రంగంలోకి దింపాలని నిర్ణయించింది. ఏఐసీసీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేలతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఇతర ప్రముఖులతో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో.. మిగతా ముఖ్యమంత్రులు సిద్దరామయ్య, సుక్కులతో సభల ఏర్పాటుకు ప్లాన్ చేస్తోంది. ఈ నెల 28, 29 తేదీల్లో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాష్ట్రానికి వచ్చేలా షెడ్యూల్ రూపొందిస్తోంది. తర్వాత 30, 31 తేదీల్లో ప్రియాంకా గాంధీ వస్తారని, పాలమూరు ప్రజాగర్జనతోపాటు నాగార్జునసాగర్‌లో జరిగే సభలోనూ ఆమె పాల్గొంటారని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. వచ్చే నెల 1, 2 తేదీల్లో రాహుల్ గాంధీ మరోమారు రాష్ట్రానికి వచ్చి రెండో విడత బస్సుయాత్రలో పాల్గొననున్నారు.

నేతల అంగీకారం రాగానే..

అయితే ఈ నెల 31న కొల్లాపూర్‌లో ప్రియాంకా గాంధీ పాల్గొనే సభ మినహా మిగతా పర్యటనలు ప్రతిపాదనలేనని, నేతల అంగీకారం వచ్చాక షెడ్యూల్ ఖరారవుతుందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఇక ప్రచార పర్వం ముగిసే చివరి వారంలో మొత్తం కాంగ్రెస్ యంత్రాంగాన్ని రంగంలోకి దింపాలని టీపీసీసీ యోచిస్తోంది. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలకుగాను.. నవంబర్ 23న రాజస్తాన్‌లో పోలింగ్‌తో నాలుగు రాష్ట్రాల్లో ప్రక్రియ ముగుస్తుందని.. ఆ తర్వాత ఏఐసీసీ పూర్తిస్థాయిలో తెలంగాణపై దృష్టి కేంద్రీకరిస్తుందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. వచ్చే నెల 23 నుంచి 28 వరకు రాహుల్ గాంధీ సహా జాతీయ స్థాయి నేతలంతా ఇక్కడే మకాం వేసి.. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తారని వెల్లడిస్తున్నాయి.

హస్తినలో ఇల్లెందు రచ్చ

కోరం కనకయ్యకు టికెట్ ఇవ్వొద్దని నినాదాలు



ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఇల్లెందు కాంగ్రెస్ నేతలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఇల్లెందు టికెట్ కేటాయించవద్దంటూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ఈ నియోజకవర్గానికి చెందిన ఆశావహులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఇల్లెందు నుంచి పోటీ చేసేందుకు రాష్ట్రంలోనే అత్యధికంగా 32 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చీమల వెంకటేశ్వర్లు, ప్రవీణ్ నాయక్, బానోత్ విజయలక్ష్మి, నాగేంద్రబాబు, దళ్‌సింగ్ నాయక్ తదితర నేతలు, వారి మద్దతుదారులు ఆందోళన చేపట్టారు. సేవ్ కాంగ్రెస్ ఇన్ ఇల్లెందు అనే ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేశారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. టికెట్ కేటాయింపు కోసం ఏర్పాటు చేసిన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం రోజునే వీరు మెరుపు ధర్నాకు దిగడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసిన నేతల్లో సగానికి పైగా మంది కోరం కనకయ్య అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఆయనకు టికెట్ ఇవ్వడం సరికాదంటున్నారు. పదేళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న తమలో ఒకరికి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇల్లెందు నుంచి పోటీ చేసే అవకాశం బంజారాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోయ సామాజిక వర్గం నుంచి టికెట్ ఇవ్వాల్సి వస్తే చీమల వెంకటేశ్వర్లు పేరును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కాగా, గురువారం కూడా ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

ఇంకా 'పొత్తు' పొడవదే!

వామపక్షాల్లో తీవ్ర అసంతృప్తి

- కాంగ్రెస్ నుంచి ఇప్పటికీ రాని స్పష్టత

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, వామపక్షాల పొత్తు వ్యవహారం ఇప్పటికీ తేలడం లేదు. దీంతో సీపీఐ, సీపీఎం కేడర్లలో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. చెరి రెండు అసెంబ్లీ స్థానాలు ఇస్తామని చెప్పినా, ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇస్తామని, సీపీఎంకు మిర్యాలగూడ స్థానం ఇస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. కానీ మరో స్థానం విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. కనీసం ఆ మూడు స్థానాల్లోనైనా ప్రచారం చేసుకోండంటూ తమకు భరోసా ఇవ్వడం లేదని వామపక్షాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఇంకెప్పుడు ప్రచారం చేసుకోవాలి..?: ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకుపోతోంది. మరోవైపు వచ్చే నెల మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. దాంతోపాటు నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుంది. సమయం గడుస్తున్నా పొత్తుపై స్పష్టత లేకపోవడం, ఇస్తామన్న వాటిపైనా భరోసా ఇవ్వకపోవడంతో వామపక్ష శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఇక ఇస్తామన్న స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు చెందిన ఆశావహులు ప్రచారం చేసుకుంటున్నారని లెఫ్ట్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇలా ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్, లెఫ్ట్ వర్గాల మధ్య అగాధం నెలకొంది. తమకు ఇస్తామన్న స్థానాలపై కూడా అధికారిక ప్రకటన రాకపోవడంతో ప్రచారం చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. తేలిన స్థానాలను అధికారికంగా ప్రకటించడానికి జాప్యం చేయాల్సిన అవసరం ఏముందని లెఫ్ట్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

సీపీఎంకు మరో స్థానంపై కొనసాగుతున్న ఉత్కంఠ...

సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తమకు చెన్నూరు బదులు మునుగోడు ఇవ్వాలని సీపీఐ కోరుతున్నా, ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు తిరిగి రావడంతో ఆయనకు ఆ స్థానం ఖరారు అయినట్లే. కాబట్టి మునుగోడుపై సీపీఐ ఆశ వదులుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పరిస్థితిని ముందే పసిగట్టిన సీపీఐ చెన్నూరులో పోటీకి సిద్ధమైంది. కాగా, సీపీఎం విషయంలో ఒక మిర్యాలగూడ స్థానం వరకు కాంగ్రెస్ సుముఖంగా ఉంది. సీపీఎం అడిగిన పాలేరు లేదా భద్రాచలం స్థానాలపై కాంగ్రెస్ విముఖతగా ఉంది. పాలేరు ఇచ్చే పరిస్థితే తలెత్తదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఇక భద్రాచలం స్థానంలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తన సిట్టింగ్ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించింది. దీంతో సీపీఎంకు మరో స్థానం ఎక్కడ ఇస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

ఏ క్షణమైనా మలిజాబితా!



స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న భట్టి, మాణిక్‌రావ్‌ఠాక్రే, రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, కేసీ వేణుగోపాల్, ఉత్తమ్ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాహుల్‌గాంధీ పాల్గొని చర్చించారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో గెలుపు అవకాశాలు, కుల సమీకరణాలు, సర్వేల ఆధారంగా సుమారు 50 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, వనపర్తి, నారాయణ్‌ఖేడ్, శేరిలింగంపల్లి, తాండూరు వంటి 15కుపైగా నియోజకవర్గాల్లో ఇద్దరేసి అభ్యర్థులను గుర్తించిన చోట గెలుపు అవకాశాలు, విధేయతను దృష్టిలో పెట్టుకొని సీఈసీ అభ్యర్థులను ఫైనల్ చేసినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఖరారైన అభ్యర్థుల జాబితాను ఏ క్షణమైనా విడుదల చేయవచ్చని పేర్కొంటున్నాయి.

ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల కోసం..

బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోసం మునుగోడు స్థానాన్ని ఖాళీగా ఉంచారు. ఆయనతోపాటు బీజేపీ నుంచి చేరుతారని భావిస్తున్న మరో ఇద్దరు సీనియర్లకు సంబంధించిన సీట్లనూ పెండింగ్‌లో పెట్టారు. ఇక సీపీఎం కోరుతున్న మిర్యాలగూడ, వైరా సీట్లపై ఎలాంటి స్పష్టత రాని నేపథ్యంలో అక్కడ అభ్యర్థులను ఖరారు చేయలేదు. కాగా సీఈసీ సమావేశం జరుగుతున్న సమయంలో ఏఐసీసీ కార్యాలయం బయట ఇల్లందు నియోజకవర్గ కార్యకర్తలు కొందరు నిరసన తెలిపారు. ఇల్లందు సీటును పారాచూట్ నేతలకు కేటాయించవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

తెలంగాణలో పాగా వేస్తాం: ఖర్గే

తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎన్నుకోవడం ఖాయమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఓటమి ఖాయమని గుర్తించిన బీఆర్‌ఎస్ నేతలు.. కాంగ్రెస్‌పై దాడులు చేస్తూ నిరాశను వ్యక్తం చేస్తున్నారని ట్వీట్‌లో ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు అన్ని నేరాల్లో భాగస్వాములనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. ఆ మూడు పార్టీలకు అబద్ధాలు, దోపిడీ, కమీషన్లు తప్ప తెలంగాణ ప్రజలకు చెప్పుకోవడానికి వేరే అంశాలేవీ లేవని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ప్రజలతో పంచుకునే అపార ప్రేమాభిమానాలు న్యాయం, సంక్షేమం, ప్రగతికి దోహదపడతాయని పేర్కొన్నారు.

ఆ స్థానాలపై మాత్రం పీటముడి

పోటీ తీవ్రంగా ఉన్న కొన్ని నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా మారిందని సమాచారం. సూర్యాపేట, తుంగతుర్తి, వరంగల్ (వెస్ట్), నిజామాబాద్ అర్బన్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, పరకాల, ఎల్బీనగర్ తదితర సీట్లతోపాటు ఇతర పార్టీల నుంచి నేతలు వస్తారనే అంచనా ఉన్న స్థానాలపై పీటముడి పడిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. వామపక్షాలతో పొత్తులు ఖాయమే అంటున్నా.. వారికిచ్చే సీట్లపై ఏకాభిప్రాయం రావడం లేదని అంటున్నాయి. సీపీఎం ఆశిస్తున్న పాలేరు, మిర్యాలగూడ స్థానాలను వదులుకునేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదని పేర్కొంటున్నాయి. పాలేరులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మిర్యాలగూడలో బత్తుల లక్ష్మారెడ్డి బలమైన అభ్యర్థులని, ఆ సీట్లను సీపీఎంకు ఇచ్చినా ఓటు బదిలీ జరగక ఇరుపక్షాలు నష్టపోయే పరిస్థితి ఉంటుందని కాంగ్రెస్ నేతల్లో చర్చ జరుగుతోంది. సీపీఐ అడుగుతున్న కొత్తగూడెం, చెన్నూరు విషయంలోనూ ఇదే తరహా పరిస్థితి ఉందని అంటున్నారు.

కీలకనేతలపై పోటీ ప్రతిపాదన లేనట్టే!

ఈసారి ఎన్నికల్లో బీజేపీ తరహా ప్రయోగం చేయాలని కాంగ్రెస్ నేతలు తొలుత భావించినా వెనక్కితగ్గినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ కీలక నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై పార్టీ సీనియర్లను రంగంలోకి దించితే ఎలా ఉంటుందన్న దానిపై కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర నేతలతో చర్చించినట్టు సమాచారం. కామారెడ్డిలో రేవంత్, సిద్దిపేటలో ఉత్తమ్, సిరిసిల్లలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గజ్వేల్‌లో రాజగోపాల్‌రెడ్డి ఇలా ఎవరెక్కడ పోటీ చేయాలన్న ప్రతిపాదనలపైనా చర్చ జరిగినట్టు సమాచారం. కానీ ఎక్కువ మంది నాయకులు రెండు చోట్ల పోటీ చేయడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతుందని... ఈ ప్రభావం రెండు స్థానాలపైనా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది.

ముందే బుజ్జగింపులు షురూ!

కాంగ్రెస్ అధిష్టానం మలి జాబితా విడుదలకు ముందే అసంతృప్తులను అంచనావేసి చక్కదిద్దే పనిలో పడింది. ఇద్దరు, ముగ్గురు పోటీపడుతున్న నియోజకవర్గాల్లో టికెట్ వచ్చే అవకాశం లేని వారిని బుజ్జగించేందుకు సిద్ధమైంది. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ అంశంపై బుధవారం రాత్రి భేటీ అయి చర్చించినట్టు తెలిసింది. టికెట్ రాని నేతలకు భవిష్యత్తులో తగిన న్యాయం చేస్తామని పక్కాగా హామీ ఇవ్వాలని.. రెబెల్ అభ్యర్థులు లేకుండా చూసుకుంటూ, పార్టీలో అంతర్గత కుమ్ములాటలేవీ లేవన్న సందేశాన్ని ప్రజల్లోకి పంపాలని ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో ఆశావహులతో ఫోన్‌లో మాట్లాడటం లేదా సీనియర్ నేతలను పంపి బుజ్జగించడం, ఢిల్లీకి పిలిపించుకుని హామీ ఇవ్వడం వంటి మార్గాల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై వేణుగోపాల్, రేవంత్ చర్చించినట్టు తెలిసింది. కాగా నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని ముస్లిం అభ్యర్థికి ఇవ్వాలని నిర్ణయించిన కాంగ్రెస్ పెద్దలు.. ఆ సీటును ఆశిస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్‌ను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మహేశ్‌గౌడ్‌ను కేసీ వేణుగోపాల్ ఢిల్లీకి పిలిపించి మాట్లాడినట్టు తెలిసింది.



గుంపులో నిలబడటం సులభం.
ఒంటరిగా నిలబడటానికి ధైర్యం అవసరం.
– మహాత్మా గాంధీ

సాక్షి
గురువారం, 26 అక్టోబర్ 2023

గణాంకాలు చెప్పే నిజాలు!

సరైన ప్రాతిపదికలు ఎంచుకుని, శాస్త్రీయ విధానంలో నమూనాలు రూపొందించుకుని వాటి ఆధారంగా సర్వే చేయాలేగానీ గణాంకాలెప్పుడూ అబద్ధం చెప్పవు. అలాగే అవి అన్నిసార్లూ పాలకులను రంజింపజేయలేవు. అప్పుడప్పుడు మిశ్రమ ఫలితాలు కూడా తప్పకపోవచ్చు. వెల్లడైన అంశాల్లోని వాస్తవాలను గుర్తించి వాటిని సరిచేసేందుకు అవసరమైన విధానాలను రూపొందించగలిగితే స్థితిగతులు మెరుగుపడతాయి. మనను చిన్నబుచ్చటానికే, ప్రతిష్ఠ దెబ్బతీసేందుకే ఇలాంటి గణాంకాలు అందిస్తున్నారని కొట్టిపారేస్తే అందువల్ల ప్రయోజనం ఉండదు. తాజాగా 2023కి సంబంధించిన అంచనాలతో ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) విడుదల చేసిన నివేదిక వెలువరించిన గణాంకాలు మనకు ఏక కాలంలో అటు సంతోషాన్నీ, ఇటు నిరాశనూ కూడా కలిగిస్తుండగా... ప్రపంచ బ్యాంకు నివేదిక ఓ విధంగా భయపెడుతోంది. ఓఈసీడీ నివేదిక ప్రకారం సంపన్న రాజ్యాలకు అంతక్రితం కన్నా 2021, 2022 సంవత్సరాల్లో వలసలు బాగా పెరిగాయి. ఇందుకు ఉక్రెయిన్ యుద్ధం చాలావరకూ దోహదపడి వుండొచ్చు. ఆ దేశం నుంచి పెద్ద సంఖ్యలో శరణార్థులు యూరోప్ దేశాలకు వలసపోయారు. అలాగే 2020లో ప్రతి దేశమూ సరిహద్దులు మూసి వేయటంతో వలసలు దాదాపుగా నిలిచిపోయాయి గనుక దాంతో పోలిస్తే వలసలు పెరిగి వుండొచ్చు. అయితే స్థూలంగా చూస్తే వలసలు పెరిగాయి. అదే సమయంలో ఆ వలసల్లో మహిళల శాతం కూడా పెరిగింది. నిరుడు మన దేశంనుంచే వలసలు అధికంగా వున్నాయని నివేదిక సారాంశం. ఉన్నత విద్యకోసం వెళ్లేవారిని మినహాయించి కేవలం ఉపాధి కోసం వెళ్తున్నవారినే లెక్కేస్తే భారత్ నుంచి ఈసారి ఎక్కువమంది ఉద్యోగార్థులు వెళ్లారని ఆ నివేదిక వివరిస్తోంది.

ఓఈసీడీలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు సహా 38 సంపన్న దేశాలకు సభ్యత్వం వుంది. ఈ దేశాలకు 2021–22 మధ్య పదిలక్షల మంది వివిధ దేశాల నుంచి వలస రాగా అందులో 4.07 లక్షల మంది మన పౌరులు. ఉన్నత విద్య కోసం వెళ్లేవారిలో భారత్ రెండో స్థానంలో వుంది. మన దేశం నుంచి ఈ కేటగిరీలో 4.24 లక్షలమంది వుండగా, చైనా 8.85 లక్షలతో అగ్రభాగాన వుంది. అటు ఉపాధి కోసమైనా, ఇటు విద్యార్జన కోసమైనా అత్యధికులు ఎంచుకుంటున్నది అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలేనని నివేదిక వెల్లడిస్తోంది. ఈ వలసల గణాంకాలు గమనిస్తే అంతర్జాతీయంగా వుండే తీవ్ర పోటీని తట్టుకుని మన దేశం నుంచి ఎక్కువమంది ఉపాధి అవకాశాలను గెల్చుకుంటున్నారని తెలుస్తుంది. విదేశాలకు వెళ్లినవారు తమ కుటుంబాలకు పంపే నగదు నిరుడు బాగా పెరిగింది. ఆ ఏడాది 11,100 కోట్ల డాలర్లు భారత్‌కు విదేశాల నుంచి వచ్చిందని అంచనా. ఇది దేశ జీడీపీలో 3.3 శాతం. అంతేకాదు... ప్రపంచ దేశాలన్నిటిలో చాలా అధికం. ఈ నగదులో 36 శాతం అమెరికా, బ్రిటన్, సింగపూర్‌ల నుంచి వచ్చిందేనని గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టి భారత్‌కూ, అభివృద్ధి చెందిన దేశాలకూ సంబంధ బాంధవ్యాలు ఎంత పెరిగాయో తెలుస్తున్నది. అటు విద్యారంగాన్ని గమనిస్తే ఉన్నత చదువుల కోసం పిల్లలను విదేశాలకు పంపే తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతున్నదని అర్థమవుతుంది. ఈ విషయంలో లింగ వివక్ష కూడా తగ్గిందని ఓఈసీడీ నివేదిక వివరిస్తోంది. విదేశాల్లో చదువుకొనేందుకు వెళ్లేవారు అంతక్రితంతో పోలిస్తే రెట్టింపు పెరిగారని గణాంకాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ఉపాధి కోసమైనా, విద్య కోసమైనా వెళ్లేవారు పెరగటం మనవాళ్ల సత్తాను చాటుతోంది. ఎందుకంటే ప్రత్యేక నైపుణ్యాలుంటే తప్ప ఇదంతా సాధ్యం కాదు. అయితే ఇదే సమయంలో మన దేశంలో అటువంటి నిపుణులకు తగిన అవకాశాలు లేవన్న చేదు వాస్తవం వెల్లడవుతోంది. తగిన ఉపాధి, మంచి వేతనాలు లభించినప్పుడు వాటిని వదులుకుని ఎవరూ అయినవారికి దూరంగా పరాయి దేశాలకు వలస వెళ్లాలనుకోరు. వెళ్తున్నారంటే అలాంటివారికి తగిన ఉపాధి అవకాశాలు చూపలేకపోతున్నామని, మెరుగైన వేతనాలు ఇవ్వలేకపోతున్నామని అర్థం. ఆ నైపుణ్యాలను మన దేశాభివృద్ధికి వినియోగించలేకపోతున్నామని, తగిన శ్రద్ధ పెట్టడంలేదని గుర్తించాలి. ఈ సందర్భంలో ఈమధ్యే అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఇచ్చిన గణాంకాల ఆధారంగా రూపొందిన ప్రపంచ బ్యాంకు నివేదికను కూడా ప్రస్తావించుకోవాలి. నిరుడు మన ఇరుగుపొరుగు దేశాలతో పోలిస్తే భారత్‌లో నిరుద్యోగిత అధికంగా వున్నదని ఆ నివేదిక తెలిపింది. మన దేశ యువతలో నిరుద్యోగిత 23.22 శాతం వుంటే, పాకిస్తాన్ (11.3 శాతం), బంగ్లాదేశ్ (12.9 శాతం), ఆఖరికి భూటాన్ (14.4 శాతం)లతో మనకంటే దూరంగా వున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం.

విదేశాలకెళ్లేవారు పెరగటం గర్వపడాల్సిన విషయమేననటంలో సందేహం లేదు. ఉన్నత విద్యారంగంలో చూస్తే మన దేశంలో చాలా స్వల్ప సంఖ్యలో ఉన్నత శ్రేణి విద్యాసంస్థలున్నాయి. అవి కూడా వివిధ అంశాల్లో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా నిలబడలేకపోతున్నాయి. బోధనారంగ నిపుణులు కూడా అంతే. వారికి ఉన్నత విద్యాసంస్థల్లో అవకాశాలు లభించి తగిన వేతనాలు లభిస్తే ఇక్కడే ఉంటారు. అందువల్ల మన పిల్లల స్థితిగతులు మరింత మెరుగుపడతాయి. విదేశాల్లో విశ్వవిద్యాలయాలు ఇక్కడివారిని ఆకర్షించి భారీ మొత్తంలో వేతనాలిస్తుంటే మన సంస్థలు ఆ స్థాయిని అందుకోలేకపోతున్నాయి. ఉపాధి విషయంలోనూ అంతే. తయారీ రంగ పరిశ్రమలను పెంచగలిగితే, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు మరింత మెరుగ్గా చేయూతనందించగలిగితే వలసపోయేవారి మేధస్సు పూర్తిగా ఇక్కడే వినియోగపడుతుంది. ఇక్కడ ఉపాధి అవకాశాలు మరింత విస్తృతమై జీవనప్రమాణాలు పెరగటానికి దోహదపడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.8.32 వరకు, తదుపరి త్రయోదశి తె.5.47 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** పూర్వాభాద్ర ఉ.10.47 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర.**వర్జ్యం:** రా.7.47 నుండి 9.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.11 వరకు, **అమృత ఘడియలు:** తె.4.46 నుండి 6.16 వరకు.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం: 5.30
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సమితి సంస్కరణకు వేళయింది!

సందర్భం



అశోక్ ముఖర్జీ

అక్టోబర్ 24 ఐక్యరాజ్యసమితి దినోత్సవంగా గుర్తింపు పొందింది. 'యుఎన్ చార్టర్'గా ప్రసిద్ధి చెందిన ఒడంబడిక 1945లో అమల్లోకి రావడాన్ని ఇది సూచిస్తోంది. ఐరాస చార్టర్ పీఠికలో ఉన్న ప్రాథమిక లక్ష్యాలు ఏమిటంటే, 'తరువాతి తరాలను యుద్ధ శాపం నుండి రక్షించడం', 'మానవుల ప్రాథమిక హక్కులపై విశ్వాసాన్ని పునరుద్ఘాటించడం', 'సామాజిక పురోగతినీ, విస్తృతమైన స్వేచ్ఛలో మెరుగైన జీవన ప్రమాణాలనూ ప్రోత్సహించడం'. అయితే నేడు ఈ లక్ష్యాలు.. పెరుగుతున్న ఐక్యరాజ్యసమితి అసమర్థత కారణంగా ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోంది. కనుక ఐక్యరాజ్య సమితిని సంస్కరించడం కోసం ఐరాస చార్టర్ నిబంధనలను సమీక్షించడానికి సమయం వచ్చేసినట్లే అనుకోవాలి.

ఐక్యరాజ్యసమితి ప్రధానంగా శాంతి భద్రతలు; సామాజిక, ఆర్థిక అభివృద్ధి, మానవ హక్కులు అనే మూడు విస్తృత మూలాలపై ఆధారపడి ఉంటోంది. ప్రారంభం నుండి శాంతి భద్రతల విషయంలో ఐరాస తన నిరాశాజనకమైన పాత్ర కారణంగానే తనపై ప్రజల అవగాహనను బలంగా ప్రభావితం చేస్తూ వస్తోంది. ఇది ఐరాస సభ్య దేశాలను సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధనలో దాని తోడ్పాటు నుండి, ప్రాథమిక మానవ హక్కులు, స్వేచ్ఛల పరిరక్షణ విషయంలో అది సాధించిన ముఖ్యమైన విజయాల నుండి దృష్టిని మరల్చింది.

అంతర్జాతీయ శాంతిభద్రతలను నిర్వహించడం అనే 'ప్రాథమిక బాధ్యత'ను ఐరాస భద్రతా మండలికి చార్టర్‌లోని ఆర్టికల్ 24 అప్పగించింది. ఆర్టికల్ 25 ప్రకారం యుఎన్ఎస్‌సీ నిర్ణయాలకు ఐరాసలోని అన్ని సభ్య దేశాలూ కట్టుబడి ఉంటాయి. ఆర్టికల్ 27.3 ప్రకారం ఈ నిర్ణయాలకు ఆర్టికల్ 23 ప్రకారం ఐదుగురు శాశ్వత సభ్యులు... చైనా, ఫ్రాన్స్, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ 'సమ్మతి ఓట్లు' అవసరం. లేకుంటే వీటో అవుతోంది.

నిజానికి ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో భాగంగా వీటో అనేది లేదు. చర్చలు జరపడానికి, చార్టర్‌ను స్వీకరించడానికి శాన్‌ఫ్రాన్సిస్కో సదస్సులో పాల్గొనడానికి దేశాలను ఆహ్వానిస్తున్నప్పుడు పి5 దేశాల తరపున అమెరికా ముందస్తు షరతుగా దీనిని ఒప్పందంలో చేర్చడం జరిగింది. భారతదేశం తరపున చార్టర్‌పై సంతకం చేసిన భారత ప్రతినిధి బృందం నాయకుడు సర్ ఎ. రామస్వామి ముదలియార్ వీటోను తాత్కాలిక 'రక్షణ' యంత్రాంగంగా చేర్చడానికి 'అనిష్ట పూర్వకంగానే' అంగీకరించినట్లు రికార్డుల్లో ఉంది. దానికి ప్రతిఫలంగా చార్టర్ అమలులోకి వచ్చిన 10 సంవత్సరాల తర్వాత, అంటే 1955 నాటికి అన్ని నిబంధనల సమీక్ష జరగాల్సి ఉంటుంది (ఆర్టికల్ 109).

ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత ఐరాస శాంతి భద్రతల స్తంభం కిందికి కుంగిపోయినట్లు 2005 సెప్టెంబరులో ఐరాస 60వ వార్షికోత్సవ శిఖరాగ్ర సమావేశంలో ప్రపంచ నాయకులు స్పష్టంగా గుర్తించారు. 'భద్రతాసమితిని మరింత విస్తృత స్థాయి ప్రతినిధిగా, సమర్థవంతంగా, పారదర్శకంగా మలచడానికి, దాని ప్రభావాన్ని, దాని నిర్ణయాల చట్టబద్ధతను, అమలును మరింతగా మెరుగుపరచడం కోసం భద్రతా సమితిలో ముందస్తు సంస్కరణలకు పిలుపునిస్తూ ఆ నాయకులు చేసిన ప్రకటనను జనరల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే పద్దెనిమిది సంవత్సరాల తరువాత కూడా, ఈ ఆమోదం నెరవేరలేదు, ప్రధానంగా భద్రతా సమితిలో సంస్కరణకు అయిదు శాశ్వత సభ్య దేశాల వ్యతిరేకతే దీనికి కారణం (ఏకగ్రీవ ప్రకటనలో పి5 భాగమే అయినప్పటికీ).

భద్రతామండలి సంస్కరణలను వ్యతిరేకించడం ద్వారా 5 శాశ్వత సభ్యదేశాలు మండలి అసమర్థతను మరింత తీవ్రతరం చేస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు ఉక్రెయిన్‌లో రాజకీయ పరిష్కారం కోసం (భద్రతాసమితి 2202వ తీర్మానం, 2015 ఫిబ్రవరి 17), అఫ్గానిస్తాన్‌లో రాజకీయ పరిష్కారం కోసం (భద్రతా సమితి 2513వ తీర్మానం, 2020 మార్చి 10) ఏకగ్రీవ తీర్మానాలను ఆమోదించినప్పటికీ, వాటిని అమలు చేయకపోవడం పట్ల భద్రతా మండలి ఇప్పటివరకు బాధ్యత వహించలేదు. దీనివల్ల లక్షలాది మంది ప్రజలు ప్రతికూల ప్రభావాలకు గురవుతున్నారు.



చరిత్రాత్మక సందర్భం : భారత్ తరఫున యు.ఎన్.చార్టర్‌పై సంతకం చేస్తున్న సర్ ఎ. రామస్వామి ముదలియార్ (1945)

ప్రస్తుతం భద్రతా మండలి అజెండాలో ఉన్న ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఐరోపాలలో 50కి పైగా సంఘర్షణలను పరిష్కరించడంలో 5 శాశ్వత సభ్యదేశాలు నిస్సహాయంగా ఉంటు న్నాయి. దౌత్యపరమైన చర్చల కోసం వాతావరణాన్ని సృష్టించేందుకు 6.3 బిలియన్ డాలర్ల వార్షిక వ్యయంతో 85,500 మంది ఐరాస శాంతి పరిరక్షకులను భద్రతామండలి మోహరించిన 12 సంఘర్షణలు కూడా వీటిలో ఉన్నాయి. ఈ సంఘర్షణల ద్వారా ప్రత్యక్షంగా ప్రభావితమైన వ్యక్తుల సంఖ్య 2015లో 60 మిలియన్ల నుండి 2022 నాటికి 314 మిలియన్లకు పెరిగింది.

ఒకవైపు తన అసమర్థత పెరుగుతున్నప్పటికీ... తీవ్రవాదం, డిజిటల్ సమస్యలు, వాతావరణ మార్పుల వంటి ప్రపంచ సవాళ్లను కూడా తన పరిధిలోకి తీసుకురావడానికి భద్రతామండలి ప్రయత్నించింది. భద్రతామండలి నైపుణ్యం, వనరుల కొరత అనేది నాటో వంటి ఐరాసయేతర కూటములు ఐరాస సర్వసభ్య సమావేశం ఆమోదం లేకుండా ఏకపక్షంగా వ్యవహరించడానికి తలు పులు తెరిచింది. ఈ ధోరణి ఐరాస చార్టర్‌కి చెందిన సమర్థవంతమైన పనితీరును విచ్ఛిన్నం చేస్తోంది.

1945 జూన్ 26న శాన్ ఫ్రాన్సిస్కోలో ఐక్యరాజ్యసమితి ఒప్పందంపై సంతకం చేసిన 50 మంది సభ్యులలో ఒకరిగా భారతదేశ లక్ష్యం ఏమిటంటే ఐరాసను సంస్కరించడమే కానీ దాని స్థానాన్ని భర్తీ చేయడం కాదు. భారతదేశ సమగ్ర విధానం శాంతి భద్రతలు, అభివృద్ధి మధ్య అంగీకృత పరస్పర సంబంధంపై నిర్మితమైంది, ఇది బహు పాక్షికతలోకి 'మానవ-కేంద్రీకృత' దృక్పథాన్ని తీసుకువస్తుంది. భద్ర తాసమితి కోసం, యుఎన్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ (ఈసీఏఎస్ఓసీ) కోసం మొదటి చార్టర్ సంస్కరణలను సర్వసభ్య సమావేశం విజయవంతంగా ఆమోదించిన 1963 నాటి నుండి, ఐక్యరాజ్యసమితిలో భారతదేశ ట్రాక్ రికార్డ్ అటువంటి సంస్కరణవాద పాత్రను పోషించడానికి తన విశ్వసనీయతను కలిగి ఉంది.

ఈ రోజు ఐరాస ప్రధాన ఎజెండా ఏమిటంటే దాని 17 నిలకడైన అభివృద్ధి లక్ష్యాలతో కూడిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌పై 2030 ఎజెండా. 2015 సెప్టెంబరులో యుఎన్ జనరల్ అసెంబ్లీ ద్వారా ఏకగ్రీవంగా ఆమోదం పొందిన ఈ విశ్వవ్యాప్త ఫ్రేమ్‌వర్క్.. అభివృద్ధితో పాటు శాంతి భద్రతలను పెంపొందిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు (ఎస్‌డీజీ గోల్ నెం. 16.8) బహుపాక్షిక నిర్ణయాధికారంలో, ముఖ్యంగా భద్రతా మండలిలో మెరుగైన, సమాన భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తాయి. ఎజెండా 2030 అనేది ఎస్‌డీజీలను అమలు చేయడానికీ, భాగస్వామ్యాల (ఎస్‌డీజీ 17) ద్వారా బహుపాక్షిక ఆర్థిక ప్రవాహాలనూ, తగిన సాంకేతిక పరిజ్ఞానాన్నీ బదిలీ చేయడానికి కట్టుబడి ఉంది. అసమానతలను తగ్గించడానికి (ఎస్‌డీజీ 10) నిబద్ధత వహిస్తూనే, ఇది పేదరికాన్ని నిర్మూలించడం (ఎస్‌డీజీ 1), ఆహార భద్రత (ఎస్‌డీజీ 2), ఆరోగ్యం (ఎస్‌డీజీ 3), విద్య (ఎస్‌డీజీ 4), లింగ సమానత్వం (ఎస్‌డీజీ 5) వంటి ప్రధాన మానవ హక్కులను సమర్థిస్తుంది. సంస్కరించబడిన ఐక్యరాజ్యసమితి ఈ కట్టుబాట్లను దాని చార్టర్ నిబంధనలలో ఏకీకృతం చేయాలి.

ఐరాస చార్టర్‌కు ఈ సవరణలు ఎలా చేయవచ్చు? చార్టర్ ఆర్టికల్ 109 జనరల్ కాన్ఫరెన్స్ ద్వారా చేయొచ్చు. అటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి ఐరాస జనరల్ అసెంబ్లీలో మూడింట రెండు వంతుల మెజారిటీ ఓట్లు, భద్రతామండలిలో 9 నిశ్చయాత్మక ఓట్లు (పీ5కి ఎటువంటి వీటో అధికారం లేకుండా) అవసరం.

2024 సెప్టెంబరులో జరిగే ఐరాస 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్'లో పాల్గొనడానికి భారతదేశం సిద్ధమవుతున్నందున, ఈ ఫ్రేమ్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఐరాస సెక్రటరీ జనరల్‌కి చెందిన ఉన్నత స్థాయి సలహా మండలి సిఫార్సు చేసిన విధంగా, 21వ శతాబ్దానికి సంస్థను 'ప్రయోజనం కోసం సరిపోయేలా' చేయడానికి ఐరాస సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సదస్సు సిఫార్సు చేయాలి. 2025లో జరిగే ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవం ఈ సదస్సును నిర్వహించడానికి తగిన సందర్భం.

వ్యాసకర్త ఐరాసలో భారత్ మాజీ శాశ్వత సభ్యులు

సోషల్ మీడియా



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆ గుణాలేవీ?!



రాముణ్ణి మీరు మీ రాజకీయ లబ్ధి కోసం ఎన్నిసార్లు ఉపయోగించుకుంటారు? రాముడిలోని శౌర్యం, ధీరత్వం, విధేయత, కరుణ, ప్రేమ, సచ్ఛీలత.. వీటిల్లో ఏ ఒక్క గుణం కూడా మీ పాలనలో ఎందుకు లేకపోయింది? (బీజేపీని ఉద్దేశించి)

– కపిల్ సిబల్, ఎంపీ

'ఇండియా' మారుతోంది



పాఠ్యాంశాల సవరణ కోసం ఎన్.సి.ఇ.ఆర్.టి. కమిటీ పాఠ్య పుస్తకాలలో ఇండియా అనే పేరును 'భారత్' గా మార్చాలని, పురాతన చరిత్రకు బదులుగా ఆధునిక చరిత్రను సిలబస్‌లో ప్రవేశపెట్టాలని సిఫారసు చేసింది. అలాగే పాఠ్య పుస్తకాలలో హిందూ విజయాలకు ప్రాముఖ్యం ఇవ్వాలని సూచించింది.

– ఫరీహా ఇఫ్తికార్, విద్యారంగ విశ్లేషకురాలు

సంకెళ్లు లేని చట్టం



ఆర్థిక నేరస్థులు అనేవారు హంతకులు గానీ, రేపిస్టులు గానీ కాదు కనుక వారిని అరెస్టు చేసినప్పుడు చేతికి సంకెళ్లు వేయకూడదని ఇప్పటికే చెబుతూ వస్తున్న పార్లమెంటరీ కమిటీ... భారతీయ శిక్షాస్మృతి స్థానంలో ప్రవేశపెట్టనున్న ప్రతిపాదిత 'భారతీయ నాగరిక సురక్ష సంహిత బిల్లు'లో 15 రోజుల పోలీసు కస్టడీ అధికారాలను స్పష్టంగా నిర్వచించమని కూడా కోరింది.

– నీరజ్ చౌహాన్, సీనియర్ జర్నలిస్ట్

అందరూ బిలియనీర్‌లే!



'దివాలా' తీసిన కంపెనీలను అమ్మేస్తున్న వాళ్లంతా బిలియనీర్‌లు. వాళ్లు అడిగినంతా ఇచ్చేస్తూ ఆ కంపెనీలను కొంటున్న వాళ్లంతా మల్టీ బిలియనీర్‌లు. వాళ్లకు, వీళ్లకు సహాయపడుతున్న రాజకీయ నాయకులు, అధికారులు ఆధారపడుతున్నది ఎవరి మీదో తెలుసా? బిలియన్‌ల సంఖ్యలో ఉన్న పేద భారతీయుల మీద!

– రాజేంద్ర కుంభట్, పొలిటికల్ ఎనలిస్ట్

చేయి దాటుతోంది!



మధ్యప్రాచ్యంలో పరిస్థితి గంట గంటకూ భయానకంగా మారుతోంది. ఇలాంటి కీలక సమయంలో పౌర హక్కుల్ని గౌరవించడం, పౌరులను రక్షించడం అనే ప్రాథమిక బాధ్యతపై స్పష్టంగా ఉండాలి. అలాగే పాలస్తీనా ప్రజల మనోవేదనలు హమాస్ దాడులకు సమర్థనీయతను కల్పించలేవనీ గుర్తించాలి.

– ఆంటోనియో గుటెర్రస్, ఐరాస ప్రధాన కార్యదర్శి

సైనిక నిబద్ధత



యుద్ధం అక్టోబర్ 7న ప్రారంభం కాలేదు. ఇది 76 సంవత్సరాల క్రితమే మొదలైంది. పౌరులను చంపడం ఇస్లాం సూత్రాలకు విరుద్ధం. ముస్లిం సైనికులు గత వెయ్యేళ్లలోనూ మహిళలకు, పిల్లలకు, ఆఖరికి చెట్లకు కూడా హాని చేయలేదు. మరొక సంగతి కూడా! పాలస్తీనా తల్లులు తమ పిల్లలను ఇతర దేశాల్లోని తల్లుల్లాగే ప్రేమిస్తారని నేను ప్రపంచానికి గుర్తు చేయాలనుకుంటున్నాను.

– జోర్డాన్ రాణి రానియా ('సీఎన్ఎన్' ఇంటర్వ్యూ)

వీడియో కలకలం



మోదీ స్వయంగా ఎంపిక చేసిన జమ్మూకశ్మీర్ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఇటీవల రాహుల్ గాంధీని ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. 'మీకు పదవి అధికారాలపై దురాశలు లేవు' అని రాహుల్‌ను కీర్తించారు. రాహుల్ తాజాగా విడుదల చేసిన ఆ వీడియోలో మోదీకి కలవరం కలిగించే రహస్యోద్ఘాటనలు కూడా ఉన్నాయి!

– శంతను, గాంధేయవాది

ఇన్ బాక్స్

అరుణాచల్‌కు తలమానికం

గత 13 ఏళ్లుగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'టాటా లిటరేచర్ లైవ్' ఈనెల 25 నుంచి తన 14వ సంచికను నిర్వహిస్తున్నది. అందులో ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన గొప్ప కవి, రచయిత్రి మమాంగ్ దయాని ఈ యేటి ఆస్థాన కవిగా ఎంపిక చేసి గౌరవిస్తున్నారు.



మమాంగ్ దయాని

అరుణాచల్ ప్రదేశ్‌లో లిపి లేని భాషలే అధికంగా ఉండడంతో మొదటి నుంచీ అస్సామీ భాషను విద్యాలయాల్లో నేర్పారు. ఆ తరువాత ఇంగ్లీష్, హిందీలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఇంగ్లీష్ అభ్యసనం ప్రపంచ సాహిత్యంతో అక్కడివారికి పరిచయం ఏర్పరచింది. ఆ ప్రభావంతో అనేకమంది ఇంగ్లీష్‌లో రచనలు చేయడం ప్రారంభించారు. అలా రాసిన మొదటి తరానికి చెందినవారు మమాంగ్ దయా. ఆమె కవిత్వం, కథలూ, నవలలూ రాశారు. ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో నివసిస్తున్నారు. ఇప్పటికే ఆమె పలు కవితా సంకలనాలు వెలువరించారు. ఆమె 'నది కవితలు' చాలా ప్రసిద్ధి. ఆమె తర్వాతి రచన 'మిడ్ సమ్మర్-సర్వైవల్ లిరిక్స్'. 'ద లెజెండ్స్ ఆఫ్ పెన్సం' నవలతో పాటు పలు నాన్ ఫిక్షన్ రచనలూ చేశారు. ఆమె 'ఆది' భాషలోనూ, ఆంగ్లంలోనూ రాస్తున్నారు.

1957లో 'ఆది' తెగలో జన్మించారు. మొదట ఐఏఎస్‌కు ఎంపికయ్యారు కానీ జర్నలిస్ట్‌గానూ, రచయిత్రిగానూ ఉండడానికి ఇష్టపడి ఐఏఎస్‌ను వదిలేశారు. దయా 'ది టెలిగ్రాఫ్', 'ది హిందుస్థాన్ టైమ్స్', 'ది సెంటినెల్'తో సహా వివిధ వార్తాపత్రికలకు కరస్పాండెంట్‌గా ఉన్నారు. టెలివిజన్, రేడియోలకు కూడా విరివిగా రాశారు. రెండు నవలలతో పాటు, యువ పాఠకుల కోసం ఆమె వచన కవితలు, కథలు రాశారు. ఆమె నాన్-ఫిక్షన్ రచన 'అరుణాచల్ ప్రదేశ్: ది హిడెన్ ల్యాండ్'కు గాను 2003లో 'స్టేట్ వెరియర్ ఎల్విన్' అవార్డును అందుకున్నారు. ఆమె ప్రస్తుతం 'అరుణాచల్ ప్రదేశ్ లిటరరీ సొసైటీ' జనరల్ సెక్రటరీగా, 'నార్త్ ఈస్ట్ రైటర్స్ ఫోరమ్' సభ్యురాలుగానూ ఉన్నారు.

మమాంగ్ దయా తన మూలాల్నీ, తాను నివసించిన ప్రాంతాన్నీ తన రచనల్లో ప్రతిబింబింపజేశారు. ఆమె సాహిత్యంలోని ప్రకృతి రహస్యమైనది, పురాణాలతో పచ్చగా ఉంటుంది, పవిత్రమైన జ్ఞాపకశక్తితో దట్టంగా ఉంటుంది. 'నదికి ఆత్మ ఉంది'అంటారామె.

ఆమె కవిత్వం చాలా సరళంగా ఉంటుంది. కవిత్వం ఒక క్షణపు సత్యానికి సంబంధించిందనీ, అది ఒక 'అనుభూతి' అనీ అంటారామె. దీని అర్థం మొత్తం జీవితానికి ప్రతిస్పందించడమే. అంతేకాదు మనిషి స్థితిని పదాలలోకి మార్చడం కవిత్వం. అది మానవ హృదయ భాష అంటారు మమాంగ్ దయా.

– వారాల ఆనంద్, రచయిత – విమర్శకులు

భూతల స్వర్గం... అలా విలీనమైంది!

సందర్భం



జిల్లా గోవర్ధన్

స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచీ భారత్‌లో ఆరని మంటల్ని రగుల్చుతోంది 'కశ్మీర్' సమస్య. కశ్మీర్‌ను తనలో కలిపివేసుకోవాలన్న పాక్ కలలు కల్లలు చేస్తూ భారత్ స్పందించిన తీరుతో ధర్మబద్ధంగా కశ్మీర్ మన దేశంలో విలీనమైంది.

అది 1947 జూలై 25. ఢిల్లీలో 'ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్' మీటింగ్‌లో బ్రిటిష్ రాయల్ నేవీ అడ్మిరల్, వైస్రాయ్ లార్డ్ లూయిస్ (డిక్కీ) మౌంట్ బాటెన్ స్వదేశీ సంస్థానాలను భారత దేశ సమైక్యత దృష్ట్యా 'విలీన ఒప్పంద పత్రం'పై సంతకం చేయవలసిందిగా కోరారు. కొత్తగా ఏర్పాటైన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్స్'కు అధిపతిగా ఉన్న వల్లభాయ్ పటేల్ కూడా పరిస్థితిని వివరించారు. చాలా మంది రాజులు తమ తమ సంస్థానాలను భారత్‌లో విలీనం చేయటానికి ఒప్పుకుని ఆ రోజే పత్రాలపై సంతకాలు చేశారు. అయితే ఉత్తరాదిన హిమాలయాలను ఆనుకుని ఉన్న కశ్మీర్ పాలకుడు మహారాజా హరిసింగ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. పటేల్‌తో సింగ్, 'బ్రిటిష్ నిష్క్రమణ తర్వాత, నా కశ్మీర్‌ను 'స్విట్జర్లాండ్ ఆఫ్ ఈస్ట్'గా మార్చాలి. నా దేశం అలిప్తంగానే ఉంటుంది' అంటూ నవ్వారు. అప్పటికి సమావేశం ముగిసింది.

1947 అక్టోబరు 25 అర్ధరాత్రి దాటాక 300 వాహనాలతో ప్యాలెస్‌లోని విలువైన వస్తువులు, నగలు నట్రా తీసుకుని, పర్సనల్ పోలీసు, సైన్యంతో, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అనూహ్య పరిస్థితిలో మహారాజు తన కుటుంబ సభ్యులతో సహా శ్రీనగర్ విడిచి జమ్మూకు తరలిపోవలసి వచ్చింది.

అసలేం జరిగిందంటే... 1947 ఆగస్టు 15న నాటి భారత ఉపఖండం రెండు దేశాలుగా విడిపోయి స్వాతంత్య్రం పొందాయి. సంస్థానాలు ఇటు భారత్‌లోనూ, అటు పాకిస్తాన్‌లోనూ విలీనమవుతున్నాయి. స్వతంత్రంగా ఉండాలని అనుకుంటున్న కశ్మీర్ నేపథ్యం గురించి ఇక్కడ కొంత చెప్పుకోవాలి. దీన్ని పాలించే రాజు హిందూ డోగ్రా వంశానికి చెందిన మహారాజా హరిసింగ్. అయితే పాలితుల్లో 90 శాతం మంది ముస్లింలే. కానీ పరిపాలన యంత్రాంగం,



పోలీస్ వ్యవస్థల్లో ఎక్కువ శాతం డోగ్రాలు, బ్రాహ్మణ పండితులే ఉన్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ పాకిస్తాన్ ఏర్పడటంతో, కశ్మీర్‌లోని ముస్లిం మతతత్వ శక్తులు హరిసింగ్ అధికారాన్ని కూల్చివేయటానికి పన్నాగం పన్నుతున్నాయి. పశ్చిమ సరిహద్దు ప్రాంతం ముర్రీ, ముజఫరాబాద్ నగరాల్లో ర్యాడికల్ ముఠాలకు పాకిస్తాన్ ప్రభుత్వం అండ లభించింది. ముర్రీ తెహసిల్‌లో భూస్వామి సాహెబ్ ఖుదా ఖయ్యాం స్థానిక గిరిజనులను ఏకం చేసి సెప్టెంబరు నుండే శ్రీనగర్‌ను ముట్టడించటానికి పూనుకున్నాడు. అతనికి పాకిస్తాన్ శస్త్రబలం, సరిపడా కాల్బలం (ఆర్మీ) కూడా లభించింది. దీంతో డోగ్రా పాలనకు విరుద్ధంగా 'జిహాద్' మొదలైంది.

కశ్మీర్ సరిహద్దుల్లో రోజు రోజుకూ మారుతున్న పరిస్థితులు ఎప్పటికప్పుడు ఢిల్లీలోని ఉప ప్రధాని, హోంమంత్రి పటేల్‌కు సమాచారం అందటంతో ముందు జాగ్రత్తగా ఒక ఆర్మీ బెటాలియన్‌ను జమ్ము సరిహద్దులో, మరో దాన్ని లాహోర్ సరిహద్దు వైపు మోహరింపచేశారు. అక్టోబర్ 22న ఒక గిరిజన గ్రూపు పాక్ సైన్యంతో కలిసి కశ్మీర్ భూభాగంలోకి చొరబడింది. శ్రీనగర్ సిటీకి మరో 50 మైళ్ళ దూరంలో జిహాద్ గ్రూప్ డేరా వేసినట్లు, ఇక మహారాజు ప్యాలెస్‌లో ఉంటే ఆయనకు, ఆయన కుటుంబానికి కూడా ప్రాణహాని జరగొచ్చని కశ్మీర్ పోలీస్ వర్గాలు తేల్చేశాయి. దీంతో గత్యంతరం లేక పోవటంతో ఇక భారత ప్రభుత్వాన్ని సైనిక సహాయం కోరారు మహారాజు. ప్రభుత్వం సాయం చేయడానికి ఒప్పుకొంది.

1947 అక్టోబర్ 26న తన పొలిటికల్ సెక్రటరీ వీ.పీ. మీనన్ ద్వారా హరిసింగ్‌తో విలీన ఒప్పంద పత్రంపై సంతకం సేకరించారు పటేల్. కల్నల్ మానెక్‌షా, ఢిల్లీ నుండి అదే రాత్రి నాలుగు యుద్ధ విమానాల్లో ఆర్మీ స్టాఫ్‌తో శ్రీనగర్ ఎయిర్ పోర్టు చేరుకున్నారు. భారత్ లష్కర్ ధాటికి ఆక్రమణకు వచ్చిన కొందరు గిరిజన దుండగులు చనిపోగా, మిగిలిన పాక్ సైనికులు, రెబెల్ జిహాదీలు బ్రతుకు జీవుడా అనుకుంటూ పాక్ సరిహద్దు వైపు పారిపోయారు. అక్టోబర్ 27న శ్రీనగర్‌లోని కశ్మీర్ ప్రజాసభ (అసెంబ్లీ) భవనం, మహారాజా ప్యాలెస్‌పై మువ్వన్నెల జెండా ఎగిరింది. కశ్మీర్ లోయ భారత్‌లో విలీనమైంది!

వ్యాసకర్త పీఎఫ్ మాజీ కమిషనర్ I 98190 96949
(రేపు భారత్‌లో కశ్మీర్ సంస్థానం విలీనమైన రోజు)

ధీరుని లక్షణం

అత్యున్నత ఐశ్వర్యం అనుభవించి కాల వశాత్తూ అదంతా కోల్పోయినా ఏ మాత్రం మనసులో శోకించని మనోధీరుడు 'నముచి' అనే దానవుడు. అతని దగ్గరకు ఇంద్రుడు వచ్చి 'సమస్త సంపదలూ కోల్పోయినందుకు కలత పడుతున్నావా?' అని అడిగాడు. దానికి నముచి



సంతాపాద్ భ్రశ్యతే రూపం సంతాపాద్ భ్రశ్యతే శ్రియ
సంతా పాద్ భ్రశ్యతే చాయుః ధర్మశ్చైవ సురేశ్వర

అంటాడు.

'శోకం వల్ల రూపం నశిస్తుంది. సంపదలు నశిస్తాయి. ఆయువు, ధర్మం కూడా నశిస్తాయి. శోక సమయంలో మనతో ఉండి సాయం చేయ గలిగే వాళ్ళు ఉండరు. శోకం వలన శరీరానికి తాపం తప్ప వేరే ప్రయోజనం లేదు. అందు చేత నేను నాకు సంభవించిన ఏ విపత్తుకూ శోకించను' అని దీని భావం. మహాభారత కాలం నాటి ఈ మాటలు ఇప్పటి సమాజానికీ వర్తిస్తాయి. సంక్షుభిత జీవన వలయంలో చిక్కుకున్న వారు నముచి మాటలు స్మరిస్తూ జీవితాన్ని ధైర్యంగా గడపాలి. సమస్యలు కష్టాలు తట్టుకొని నిలబడడం ధీరుని లక్షణం.

– శివలెంక ప్రసాదరావు

క్లుప్తంగా...

నేను పార్టీ మారను: వివేక్



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారనున్నట్టు చాలా రోజులుగా ప్రచారం జరుగుతోందని, అదంతా అవాస్తవమని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డా.జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని తెలిపారు. బీజేపీకి కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తనకు తెలియదన్నారు.

రెండుచోట్లా గెలుస్తా... ఈటల



వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ డబ్బులను నమ్ముకుందని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. అయినా తాను ప్రజల ఆశీస్సులతో హుజురాబాద్, గజ్వేల్ రెండు చోట్లా గెలుస్తాననే ధీమాను వ్యక్తం చేశారు. బుధవారం ఈటల మీడియాతో మాట్లాడుతూ ఇటీవలే బీఆర్ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని చెప్పిన రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు ఎలా మాట మార్చారో అర్థం కావడం లేదన్నారు. రాజగోపాల్ రెడ్డి శరీరం మాత్రమే బీజేపీలో ఉందనీ, ఆత్మ కాంగ్రెస్ లోనే ఉండిందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ వ్యాఖ్యానించారు. పార్టీ అధిష్టానం ఎక్కడి నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచే తాను పోటీ చేస్తానని, తనకు మాత్రం భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని ఉందని నర్సయ్య గౌడ్ చెప్పారు.

బెదిరింపు ఫోన్లు వస్తున్నాయి




సాక్షి, హైదరాబాద్: తనకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని బీజేఎల్పీనేత, గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ తెలిపారు. ఈ ఫోన్లు 15 డిజిట్ నంబర్ నుంచి వస్తున్నాయని, తనను చంపుతామని, నరుకుతామని భయపెట్టిస్తున్నారని బుధవారం మీడియాతో వెల్లడించారు. తనకు ఫోన్ చేసి తన గురించి, తాను ఎక్కడెక్కడికి వెళుతోంది ప్రతీ కదలిక గురించి తెలియజేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ వస్తుండటంతో, తమ ఇద్దరినీ కలిపి చంపుతామని హెచ్చరించినట్లు రాజాసింగ్ చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 1.59 గంటలకు +61 9664800063233 నుంచి తనకు ఫోన్ చేసి బెదిరించినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు రాజాసింగ్ వెల్లడించారు. ఈ బెదిరింపు ఫోన్ కాల్స్‌పై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

‘బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రిష్తేదార్ పార్టీ’

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రిష్తేదార్ పార్టీ అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ అవినీతికి పాల్పడే పార్టీ అని.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఎంఐఎం బీ–టీంగా పని చేస్తోందని ఆరోపించారు. కుటుంబం, అవినీతి గురించి బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ ఆలోచిస్తున్నాయని, ఈ పార్టీలన్నీ అవినీతి చేయడానికే పనిచేస్తాయని మండిపడ్డారు. బుధవారం జాఫర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ఓ ఏటీఎంగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్లీపర్ సెల్ అయిన తమిళనాడు సర్కారు సహకారంతో తెలంగాణకు డబ్బు చేరుతోందని ఆయన ఆ రోపించారు. ఇటీవల తరలిస్తున్న డబ్బు దొరికింది కొంతమాత్రమే అని.. వేల కోట్ల రూపాయల లింక్ దొరికిందని జాఫర్ వెల్లడించారు. ప్రజల సొత్తు అక్రమంగా సంపాదించి ఎన్నికల్లో మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్న పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని జాఫర్ సూచించారు. తెలంగాణలో గెలుపు కోసం సీరియస్‌గా పని చేస్తున్నామని, డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

నాకు టికెట్ ఇవ్వకపోవడానికి కారణాలేంటి?

పార్టీని ప్రశ్నించిన నాగం జనార్దన్‌రెడ్డి



తుర్కయాంజాల్ (హైదరాబాద్): తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడానికి కారణాలేంటి? తన అనర్హతలేంటో కాంగ్రెస్ పార్టీ చెప్పాలని మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని నిలదీశారు. తుర్కయాంజాల్‌లోని బుధవారం ఓ ఫంక్షన్ హాల్‌లో తన అనుచరులతో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగం మాట్లాడుతూ...ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ఐదేళ్ల సభ్యత్వం ఉన్నవారికే టికెట్ కేటాయిస్తామని గతంలో ప్రకటించినా...ఈ ఏడాది ఆగస్టు నెల 3న పార్టీలో చేరిన కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి ఏ అర్హత ఆధారంగా టికెట్ కేటాయిస్తున్నారో చెప్పాలని కోరారు. పార్టీ చెబుతున్న ఆరు గ్యారంటీల కన్నా ముందు పార్టీ ఫిరాయించరనే విషయంపై గ్యారంటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలపై కోర్టుల్లో కేసులు వేసి పోరాడినందుకు ఫలితం టికెట్ ఇవ్వకపోవడమా అని ప్రశ్నించారు. దీనిని అవమానకరంగా భావిస్తున్నానని, తన ఆత్మగౌరవానికి సంబంధించిన విషయంగా భావిస్తున్నానని తెలిపారు.

కమలం పార్టీలో ‘కొత్త’ రేకల ఉక్కపోత!

- పార్టీలో ఇమడలేక, జాతీయ, రాష్ట్ర నాయకత్వాల వ్యూహాలు అర్థంకాక నిష్క్రమణ
- ఉన్న నేతలూ ఎమ్మెల్యేగా పోటీకి ససేమిరా అంటున్న వైనం

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో కొత్త నేతలు కుదురుకోని పరిస్థితి కనిపిస్తోంది. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరినవారు ఎక్కువ కాలం ఉండలేకపోతున్నారని.. దీనికి ఇటీవలి నిష్క్రమణలే సాక్ష్యమని, రాజగోపాల్‌రెడ్డి రాజీనామా తాజా ఉదాహరణ అని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరాక.. జాతీయ కార్యవర్గ సభ్యులుగా, ఇతర ప్రాధాన్య పదవులు ఇచ్చినా, పార్టీలో ఉండలేకపోవడానికి కారణాలేమిటనే దానిపై ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో పార్టీని నడిపే తీరులో జాతీయ నాయకత్వం తీరు, అంతా ఢిల్లీ నుంచే నడిపించడం, ఇక్కడి రాజకీయ వాతావరణం, పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటివి అసంతృప్తికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర నాయకత్వం వ్యవహార శైలి, అనుసరించే వ్యూహాలు అర్థంగాకపోవడం, సమన్వయ లేమి వంటివి కూడా ఇబ్బందికరంగా మారాయని పార్టీ నేతలు అంటున్నారు. పార్టీలో అసంతృప్త నేతలుగా ముద్రపడిన వారంతా ఇతర పార్టీల నుంచి వచ్చినవారేనని, వారు ఇక్కడ ఇమడటం కష్టంగానే ఉందని పేర్కొంటున్నారు.

రాజీనామాల పర్వంలో..

బీజేపీలో ఇటీవల వరుసగా రాజీనామాలు కనిపిస్తున్నాయి. మాజీ మంత్రి చంద్రశేఖర్, జిట్టా బాలకృష్ణారెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.స్వామిగౌడ్, మోత్కుపల్లి నర్సింహులు, ఎర్ర శేఖర్, నాగం జనార్దన్‌రెడ్డి ఇప్పటికే పార్టీని వీడగా.. తాజాగా రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేశారు. వీరంతా పార్టీలో ఇమడలేక, జాతీయ, రాష్ట్ర నాయకత్వాల వ్యూహాలు అర్థంకాక నిష్క్రమిస్తున్నారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. దీనికి మరిన్ని కారణాలూ ఉన్నాయని.. వీటిపై పార్టీ నాయకత్వం పెద్దగా సమీక్షించిన దాఖలాలు కూడా లేవని అంటున్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా పార్టీ జాతీయ (సంస్థాగత) ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ మాట్లాడుతూ.. ‘‘వచ్చే వాళ్లు వస్తుంటారు.. పోయే వాళ్లు పోతుంటారు..’’ అన్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని చెప్తున్నారు. కీలకమైన అసెంబ్లీ ఎన్నికల తరుణంలో కొత్త నేతల సమస్య మరోసారి రాష్ట్రపార్టీకి తలనొప్పిగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అసంతృప్త నేతలుగా ముద్రపడిన వారిలో ఇంకా ఎవరెవరు పార్టీ మారుతారోనన్న చర్చ జరుగుతోందని అంటున్నాయి.

మాజీ ఎంపీలంతా లోక్‌సభ పోటీ వైపే..

రాష్ట్ర పార్టీలోని ముఖ్య నేతలంతా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశించినా.. మాజీ ఎంపీలు, ఇతర సీనియర్లు లోక్‌సభకు పోటీ చేయడానికే మొగ్గుచూపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తొలుత పోటీకి విముఖంగా ఉన్నట్టు వార్తలు వచ్చినా.. జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కరీంనగర్ బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. చెన్నూరు సీటుకు జాతీయ కార్యవర్గ సభ్యుడు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ జి.వివేక్ వెంకటస్వామి పేరును ఖరారు చేసినా ఆయన పోటీకి ససేమిరా అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఎంపీగా పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేసినట్టు సమాచారం. మాజీ ఎంపీలు ఏపీ జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూరనర్సయ్యగౌడ్ తదితరులు కూడా లోక్‌సభకే పోటీ చేస్తామని చెప్తున్నారు. ఇక మహబూబ్‌నగర్ నుంచి తాను, షాద్‌నగర్ నుంచి కుమారుడికి అసెంబ్లీ టికెట్లు కోరుతున్న జితేందర్‌రెడ్డి.. ఇప్పుడు స్వరం మార్చి మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగానే పోటీచేస్తానని తాజాగా ప్రకటించారు. రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో మునుగోడులో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను పోటీకి నిలిపే అవకాశాలపై చర్చ జరుగుతోంది. కానీ తాను భువనగిరి నుంచే పోటీకి సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెప్తున్నారు. అధిష్టానం ఒత్తిడి తెస్తే.. వారు కూడ పార్టీ మారితే పరిస్థితి ఏమిటనే చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

తిరిగి కాంగ్రెస్ గూటికి రాజగోపాల్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు రాజగోపాల్‌రెడ్డి రాజీనామా లేఖ పంపించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, అధ్యక్షుడు నడ్డా తనపై విశ్వాసంతో అప్పగించిన ప్రతి పనిని చిత్తశుద్ధితో నిర్వహించానని అందులో పేర్కొన్నారు. గత 15 నెలల్లో బీజేపీ నాయకత్వం ఇచ్చిన ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేసిన రాజగోపాల్‌రెడ్డి.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని తన ఫామ్‌హౌస్‌లో మీడియాతోనూ మాట్లాడారు. ఆ వివరాలు రాజగోపాల్‌రెడ్డి మాటల్లోనే..

‘‘బీజేపీలో నాకు తగిన గుర్తింపు లభించింది. ప్రధాని మోదీ, కేంద్రం హోంమంత్రి అమిత్‌షా ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉండాలనుకున్నా. కానీ మునుగోడు ఉప ఎన్నిక తర్వాత తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల పార్టీ బలహీనపడింది. పలు రాజకీయ పరిణామాలు అందరినీ బాధించాయి. పార్టీపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్సీ కవితను ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. కేసీఆర్, ఆయన కుటుంబం అవినీతిని అడ్డుకోలేదు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేననే భావన తెలంగాణ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో నేను బీజేపీలో కొనసాగలేను. ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నా. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలోనూ కాంగ్రెస్ గాలి వీస్తోంది. కేసీఆర్‌ను గద్దె దించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకు కాంగ్రెస్‌లో చేరుతున్నా.. మళ్లీ మునుగోడు నుంచే పోటీచేస్తా. అధిష్టానం అవకాశమిస్తే.. గజ్వేల్‌లోనూ పోటీ చేస్తా. నన్ను ఓడించేందుకు కేసీఆర్ ఎలా ప్రయత్నించాడో అలా ఈసారి గజ్వేల్‌లో కేసీఆర్‌ను చిత్తుగా ఓడించి రిటర్న్ గిఫ్ట్ ఇస్తా. లేదా కేసీఆర్‌కు దమ్ముంటే వచ్చి నాపై మునుగోడులో పోటీ చేయాలి.

ఆ ఒక్క కుటుంబమే బాగుపడింది

గత పదేళ్లలో దేశంలో ఏ ముఖ్యమంత్రీ సంపాదించనన్ని ఆస్తులను కేసీఆర్ కుటుంబం కూడబెట్టింది. పదేళ్లలో పది లక్షల కోట్లు పోగేసింది. హైదరాబాద్ చుట్టూ పదివేల ఎకరాలు కొల్లగొట్టారు. ల్యాండ్ మాఫియా, ఇసుక, మైనింగ్ మాఫియాకు పాల్పడ్డారు. కేసీఆర్ అవినీతిని బయటికి తీస్తుందనే నమ్మకంతోనే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని బీజేపీలో చేరాను. కానీ కవిత అరెస్టు కాకపోవడం, పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతిపై చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ బయటికి రావాల్సి వస్తోంది. మోదీ నాయకత్వంపై నమ్మకమున్నా.. తెలంగాణలోని రాజకీయ పరిణామాల దృష్ట్యా బీజేపీని వీడక తప్పడం లేదు. కర్ణాటక ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని నిరుద్యోగులు, రైతులు, పేదలు భావిస్తున్నారు.

ఏ నిర్ణయమైనా తెలంగాణ సంక్షేమం కోసమే..

సామాజిక తెలంగాణ రావాలన్నా.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నా.. బడుగు బలహీన వర్గాలు బాగుపడాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యం. తెలంగాణ సమాజం కోసం నిస్వార్థంగా కేసీఆర్‌ను గద్దె దింపేందుకు పోరాటం చేస్తా. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. కాంట్రాక్టుల కోసమే నేను కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరినట్టు గతంలో ఆరోపణలు చేశారు. నాడు తెలంగాణ సంక్షేమం కోసమే ఆ నిర్ణయం తీసుకున్నా.. నా రాజీనామాతోనే మునుగోడులో అభివృద్ధి సాధ్యమైంది. నా భార్య లక్ష్మికి పార్టీలోకి రావాలనే ఆలోచన లేదు. ఎన్నికల సమయంలో నా కోసం ప్రచారం చేసిందే తప్ప మరేమీ కాదు..’’ అని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

రాజగోపాల్ వ్యాఖ్యలు సరికాదు: కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్

బీఆర్ఎస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదన్న రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారడం విషయంలో ఎవరిష్టం వారిదని.. కానీ రాజగోపాల్‌రెడ్డి అనుకున్నంత మాత్రాన బీఆర్ఎస్‌కు బీజేపీ పోటీకాకుండా పోదని స్పష్టం చేశారు. ఇక జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా రాజగోపాల్‌కు బీజేపీ మంచి గుర్తింపు ఇచ్చిందని, అయినా పార్టీ గురించి ఆయన ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం సరికాదని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఎప్పుడూ బలంగానే ఉంటుందని.. కొందరు అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంటారని రాజగోపాల్‌ను ఉద్దేశించి ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇసుక పక్కకు జరగడం వల్లే..

- మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగడంపై ఈఎన్‌సీ మురళీధర్
- పైనుంచి చూసి ఈ మేరకు ప్రాథమిక అంచనా
- బ్యారేజీ డిజైన్లు, నాణ్యతలో లోపం లేదు
- వేసవిలోగా పునరుద్ధరణ పనులు పూర్తి
- కేంద్ర నిపుణుల బృందంతో భేటీ



సాక్షి, హైదరాబాద్: ఫౌండేషన్ కింద ఇసుక పక్కకు జరగడంతోనే ఖాళీ ఏర్పడి మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగిందని, పైనుంచి చూడడం ద్వారా ఈ మేరకు ప్రాథమిక అంచనాకు వచ్చామని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్ తెలిపారు. బ్యారేజీని పూర్తిగా ఖాళీ చేసిన తర్వాత కిందికి దిగి ఫౌండేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తేనే పూర్తిగా స్పష్టత వస్తుందని అన్నారు. ‘ఎక్కడో చిన్నలోపం జరిగి ఉండొచ్చు. ఇందులో సందేహం లేదు. లేకుంటే ఇలా ఎందుకు జరిగేది? ’అని వ్యాఖ్యానించారు. బ్యారేజీ డిజైన్లు, నాణ్యతలో ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. డిజైన్లలో లోపంతోనే బ్యారేజీ కుంగిందని వచ్చిన విమర్శలను కొట్టిపారేశారు. గతేడాది జూలైలో 25 లక్షల క్యూసెక్కుల భారీ వరద వచ్చినా బ్యారేజీ తట్టుకుని నిలబడిందని గుర్తు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పియర్లు కుంగిన ఘటనపై అధ్యయనం కోసం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలో కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఈఎన్‌సీ మురళీధర్‌తో సమావేశమై విస్తృతంగా చర్చించింది. అనంతరం మురళీధర్ మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగడంతో పగుళ్లు వచ్చాయని, ర్యాఫ్ట్‌కూ నష్టం జరిగిందని చెప్పారు. పూర్తి బాధ్యతతో బ్యారేజీ పునరుద్ధరణ పనులు చేస్తామని నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ హామీ ఇచ్చిందని తెలిపారు. బ్యారేజీలోని నీటి నిల్వలను ఖాళీ చేశామని, ఎగువ నుంచి వచ్చే వరదను దారి మళ్లిస్తామని వివరించారు. నెలాఖరులోగా గోదావరిలో ప్రవాహం తగ్గుతుందని, నవంబర్‌లో పనులు ప్రారంభించి వేసవిలోగా పూర్తి చేస్తామని అన్నారు. నిపుణుల కమిటీతో సమావేశమైనవారిలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (రామగుండం) నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) నాగేంద్ర రావు, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే తదితరులున్నారు.

నేడు మేడిగడ్డకు సీపీఐ బృందం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీ బ్యారేజ్ పిల్లర్ కుంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు సీపీఐ బృందం గురువారం మేడిగడ్డకు వెళ్లనుంది. సీపీఐ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలతో కూడిన బృందం ఆ ప్రాంతంలో పర్యటించనుంది. అలాగే కరీంనగర్‌లో దెబ్బతిన్న మానేరు కేబుల్ బ్రిడ్జ్‌ని కూడా బృందం పరిశీలించనుంది. తొలుత హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లి, అక్కడ కేబుల్ బ్రిడ్జ్ చూసి, అనంతరం మేడిగడ్డకు వెళ్లనుంది. ప్రభుత్వ వైఫల్యం, నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు, అధికారుల నిర్లక్ష్యమే పిల్లర్లు కుంగిపోవడానికి కారణం అని చాడ వెంకట్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. లక్ష్మీ బ్యారేజ్ కుంగిపోవడానికి విద్రోహ చర్యే కారణమని పోలీసులు చెప్పడాన్ని చాడ తప్పుబట్టారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ, లక్ష్మీ బ్యారేజి కుంగిపోవడానికి కూడా రాహుల్ కారణమని, ఆయనను ముద్దాయిని చేస్తారేమోనని ఎద్దేవా చేశారు. కాగా, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహనపై చర్చలు జరుగుతున్నాయని, సీపీఐకి రెండు స్థానాలు ఇస్తామని జాతీయ కమిటీకి చెప్పారని నారాయణ తెలిపారు.

ఎమ్మెల్యే వివేకానందపై కేసు పెట్టాలి

- బీఆర్ఎస్ నేతలు రౌడీల్లా తయారయ్యారు
- కూన శ్రీశైలంగౌడ్‌పై దాడికి బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, సంజయ్, రాజాసింగ్ ఖండన

సాక్షి, హైదరాబాద్: కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఆ పార్టీ నేతలు రౌడీల్లా దాడి చేశారని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దాడి ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఓ టీవీ చానెల్ డిబేట్‌లో అందరూ చూస్తుండగానే గొంతు నులిమి దాడి చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని కోరారు. లేని పక్షంలో తాము కోర్టుకెళ్లి న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో భూములు కబ్జా చేసి రూ.కోట్లు కొల్లగొట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. వీధి గూండాల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శ, ప్రతివిమర్శలు సాధారణమనీ కానీ భౌతిక దాడులకు దిగడం దుర్మార్గమని ఒక ప్రకటనలో కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద అరాచకాలపై నిజం మాట్లాడినందుకే.. జీర్ణించుకోలేక రౌడీలా ప్రవర్తించారని ఆరోపించారు. తన ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో మైసమ్మ దున్నపోతుల్లా వదిలిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఓటమి నైరాశ్యంతోనే దాడులు... బీజేపీ నేత డా.కె.లక్ష్మణ్

ఓటమి భయం, నైరాశ్యంతోనే బీఆర్ఎస్ నేతలు బీజేపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని, కూన శ్రీశైలం గౌడ్ పై దాడి ఆ తరహా ఘటనే అని బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. ఓ టీవీ లైవ్ లోనే ఎమ్మెల్యే దాడికి పాల్పడడం బీఆర్ఎస్ నేతల అరాచకానికి పరాకాష్టగా అభివర్ణించారు.

ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలి: బండి సంజయ్

‘కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ పై దాడి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థిపై వెంటనే కేసు నమోదు చేయాలనీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. ‘‘ఖబడ్దార్ బీఆర్ఎస్ నేతల్లారా, బీజేపీ తల్చుకుంటే మీరు రోడ్లపై తిరగలేరు. మా సహనాన్ని చేతకానితనంగా భావించొద్దు. మీ దాడులకు భయపడే ప్రసక్తే లేదు.’అని సంజయ్ పేర్కొన్నారు.

ఉరికించి తరిమికొట్టే రోజులు రాబోతున్నయ్..బీజేఎల్పీ నేత రాజాసింగ్

‘బీఆర్ఎస్ నాయకుల్లో ఓటమి భయం కన్పిస్తోంది. అందుకే దాడులకు తెగబడుతున్నారు. బీఆర్ఎస్ నేతల అరాచకాలకు రోజులు దగ్గర పడ్డాయి. ప్రజలే బీఆర్ఎస్ నాయకులను ఉరికించి తరిమికొట్టే రోజులు రాబోతున్నయ్’ అని రాజాసింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాజగోపాల్ బాటలో డీకే అరుణ కూడా?

- బీజేపీ తరఫున గద్వాల నుంచి పోటీకి నో
- వేరే అభ్యర్థిని నిలబెడితే మద్దతిస్తానని వెల్లడి
- డీకే అరుణ కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ ప్రచారం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ కొత్త నేతల్లో కొందరు రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో పునరాలోచనలో పడ్డారనే ప్రచారం జరుగుతోంది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణ కూడా ఆ బాటలో ఉన్నట్టు కనిపిస్తోందని నేతలు అంటున్నారు. బీజేపీ తరఫున గద్వాల నుంచి పోటీ చేస్తానన్న ఆమె ఇటీవల మాట మార్చారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అక్కడ ప్రతికూల పరిస్థితులు ఉన్నాయన్న అంతర్గత సమాచారంతో పోటీపై వెనక్కి తగ్గారని.. గద్వాల నుంచి బీసీ అభ్యర్థిని నిలబెడితే పూర్తి మద్దతు ఇచ్చి గెలిపిస్తానంటున్నారని పేర్కొంటున్నాయి. అసెంబ్లీకి పోటీ చేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం పట్టుబడితే.. తన తల్లిగారి ప్రాంతమైన నారాయణపేట నుంచి పోటీ చేస్తానని సంకేతాలు ఇచ్చారని.. దీనిని ఆ నియోజకవర్గ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిసింది. ఈ క్రమంలోనే డీకే అరుణ పార్టీ మారే ఆలోచన చేస్తున్నారంటూ.. రాజగోపాల్‌రెడ్డి మాదిరిగా చివరి నిమిషంలో బీజేపీని వీడి, కాంగ్రెస్‌లో చేరే అవకాశాలను తోసిపుచ్చలేమంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె కాంగ్రెస్‌లో మక్తల్ లేదా నారాయణపేట సీటు అడుగుతున్నట్టు కాంగ్రెస్ వర్గాల సమాచారం. ఇదే జరిగితే మహబూబ్‌నగర్ జిల్లాలో జితేందర్ రెడ్డి మినహా గట్టి నాయకుడు ఎవరూ లేకుండాపోతారని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

నేటి రాత్రి నగరానికి అమిత్ షా

రేపు జనగర్జన సభలో పాల్గొననున్న బీజేపీ అగ్రనేత



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గురువారం రాత్రి 10.15 గంటలకు ఆయన ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నేషనల్ పోలీస్ అకాడమీకి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. ఈ పర్యటనలో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో అమిత్ షా సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. శుక్రవారం ఉదయం 8 గంటలకు నేషనల్ పోలీస్ అకాడమీలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద అమిత్ షా శ్రద్ధాంజలి ఘటిస్తారు. అక్కడే 11 గంటల వరకు ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నేషనల్ పోలీస్ అకాడమీలో వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం 2:35 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని, 3 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్లో సూర్యాపేటలో జరిగే బీజేపీ జనగర్జన సభకు బయలుదేరి వెళతారు. 3:55కు జన గర్జన సభాస్థలికి చేరుకుంటారు. 4:45 వరకు జనగర్జన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 5 గంటలకు సూర్యాపేట నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరి, 5:45 గంటలకు ఇక్కడకు చేరుకుంటారు. 5:55 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీకి అమిత్ షా తిరుగు ప్రయాణమవుతారు.

జనగామపై అసంతృప్తి జ్వాలలు

- పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆ సెగ్మెంట్ బీజేపీ నేతలు, కార్యకర్తలు
- అక్కడి టికెట్‌ను స్థానిక బీసీకి ఇవ్వాలంటూ జవదేకర్, బన్సల్‌లకు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైన తర్వాతి నుంచి పలు నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు బయటపడుతున్నాయి. జనగామ టికెట్ కేటాయింపుపై నిరసనగా ఆ సెగ్మెంట్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన చేశారు. పార్టీ అభ్యర్థిని మార్చాలని, బేజాడి బీరప్పకు అవకాశం ఇవ్వాలని కోరుతూ.. పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌లకు వినతిపత్రం సమర్పించారు. బీసీ అయిన బీరప్ప గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని.. వివిధ ప్రజా చైతన్య కార్యక్రమాలు విన్నవించారు. జనగామలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ రెడ్డి వర్గానికి చెందినవారికి సీట్లు ఇచ్చాయని.. బీజేపీ స్థానిక బీసీ బిడ్డకు టికెట్ ఇస్తే బీసీ వర్గం మద్దతుతో విజయం సాధించగలరని పేర్కొన్నారు. వినతిపత్రం తీసుకున్న సునీల్ బన్సల్.. అన్ని అంశాలను పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో జనగామ నేతలు, కార్యకర్తలు వెనుదిరిగారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో కురుమలకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలన్న డిమాండ్ కురుమ యువ చైతన్య సమితి అసెంబ్లీ ఎదుట అమరవీరుల స్థూపం వద్ద ఆందోళన చేసింది. బీసీలకు పెద్దపీట వేస్తామన్న బీజేపీ కురుమలకు ఒక్క టికెట్ ఇవ్వకపోవడం సరికాదని సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ వ్యాఖ్యానించారు.

టికెట్లపై కొనసాగుతున్న కసరత్తు

బీజేపీ కార్యాలయంలో ప్రకాశ్ జవదేకర్, సునీల్ బన్సల్‌లతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు సమావేశమైనట్టు సమాచారం. ఆయన కుమారుడు సీహెచ్ వికాస్‌రావు ఆశిస్తున్న వేములవాడ సీటుపై నిర్ణయం ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఈ సీటును కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమకు ఇవ్వాలని పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అధిష్టానం వద్ద పట్టుబడుతున్నారు. ఉమకు ఆ సీటు ఇవ్వకుంటే తాను పోటీకి దూరంగా ఉంటానని కూడా ఆయన స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో టికెట్ల కేటయింపుపై బుధవారం రాత్రి వరకు కసరత్తు కొనసాగింది. వేములవాడ, రాజేంద్రనగర్, సంగారెడ్డి సీట్లపై చర్చించారని తెలిసింది.

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఓ చారిత్రక తప్పిదం

- దీంతో రైతులకు ఒరిగింది శూన్యమే: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఓ చారిత్రక తప్పిదమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలకోట్లు అప్పులు తెచ్చి పనికిరాని చెత్త ప్రాజెక్టును కట్టించారని నిప్పులు చెరిగారు. ఈ ప్రాజెక్ట్‌పై గప్పాలు పలికిన కేసీఆర్ కుటుంబం.. ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వీళ్ల అసమర్థతతో పిల్లర్లు కుంగిపోతే, ఎవరో కుట్ర చేశారంటూ కేసు నమోదు చేయడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. కాళేశ్వరం విషయంలో ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఉన్నాయని, అసలు ముఖ్యమంత్రి మీదే కేసు పెట్టాలన్నారు. బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుపై న్యాయ విచారణకు సిద్ధమా అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కేసీఆర్ సూపర్ ఇంజనీర్ అవతారం ఎత్తి.. ప్రపంచంలో ఇటువంటి ప్రాజెక్ట్ ఎక్కడా లేదని గొప్పలు చెప్పుకున్నారని.... ఇదేనా మీ సూపర్ ప్రాజెక్టు నాణ్యత? అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేయడానికే...

రైతులకు ఈ ప్రాజెక్ట్‌తో ఒరిగిన ప్రయోజనం శూన్యమని, ప్రజలను మోసం చేయడానికి ఈ ప్రాజెక్టును ఉపయోగించారని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేంద్ర నిపుణుల కమిటీ పర్యవేక్షిస్తుందని... అధికారులు సరిగ్గా వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రాజెక్ట్‌పై తలెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితి లేదని, కేసీఆర్ అతి తెలివే ఈ సమస్యకు కారణమని మండిపడ్డారు. కుట్ర జరిగిందనే పేరుతో వారి అసమర్థ నిర్ణయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని.. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికైనా చేసింది తప్పని తెలుసుకొని కేసీఆర్ రాజీనామా చేయాలన్నారు.

క్లుప్తంగా...

ఉత్తరాఖండ్ మాజీ సీఎం రావత్‌కు స్వల్ప గాయాలు

హల్ద్వానీ: కాంగ్రెస్ సీనియర్ నేత, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ ప్రయాణిస్తున్న కారుకు స్వల్ప ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రావత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. హల్ద్వానీ నుంచి కాశీపూర్‌కు రావత్ కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో బజ్‌పూర్ రైల్వే క్రాసింగ్ సమీపంలో ఒక వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో రావత్ కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో కారు ముందు సీటులో కూర్చుని ప్రయాణిస్తున్న రావత్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

నేషనల్ ఐకాన్‌గా నటుడు రాజ్‌కుమార్ రావు

న్యూఢిల్లీ: హిందీ చిత్రం 'న్యూటన్'లో ఎన్నికల అధికారి పాత్రలో మెప్పించిన నటుడు రాజ్‌కుమార్ రావును నేడు కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ ఐకాన్‌గా ప్రకటించనుంది. ఎన్నికల ప్రక్రియలో ప్రజలను మరింత భాగస్వాములను చేయడంతోపాటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు నేషనల్ ఐకాన్‌గా ఎంపికైన వారు కృషిచేయనున్నారు. గురువారం ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాజ్‌కుమార్‌ను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ నేషనల్ ఐకాన్‌గా ప్రకటించనున్నారు. న్యూటన్ చలనచిత్రంలో ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత జిల్లాల్లో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించిన పాత్రను అద్భుతంగా పోషించి అందరికీ ఎన్నికల అధికారిగా గుర్తుండిపోయిన రాజ్‌కుమార్.. 'నేషనల్ ఐకాన్' పాత్ర సైతం చక్కగా పోషించగలరని ఎన్నికల సంఘం ఆశిస్తోంది.

రాజ్‌భవన్‌పై పెట్రో బాంబు దాడి యత్నం

సాక్షి, చెన్నై: చెన్నై నగరంలోని సర్దార్ పటేల్ రహదారిలోని గవర్నర్ అధికార నివాసం రాజ్‌భవన్ వద్ద కలకలం రేగింది. బుధవారం సాయంత్రం ఒక ఆగంతకుడు రాజ్‌భవన్ మెయిన్ గేట్ వద్ద పెట్రో బాంబు విసిరాడు. బాంబు పేలడంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పేలుడుతో చెలరేగిన మంటలను ఆర్పేశారు. బాంబ్ దూసుకొచ్చిన వైపు పరుగులు తీశారు. అక్కడే పెట్రోల్ ఉన్న మరో సీసాను విసిరేందుకు సిద్ధంగా ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని 14 కేసుల్లో నిందితుడిగా ఉన్న కరుక్కా వినోద్‌గా గుర్తించారు. నీట్ ప్రవేశ పరీక్షకు వ్యతిరేకంగా ఈ దాడి చేసినట్లు పోలీసులతో అతను చెప్పినట్లు వార్తలొచ్చాయి.

అయోధ్య రామాలయం ప్రారంభానికి మోదీకి ఆహ్వానం

న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవానికి తేదీ ఖరారు చేశారు. దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి వచ్చే ఏడాది జనవరి 22న ఆలయాన్ని ప్రారంభించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ప్రధాని మోదీని ఆలయ ట్రస్టు కోరింది. ఈ మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసి ఆహ్వానించారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందుకు ప్రధాని అంగీకరించారు.

ఆ 14 మంది తలసేమియా చిన్నారులకు ఎయిడ్స్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో వైద్య సేవల్లో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. కాన్పూర్ ప్రభుత్వాస్పత్రిలో 14 మంది తలసేమియా బాధిత చిన్నారులకు కలుషిత రక్తం ఎక్కించి వారికి ఎయిడ్స్, హెపటైటిస్ సోకేందుకు కారణమయ్యారని తీవ్రంగా విమర్శించారు. 'ఇది నిజంగా సిగ్గుచేటు. క్షమించరాని నేరం. ప్రధాని గొప్పగా చెప్పుకునే డబుల్ ఇంజన్ సర్కారు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆరోగ్య వ్యవస్థను రెట్టింపు కష్టాల్లోకి నెట్టేసింది' అని ఎద్దేవా చేశారు. ఈ ఆరోపణలను వైద్య కళాశాల తోసిపుచ్చింది.

అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా మైక్ జాన్సన్

వాషింగ్టన్: అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా మైక్ జాన్సన్ బుధవారం ఎన్నికయ్యారు. లూసియానా నుంచి చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనకు విపక్ష రిపబ్లికన్లంతా మద్దతు పలికారు. దీంతో మొదటి బ్యాలెట్ పోరులోనే జాన్సన్ స్పీకర్‌గా విజయం సాధించారు. స్పీకర్ పదవి నుంచి మెకార్తీ తప్పుకున్న తర్వాత ప్రతినిధుల సభలో చాలారోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ఇక తెరపడింది. మైక్ ఎన్నిక పట్ల రిపబ్లికన్ పార్టీ నేత, మాజీ అధ్యక్షుడు ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్ వద్ద తీరాన్ని దాటిన తుపాను

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగిన తీవ్ర తుపాను బుధవారం వేకువజామున బంగ్లాదేశ్‌లోని దక్షిణ చిట్టగాంగ్ వద్ద తుపానుగా మారి తీరాన్ని దాటింది. ఆ సమయంలో గాలుల వేగం 75–85, గరిష్ఠంగా 95 కిలోమీటర్ల మధ్య ఉంది. అనంతరం ఇది సాయంత్రానికి అల్పపీడనంగా బలహీనపడింది. తుపాను తీరం దాటి బలహీనపడడంతో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పోర్టుల్లో జారీ చేసిన హెచ్చరికలను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉపసంహరించుకుంది. మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం మరో అల్పపీడనం ఏర్పడింది. అయితే ఇది సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. అందువల్ల దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండే అవకాశం లేదు.

ఇజ్రాయెల్ బాంబుల ఆట..



సరిహద్దు నుంచి గాజా స్ట్రిప్ వైపునకు బాంబు ప్రయోగిస్తున్న ఇజ్రాయెల్ శతఘ్ని దళం

గాజాలో కన్నీటి చుక్కలు

ఇజ్రాయెల్ ఆంక్షలతో నిలిచిపోయిన పెట్రోల్, డీజిల్ సరఫరా

మూలనపడ్డ వాహనాలు.. ఆగిపోతున్న సహాయక చర్యలు

విద్యుత్ లేక ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు నిలిపివేత

రఫా/టెల్ అవీవ్: ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులతో దద్దరిల్లుతున్న గాజా స్ట్రిప్‌లో పరిస్థితులు మరింత దయనీయంగా మారుతున్నాయి. ప్రధానంగా ఇంధన కొరత వల్ల సహాయక చర్యలు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో వాహనాలు మూలనపడ్డాయి. క్షిపణుల దాడుల్లో ధ్వంసమైన భవనాల శిథిలాలను తొలగించే అవకాశం లేకుండాపోయింది. వాటికింద చిక్కుకుపోయిన మృతదేహాలు కుళ్లిపోతున్నాయి. మరోవైపు ఇంధనం కొరతవల్ల ఆసుపత్రుల్లో జనరేటర్లు పనిచేయడం లేదు. డాక్టర్లు శస్త్రచికిత్సలు ఆపేస్తున్నారు. క్షతగాత్రులకు కనీస వైద్య సేవలు కూడా అందడం లేదు. ఫలితంగా మృతుల సంఖ్య పెరిగిపోతోంది. నిత్యం పదుల సంఖ్యలో మృతదేహాలు ఆసుపత్రుల నుంచి శ్మశానాలకు చేరుతున్నాయి. ఈ పరిణామాలపై ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ 'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజాకు ఇంధన సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని బుధవారం ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేసింది. ఇంధనం సరఫరా చేయకపోతే గాజాలో సహాయక చర్యలు అతిత్వరలో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని వెల్లడించింది.

ససేమిరా అంటున్న ఇజ్రాయెల్

గాజా జనాభా 23 లక్షలు కాగా, యుద్ధం ప్రారంభమైన తర్వాత వీరిలో 14 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దాదాపు 6 లక్షల మంది ఐక్యరాజ్యసమితి సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈజిప్టు సరిహద్దు నుంచి ఆహారం, నిత్యావసరాలను గాజాకు చేరవేసేందుకు ఇజ్రాయెల్ ఇటీవల అనుమతి ఇచ్చింది. దాంతో కొన్ని వాహనాలు గాజాకు చేరుకున్నాయి. పరిమితంగా అందుబాటులోకి వచ్చిన ఆహారం, నిత్యావసర సామగ్రిని రేషనింగ్ విధానంలో పాలస్తీనియన్లకు సరఫరా చేస్తున్నారు. ఇంధన కొరత మాత్రం తీరడం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్రోల్, డీజిల్‌ను గాజాలోకి అనుమతించే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ సైన్యం తెగేసి చెబుతోంది.

చేతులెత్తేయడమే మిగిలింది

'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' ప్రస్తుతం గాజాలో సహాయక చర్యల్లో నిమగ్నమైంది. క్షతగాత్రులకు వైద్య సేవలు అందిస్తోంది. విద్యుత్ లేక, పెట్రోల్, డీజిల్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇకపై క్షతగాత్రులకు సేవలందించే పరిస్థితి లేదని చెబుతోంది. ఆహార ధాన్యాలు పంపిణీ చేయడానికి కూడా వాహనాలకు ఇంధనం లేదని పేర్కొంటోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము పూర్తిగా చేతులెత్తేయడం తప్ప చేసేదేమీ లేదని 'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' అధికార ప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలోని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మూడింట రెండొంతులు ఇప్పటికే మూతపడ్డాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

సిరియాలో 8 మంది జవాన్లు మృతి

ఇజ్రాయెల్–హమాస్ మధ్య మొదలైన యుద్ధం మధ్యప్రాచ్యంలో అగ్గి రాజేస్తోంది. హమాస్‌కు ఆయుధాలు, ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలిచేవారిని వదిలిపెట్టబోమని ఇజ్రాయెల్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. హమాస్‌కు సిరియా ప్రభుత్వం మద్దతు పలుకుతుండడంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ సైన్యం బుధవారం దక్షిణ సిరియాలోని సైనిక శిబిరాలపై వైమానిక దాడులు ప్రారంభించింది. బాంబుల వర్షం కురిపించింది. ఈ ఘటనలో 8 మంది సిరియా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. సిరియా నుంచి తమపై రాకెట్ దాడులు జరుగుతుండడంతో తిప్పికొట్టామని, వైమానిక దాడులు చేసి సిరియా సైనిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

ఒక్కతాటిపైకి మిలిటెంట్ సంస్థలు!

ఇజ్రాయెల్ సైన్యం దూకుడు పెంచిన నేపథ్యంలో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా ముఖ్య నేత హసన్ నస్రల్లా బుధవారం హమాస్, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ అగ్రనాయకులతో సమావేశమయ్యారు. తాజా పరిణామాల గురించి చర్చించినట్లు సమాచారం. ఇజ్రాయెల్ సైన్యంపై హమాస్, హెజ్బొల్లా, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ సంస్థలు కలిసి పోరాడే సూచనలు కనిపిస్తున్నాయి. గాజాపై భూతల దాడులకు దిగితే తగిన మీకు గుణపాఠం నేర్పుతామంటూ ఇజ్రాయెల్‌ను హెజ్బొల్లా హెచ్చరించింది. హమాస్‌కు ఇరాన్ సాయం అందిస్తోందని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగారీ చెప్పారు. ఇరాన్‌లోని మిలిటెంట్ సంస్థలు ఇరాక్, యెమెన్, లెబనాన్ భూభాగల నంచి ఇజ్రాయెల్ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని, వాటిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బందీల విడుదలకు ఖతార్ యత్నాలు

హమాస్ చెర నుంచి బందీలు విడుదలయ్యే విషయంలో మరిన్ని సానుకూల పరిణామాలు చూడొచ్చని ఖతార్ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్–థానీ చెప్పారు. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇప్పటికే నలుగురు బందీలు విడుదలైన సంగతి తెలిసిందే. మిగిలినవారిని సైతం విడుదల చేసేలా హమాస్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని ఖతార్ ప్రధానమంత్రి తెలిపారు. బందీల విడుదలకు చొరవ చూపుతున్న ఖతార్ ప్రభుత్వానికి ఇజ్రాయెల్ జాతీయ భద్రతా మండలి అధినేత టాగీ హనెగ్బీ కృతజ్ఞతలు తెలియజేశారు.

గాజా కన్నీటి పాట..



రొటీన్ జీవితం నుంచి ఉపశమనం కోసం గతంలో వయొలిన్ వాయించిన తాను ఇప్పుడు రక్తమోడుతున్న గాజా కన్నీటి పాటను వినిపిస్తున్నానని జవహర్ అల్‌-అఖ్రా చెప్పారు. ఈమె సొంతిల్లు సెంట్రల్ గాజాలోని దెయిర్ అల్‌-బాలాహ్ పట్టణంలో ఉంది. బుధవారం బాంబు మోతల నడుమ ఇంట్లో తీసిందీ ఫొటో.

మధ్యప్రాచ్యం నుంచి అమెరికన్ల తరలింపు!

ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ మధ్యప్రాచ్యంలో ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే, అక్కడున్న తమ పౌరులను స్వదేశానికి తరలించాలని యోచిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. ఇజ్రాయెల్ నుంచి అమెరికా పౌరుల తరలింపు ఇప్పటికే ప్రారంభమైంది. చాలామంది అమెరికన్లు ఇజ్రాయెల్ వదిలి వెళ్లిపోయారు. మధ్యప్రాచ్య దేశాల్లో పెద్ద సంఖ్యలో అమెరికన్లు ఉన్నారు. యుద్ధం గనుక విస్తరిస్తే వారి భద్రతకు భరోసా ఉండదని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పరిస్థితి అదుపు తప్పకముందే వారిని క్షేమంగా స్వదేశానికి రప్పించాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తాజాగా సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్ తాజా పరిస్థితులపై చర్చించారు. ఘర్షణను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు.

రెండు రోజుల్లో 750 మంది మృతి

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడుల తీవ్రత పెంచింది. బుధవారం కొన్ని టార్గెట్లపై క్షిపణులు ప్రయోగించింది. హమాస్ స్థావరాలను, సొరంగాలను, ఆయుధాగారాలను, సమాచార వ్యవస్థను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మంగళవారం, బుధవారం జరిగిన దాడుల్లో గాజాలో 750 మందికిపైగా జనం మృతిచెందారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో ఇప్పటిదాకా గాజాలో 5,791 మందికిపైగా మరణించారని, 16,297 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ తాజాగా ప్రకటించింది. గాజాలోని మృతుల్లో 2,300 మంది మైనర్లు ఉన్నారని వెల్లడించింది. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో 96 మంది పాలస్తీనియన్లు బలయ్యారు. 1,650 మంది క్షతగాత్రులుగా మారారు.

10 మంది యూదులను చంపేశా!

ఇజ్రాయెల్‌లో 10 మంది యూదులను చంపేశానంటూ హమాస్ మిలిటెంట్ ఒకరు తన తల్లిదండ్రులతో మొబైల్ ఫోన్‌లో చెప్పిన ఆడియో రికార్డు ఒకటి వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ రక్షణ శాఖ దీన్ని విడుదల చేసింది. గాజా సరిహద్దులో ఇజ్రాయెల్ భూభాగంలోని కిబుట్జ్‌లో తానున్నానని, తాను ఒక్కడినే 10 మంది యూదులను మట్టుబెట్టానని సదరు మిలిటెంట్ గాజాలోని ఉన్న తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి గర్వం తొణికిసలాడే స్వరంతో ఆనందంగా చెప్పాడు. దాంతో వారు అతడిని శభాష్ అంటూ అభినందించారు. మిలిటెంట్ ఉపయోగించిన ఫోన్ అతడి చేతిలో చనిపోయిన ఇజ్రాయెల్ పౌరుడిదే కావడం గమనార్హం. అయితే, ఈ ఆడియో రికార్డు నిజమైందో కాదో ఇంకా నిర్ధారణ కాలేదని ఇజ్రాయెల్ రక్షణ శాఖ వెల్లడించింది.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో భారత్



- ప్రాచీన చరిత్ర బదులు క్లాసికల్ హిస్టరీ
- యుద్ధాల్లో హిందూ విజయాలకు చోటు
- కమిటీ సిఫార్సు, విపక్షాల విమర్శలు
- ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న కౌన్సిల్

న్యూఢిల్లీ: అన్ని పాఠ్య పుస్తకాల్లోనూ ఇండియా స్థానంలో భారత్ పదాన్ని ప్రవేశపెట్టాలని జాతీయ విద్యా పరిశోధనా, శిక్షణా మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) భావిస్తోంది. పాఠశాల పాఠ్య ప్రణాళికలో మార్పుచేర్పుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఈ మేరకు సిఫార్సు చేసింది. పాఠ్య పుస్తకాల్లో 'ప్రాచీన చరిత్ర'కు బదులుగా 'క్లాసికల్ హిస్టరీ'ని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసినట్టు కమిటీ చైర్‌పర్సన్ సి.ఇసాక్ తెలిపారు. 'ముఖ్యంగా ఇండియా పేరును అన్ని తరగతుల పాఠ్య పుస్తకాల్లోనూ భారత్‌గా మార్చాలని కమిటీ ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. ఎందుకంటే భారత్ అనే పేరు చాలా పురాతనమైన పేరు. విష్ణుపురాణం వంటి 7 వేల ఏళ్ల నాటి పురాతన గ్రంథాల్లోనే భారత్ పేరును ప్రస్తావించా' అని ఆయన వివరించారు. అయితే ప్యానల్ సిఫార్సుల అమలుపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ దినేశ్ సక్లానీ స్పష్టం చేశారు. అనంతరం ఈ మేరకు సంస్థ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'కొత్త సిలబస్, పాఠ్యపుస్తకాల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. కొత్త ప్రతిపాదనలను డొమైన్ నిపుణులు తదితరులకు ఎప్పటికప్పుడు తెలియపరిచి వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరిస్తాం. అందుకే ఈ అంశంపై ఇప్పుడే ఏ విధమైన వ్యాఖ్యలు చేసినా అది తొందరపాటు చర్య అవుతుంది' అని అందులో పేర్కొంది.

'ఇండియా' కూటమికి భయపడే: విపక్షాలు

కమిటీ సిఫార్సులను విపక్షాలు తీవ్రంగా దుయ్యబట్టాయి. 'చివరికి పాఠ్య పుస్తకాల్లో, సిలబస్‌లో కూడా దేశ చరిత్రను బీజేపీ ఎలా వక్రీకరించాలని చూస్తోందో దీనిని బట్టి మరోసారి రుజువైంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. తమ దృష్టిలో ఇండియా, భారత్ పేర్లు రెండూ ఒక్కటేనని స్పష్టం చేశారు. విపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టడం ప్రధాని మోదీని విపరీతంగా భయపెడుతోందనేందుకు ఇది ప్రబల నిదర్శనమని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. ఎన్డీఏ అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మోదీ సర్కార్ ఇలా పేర్ల మార్పిడి పరంపర కొనసాగిస్తోందని డీఎంకే ఆరోపించింది. ఆర్‌జేడీ తదితర పార్టీలు కమిటీ సిఫార్సులను తప్పుబట్టాయి. "విపక్షాలు తమ కూటమి పేరున 'ఇండియా' బదులు భారత్‌గా ఇప్పుడు మార్చేస్తే మోదీ సర్కార్ వెంటనే దేశం పేరును 'భారత్'కు బదులు జంబూద్వీపం అనో మరేదైనా పేరో పెట్టేస్తారా ?" అని ఎంపీ మనోజ్ ఝా ఎద్దేవా చేశారు.

జీ20 శిఖరాగ్రంతో మొదలు

భారత్ పేరు తొలుత ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు ఆహ్వాన పత్రికల్లో ప్రత్యక్షమవడం విదితమే. రాష్ట్రపతిని అప్పటిదాకా 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'గా సంబోధిస్తుండగా కొత్తగా దానికి బదులు 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ఆ ఆహ్వాన పత్రికల్లో మోదీ ప్రభుత్వం పేర్కొంది. ఇది దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ సీటు ముందు ఉంచిన నేమ్‌ప్లేట్‌పై ఇండియా బదులు భారత్ అనే రాసి ఉండటం తెల్సిందే.

కమిటీ ఏం చెప్పిందంటే...

ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత స్థాయి కమిటీ చైర్‌పర్సన్ ఇసాక్ సంఘ్ పరివార్‌కు సన్నిహితుడు. దాని తాలూకు అతివాద సంస్థ అయిన భారతీయ విచార కేంద్రం ఉపాధ్యక్షునిగా ఆయన పని చేశారు. ఆయన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్‌ఆర్) సభ్యుడు కూడా. ఎన్‌సీఈఆర్‌టీకి కమిటీ చేసిన సిఫార్సులను ఆయన సవివరంగా పేర్కొన్నారు. అవేమిటంటే...

- బ్రిటిషర్లు భారత చరిత్రను ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక అంటూ మూడు దశలుగా విభజించారు. వీలైనంత వరకూ భారత్ ఘనతలను, సాధించిన ప్రగతిని, శాస్త్రీయ విజయాలను మరుగునపడేశారు. వాటిని తక్కువ చేసి చూపించారు. అందుకే పాఠశాలల్లో మధ్య యుగ, ఆధునిక భారత చరిత్రతో పాటు క్లాసికల్ పీరియడ్ గురించి ఇకమీదట బోధించాలి.
- ప్రస్తుత పాఠ్య పుస్తకాల్లో హిందూ వైఫల్యాలను మాత్రమే ప్రముఖంగా పేర్కొన్నారు. కానీ మొగలులు తదితర సుల్తాన్లపై హిందూ రాజులు సాధించిన విజయాలను మాత్రం ప్రస్తావించలేదు.
- అందుకే మన చరిత్రలో పలు యుద్ధాల్లో హిందూ రాజులు సాధించిన విజయాలకు పాఠ్య పుస్తకాల్లో మరింతగా చోటు కల్పించాలి.
- అన్ని పాఠ్యపుస్తకాల్లోనూ ఇండియన్ నాలెడ్జ్ సిస్టం (ఐకేఎస్)ను కొత్తగా ప్రవేశపెట్టాలి.
- కమిటీలో ఐసీహెచ్‌ఆర్ చైర్‌పర్సన్ రఘువేంద్ర తన్వర్, జేఎన్‌యూ ప్రొఫెసర్ వందనా మిశ్రా, వసంత్ షిండే, మమతా యాదవ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

జమిలి ఎన్నికలు... కోవింద్‌తో లా కమిషన్ భేటీ

పార్టీల అభిప్రాయాలు కోరుతూ లేఖలు

న్యూఢిల్లీ: 'ఒక దేశం–ఒకేసారి ఎన్నికలు' అంశంపై ఏర్పాటైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని ఉన్నత స్థాయి కమిటీతో కేంద్ర లా కమిషన్ బుధవారం భేటీ అయింది. లోక్‌సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు రాజ్యాంగానికి చేయాల్సిన సవరణలు తదితరాలతో కూడిన రోడ్ మ్యాప్‌ను కమిటీ ముందు ఉంచింది. లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలను ఒకేసారి జరిపే సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా లా కమిషన్‌ను కేంద్ర న్యాయ శాఖ ఇప్పటికే పురమాయించింది. వాటితో పాటు మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికలను ఒకేసారి జరిపే సాధ్యాసాధ్యాల పరిశీలన బాధ్యతను కోవింద్ కమిటీకి అప్పగించింది. ఈ అంశంపై లా కమిషన్ రూపొందిస్తున్న నివేదిక ఇంకా తుది రూపు సంతరించుకోవాల్సి ఉందని సమాచారం. ఒక దేశం–ఒకేసారి ఎన్నికలు అంశంపై అభిప్రాయాలు, సూచనలు 3 నెలల్లో చెప్పాలంటూ రాజకీయ పార్టీలకు కోవింద్ కమిటీ తాజాగా లేఖలు రాసింది. ఆరు జాతీయ పార్టీలు, 33 రాష్ట్ర పార్టీలు, ఏడు నమోదైన గుర్తింపు లేని పార్టీలకు లేఖలు వెళ్లాయి. దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీల పదవీకాలాలను పొడిగించడం, తగ్గించడం వంటి చర్యల ద్వారా 2029లో వాటికి సైతం లోక్‌సభతో పాటే ఎన్నికలు జరిపేందుకు అవసరమైన విధాన రూపకల్పనలో లా కమిషన్ ప్రస్తుతం తలమునకలైంది.

ఇస్రో చైర్మన్ ఆత్మకథ

తిరువనంతపురం: ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆత్మకథ రాశారు. 'నిలవు కుడిచ సింహగల్ (వెన్నెల గ్రోలిన సింహాలు)' పేరిట మలయాళంలో రాసిన ఈ ఆత్మకథ త్వరలో రానుంది. యువతరానికి తన జీవితం స్ఫూర్తిగా నిలవాలనే ఈ ఆత్మకథ రాసినట్లు ఆయన వెల్లడించారు. అత్యంత నిరుపేద గ్రామీణ కుటుంబంలో పుట్టిన ఆయన ఇస్రో చైర్మన్ స్థాయికి ఎదిగిన తీరు, ఆ క్రమంలో ఎదురైన కష్టాలను ఆయన ఇందులో హృద్యంగా వివరించారు. చంద్రయాన్ మిషన్ విజయం తనను ఆత్మకథ రచనకు పురిగొల్పిందని చెప్పారాయన. ఇంజనీరింగ్ కాలేజీకి పాత డొక్కు సైకిల్ మీద వెళ్లిన వైనం తదితరాలను పుస్తకంలో పొందుపరిచారు.

ఎరువులపై రూ.22,303 కోట్ల సబ్సిడీ

న్యూఢిల్లీ: రబీ సీజన్‌లో పాస్ఫరస్, పొటాషియం (పీ అండ్ కే) సంబంధిత ఎరువులపై రూ.22,303 కోట్ల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. 50 కేజీల డీఏపీ బస్తా ధరను రూ.1,350గానే కొనసాగించాలని నిర్ణయించింది. 2023–24 రబీ సీజన్(2023 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 దాకా)లో పోషకాల ఆధారిత సబ్సిడీకి ఎరువులు, రసాయనాల శాఖ చేసిన ప్రతిపాదనలకు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తర్వాత మీడియాకు వెల్లడించారు. రైతులకు అందుబాటు ధరల్లో చాలినన్ని ఎరువులను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. 'నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియంలు పాత ధరకే లభిస్తాయి. అంటే బస్తా నత్రజని పాత రూ.1,470 ధరకే, ఎస్ఎస్‌పీ(సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) బస్తా దాదాపు రూ.500కు దొరుకుతాయి. పొటాష్(ఎంఓపీ) బస్తా ధర రూ.1,655కు తగ్గనుంది' అని మంత్రి వివరించారు. గత ఖరీఫ్ సీజన్‌కు రూ.38,000 కోట్ల ఎరువుల సబ్సిడీని కేంద్రం అందజేయడం తెలిసిందే. మొత్తం వార్షిక ఎరువుల సబ్సిడీ రూ.2.55 లక్షల కోట్లకు పెరిగిందని ఠాకూర్ చెప్పారు.

భారత అమెరికన్లకు అత్యున్నత పురస్కారాలు

బైడెన్ చేతుల మీదుగా అందుకున్న గాడ్గిల్, సురేశ్

వాషింగ్టన్: భారతీయ అమెరికన్ శాస్త్రవేత్తలు అశోక్ గాడ్గిల్, సుబ్రా సురేశ్ అమెరికా అత్యున్నత శాస్త్ర సాంకేతిక రంగ అవార్డులు అందుకున్నారు. గాడ్గిల్‌కు వైట్ హౌస్ నేషనల్ మెడల్ ఫర్ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్, సురేశ్‌కు నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ అవార్డులు దక్కాయి. అధ్యక్షుడు జో బైడెన్ వారికి ఈ ప్రతిష్టాత్మక అవార్డులతో అందజేశారు. మానవ జీవితాన్ని సుఖవంతం చేసే పలు అమూల్య పరికరాలను కనిపెట్టిన ఘనత గాడ్గిల్‌ది అంటూ కొనియాడారు. ఇక మెటీరియల్ సైన్స్, ఇతర రంగాల్లో దాని వాడకాన్ని సురేశ్ కొత్త పుంతలు తొక్కించారన్నారు. ఈ అవార్డులను అగ్ర శ్రేణి అమెరికా ఇన్నొవేటర్లకు అందిస్తుంటారు.

కింది స్థాయి నుంచి...

ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలిద్దరిదీ కష్టించి కింది స్థాయి నుంచి ఎదిగిన నేపథ్యమే. గాడ్గిల్ 1950లో ముంబైలో జన్మించారు. అక్కడ, ఐఐటీ కాన్పూర్‌లో ఫిజిక్స్‌లో డిగ్రీలు పొందారు. యూసీ బర్కిలీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. 1980లో లారెన్స్ బర్కిలీ ల్యాబ్‌లో చేరారు. ఈ ఏడాదే రిటైరయ్యారు. అక్కడే సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ గౌరవ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. చౌకైన, సురక్షిత తాగునీటి సదుపాయాలు, తక్కువ ఇంధనంతో సమర్థంగా పని చేసే గ్యాస్ స్టౌలు, మెరుగైన విద్యుద్దీపాల అభివృద్ధిలో ఆయన పరిశోధనలు ఎంతగానో దోహదపడ్డాయి. ముంబైకే చెందిన సురేశ్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ సారథిగా వ్యవహరించారు. ఈ ఘనత సాధించిన తొలి ఆసియన్ అమెరికన్‌గా నిలిచారు. 1956లో పుట్టిన ఆయన ఐఐటీ మద్రాస్ నుంచి బీటెక్ పూర్తి చేశారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి రెండేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1983లో బ్రౌన్ వర్సిటీలో ఇంజనీరింగ్ విభాగంలో అత్యంత పిన్న వయస్కుడైన ప్రొఫెసర్‌గా రికార్డులకెక్కారు.


సునాక్ పాలనకు ఏడాది

లండన్: భారతీయ మూలాలున్న రిషీ సునాక్ బ్రిటన్ ప్రధాన మంత్రిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో ఏడాది పూర్తి చేసుకున్నారు. అయితే వార్షికోత్సవ సంబరాల వంటివాటికి దూరంగా రోజంతా ఆయన రోజువారీ అధికారిక విధుల్లోనే గడపడం విశేషం. 43 ఏళ్ల సునాక్ సరిగ్గా ఏడాది కింద ఎన్నో సవాళ్ల నడుమ ప్రధాని కావడం తెలిసిందే. ఆ పదవి చేపట్టిన తొలి భారత మూలాలున్న వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. 'ఏడాదిలో ఎంతో సాధించాం. కానీ సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది' అంటూ సోషల్ మీడియాలో ఆయన వీడియో పోస్ట్ చేశారు. అధికార కన్సర్వేటివ్ పార్టీ చైర్మన్ గ్రెగ్ హ్యాండ్స్ సైతం రిషి పాలనను ఈ సందర్భంగా ప్రశంసించారు.

నగలు తయారు చేయలేం

దుకాణాలకు నోటీసులు అంటించిన వ్యాపారులు

చిట్యాల: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో తనిఖీలు విస్తృతమయ్యాయి. దీంతో పలు రకాల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. నగదుతో పాటు బంగారు, వెండి నగలు తీసుకువచ్చే క్రమంలో రహదారులపై పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. తగిన రశీదులు, రుజువులు లేకుంటే వాటిని సీజ్ చేస్తున్నారు. దీంతో నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని గోల్డ్‌స్మిత్ బజార్‌లో పలువురు నగల తయారీదారులు...'ఎన్నికల కోడ్ ముగిసేవరకు బంగారు, వెండి నగల తయారీ నిలిపివేస్తున్నాం'అని దుకాణాలకు నోటీసు అంటించారు.



కూరగాయలు అమ్మిపెడతా... ఓటేయండి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని పాతకొండలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఓ కూరగాయల దుకాణం వద్ద ఆగి కూరగాయలు అమ్మిపెడతా... ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని మంత్రి అడగడం అక్కడున్న వారికి నవ్వులు పూయించింది.
– జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)



చేదోడు లేని ఆ నలభై ఏడు!

మేకల కళ్యాణ్ చక్రవర్తి

తెలంగాణలో అధికారం కోసం ఉవ్విళ్లూరుతున్న కాంగ్రెస్ పార్టీకి గత చరిత్ర మాత్రం చేదు జ్ఞాపకంగానే ఉంది. 47 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ పరిస్థితి అంతంత మాత్రమేనని గత ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఆయా స్థానాల్లో కొన్నిచోట్ల గత పది ఎన్నికల్లో ఆ పార్టీ ఒకట్రెండు సార్లు మాత్రమే గెలవగలిగింది. 1967 తర్వాత నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థులు ఇప్పటివరకు విజయం సాధించలేదు. పునర్విభజన తర్వాత ఏర్పాటైన బెల్లంపల్లి, మంచిర్యాల, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, ధర్మపురి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, దేవరకద్ర, పాలకుర్తి, వరంగల్ వెస్ట్, వైరాలోనూ ఇప్పటివరకు కాంగ్రెస్ పాగా వేయలేదు.

మెదక్ నియోజకవర్గంలోనూ 1989 తర్వాత కాంగ్రెస్ గెలవలేదు. సిరిసిల్లలో 2009 నుంచి అక్కడ టీఆర్ఎస్ అభ్యర్థి కె విజయం సాధిస్తూనే ఉన్నారు. దుబ్బాకలో 2009లో చెరుకు ముత్యంరెడ్డి గెలిచారు. అంబర్‌పేటలో 1989లో వి. హనుమంతరావు గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి అక్కడ విజయం దక్కలేదు. మహబూబ్‌నగర్‌లో 1989లో పులివీరన్న గెలిచిన తర్వాత జరిగిన ఏడు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. భువనగిరిలో 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కె.నర్సింహారెడ్డి మాత్రమే గెలిచారు. నర్సంపేటలో మొత్తం 14 సార్లు ఎన్నికలు జరిగితే 1957లో కె.కనకరత్నమ్మ, 1967లో కె.సుదర్శన్‌రెడ్డి మాత్రమే గెలిచారు.

కాంగ్రెస్ పార్టీకి గతం ఓ చేదు జ్ఞాపకం

చాలా కాలంగా రాష్ట్రంలోని 47 నియోజకవర్గాల్లో పార్టీకి ఎదురుగాలి

- పదిసార్లు ఎన్నికలు జరిగితే కొన్నిచోట్ల గెలిచింది ఒకట్రెండు సార్లే
- పునర్విభజన తర్వాత ఏర్పాటైన 13 నియోజకవర్గాల్లో గెలుపు రుచి చూడని కాంగ్రెస్
- రిజర్వుడుగా మారిన 4 నియోజకవర్గాల్లో వరుస ఓటమి
- 1967 తర్వాత నర్సంపేటలో, 1978 తర్వాత హుజూరాబాద్‌లో దక్కని విజయం
- ఈసారి సీన్ రివర్స్ అంటున్న కాంగ్రెస్.. చాలాచోట్ల బోణీ కొడతామని ధీమా

గతంలో కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు ఎక్కువగా వీచిన నియోజకవర్గాలివే..

- 2004 తర్వాత సిర్పూర్‌లో కాంగ్రెస్ పార్టీకి గెలుపు దక్కలేదు. 1978 తర్వాత గెలిచింది 2004లోనే. అప్పుడు కోనేరు కోనప్ప విజయం సాధించగా, గత 10 సార్లు జరిగిన ఎన్నికల్లో ఒకసారి మాత్రమే కాంగ్రెస్ గెలిచింది.
- చెన్నూరులో కూడా 1978 తర్వాత గెలిచింది 2004లోనే. ఇక్కడ మాత్రం ఓడిపోయిన ప్రతిసారీ రెండోస్థానంలో నిలిచింది. 2004లో జి.వినోద్ గెలిచారు.
- 2009లో బెల్లంపల్లి అసెంబ్లీ స్థానం ఏర్పాటయిన తర్వాత ఒక్కసారి కూడా ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవలేదు.
- మంచిర్యాలలోనూ కాంగ్రెస్ ఇప్పటివరకు గెలవలేదు. నాలుగుసార్లు (ఒక ఉప ఎన్నికతో సహా) ఓడిపోయిన కాంగ్రెస్ మూడుసార్లు రెండో స్థానంలో నిలిచింది.
- ఖానాపూర్‌లో 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి కె.భీంరావు గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవలేదు.
- 1983 నుంచి ఆదిలాబాద్ నియోజకవర్గంలో పదిసార్లు ఎన్నికలు జరిగితే 1989, 2004లో రెండుసార్లు సి.రామచంద్రారెడ్డి మాత్రమే కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు.
- బోథ్ నియోజకవర్గంలో వరుసగా ఎనిమిది పర్యాయాలుగా కాంగ్రెస్ పార్టీ ఓడిపోతోంది. ఇక్కడ 1983లో కాంగ్రెస్ పక్షాన ఎం.కాశీరాం గెలిచిన తర్వాత మరెవరూ గెలవలేదు.
- నిర్మల్‌లో 1999, 2004లో వరుసగా రెండు సార్లు ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. ఆ తర్వాత ఇప్పటివరకు కాంగ్రెస్ ఆ నియోజకవర్గంలో గెలవలేదు.
- 1989, 99 ఎన్నికల్లో రెండుసార్లు ఆర్మూరు నుంచి కాంగ్రెస్ గెలిచింది. 1999 తర్వాత జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ ఓడిపోయింది.
- ఎస్సీ రిజర్వుడు అయిన తర్వాత జుక్కల్ నియోజకవర్గంలో 10 సార్లు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ గెలిచింది నాలుగు సార్లు మాత్రమే. ఐదు సార్లు రెండోస్థానంలో నిలిచింది. చివరగా 2004లో సౌదాగర్ గంగారాం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారు.
- బాన్సువాడలో గత నాలుగు సార్లు ఓటమిపాలయ్యింది. 2004లో బాజిరెడ్డి గోవర్ధన్ గెలవగా, 2009, 2011 (ఉప ఎన్నిక), 2014, 2018లో ఓడిపోయింది.
- కామారెడ్డిలో 1983 తర్వాత కాంగ్రెస్ గెలిచింది రెండుసార్లు మాత్రమే. 1989, 2004లో షబ్బీర్ అలీ ఇక్కడి నుంచి గెలిచారు.
- నిజామాబాద్ అర్బన్‌గా మారిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇక్కడి నుంచి గెలుపొందలేదు. 2009లో నియోజకవర్గం పేరు మారగా, అంతకుముందు 2004, 1999లో కాంగ్రెస్ తరఫున డి.శ్రీనివాస్ రెండుసార్లు గెలుపొందారు.
- నిజామాబాద్ రూరల్‌లో కూడా ఇప్పటివరకు కాంగ్రెస్ గెలవలేదు. అంతకుముందు డిచ్‌పల్లిగా ఉన్నప్పుడు కూడా 2008 ఉప ఎన్నికలో, 1978లో ఆకుల లలిత, ఎ. బాల్‌రెడ్డిలు మాత్రమే ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు.
- కోరుట్లలోనూ ఇప్పటివరకు కాంగ్రెస్ విజయాన్ని అందుకోలేకపోయింది. బుగ్గారం (2009కి ముందు)గా ఉన్నప్పుడు మాత్రం రెండుసార్లు రత్నాకర్‌రావు, ఒకసారి కె.గంగారం, మరోమారు రాజారాం, ఇంకోసారి మోహన్‌రెడ్డిలు కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు.
- పెద్దపల్లిలో 1989 తర్వాత కాంగ్రెస్ గెలుపొందలేదు. 1989లో గీట్ల ముకుందరెడ్డి గెలిచిన తర్వాత వరుసగా ఆరుసార్లు ఆ పార్టీ ఓటమి పాలు కావడం గమనార్హం.
- హుజూరాబాద్ నియోజకవర్గంలో 1978 తర్వాత కాంగ్రెస్ పార్టీ గెలవలేదు. అప్పుడు దుగ్గిరాల వెంకట్రావు విజయం సాధించారు.
- సిద్దిపేటలో కాంగ్రెస్ చివరగా గెలిచింది 1983లోనే. అంతకుముందు వరుసగా మూడు సార్లు గెలిచిన కాంగ్రెస్, ఆ తర్వాత జరిగిన 12 ఎన్నికల్లో వరుసగా ఓడిపోవడం గమనార్హం.
- దేవరకద్రలో ఇంతవరకు కాంగ్రెస్ బోణీ కొట్టలేదు. నాగర్‌కర్నూల్‌లో 1989లో వంగా మోహన్‌గౌడ్ గెలుపొందారు. ఆ తర్వాత ఆ పార్టీ ఓటమి పాలవుతూనే ఉంది. 1983 తర్వాత ఇబ్రహీంపట్నంలోనూ కాంగ్రెస్ పార్టీ వరుసగా ఓటమి పాలవుతోంది.

గాసిప్ టైమ్

ఏ మొహం పెట్టుకుని వచ్చారు?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్‌లో చేరేందుకు ఇటీవల గాంధీభవన్‌కు వెళ్లిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు బీఆర్ఎస్ నేతలకు తీవ్ర పరాభవం ఎదురైంది. కొంతకాలంగా గులాబీ పార్టీలో తమకు ప్రాధాన్యం దక్కడం లేదంటూ వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించిన టికెట్ల జాబితాలో పేరు లేకపోవడంతో తమ దారి తాము చూసుకోవాలనుకున్నారు. వెంటనే తమ మాతృ పార్టీ కాంగ్రెస్ వైపు చూసేందుకు గాంధీభవన్‌కు చేరుకున్నారు. ఆ క్షణంలో అక్కడే ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీరిని చూడగానే.. రగిలిపోయాడు. తిట్లదండకం అందుకున్నాడు. దీంతో ఆ ఇద్దరూ చిన్నబుచ్చుకున్నారు. అందులో ఒకరు బీజేపీలో చేరగా,మరోనేత ఇంకా ఏ పార్టీలో చేరలేదు.

ముందొచ్చిన చెవుల కంటే..

ముందొచ్చిన చెవుల కంటే..వెనకొచ్చిన కొమ్ములు వాడి..అనే నానుడి బీజేపీకి అచ్చంగా సరిపోతుందట. పార్టీలో ఏళ్ల తరబడి ఉన్న నేతలు ఎదుగూబొదుగూ లేకున్నా..పార్టీని నమ్ముకొని ఉన్న వారికి తగిన శాస్తే జరిగిందంటూ ఆ పార్టీ సీనియర్లు వాపోతున్నారట. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీచేసి 4 సీట్లు గెలవడంతో పాటు కేంద్రంలోమోదీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఇతరపార్టీల్లోని నేతలు పోలోమని వచ్చి చేరారు. దశాబ్దాల తరబడి పార్టీలో క్రమశిక్షణకు కట్టుబడి ఉంటే.. ఒకరికో ఇద్దరికో జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించడం మామూలేనట. ఇతర పార్టీల నుంచి వచ్చిన మాజీ ఎంపీలకు మాత్రం ఏడెనిమిది మందిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించడానికి వారేమైనా ఆకాశం నుంచి ఊడిపడ్డారంటూ దీర్ఘాలు తీస్తున్నారు. ఎన్నికల ముంగిట ఇప్పుడేమి చేయాలో పాలుపోక ఈ నాయకులు బిక్కమొహం వేస్తున్నారట...



తండ్రీ కొడుకు.. భిన్న నేపథ్యం





సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌కు తండ్రీకొడుకు రెండేసిసార్లు ప్రాతినిధ్యం వహించారు.

రెండుసార్లు గెలిచిన పువ్వాడ

1989లో పువ్వాడ నాగేశ్వరరావు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కె.దుర్గానర్సింహారావుపై విజయం సాధించారు. ఆ తర్వాత 1994లో సీపీఐ అభ్యర్థిగా రెండోసారి బరిలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి జహీర్‌అలీ మహ్మద్‌పై గెలుపొందారు. ఆ తర్వాత 1999 ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ నుంచే పువ్వాడ నాగేశ్వరరావు పోటీ చేసినా ఓటమి పాలయ్యారు.

మూడోసారి బరిలో అజయ్

పువ్వాడ అజయ్‌కుమార్ 2014లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి..టీడీపీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుపై 5,609 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2018లో ఇదే స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి, టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై 10,991 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా పువ్వాడ అజయ్ కుమార్ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఖమ్మం అసెంబ్లీ చరిత్రలో మంత్రి పదవి సైతం పువ్వాడ అజయ్ కుమార్‌నే వరించింది.

లోకల్ టచ్చిస్తారా..నేషనల్ నచ్చేస్తారా?

కోలా వెంకటేశ్వర్లు

వేలల్లో పరిశ్రమలు. లక్షలాదిమంది కార్మికులు.. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన కార్మిక కుటుంబాలతో సందడి..అన్ని భాషలు, సంస్కృతుల సమ్మేళనం.. వెరసి మినీ ఇండియా పేరుగాంచింది మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా. మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి మల్కాజిగిరి అసెంబ్లీ సెగ్మెంట్లు ఈ జిల్లా పరిధిలో ఉన్నాయి.

వారిదే ప్రధాన భూమిక

శ్రామికుల రాజధానిగా పేరుగాంచిన మేడ్చల్ జిల్లాలో అభ్యర్థుల గెలుపోటములపై శ్రామిక ఓటర్లు ప్రభావం చూపనున్నాయి. ఈ జిల్లా జనాభాలో 40 శాతం మంది శ్రామికులే ఉన్నారు. జిల్లాలో మొత్తం శ్రామికులు 2,26,939 మంది ఉండగా, వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వలస శ్రామికులు 1,80,326 మంది ఉన్నారు. జిల్లాలో రెండు మెగా పరిశ్రమలు, 71 భారీ పరిశ్రమలు, 3,760 మైక్రో , 2320 సూక్ష్మ, 16 మధ్యతరహా పరిశ్రమల్లో 77,862 మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. ఇక ఈ ఏడాది కొత్తగా ఏర్పడిన 599 సూక్ష్మ, చిన్న పరిశ్రమలతో 4,609 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లోని నివసిస్తున్న వీరంతా ఇక్కడే ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరి ఓట్లపై ప్రధాన పార్టీల అభ్యర్థులు దృష్టి పెట్టారు. అయితే వీరు ఈసారి ఎటువైపు మొగ్గచూపుతారో చూడాలి. జాతీయ పార్టీలకు మద్దతిస్తారా.. లోకల్‌గా ఉంటున్న నేపథ్యంలో ఇక్కడి పార్టీ కే పట్టం కడతారా అన్నది చూడాల్సిందే.

వలస ఓటు మొగ్గుచూపేదెటో..

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మినీ భారత్
- భిన్న భాషలు... విభిన్న సంస్కృతులు.. వేలల్లో పరిశ్రమలు..
- అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు, ఉద్యోగులు



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు..

ప్రధానంగా బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్, అస్సాం, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఇక్కడ స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు.

ఏయే కంపెనీలు ఉన్నాయంటే..

జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి, మౌలాలి, శామీర్‌పేట, మేడ్చల్ ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమలతోపాటు ఇంజనీరింగ్, ఫార్మా, ఫుడ్ ఇండస్ట్రీలు ఉన్నాయి. మౌలాలి ప్రాంతంలో ఫ్యాబ్రికేషన్, స్టీల్, ప్లాస్టిక్, ఫర్నిచర్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ తరహా పరిశ్రమలు ఉన్నాయి. బాలానగర్ పారిశ్రామికవాడ పరిధిలో ఫ్యాన్లు తయారు చేసే కంపెనీలు, ఆటోమొబైల్ వస్తువుల తయారీ, బీర్ మాన్యు ఫాక్చరింగ్ యూనిట్, ఫ్యాబ్రికేషన్, వైర్ మెష్ యూనిట్లు, ఫుడ్ ప్రాడక్ట్స్, ఫార్మా యూనిట్లు ఉన్నాయి. బీహెచ్ఈఎల్, ఆర్ అండ్ డీ, హెచ్ఏఎల్, ఐడిపిఎల్, ఎన్ఆర్ఎస్ఏ వంటి కంపెనీలూ ఉన్నాయి. ఐడీఏ బాలానగర్, ఐడీఏ కూకట్‌పల్లి, సీఐఈ గాంధీనగర్ ఒకే చోట ఉన్నాయి. ఇక శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లో బయోటెక్, కెమికల్, విత్తన చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి.

బీఆర్ఎస్.. బీజేపీ పెళ్లి

వినూత్నంగా పెళ్లి కార్డు విడుదల చేసిన టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీల రాజకీయ బంధాన్ని కాంగ్రెస్ పార్టీ వినూత్న రీతిలో ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. బీజేపీ-బీఆర్ఎస్‌ల పెళ్లి పేరుతో టీపీసీసీ బుధవారం పెళ్లి కార్డు విడుదల చేసింది.



తడారిన ఎడారి గొంతు వినండి!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్, మోర్తాడ్ (బాల్కొండ)

రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న గల్ఫ్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధపడుతుతున్నారు. తమ సమస్యలు తీరాలంటే.. కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి గల్ఫ్‌దేశాల్లో మరణించిన కుటుంబాల నుంచి ఒకరిని పోటీ చేయించాలని గల్ఫ్ ప్రవాసీ సంఘాలు నిర్ణయించాయి. ఇటీవల షార్జాలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో దాదాపుగా 32 నియోజకవర్గాల్లో దుబాయ్, ఒమన్, ఖతర్, సౌదీ అరేబియా తదితర మధ్యప్రాచ్య దేశాల్లో పనిచేసి వచ్చిన ఓటర్లు ఉన్నారని ప్రవాసీ సంఘాలు చెబుతున్నాయి. వీరంతా తమ హక్కుల సాధనకు సంఘటితంగా మారి అసెంబ్లీ ఎన్నికలు వేదికగా తమ డిమాండ్లను తెలియజేసేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం కామారెడ్డి లేదా నిర్మల్ వంటి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. కామారెడ్డిలో 100 మంది విడోలతో, నిర్మల్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో విడోతో నామినేషన్ వేయించేలా కసరత్తులు ప్రారంభించారు. ఇందుకోసం అన్ని గల్ఫ్ కుటుంబాలతో వాట్సాప్ గ్రూపులు ప్రారంభించి వారిని సంసిద్ధం చేస్తున్నారు.


21 అసెంబ్లీ సెగ్మెంట్లలో **8.3** లక్షల మంది గల్ఫ్ ఓటర్లు	డిమాండ్ల సాధనకు గల్ఫ్ విడోస్‌తో పోటీ యోచనలో సంఘాలు	మరణించిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్	కామారెడ్డితోపాటు ఆరు స్థానాల్లో బరిలోకి దించాలని ఆలోచన	కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడికి కొత్త వ్యూహం

గల్ఫ్ దేశాల్లో ఉపాధి వెతుక్కుంటూ వెళ్లిన వారి సంఖ్య దాదాపు 15 లక్షల వరకు ఉంటుందని అంచనా. అదే విధంగా అక్కడ కొంతకాలం పనిచేసి తిరిగి వచ్చిన వారి సంఖ్య కూడా 15 లక్షలకుపైగానే ఉంటుందని ప్రవాసీ సంఘాలు చెబుతున్నాయి.

హామీల కోసం పట్టు..



వీరి సంక్షేమానికి, పునరావాసానికి తగిన ప్రోత్సాహం ఇవ్వాలని గల్ఫ్ ప్రవాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత పదేళ్ల కాలంలో గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాల వల్ల 1,800 మందికిపైగా వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కార్మికులు మరణిస్తే.. రూ.5 లక్షల పరిహారం ఇస్తానన్న డిమాండ్‌ను ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలని ప్రవాసీ సంఘాలు కోరుతున్నాయి.



(నోట్: 17-04-2023 వరకు ఉన్న గణాంకాలు. ఇందులో స్వల్ప మొత్తంలో మార్పులు ఉండొచ్చు)

యుద్ధభేరి మోగిస్తాం

కామారెడ్డిలో వందమంది మహిళలతో నామినేషన్ వేయిస్తాం



మాట్లాడుతున్న గుగ్గిల్ల రవిగౌడ్

కోరుట్ల: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డిలో గల్ఫ్ బాధిత కుటుంబాల నుంచి వంద మంది మహిళలతో నామినేషన్లు వేయిస్తామని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు గుగ్గిల్ల రవిగౌడ్, సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాస్‌రావు, మంద భీంరెడ్డి, బూత్కురి కాంత అన్నారు. గల్ఫ్ వలస కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలో పార్టీలు నిర్లక్ష్యం చూపుతున్నాయని ఆరోపించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో గల్ఫ్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఒక్క పార్టీ కూడా తమ మేనిఫెస్టోలో ప్రవాసీ బోర్డు, గల్ఫ్ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, బాధిత కుటుంబాలను ఆదుకునే అంశాల ప్రస్తావన తేలేదన్నారు. సమావేశంలో గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు అశోక్, మోహన్‌రెడ్డి, రవి, మారుతి, బీడీ చెన్న విశ్వనాథం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్ హయాంలోనే ఆర్థిక సాయం



ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా పని చేసిన వైఎస్సార్ తన హయాంలో గల్ఫ్ వలస కార్మికుల కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారు. అప్పట్లో 1000 మంది గల్ఫ్ మృతులకు రూ. లక్ష చొప్పున సాయం అందించారు. గల్ఫ్ దేశాలను వీడి ఇంటిబాట పట్టిన వలస కార్మికులకు ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలను ఇప్పించారు. వైఎస్ తర్వాత పనిచేసిన సీఎంలు ఎవరూ కూడా గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోలేదు. ఎన్నికల సమయం కావడంతో గల్ఫ్ అంశం మళ్లీ చర్చకు వచ్చింది. వలస కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

మీకు తెలుసా?

ప్రాంతీయపార్టీ నేత.. లోక్‌సభలో ప్రతిపక్షనేత

ప్రముఖ తెలంగాణనేత సి.మాధవరెడ్డికి ఒక ప్రత్యేకత ఉంది. ఆయన లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షనేతగా పనిచేశారు. ఇందిరాగాంధీ హత్య తర్వాత 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్.టి.రామారావు నాయకత్వంలోని తెలుగుదేశంపార్టీ 30 స్థానాలను గెలుచుకుంది. ఇందిరాగాంధీపై ఉన్న సానుభూతితో ఆమె కుమారుడైన రాజీవ్‌గాంధీకి దేశం అంతటా పట్టం కట్టింది. కానీ, ఏపీలో అప్పటికే ఎన్.టీ.ఆర్. ప్రభుత్వాన్ని కూలదోయడానికి కాంగ్రెస్ యత్నించిందన్న అసంతృప్తితో ఉన్న ప్రజలు తెలుగుదేశంపార్టీకి అత్యధిక సీట్లు కట్టబెట్టారు. దేశంలో మరే ప్రధాన, ప్రాంతీయ రాజకీయపార్టీకి అన్ని సీట్లు రాలేదు. దీంతో టీడీపీ తరఫున ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలిచిన సి.మాధవరెడ్డి లోక్‌సభలో ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. ఒక ప్రాంతీయ పార్టీ నేతకు ఇలాంటి అవకాశం అరుదుగా వస్తుంటుంది. ఆయన తొలిసారి 1952లో ఆయన సోషలిస్టు పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికయ్యారు. తదుపరి బోథ్ నియోజకవర్గం జనరల్‌గా ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

కేటీఆర్ తొలి ఎన్నికల్లో మెజారిటీ 171 ఓట్లు

తెలంగాణ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కె.తారక రామారావు 2009లో తన రాజకీయ జీవితం ఆరంభించినప్పుడు శాసనసభ ఎన్నికల్లో తీవ్రమైన పోటీని ఎదుర్కొన్నారు. ఆ ఎన్నికల్లో తెలంగాణలో అప్పటి టీఆర్ఎస్ తీవ్ర సంక్షోభానికి గురైంది. తెలుగుదేశం పార్టీ, సీపీఐ, సీపీఎం లతో కలిసి మహాకూటమి ఏర్పాటు చేసుకుని పోటీ చేసినా కేవలం పదిసీట్లలోనే టీఆర్ఎస్ గెలిచింది. ఆ క్రమంలో కేటీఆర్ కూడా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కె.కె. మహేందర్‌రెడ్డి నుంచి గట్టి పోటీని తట్టుకుని కేవలం 171 ఓట్ల ఆధిక్యతతోనే గెలిచారు. కానీ, ఆ తర్వాత మాత్రం భారీ ఆధిక్యతలతో ఆయన గెలుస్తూ వస్తున్నారు. 2010 ఉపఎన్నికలో 68,220 ఓట్లు, 2014లో 53,004 ఓట్లు, 2018లో 89,009 ఓట్ల మెజార్టీతో గెలుపొంది రాజకీయాలలో రాణిస్తున్నారు. ఇంతవరకు నాలుగుసార్లు ఆయన పోటీచేయగా, మూడుసార్లు అయనకు ప్రత్యర్థిగా మహేందర్‌రెడ్డే ఉన్నారు.



సిటీ ఓటేస్తదా.. టూరేస్తదా..

పార్టీల్లో గుబులు పుట్టిస్తున్న పట్టణ ఓటర్లు

ఓటింగ్ డేపై వారాంతపు సెలవు ప్రభావం?
వివిధ నియోజకవర్గాల్లో పెరిగిన అర్బన్ ఓటర్ల సంఖ్య

అసలే అర్బన్ ఓటర్ల నిరాసక్తత... దానికి తోడు వారాంతపు సెలవులు.. వెరసి అర్బన్ ఓటింగ్ శాతంపై ప్రభావం చూపుతుందా? అనే ఆందోళన రాజకీయ పార్టీల నేతల్లో వ్యక్తమవుతోంది. చాలా నియోజకవర్గాల్లో అర్బన్ ఓటింగ్ బాగా పుంజుకున్న నేపథ్యంలో లాంగ్ వీకెండ్ ఎఫెక్ట్ ఏ మేరకు ఉంటుందన్న చర్చ జరుగుతోంది.

సాక్షి, హైదరాబాద్: సాధారణంగా కార్పొరేట్ ఐటీ ఉద్యోగులు వారాంతపు సెలవుల్ని రకరకాలుగా ప్లాన్ చేస్తుంటారు. ఏ మాత్రం అవకాశం దొరికినా సొంతూర్లకు , హాలిడే టూర్స్‌కి చెక్కేస్తుంటారు. ఈ నేపథ్యంలో పోలింగ్ తేదీ నవంబరు 30 గురువారం కావడంతో శుక్రవారం ఒక్కరోజు సెలవు పెడితే...4రోజుల పాటు లాంగ్ వీకెండ్ ట్రిప్ ప్లాన్ చేయవచ్చు కదా అనే ఆలోచన వారిలో వచ్చే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు ఇదే విషయం రాజకీయ పార్టీల్లో టెన్షన్ పుట్టిస్తోంది. మరో వైపు రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో పట్టణీకరణ జోరు కొనసాగుతోన్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిందని ఎన్నికల సంఘం గణాంకాలు తెలియజేస్తున్నాయి.

పటాన్ చెరు... ఓటర్ల జోరు...

గత 2018తో తాజా 2023 మధ్య చూస్తే.. పటాన్ చెరులో ఓటర్ల సంఖ్యలో అత్యధికంగా 35శాతం వృద్ధి నమోదైంది. అదే సమయంలో ఓటర్ల సంఖ్యాపరంగా చూస్తే అతి పెద్ద అసెంబ్లీ నియోజకవర్గంగా శేరిలింగంపల్లి తన స్థానాన్ని నిలుపుకుంది. ఐటీ పరిశ్రమకు చిరునామాకు తోడుగా.. ఇటీవల వేగవంతమైన హౌసింగ్ బూమ్ కారణంగా హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని శేరిలింగంపల్లిలో గతంలో 5,75,542 లక్షల మంది ఓటర్లు ఉండగా అది 21.2శాతం పెరిగి 6,98,079 లక్షలకి చేరింది. ఇది రాష్ట వ్యాప్త సగటు అయిన 13.15శాతంపెరుగుదలతో చాలా ఎక్కువ.

రాష్ట్రవ్యాప్తంగానూ...

పట్టణ ఓటర్ల పెరుగుదల హైదరాబాద్ పశ్చిమ ప్రాంతాలకే పరిమితం కాలేదు. నకిరేకల్ (ఎస్సీ) 28శాతం, ఆసిఫాబాద్ (ఎస్టీ) 20, కామారెడ్డి 19, కరీంనగర్ 19, నిజామాబాద్ (అర్బన్) 18శాతంతో ఓటర్లు భారీగా పెరిగారు. తెలంగాణ లోని పాత పట్టణ కేంద్రాలైన ఖమ్మం 15, వరంగల్ పశ్చిమ 15, వరంగల్ తూర్పు 16శాతం ఓటర్ల సంఖ్య పెరిగింది.

ఇందుకు భిన్నంగా హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య స్వల్పంగా మాత్రమే పెరిగింది. నాంపల్లి, మలక్‌పేట్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, సనత్‌నగర్‌లో ఓటరు సంఖ్య పెరుగుదల శాతం సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. రిజ

గ్రేటర్ పరిధిలో స్వల్పమే...

ర్వుడ్ నియోజకవర్గాలుగా ఉన్న అశ్వారావుపేట, భద్రాచలం, వైరా, మధిర, స్టేషన్‌ఘనపూర్ కూడా సింగిల్ డిజిట్ వృద్ధిని మాత్రమే నమోదు చేశాయి. ఇక అత్యల్పంగా ఓటర్ల వృద్ధి నమోదైన ప్రాంతం మెదక్‌లోని దుబ్బాక. ఈ నియోజకవర్గంలో కేవలం 2% ఓటర్లు మాత్రమే పెరిగారు.

పట్టణ ఓటర్లు ఏం చేస్తారో

ఓటింగ్ ఉదాసీనత'కు పేరొందిన పట్టణ ఓటర్ల సంఖ్య పెరగడంతో నేతల్లో ఒకింత ఆందోళన పెరిగింది. శని, ఆదివారాలు సెలవు ఉన్న ప్రైవేట్ కంపెనీల్లోని సిబ్బంది ఓటింగ్ రోజైన గురువారం కూడా కలిపి లాంగ్ వీకెండ్‌లో భాగం చేసుకుంటే మాత్రం అది కచ్చితంగా ఓటింగ్ శాతాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అందరూ అందరే!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

''రా..రా..బామ్మర్ది. చాలా రోజులకు వచ్చినవ్. ఇగో..మీ తమ్ముడొచ్చిండు''
భార్యతో అంటూనే, మళ్లీ బావమరిది వైపునకు తిరిగి..''కాకతీయ నీళ్లతో కాళ్లు కడుక్కో'' అన్నాడు బావ.

''కాకతీయ నీళ్లేమిటీ?'' అడిగాడు బావమరిది.

''కాకతీయ నీళ్లంటే మిషన్ కాకతీయ నీళ్లని. కాళ్లేతులు కడుక్కునే నీళ్లు కాకతీయయట.. తాగేయి మిషన్ భగీరథ నీళ్లంట. రోజూ ఇదే గోల, ఇదే గోస. తెల్లారి లేసినకాణ్నుంచి పొద్దు గూకిందాక మా ఇంట్ల అన్నీ బీఆర్ఎస్ పథకాలతోనే నడుస్తున్నయని నిరూపించాలనే తాపత్రయం మీ బావది.'' చెప్పింది అక్క.

''అందరూ తుమ్మినంక 'చిరంజీవ' అంటరు గదా మామా. మా నాయన 'కరంజీవ' అంటడు''

''అంటేందన్నట్టు?''

''కారు ప్లస్ జీవ..'కరంజీవ' అంట. చిరంజీవ అంటే చిరకాలం బతకాలె అన్నట్టుగానే, కారు గుర్తు కలకాలం నిలిసిపోవాల్నట. అందు కోసం నాయన చెప్పే బ్లెస్సింగు మామా అది'' ఎక్స్‌ప్లెయిన్ చేశాడు మేనల్లుడు.

''బుజ్జి ఎట్లుంది అక్కా?'' అడుగుతుండగా మధ్యలోనే అందుకున్నాడు బావ.

''బుజ్జికేమయ్యింది రా..'ఆరోగ్యలక్ష్మి' లెక్క మంచిగుంది. హెల్తు గిన నిమ్మలంగనే ఉంది. మొన్న ఈడ్నే.. తల్లిగారింటికాడ గవర్మెంటు దవకానల పసిద్ది (ప్రసూతి) అయ్యింది. పోరడు పుట్టిండు. కేసీఆర్ కిట్టు గూడ ఇచ్చిర్రు'' సంతోషంగా చెబుతూ..కొడుకు వైపు తిరిగి.. ''అరేయ్... మామకు మర్యాద చెయ్యాలె. మీ నానమ్మనడిగి పింఛన్ డబ్బులల్ల కొద్దిగ బదులియ్యమను''

''ఎందుకు నానా. ఎలక్షన్ సీజన్ కదా. కొద్ది గాగినంక సైదులు కాక మందు సీసాలు తీస్కోని ఇంటికాడికే వస్తడుగదా... ఇంటింటికి పంచనీకి''

''సుట్టమొచ్చిన్నాడు గూడ ఆ సీపులిక్కరూ, ఆ బగారబువ్వ బంకచెక్కలెందుగ్గని,

నా 'రైతుభరోసా' సొమ్ములల్ల నుంచి కొన్ని డబ్బులు గొంచబో. నల్లిబొక్కలతోని..తొడమాంసంలకెల్లి మాంచి మెత్తటి ముక్కలు ఏపిచ్చుకోని కిలో మటను కొట్టియ్. నాలుగు బీరు కీసలు, ఓ ఫుల్లు బాటిలు తీస్కరా..పో. పొలం పనుల టైముకు మళ్లీ భర్తీ ఏద్దాంలే'' కొడుక్కు పురమాయించాడు.

అతడలా బయటకు వెళ్లగానే ''ఇప్పుడు రాముడేంజేస్తున్నడు అక్కా'' అక్కకొడుకు గురించి ఆరాతీస్తుండగానే...

''ఆ... ఏంజేస్తున్నడంటె ఏంజెప్పను? అయ్యేవో గ్రూపులంట గదా. సదివిన బొక్కులే సదువుతాండు. రాసిన పరీచ్చలే రాస్తాండు'' బావ వైపు ఆవేశంగా చూస్తూ అక్క అనగానే.. బావ ముఖం నల్లగ అయ్యింది.

''అప్పుడప్పుడు అయితుంటయి''

''అవునవును అయితుంటై. లెస్స అయితుంటై మరి. పంపుహౌజులు పడవల్లెక్క మునుగుతుంటై, చెప్పుకోలేని కాడ గడ్డల్లెక్క మేడిగడ్డలైతుంటై'' అన్నది విసురుగా. అక్కేమో కాంగ్రెస్ పార్టీ సింపథైజరు కదా మరి.

''పెతీసారీ పరీచ్చలు వాయిదా పడుతున్నందుకు ఇసిగిపొయ్యి వాడేమో పువ్వు పార్టీలోళ్లతోని తిరుగుతున్నడు.. పొద్దుందాక పోరడు'' వాపోయింది అక్క.

''ఈల్లు కనీసం పోస్టులకు ప్రకటనలన్న ఇస్తరు. పువ్వుపార్టీవోళ్లకేమో..

ఉద్యోగల ఊసూ ఉండదు..ఉన్నయి అమ్ముకతింటరు. ఆఖరికి ప్రైవేటోళ్ల ఆస్తులు కూడా. ఇగ మీవోళ్లను స్కాంగ్రెస్సు అని ఉట్టిగనే అన్నరా'' అక్కడికి కాంగ్రెసోళ్లేదో మా అక్కసైడు తల్లిగారింటోళ్లు అన్నట్టుగ ఎగిరిండు బావ.

ఈళ్ల మాటలూ, యవ్వారాలూ చూసినంక... అక్కబావల ఫ్యామిలీనన్నాడో లేక వాళ్లభిమానించే పార్టీల నేతలనన్నాడోగానీ..రెండు మాటలన్నడు. అవేమిటంటే...

''అందరూ అందరే... అందరు తీస్మార్‌ఖాన్లే''



సంక్షేమ పథకాలు 'ఉచితాలు' కావు

కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే

రాయ్‌పూర్: పేద ప్రజల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు 'ఉచితాలు' అంటూ అభివర్ణిస్తూ ఉండడాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే తప్పుపట్టారు. పేదల సంక్షేమ పథకాలు నిజంగా ఉచితాలే అయితే వాటిని తాము కచ్చితంగా అమలు చేస్తామని తేల్చిచెప్పారు. సుప్రియా శ్రీనాతే బుధవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు చక్కగా అమలు చేసిందని చెప్పారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో, ఇప్పటిదాకా చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడుగుతామని అన్నారు. రిపోర్టు కార్డును ప్రజల ముందు పెట్టబోతున్నామని తెలిపారు. నిరుపేదల బాగు కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఉచితాలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. గిరిజనులు, దళితులు, బలహీన వర్గాలు, కార్మికులు, రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలేవీ ఉచితాలు కావని తేల్చి చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ బఘేల్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల గత ఐదేళ్లలో 40 లక్షల మంది పేదరికం నుంచి బయటపడ్డారని సుప్రియా శ్రీనాతే హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు ఎస్పీ గండం!

మధ్యప్రదేశ్‌లో కుదరని పొత్తు

పలుచోట్ల సొంతంగా బరిలోకి ఎస్పీ | కాంగ్రెస్ అవకాశాలకు గండి కొట్టే చాన్స్

మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ చిన్న పార్టీయే. కానీ రాష్ట్రంలో పలుచోట్ల అది ఉనికిలో ఉంది. పైగా పలు అసెంబ్లీ స్థానాల పరిధిలో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉంది. ఆ పార్టీతో పొత్తు బెడిసికొట్టిన నేపథ్యంలో ఆయా చోట్ల కాంగ్రెస్‌కు ఇబ్బందికరమేనని చెబుతున్నారు. ఈ పరిణామంతో తమకొచ్చిన ఇబ్బందంటూ ఏమీ లేదని పీసీసీ చీఫ్ కమల్‌నాథ్, ఇతర రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేతలు పైకి చెబుతున్నా వాస్తవం మరోలా ఉందన్న అభిప్రాయమే వినిపిస్తోంది.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మరో తలనొప్పి ఎదురైంది. విపక్ష ఇండియా కూటమిలోని తన భాగస్వామి సమాజ్‌వాదీ పార్టీతో సీట్ల పంపకం బెడిసికొట్టింది. ఈ పరిణామంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసే విషయమై చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్టు ప్రకటించారు. ఇది మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అవకాశాలను దెబ్బతీయడమేగాక కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల సయోధ్యపైనా ప్రతికూల ప్రభావం చూపగలదంటున్నారు.





ఇలా మొదలైంది...

అక్టోబర్ 15వ తేదీన కాంగ్రెస్ 144 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్, ఎస్పీ జగడానికి బీజం పడింది. తమకు దక్కుతాయని ఆశించిన స్థానాలు సైతం వాటిలో ఉండటంపై సమాజ్‌వాదీ పార్టీ కన్నెర్రజేసింది. కనీసం ఆరు స్థానాలకు తమకు కేటాయిస్తామని గతంలో తొలుత చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఆ మాట తప్పి అన్ని చోట్లా అభ్యర్థులను ప్రకటించుకుందని అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఆ వెంటనే సమాజ్‌వాదీ పార్టీ సైతం తొమ్మిది మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేసింది. వాటిలో ఐదు కాంగ్రెస్ స్థానాలున్నాయి! అనంతరం దాదాపుగా అన్ని స్థానాలకూ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించగా ఎస్పీ మరో 24 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దించింది. అన్నింటా కలిపి మొత్తమ్మీద 20 చోట్ల కాంగ్రెస్, ఎస్పీ అభ్యర్థులు తలపడుతున్నారు. ఎస్పీ మరింత మంది అభ్యర్థులను ప్రకటిస్తే ఈ సంఖ్య ఇంకాస్త పెరిగేలా ఉంది. టికెట్ల కోసం ఆశావహుల నుంచి ఉన్న విపరీతమైన ఒత్తిడి వల్లే ఎస్పీ పార్టీ కోరిన నియోజకవర్గాల్లో సీట్లు కేటాయించకలేకపోయినట్లు కాంగ్రెస్ వాదిస్తోంది. అప్పటికీ తమ అభ్యర్థుల్లో కొందరిని ఎస్పీ టికెట్‌పై పోటీ చేసేలా ఒప్పించేందుకు విఫలయత్నం చేసినట్టు నేతలు చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రెస్‌పై ప్రభావమెంత?

- మధ్యప్రదేశ్‌లో ఉత్తరప్రదేశ్ సరిహద్దుల్లోని బుందేల్‌ఖండ్, వింధ్య ప్రాంతాల్లో ఎస్పీకి గట్టి మద్దతే ఉంది.
- 2018 ఎన్నికల్లో ఎస్పీ 52 చోట్ల పోటీ చేసింది. నెగ్గింది ఒక్క బిజావర్ స్థానంలోనే.
- మొత్తమ్మీద కేవలం 1.3 శాతం ఓట్లు సాధించింది.
- కానీ ఆ ఎన్నికల్లో ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీ గనక బరిలో ఉండకపోతే ఆ చోట్ల బీజేపీ ఓటమి చవిచూసి కాంగ్రెసే నెగ్గేది!
- పృథ్వీపూర్ స్థానంలో కాంగ్రెస్ తర్వాత ఎస్పీ రెండో స్థానంలో నిలిచింది. అక్కడ భారీగా ఓట్లు రాబట్టింది.
- జబేరా వంటి పలు అసెంబ్లీ స్థానాల్లో గత ఎన్నికల్లో బీజేపీ అతి తక్కువ మెజారిటీలతో బయటపడింది.
- కాంగ్రెస్‌తో పొత్తు బెడిసికొట్టిన నేపథ్యంలో ఈసారి అలాంటి అన్నిచోట్లా బరిలో దిగి తీరతామని ఎస్పీ ఇప్పటికే ప్రకటించింది.
- ఈ పరిణామం ఆయా చోట్ల బీజేపీ విజయాన్ని మరింత తేలిక చేసేలా కన్పిస్తోంది.
- 2018లో బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డాయి. బీజేపీకి 109, కాంగ్రెస్‌కు 114 స్థానాల్లో గెలుపొందాయి. సమాజ్‌వాదీ పార్టీ తదితరుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- ఈసారి సైతం బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. అందుకే సమాజ్‌వాదీ పార్టీ చీల్చే ఓట్లు కాంగ్రెస్‌కు భారీ నష్టం కలగజేయవచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.
- ఆ పార్టీకి రాష్ట్రంలో ఉన్న దాదాపు 2 శాతం ఓటు బ్యాంకును కాంగ్రెస్ పరిగణనలోకి తీసుకుని ఉండాల్సిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నాలుగో జాబితా విడుదల

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిపక్ష బీజేపీ తమ అభ్యర్థుల నాలుగో జాబితాను బుధవారం విడుదల చేసింది. నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇవన్నీ జనరల్ స్థానాలే. బేల్తారా స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రజనీష్ సింగ్‌కు టికెట్ నిరాకరించింది. ఇక్కడ 40 ఏళ్ల సుశాంత్ శుక్లాకు అవకాశం కల్పించింది. మరో మూడు సీట్లో కొత్త అభ్యర్థులనే బరిలోకి దింపుతోంది. రాష్ట్రంలో 90 శాసనసభ స్థానాలుండగా, తాజా జాబితాతో బీజేపీ మొత్తం స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ 33 మంది ఓబీసీలకు, 30 మంది ఎస్టీలకు, 10 మంది ఎస్సీలకు టికెట్లు కేటాయించింది.

మధ్యప్రదేశ్‌లో 4 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల మార్పు

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల ఖరారు ప్రక్రియ కత్తిమీద సాములా మారింది. టికెట్లు రాని అభ్యర్థులు నిరసన గళం వినిపిస్తున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులను మార్చాలంటూ కార్యకర్తల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం బుధవారం మార్చేసింది. సుమౌలీ, పిపారియా, బాద్‌నగర్, జవోరా స్థానాల్లో కొత్త అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. సుమౌలీ నియోజకవర్గంలో కుల్దీప్ సికార్వార్ స్థానంలో అజబ్‌సింగ్ కుష్వాహా, పిపారియాలో వీరేంద్ర బెల్వాన్షీ స్థానంలో గురుచరణ్ ఖరే, బాద్‌నగర్‌లో రాజేంద్రసింగ్ సోలంకీ బదులు మురళీ మోర్వాల్, జవోరాలో హిమ్మత్ శ్రీమాల్ బదులు వీరేంద్ర సింగ్ సోలంకీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. వీరేంద్రసింగ్‌ను బాద్‌నగర్ నుంచి జవోరాలో బరిలోకి దింపుతోంది. మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలుండగా, మొత్తం స్థానాలకు కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించింది.

ఒకే కుటుంబం.. రాజకీయ విరోధం

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బంధుత్వ రాజకీయం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఒకే కుటుంబంలోని వారు వేర్వేరు పార్టీల తరఫున పోటీ చేస్తున్నారు. ఇలా అధికారం కోసం బద్ధ వైరులుగా మారిన వారిలో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల నేతలున్నారు. నవంబర్ 17వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల బరిలో తోబుట్టువులు, మామ‌- మేనల్లుడు, బావమరుదులు, అల్లుళ్లు, అత్తలు, మామలు..ఇలా రాజకీయ ప్రత్యర్థులుగా రంగంలోకి దిగారు. నర్మదాపురం స్థానంలో బీజేపీ అభ్యర్థి, అసెంబ్లీ స్పీకర్ సీతాశరణ్ శర్మపై స్వయానా ఆయన సోదరుడు గిరిజాశంకర్ శర్మ కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అయిన గిరిజా శంకర్ సొంత పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మరో ఉదాహరణ..సాగర్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్‌కు చెందిన నిధి సునీల్ జైన్, తన బావ, సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర జైన్‌పై పోటీకి దిగారు. శైలేంద్ర జైన్ చిన్న తమ్ముడు సునీల్ జైన్ భార్యే నిధి జైన్. దియోరి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సునీల్ జైన్. అదేవిధంగా, రేవా జిల్లా డియోతలాబ్‌లో కాంగ్రెస్ పార్టీ పద్మేష్ గౌతమ్‌ను పోటీకి నిలిపింది. ఈయన మామ, బీజేపీకి చెందిన ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ గిరీశ్ గౌతమ్ ఇక్కడ పోటీ చేస్తున్నారు. హర్దా జిల్లా తిమార్నిలో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి సంజయ్ షాపై ఆయన మేనల్లుడు అభిజీత్ షా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ ముఖాముఖి తలపడటం ఇది రెండోసారి. గ్వాలియర్ జిల్లా దాబ్రాలో బీజేపీకి చెందిన మాజీ మంత్రి ఇమార్తి దేవిపై ఆమె బంధువు సిట్టింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేశ్ రాజేతో తలపడుతున్నారు. కుటుంబసభ్యులు ఎన్నికల్లో పరస్పరం తలపడటంపై సీనియర్ జర్నలిస్ట్, వ్యాఖ్యాత ఆనంద్ పాండే మాట్లాడుతూ..'ఇది సైద్ధాంతిక సంఘర్షణ కానే కాదు. కేవలం అధికారం, పదవుల కోసం జరిగే పోరాటం'అని పేర్కొన్నారు.



మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఉత్త డొల్ల

కుల గణనపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడడం లేదు | రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంకా గాంధీ

జైపూర్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఉత్త డొల్ల అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. మోదీ పాలనలో సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించే నాథుడే లేకుండాపోయాడని అన్నారు. కేవలం కొద్దిమంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ఆమె బుధవారం రాజస్తాన్‌లోని ఝున్‌ఝున్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కుల గణనపై బీజేపీ నాయకులు ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టడానికి బీజేపీ మతాలు, కులాల గురించి మాట్లాడుతోందని ఆక్షేపించారు. అధికారం కాపాడుకోవడానికి ప్రజలను అణచివేసే చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టి సొంత లాభం కోసం పాకులాడే నాయకులను ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని ఓటర్లకు ప్రియాంకా పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార సభలో రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ మాట్లాడారు. రాష్ట్రంలో తాము మళ్లీ అధికారంలోకి వస్తే 2 గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 1.05 కోట్ల కుటుంబాలకు రూ. 500కు వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని చెప్పారు. అలాగే అర్హులైన మహిళలకు సంవత్సరానికి రూ.10,000 చొప్పున గౌరవ భృతి ఇస్తామని వెల్లడించారు. ఇంటి పెద్ద అయిన మహిళలకు ఈ గౌరవ భృతి అందుతుందని పేర్కొన్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం ı 26 ı అక్టోబర్ ı 2023

ఆదివాసీ కళాకారులు..





దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి ఆత్మీయ ఆలింగనం



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అట్టహాసంగా అలయ్ బలయ్



ఉట్టిపడిన తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు.. ఆకట్టుకున్న కళా, సాంస్కృతిక కార్యక్రమాలు.. ఒకటా .. రెండా.. 80 రకాలకు పైగా నోరూరించిన వంటకాలు.. దున్నపోతులు, ఒంటెలు, గొర్రెలు, గంగిరెద్దులు, బోనాల ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. బుధవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ వేడుకలు అట్టహాసంగా సాగాయి. రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

– అబిడ్స్



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.



బోనాలతో శివసత్తులు, పోతరాజుల హంగామా



దోలు కొడుతున్న విజయలక్ష్మి, దత్తాత్రేయ




ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్..


మజ్లిస్‌లో 'చార్మినార్' చిచ్చు

రిటైర్మెంట్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు సిద్ధం

- వీరిలో ఒకరు తన కుమారుడి సీటు కోసం పట్టు
- టికెట్ ఇవ్వకుంటే రెండు స్థానాల్లో పోటీకి సై
- రంగంలోకి దిగి చర్చలు జరిపిన అక్బరుద్దీన్ ఒవైసీ
- మరోవైపు ఆ సీనియర్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ గాలం



ముంతాజ్ అహ్మద్ ఖాన్



సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ రాజకీయాలను శాసిస్తున్న మజ్లిస్ పార్టీలో 'చార్మినార్ అసెంబ్లీ సీటు' చిచ్చు రాజేస్తోంది. మరోమారు పార్టీ అంతర్గత సంక్షోభం పునరావృతమయ్యే ప్రమాదం పొంచి ఉంది. పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలను వయోభారం దృష్ట్యా ఈసారి ఎన్నికల బరి నుంచి తప్పించి కొత్తగా యువతకు అవకాశం కల్పించాలన్న నిర్ణయం మజ్లిస్‌కు తలనొప్పిగా తయారైంది. అధిష్టానం ప్రతిపాదనల మేరకు ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా ఎన్నికల్లో పోటీకి రిటైర్మెంట్ ప్రకటించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అందులో ఒకరు మాత్రం తన కుమారుడికి టికెట్ ఇవ్వాలన్న మెలిక పెట్టడం పార్టీని చిక్కుల్లో పడేసినట్లయింది. అవకాశం ఇవ్వకున్నా.. ఎన్నికల బరిలో దిగడం ఖాయమన్న అల్టిమేటం తిరుగుబాటు సంకేతాన్ని సూచించడం పార్టీలో చర్చనీయాంశమైంది.

మూడు దశాబ్దాల క్రితం మజ్లిస్ అధినేత సలావుద్దీన్ ఒవైసీతో ఏర్పడిన విభేదాలతో సీనియర్ ఎమ్మెల్యే అమానుల్లా ఖాన్ ఏకంగా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని ఆరోపిస్తూ బయటకు వచ్చి మజ్లిస్ బచావో తెహరిక్‌ను స్థాపించారు. పాతబస్తీలో ఏకపక్ష రాజకీయాలు చెల్లవని 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్‌ను ఓడించి కేవలం చార్మినార్ అసెంబ్లీ సీటుకే పరిమితం చేసి ముచ్చెమటలు పట్టించారు. అప్పటి అమానుల్లాఖాన్ సహచరుడైన సీనియర్ ఎమ్మెల్యే తాజాగా పార్టీకి అల్టిమేటం ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

సంప్రదింపుల్లో కాంగ్రెస్ ..

మజ్లిస్ పార్టీని పాతబస్తీలో దెబ్బతీసేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్.. ప్రతి అవకాశాన్ని అనుకూలంగా మల్చుకునేందుకు సిద్ధమవుతోంది. మజ్లిస్ తమను ప్రధాన శత్రువు పక్షంగా పరిగణించి వ్యతిరేక ప్రచారం చేయడం కాంగ్రెస్‌కు మింగుడు పడని అంశంగా తయారైంది. ఇప్పటికే చార్మినార్ నుంచి బలమైన ముస్లిం అభ్యర్థిని రంగంలోని దింపేందుకు అలీ మస్కతీ పేరును పరిశీలిస్తోంది. తాజాగా నెలకొన్న పరిస్థితులతో కాంగ్రెస్ పార్టీ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో సంప్రదింపుల కోసం ముస్లిం సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రిని రంగంలోకి దింపినట్లు సమాచారం. కాంగ్రెస్ పక్షాన చార్మినార్‌తో పాటు యాకుత్‌పురా అసెంబ్లీ స్థానాలు తండ్రీకొడుకులకు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్ వరకు వేచి చూడాలనే యోచనలో ముంతాజ్ ఖాన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఓటమెరుగని ముంతాజ్ ఖాన్‌కు చార్మినార్‌తో పాటు యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్లలో వ్యక్తిగతంగా గట్టి పట్టు ఉంది. దానిని అనుకూలంగా మల్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా సిట్టింగ్ స్థానాల అభ్యర్థుల మార్పు, వయోభారం దృష్ట్యా సీనియర్ ఎమ్మెల్యేను పోటీ నుంచి తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించాలన్న మజ్లిస్ పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈసారి ఎన్నికల్లో చార్మినార్ అసెంబ్లీ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్, యాకుత్‌పురా స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీలకు బదులుగా కొత్తవారి అభ్యర్థిత్వాలను ఖరారు చేయాలని పార్టీ భావిస్తోంది. నాంపల్లి స్థానంలో రెండు పర్యాయాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అభ్యర్థిత్వాన్ని ఈసారి యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్‌కు మార్పు చేసి, నాంపల్లి నుంచి మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్‌ను బరిలో దింపాలని యోచిస్తోంది. చార్మినార్ అసెంబ్లీ స్థానం నుంచి పార్టీ ద్వితీయ అగ్రనేత అక్బరుద్దీన్ ఒవైసీ కుమారుడు డాక్టర్ నూరుద్దీన్ లేదా కూతురు ఫాతిమాను రాజకీయ అరంగ్రేటం చేయించాలని మజ్లిస్ భావిస్తోంది.

రంగంలోకి అక్బరుద్దీన్

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నిర్ణయం మేరకు సీనియర్ ఎమ్మెల్యేలతో చర్చించేందుకు పార్టీ ద్వితీయ అగ్రనేత అక్బరుద్దీన్ ఒవైసీ రంగంలోకి దిగారు. ఇటీవల సీనియర్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి పార్టీ ప్రతిపాదనలపై వారితో చర్చించారు. వయోభారం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా స్వచ్ఛందంగా ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు యాకుత్‌పురా ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో అక్బరుద్దీన్ ఓవైసీ సుదీర్ఘంగా మూడు గంటల పాటు చర్చలు జరిపినా ఫలప్రదం కానట్లు తెలుస్తోంది.
- వయోభారం దృష్ట్యా యువతకు అవకాశం కల్పించేందుకు ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలని అక్బరుద్దీన్ సూచించగా, స్వచ్ఛందంగానే తప్పుకునేందుకు ముంతాజ్ ఖాన్ సంసిద్ధత వ్యక్తం చేస్తూనే గత ఎనిమిదేళ్లుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న తన కుమారుడు డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఖాన్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాల క్రితం ఎంబీటీ నుంచి ఎంఐఎంలోకి తిరిగి వచ్చేందుకు 'జీవితకాలం సీటు ఖాయం' అన్న అప్పటి పార్టీ అధినేత సలావుద్దీన్ ఒవైసీ ఇచ్చిన నోటి మాట కూడా ఈ సందర్భంగా ముంతాజ్ అహ్మద్ ఖాన్.. అక్బరుద్దీన్ ఒవైసీకి గుర్తు చేసినట్లు సమాచారం. ఒకవేళ కుమారుడికి సీటు ఇవ్వకుంటే చార్మినార్, యాకుత్‌పురాల నుంచి ఎన్నికల బరిలో ఉండటం ఖాయమని ముంతాజ్ అహ్మద్ ఖాన్ అల్టిమేటం ఇవ్వడం పార్టీలో చర్చనీయాంశంగా తయారైంది.

కాయ్ రాజా కాయ్!



ఒకవైపు అసెంబ్లీ ఎన్నికలు.. మరోవైపు క్రికెట్ ప్రపంచ కప్

- జోరుగా బెట్టింగ్ రాయుళ్ల పందేలు
- బంతి బంతికీ, డిపాజిట్ల గల్లంతు వరకూ బెట్టింగ్
- ఎన్నికల ఏర్పాట్లు, తనిఖీలలో పోలీసులు బిజీ

సాక్షి, సిటీబ్యూరో: నాలుగేళ్లకు ఒకసారి వచ్చే క్రికెట్ ప్రపంచ కప్, ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికలు.. వెరసి బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. క్రికెట్ మ్యాచ్‌లపై, ఎన్నికలు జోరుగా పందేలు కాస్తున్నారు. ఒకవైపు క్రికెట్ మ్యాచ్‌లలో బంతి బంతికీ బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటే.. మరోవైపు ఏ పార్టీ ఎవరికి టికెట్ కేటాయిస్తుందనే దానిపై కూడా పందేలు నడుస్తున్నాయి. ఇంకోవైపు ఎన్నికల ఏర్పాట్లు, తనిఖీలలో పోలీసులు తలమునకలు కావడంతో ఈ నెల రోజులు పందెం రాయుళ్లకు బెట్టింగ్ సీజన్‌గా మారిపోయింది.

కాసులు కురిపిస్తున్న క్రికెట్ పందేలు..

ప్రపంచ కప్ నేపథ్యంలో గ్రేటర్‌వాసులకు క్రికెట్ ఫీవర్ పట్టేసింది. దీంతో బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. అందునా మ్యాచ్‌లు భారత్‌లోనే జరుగుతుండటంతో పందేల నిర్వాహకులలో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. బెట్టింగ్ నిర్వాహకులు ఫంటర్లు, కస్టమర్లు, బుకీలు పందేలపై ప్రచారం చేస్తూ, ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తూ కాసుల వర్షాన్ని కురిపిస్తున్నారు. ప్రతీ బాల్, వికెట్ నుంచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరకు జోరుగా పందేలు కాస్తున్నారు. అఫ్గానిస్తాన్ వంటి పసికూన టీమ్‌లు కూడా పాకిస్తాన్, న్యూజిలాండ్ వంటి పెద్ద జట్లను ఓడించడంతో క్రికెట్ బెట్టింగ్‌లు కూడా గట్టిగానే సాగుతున్నాయి. పాకిస్తాన్, ఇండియా జట్ల మ్యాచ్‌ల సమయంలో పెద్ద ఎత్తున పందేలు జరుగుతున్నాయి.

ఫాంహౌస్‌లలో ఎన్నికల బెట్టింగ్‌లు..

- క్రికెట్‌తో పాటు ఈసారి ఎన్నికల బెట్టింగ్ కూడా జోరుగా సాగుతోందని సమాచారం. అభ్యర్థులు, కార్యకర్తలు గెలుపోటములపై బేరీజులు వేస్తూ ప్రచార హోరు సాగిస్తున్నారు. సాధారణంగా శివారు ప్రాంతాలలో ఫాంహౌస్‌లను బుకింగ్ చేసుకొని అందులో పొలిటికల్ బెట్టింగ్ నిర్వహిస్తుంటారు. ఎన్నికల ఫలితాల విడుదల సమయంలో గెలుపోటములపై పందేలు నిర్వహిస్తుంటారు. కానీ.. ఈసారి శాసనసభ ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.
- దీంతో బెట్టింగ్ రాయుళ్లు కూడా ఏ పార్టీ ఎవరికి సీట్లు కేటాయిస్తుందనే అంశం నుంచే పందేలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచి ప్రారంభమైన బెట్టింగ్ ఆఫర్లు ఫలితాల విడుదల వరకు సాగేలా కనిపిస్తున్నాయి. గట్టి పోటీ, బరిలో ప్రముఖులు ఉన్న నియోజకవర్గాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది. దీనికితోడు సెంటిమెంట్, సమీకరణాలతో కూడిన సీట్లలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్ సాగుతోంది. సీటు, ఓటు శాతం, డిపాజిట్ల గల్లంతు, రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు ఇలా ప్రతి అంశాన్ని బెట్టింగ్‌కు వినియోగించుకుంటున్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో బిజీ..

సాధారణంగా క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంలో పోలీసులు అలర్ట్‌గా ఉంటారు. పాత నేరస్తుల కదలికలపై కన్నేసి ఉంచుతారు. గతంలో ఇలా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులను పట్టుకున్న సందర్భాలు అనేకం. కానీ.. ఈసారి క్రికెట్ ప్రపంచ కప్ మ్యాచ్‌లు సగం ముగిసినా ఇప్పటివరకు ఒక్క బెట్టింగ్ కేసును కూడా పోలీసులు ఛేదించలేకపోయారు. అంటే ఎన్నికల ఏర్పాట్లు, మద్యం, నగదు, హవాలా తనిఖీలలో పోలీసులు బిజీ అవడంతో పందెం రాయుళ్ల హవా కొనసాగుతోంది. ఈసారి పోలీసులు ఎన్నికల హడావుడిలో ఉండడాన్ని బెట్టింగ్ రాయుళ్లు అవకాశంగా మార్చుకుంటున్నారు.

అన్నదాతలూ.. విజయ నిర్ణేతలు



శివారు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 47,506 మంది రైతులు
- వ్యవసాయ కుటుంబాలూ ఇక్కడ అధికమే..

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతంగా విరాజిల్లుతోంది. ఇక్కడ ఉద్యాన పంటలు సాగు చేసే రైతు కుటుంబాలు కూడా జీవనం సాగిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపు ఓటములపై వీరి ప్రభావం ఉండగలదన్న చర్చ రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం అందించే పంట సాయం కింద రూ.40 కోట్లు రైతు బంధు తీసుకుంటున్న రైతుల సంఖ్య 47,506 ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీల అభ్యర్థుల జయాపజయాలపై వీరి ప్రభావం ఉంటుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. జిల్లాలోని ఘట్కేసర్‌లో 6,884 మంది రైతులు ఉండగా, కాప్రాలో 139, కీసరలో 7,667, మేడ్చల్‌లో 11,441, మేడిపల్లిలో 387, మూడుచింతలపల్లిలో 7,627, అల్వాల్‌లో 319, బాచుపల్లిలో 113, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 4,018 మంది, కూకట్‌పల్లిలో 20, కుత్బుల్లాపూర్‌లో 230, ఉప్పల్ మండలంలో 242 మంది మొత్తంగా 47,506 మంది రైతులు ఉన్నారు. ఇందులో 28 వేల మంది సన్న, చిన్నకారు రైతులు ఉండగా, మిగతా రైతులు ధనిక వర్గాలకు చెందిన వారేనని జిల్లా వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

పంటల సాగు ఇలా..

జిల్లాలో వ్యవసాయ భూమి 10,234 హెక్టార్లు ఉండగా.. ఇందులో సాగయ్యే భూమి మాత్రం 8,245 హెక్టార్లు. ఇందులో వరి పంట 5,012 హెక్టార్లలో సాగవుతుండగా, మొక్కజొన్న 1123 హెక్టార్లలో, ఉద్యాన పంటలు 2630 హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. కూరగాయ తోటలు 1,400 హెక్టార్లలో సాగవుతుండగా, మామిడి, జామ, దానిమ్మ, ద్రాక్ష తోటలు 1,200 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 30 హెక్టార్లలో మాత్రం పాలిహౌజ్ పంట పండిస్తున్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ పరిధిలో 15 మండలాలు ఉండగా, ఇందులో 12 మండలాల పరిధిలోని గ్రామాలు, బస్తీల్లో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు.

అభ్యర్థులు వీటిపై దృష్టి పెట్టాల్సిందే..

జిల్లాలో ఉద్యాన పంటల సాగు కోసం కావాల్సిన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ వసతి, పండించిన పంటకు గిట్టుబాటు ధర, పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవటానికి కోల్డ్ స్టోరేజీలు వంటి వసతులు కల్పించాలి. పంట సాగు కోసం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పంట రుణాల కల్పనకు హామీలిచ్చిన అభ్యర్థులకు ఓట్లు రాలనున్నట్లు చర్చ సాగుతోంది.

పోలింగ్ కేంద్రాలకు రూట్‌మ్యాప్‌లు

బీఎల్‌ఓల ద్వారానే ఇంటింటికీ ఓటరు స్లిప్పులు

- రీ–చెక్ కోసం కరపత్రాల పంపిణీ
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఈజీగా తమ పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు రూట్‌మ్యాప్స్ రూపొందించి గూగుల్‌మ్యాప్‌లో పొందుపరచాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రిటర్నింగ్ అధికారులతో (ఆర్ఓలతో) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్ఓలు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలైన ర్యాంప్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంవద్ద ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ కోసం తగిన స్థలాల్ని గుర్తించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రానికి నిర్దేశించిన ఓటర్ల కంటే ఎక్కువ ఓటర్లున్నట్లయితే అనుబంధ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాధ్యమైనంత తొందరగా ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్స్ ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని చెప్పారు. స్లిప్‌లో ఓటరు సీరియల్ నెంబర్, పోలింగ్ తేదీ, పోలింగ్ స్టేషన్, సమయంతో కూడిన సమాచారం ఉంటుందని తెలిపారు. గతంలో రాజకీయనేతల ద్వారా స్లిప్పుల పంపిణీ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈసారి అందుకు ఆస్కారం లేకుండా ప్రతి ఇంటికీ బీఎల్‌ఓల ద్వారానే వాటిని పంపిణీ చేయాలన్నారు. ఈసారి రాజకీయనేతల ద్వారా పంపిణీ చేసినట్లు ఆరోపణలొస్తే సదరు బీఎల్‌ఓలపై కఠినంగా వ్యవహరించాలని ఆర్ఓలను ఆదేశించారు. ఓటర్లు జాబితాలో తమ పేర్లను రీ–చెక్ చేసుకోవడానికి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

వీరు ఇంటి దగ్గరే ఓటు వేయొచ్చు..

ప్రతి ఓటరు ఫోన్ నెంబర్ సేకరించాలని, తద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపనున్నట్లు తెలిపారు. ఈసారి ఎన్నికల్లో 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఫారం–12డి ద్వారా ఇంటి వద్దే ఓటు వేసే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, శంకరయ్య, ఖైరతాబాద్ ఆర్ఓ, జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రె, యాకుత్‌పురా ఆర్ఓ వెంకటాచారి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోనాల్డ్ రాస్

3,896 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

- అవాంఛనీయ ఘటనల పరిశీలనకు..
- హైదరాబాద్ జిల్లాలో ఏర్పాటుకు చర్యలు
- అత్యధికంగా యాకుత్‌పురా నియోజకవర్గంలో 332 కేంద్రాల్లో

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
ముషీరాబాద్	274	గోషామహల్	235
మలక్‌పేట	300	చార్మినార్	198
అంబర్‌పేట	236	చాంద్రాయణగుట్ట	305
ఖైరతాబాద్	245	యాకుత్‌పురా	332
జూబ్లీహిల్స్	329	బహదూర్‌పురా	263
సనత్‌నగర్	229	సికింద్రాబాద్	220
నాంపల్లి	277	కంటోన్మెంట్	232
కార్వాన్	311		

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిర్వహించేందుకు వివిధ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు హైదరాబాద్ జిల్లాలోని 3,896 పోలింగ్ కేంద్రాల్లోనూ లైవ్ వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ ప్రారంభమయ్యే ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసేంత వరకు లైవ్ వెబ్‌కాస్టింగ్ జరుగుతుంది. పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల దగ్గర పరిస్థితుల్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షించే ఎన్నికల పరిశీలకులు ఎక్కడైనా గందరగోళం ఎదురైతే తక్షణమే రంగంలోకి దిగి పరిస్థితుల్ని చక్కదిద్దుతారు. వెబ్‌కాస్టింగ్ కోసం ఆయా కళాశాలల విద్యార్థుల సేవల్ని వినియోగించుకోనున్నారు.



అన్ని కేంద్రాలూ కీలకమే

కేవలం వల్నరబుల్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే కాకుండా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గౌడల సమస్యలు పరిష్కరించే పార్టీలకే మద్దతు


బాలరాజ్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి బీసీల జనాభా ప్రకారం చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. గౌడల సమస్యలను పరిష్కరించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని, గౌడల సమస్యలు పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పెట్టాలని ఆయన కోరారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలరాజ్‌గౌడ్ మాట్లాడారు. మహిళా బిల్లును పెట్టిన మాదిరిగానే బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీల కంటే గౌడలకు ఎక్కువ సీట్లు ఇచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని, వారినే గెలిపించుకొని తీరుతామని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టడం వల్లనే సరైన న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని వచ్చే ఎన్నికల్లో గౌడలు తమ సత్తాను చూపిస్తారని ఆయన స్పష్టం చేశారు.

వాకింగ్ చేస్తూ.. గుండెపోటుతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి


సురేష్ (ఫైల్)

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మదలంగి సురేష్ (50) వాకింగ్ చేస్తుండగా గుండె పోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన సురేష్ 2000 సంవత్సరం బ్యాచ్ కానిస్టేబుల్. నగరంలోని సంతోష్‌నగర్ ఈస్ట్ మారుతినగర్‌లో ఉంటున్నారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు వాకింగ్ చేస్తున్న సురేష్ ఒక్కసారిగా కింద పడిపోయాడు. తోటి వాకర్స్ వెంటనే కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కోవిడ్ నుంచి ఆయన రెండుసార్లు కోలుకున్నారు. విషయం తెలుసుకున్న సౌత్‌ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

‘కోడ్’ పేరుతో అత్యుత్సాహం!

- తనిఖీలతో హడావుడి చేస్తున్న పోలీసులు
- ఇద్దరు వ్యాపారుల వద్ద రూ.50,200 నగదు
- రామాయంపేట చెక్‌పోస్టు వద్ద గుర్తించిన ఎస్‌ఐ
- ఒకరి వద్దే పట్టుబడినట్లు పంచనామా, సీజ్
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సీన్‌తో సామాన్యుల గగ్గోలు


శివరాంపల్లి వద్ద పోలీసుల తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పేరు చెప్పి పోలీసులు సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. ఎక్కడికక్కడ తనిఖీల పేరుతో దొరికిన నగదు దొరికినట్లు సీజ్ చేస్తున్నారు. ఇదంతా ఎన్నికల్లో ఖర్చులకు ఉద్దేశించిందే అన్నట్లు హడావుడి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తీరు కనిపిస్తోంది. బుధవారం రామాయంపేట చెక్‌పోస్టు వద్ద పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల సంఘానికి లెక్కలు చూపించడం కోసమే అన్నట్లు ఈ పోలీసులు విచక్షణ మరచి వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు కామారెడ్డిలో లాజిస్టిక్స్ కంపెనీ నిర్వహిస్తున్నారు. తమ వ్యాపార కార్యకలాపాల కోసం వెళ్లిన వీళ్లు బుధవారం కారులో తిరిగి వస్తున్నారు. అందులో ఉన్న బ్యాగులో రూ.50 వేలు (రూ.500 నోట్ల కట్ట) ఉంది. రామాయంపేట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన పోలీసులు ఈ కారు ఆపారు. బ్యాగ్ తనిఖీ చేసిన ఎస్‌ఐ నేతృత్వంలోని పోలీసులు అందులో రూ.50 వేలు ఉండటం గమనించారు. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి రూ.50 వేల వరకు నగదు ఎలాంటి రసీదులు లేకుండా తీసుకువెళ్లే అవకాశం ఉంది. అయినప్పటికీ చెక్‌పోస్టులోని పోలీసులు యువకులను ఆ నగదుకు లెక్కలు చెప్పమని గద్దించారు. అవి తమ వ్యాపారానికి సంబంధించినవి అని చెప్తున్నా వినిపించుకోలేదు. రూ.50 వేలు సీజ్ చేసే అవకాశం లేకపోవడంతో ఆ పోలీసులు ‘ప్రత్యామ్నాయ మార్గాలు’ అన్వేషించారు. ఆ యువకుల జేబుల్లో, పర్సులు తనిఖీ చేశారు. ఒకరి పర్సులో రూ.200 ఉండటంతో ఆ మొత్తంతో కలిపి తాము రూ.50,200 సీజ్ చేసినట్లు, అవి ఒకరి వద్దే లభించినట్లు పంచనామా సిద్ధం చేశారు. ఇందులో ఇద్దరి పేర్లు ప్రస్తావించకుండా ఒకరి పేరు రాసి ఆ మొత్తం స్వాధీనం చేసుకున్నారు. రూ.50 వేలకు మించిన నగదు ఒకరి వద్ద ఉంటే సీజ్ చేస్తారా? లేక ఒక వాహనంలో ఉంటే సీజ్ చేస్తారా? దానికి సంబంధించి ఈసీ ఆదేశాలు చూపాలంటూ యువకులు కోరినా పోలీసులు పట్టించుకోలేదు. ఆ ఉత్తర్వులు చూపాలంటే ముందు పేరు చెప్పాలంటూ తెలుసుకుని పంచనామాపై రాశారు. రామాయంపేట పోలీసుల తీరుపై యువకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తమ లెక్కల కోసం ఇలా సామాన్యులను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. గడిచిన కొన్ని రోజులుగా రాష్ట్రం మొత్తం ఇలాంటి సీన్లే కనిపిస్తున్నాయి. కోడ్ పేరుతో పోలీసుల చూపిస్తున్న అత్యుత్సాహం సామాన్యులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా నగదు సీజ్ చేశారు. హైదరాబాద్‌లోనే ఈ మొత్తం రూ.15 కోట్ల వరకు ఉంది. బోయిన్‌పల్లి పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్న రూ.55,900 నగదుతో మాత్రమే ఎన్నికల లింకులు ప్రాథమికంగా బయటపడ్డాయి. ఈ నగదు తరలిస్తున్న న్యూ బోయిన్‌పల్లి వాసి ఎం.భాస్కర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కావడంతో ఆ కోణంలో ‘ఎలక్షన్ డబ్బు’గా అనుమానిస్తూ స్వాధీనం చేసుకున్నారు. ఇది మినహా మరే ఇతర ఉదంతంలోనూ నగదు స్వాధీనంలో రాజకీయ కోణం బయటపడకపోవడం గమనార్హం.

స్టీఫెన్ రవీంద్రకు పితృవియోగం


బెంజమిన్ రంజిత్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తండ్రి ముత్యాల బెంజమిన్ రంజిత్(81) బుధవారం సాయంత్రం ఏఐజీ హాస్పిటల్‌లో మరణించారు. గతంలో బెంజమిన్ రంజిత్ పోలీసు శాఖలో ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. బెంజమిన్ రంజిత్ మృతి పట్ల డీజీపీ అంజనీకుమార్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 1998లో తాను గుంటూరు ఎస్పీగా ఉన్న సమయంలో రంజిత్‌తో కలిసి పనిచేశానని, వృత్తిలో నిబద్ధత కలిగిన వ్యక్తి చనిపోవడం అత్యంత బాధాకరమని డీజీపీ వ్యాఖ్యానించారు. బెంజమిన్ రంజిత్ అంత్యక్రియలను శుక్రవారం మధ్యాహ్నం నారాయణగూడలోని ప్రొటెస్టంట్ సిమెట్రీలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



చార్మినార్‌కు చేరుకున్న ‘గడ్చిరోలీ అమరవీరుల’ సంస్మరణ ర్యాలీ

చార్మినార్: మహారాష్ట్ర గడ్చిరోలీ పోలీసు అమరవీరుల త్యాగాలను దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు తెలియజేస్తూ..దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న గడ్చిరోలీ అమరవీరుల గర్వం బైక్ ర్యాలీ బుధవారం చార్మినార్‌కు చేరుకుంది. ఇక్కడి నుంచి విజయవాడ ద్వారా దక్షిణ భారత దేశం మొత్తం పర్యటించనున్నట్లు గడ్చిరోలీ అమరవీరుల గర్వం బైక్ ర్యాలీ ప్రతినిధి కిషోర్ కూభ్రాగదే తెలిపారు. ఈ ర్యాలీ వారం రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ లీస్టర్‌తో అపోలో ఆస్పత్రి ఒప్పందం

బంజారాహిల్స్: విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించేందుకు వీలుగా భారతీయులకు విద్యా కార్యక్రమాల రూపకల్పన, అత్యాధునిక పరిశోధనలను, అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించడానికి యూనివర్సిటీ ఆఫ్ లీస్టర్ యూనివర్సిటీతో అపోలో ఆస్పత్రి ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అపోలో ఆస్పత్రుల గ్రూప్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, లీస్టర్ విశ్వ విద్యాలయం అధ్యక్షుడు నిషాన్ కనడా రాజా మాట్లాడుతూ ఇప్పటికే యూకేతో ఉన్న తమ సంబంధాలను ఈ ఒప్పందంతో మరింత బలపర్చుకున్నామన్నారు. విద్యలో సహకరించుకోవడం, పరిశోధన కార్యక్రమాలు అన్వేషించడానికి ఆరోగ్య సంరక్షణ నిర్వహణ, డేటాసైన్స్‌రంగాల్లో ఈ ఒప్పందాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

డిసెంబర్‌లో వీరభద్ర స్వామి వారి కల్యాణం

పంజగుట్ట: ఆరాధ్య జనసేవా వాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో మొదటిసారి ‘శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వార్ల కళ్యాణం, వీధి పళ్లెం’ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ తాడికొండ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, చారిత్రక నవలా చక్రవర్తి డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ జింఖానాగ్రౌండ్స్‌లో డిసెంబర్ 14వ తేదీ నుండి 17వ తేదీ వరకు కల్యాణోత్సవాలు ఉంటాయని తెలిపారు.

కెనడాలో బతుకమ్మ, దసరా సంబరాలు



సాక్షి, సిటీబ్యూరో: కెనడాలోని కాల్గరీ నగరంలో బోనెస్ కమ్యూనిటీ అసోసియేషన్ హాల్లో కాల్గరీ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తెలుగు కుటుంబాల మహిళలు రకరకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను తెచ్చి ఆడారు. అనంతరం తెలుగు బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో సుమారు సుమారు 650 తెలుగు కుటుంబాల సభ్యులు పాలు పంచుకున్నారు. కార్యక్రమానికి అల్బెర్టా ప్రావిన్స్ సాంస్కృతిక శాఖ మంత్రి మహ్మద్ యాసిన్, డిప్యూటీ మేయర్ వాంగ్‌లు అతిథులుగా హాజరుకాగా, కమిటీ సభ్యులు సత్య కొంపల్లి, సుకేష్ బవండ్ల, అశ్విన్ తుములు, రవి పల్లే, నమ్రత మంగు, రాహుల్ దండే, విష్ణు గబ్బుల, సునీల్, రాజవరం, అనంత్ మంగు, మదన్ చిలువేరి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ‘అభితో పరేషాన్’ సినిమా షూటింగ్



సాక్షి, సిటీబ్యూరో: వినూత్న కథాంశంతో నూతనంగా షూటింగ్ ప్రారంభించిన ‘అభితో పరేషాన్’ చిత్ర బృందం బుధవారం జూబ్లీహిల్స్‌లో సందడి చేసింది. సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో సుమన్, శీతల్ కల్యాణం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరక్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సినిమా దర్శకులు చంద్రశేఖర్ పొట్నూరు మాట్లాడుతూ., ఈతరం ప్రేక్షకులను అలరించే కథాంశంతో, అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాల మేళవింపుతో ‘అభితో పరేషాన్’ రూపొందిస్తున్నామన్నారు. హృదయాన్ని హత్తుకునే విభిన్నమైన అంశాలతో ఈ సినిమాన ఉంటుందని నిర్మాత మృణాళిని తెలిపారు.

నర్సింగ్ షో రూంలో సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్



సాక్షి, సిటీబ్యూరో: రానున్న వివాహాల సీజన్ నేపథ్యంలో కూకట్‌పల్లిలోని నర్సింగ్ షో రూం వేదికగా నూతన డిజైనర్ ఫెస్టివ్-వెడ్డింగ్ కలెక్షన్స్‌ను ఆవిష్కరించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ షో రూం ఎండీ సంజయ్ సింఘానియాతో పాటు సినీతార ప్రియాంక చౌదరి, మిస్ ఇండియా తెలంగాణ–2023 ఉర్మిళా చౌహాన్‌లు పాల్గొని సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్స్‌ను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఫ్యాషన్ హంగులతో రూపొందించిన డిజైనర్ లెహంగాలు, చీరలు తదితర డిజైనింగ్ వేర్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఈవీఎం.. ఆగయా


సీవీఆర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎం బాక్స్‌లు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఈవీఎం బాక్సాలు పోచారం సమీపంలోని సీవీఆర్ కళాశాలకు చేరుకున్నాయి. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 319 పోలింగ్ కేంద్రాలకు గాను 396 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, 446 వీవీపీఏటీలు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. సీవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈ యంత్రాలను భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల కంటే అదనంగా మెషీన్లు, వీవీపీఏటీలు వచ్చినట్లు వెల్లడించారు. నవంబర్ 30న జరిగే పోలింగ్‌కు సీవీఆర్ కళాశాల నుంచి ఈవీఎంలను, సిబ్బందిని పంపుతామని.. తిరిగి పోలింగ్ అనంతరం ఇక్కడే ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఎన్నికల కౌటింగ్ కూడా ఈ కళాశాలలోనే జరుగుతుందని ఆయన వెల్లడిఇంచారు.

అగ్రతాంబూలమే

రాజకీయాల్లో ఉమ్మడి జిల్లా నేతలకు ప్రత్యేక గుర్తింపు

- ప్రతి కేబినెట్‌లోనూ మంత్రి పదవులు
- ఇద్దరు సీఎంలు,ముగ్గురు హోంమినిస్టర్లు మనవారే
- తొలి హోంమంత్రిగా రికార్డులకెక్కిన సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అనేకమంది ఉద్దండులకు నిలయంగా ఈ జిల్లా నిలిచింది. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు షాద్‌నగర్ (ఒకప్పుడు మహబూబ్ నగర్ జిల్లా, ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో భాగం) నియోజకవర్గం నుంచే గెలుపొందారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి కూడా ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్ నుంచి ఒకసారి, మేడ్చల్ నుంచి మరోసారి గెలుపొందారు. కేంద్రమంత్రిగా పనిచేసిన దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి కూడా ప్రస్తుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 4 సార్లు గెలుపొందారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్‌టీఆర్ తొలిసారిగా ఓటమిని చవిచూసింది ఇక్కడే. ఆయనపై గెలుపొందిన చిత్తరంజన్ దాస్ చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

మేడ్చల్ నియోజకవర్గం..

మేడ్చల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించగా పది మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. వీరిలో ఒకరు ముఖ్యమంత్రిగా.. మరో ఐదుగురు మంత్రులుగా పనిచేశారు. వీరిలో సుమిత్రాదేవి (1967–72) జిల్లా నుంచి తొలి మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత మర్రిచెన్నారెడ్డి 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొంది ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన మొత్తం ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వికారాబాద్, తాండూరు నుంచి రెండేసి సార్లు, సనత్‌నగర్ నుంచి ఒకసారి, మేడ్చల్ నుంచి ఒకసారి విజయం సాధించారు. ఆ తర్వాత ఉమా వెంకట్రామిరెడ్డి(1983, 1989) కాంగ్రెస్ నుంచి, సురేందర్‌రెడ్డి(1985) టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొందడమే కాకుండా ఆయా ప్రభుత్వాల్లో మంత్రులుగా పనిచేశారు. ఆ తర్వాత 1994 నుంచి 2004 వరకు టీడీపీ నుంచి వరుసగా మూడుసార్లు తూళ్ల దేవేందర్‌గౌడ్ గెలుపొందారు. ఆయన హోం, రెవెన్యూశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత కార్మికశాఖ మంత్రిగా కొనసాగుతున్న మల్లారెడ్డి సైతం మే డ్చల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

చేవెళ్ల నియోజకవర్గం..

చేవెళ్ల నియోజకవర్గానికి 1962 నుంచి ఇప్పటివరకు 14సార్లు ఎన్నికలు నిర్వహించగా తొమ్మిది మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో 1985 నుంచి వరుసగా నాలుగు సార్లు (టీడీపీ నుంచి మూడు, కాంగ్రెస్ నుంచి ఒకసారి) గెలుపొందిన పి.ఇంద్రారెడ్డి ఉమ్మడి ఏపీలోని ఎన్‌టీఆర్ కేబినెట్‌లో హోంశాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన అకాల మరణం తర్వాత ఆ స్థానానికి (2000) నిర్వహించిన ఉపఎన్నికల్లో ఆయన సతీమణి సబితారెడ్డి గెలుపొందారు. ఆమె 2004లో కాంగ్రెస్ నుంచి మళ్లీ విజయం సాధించి తొలి మహిళా హోంమంత్రి(దేశంలోనే తొలి మహిళా హోంమంత్రి)గా పనిచేశారు. దంపతులిద్దరూ ఒకే నియోజకవర్గం నుంచి గెలుపొండమే కాకుండా ఒకే శాఖకు మంత్రిగా పనిచేయడం విశేషం. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మహే శ్వరం నియోజకవర్గం నుంచి గెలుపొందిన సబితారెడ్డి గనులు భూగర్భవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు.2018లో అదే స్థానంలో కాంగ్రెస్ అభ్య ర్థిగా విజయం సాధించి.. ఆ తర్వాత అధికార బీఆర్‌ఎస్‌లో చేరి విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

పరిగి నియోజకవర్గం..

పరిగి నియోజకవర్గానికి ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు జరిగగా.. 12 మంది రెడ్డి సామాజికవర్గం వారే విజయం సాధించారు. మూడుసార్లు మైనార్టీ(ముస్లిం) అభ్యర్థులు గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా కమతం రామిరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 1972, 1989లో ఆయనే కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. జలగం వెంగళరావు, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్లో.. కమతం రాంరెడ్డి వివిధ శాఖలకు మంత్రిగా పనిచేశారు. 1978, 1983లో పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన ఎ.షరీఫ్ చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీ నుంచి ఐదుసార్లు(1985, 1994, 1999, 2004, 2009) గెలుపొందిన హరీశ్వర్‌రెడ్డి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కొడుకు కొప్పుల మహేశ్‌రెడ్డి పరిగి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

వికారాబాద్, తాండూర్‌లో..

వికారాబాద్‌లో ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఎనిమిది మంది ఎమ్మెల్యేగా పనిచేశారు. చంద్రశేఖర్ కొంతకాలం చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేయగా, గడ్డం ప్రసాద్ కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. ఇక్కడ నుంచి గెలుపొందిన రామస్వామి కూడా మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఏపీ సీఎంగా పనిచేసిన మర్రిచెన్నారెడ్డి కూడా ఇదే నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలుపొందారు. తాండూరుకి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. ఏడుగురు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో మాణిక్య రావు, మర్రి చెన్నారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి పైలెట్ రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గం..

షాద్‌నగర్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. 1952లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, కేరళ గవర్నర్‌గా పనిచేశారు. ఇక్కడి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ పి.శంకర్‌రావు గతంలో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.అలాగే 2009లో కంటోన్మెంట్ నుంచి గెలుపొంది కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.

తొలి మహిళా హోంమంత్రిగా సబితారెడ్డి

అలాగే చేవెళ్ల నుంచి గెలుపొందిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి, సబితారెడ్డి దంపతులిద్దరూ ఉమ్మడి ఏపీలో హోంమంత్రులుగా పనిచేశారు. అయితే దివంగత నేత, మాజీ సీఎం డా.వైఎస్సార్ కేబినేట్‌లో దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిగా సబితారెడ్డి రికార్డులకెక్కారు. ఇదే జిల్లాకు చెందిన తూళ్ల దేవేందర్‌గౌడ్ సైతం ఉమ్మడి ఏపీలో హోంమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం మహేశ్వరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా, మేడ్చల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చామకూర మల్లారెడ్డి కార్మికశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 17 నియోజకవర్గాలు ఉండగా.. వీటిలో 10 స్థానాల్లోని అభ్యర్థులకు ఇప్పటివరకు ఆయా మంత్రివర్గాల్లో అవకాశం లభించింది. అయితే రాజేంద్రనగర్, ఎల్బీనగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలకు ఇప్పటి వరకు ఏ మంత్రివర్గంలోనూ చోటు లభించకపోవడం గమనార్హం.

కల్వకుర్తి నియోజకవర్గం..

కల్వకుర్తి నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు నిర్వహించగా 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది ఈ నియోజకవర్గమే. 1969, 1972లో కాంగ్రెస్ నుంచి, 1978,1983లో జనతా పార్టీ నుంచి జైపాల్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహబూబ్‌నగర్ నుంచి రెండుసార్లు, మిర్యాలగూడ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్.. 1989లో ఇక్కడి నుంచి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఎన్‌టీఆర్‌ను ఓడించిన చిత్తరంజన్‌దాస్‌కు చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు లభించింది.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో 1957–67 వరకు ఎమ్మెల్యేగా కొనసాగిన ఎంఎన్ లక్ష్మీనర్సయ్య సహా 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన సుమిత్రాదేవి, 1999లో టీడీపీ నుంచి గెలుపొందిన కొండ్రు పుష్పలీల మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కీర్తిలాల్ 11 కేవీ ఫీడర్ కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వప్న నర్సింగ్ హోం, నిశాంత్‌బాగ్, కీర్తిలాల్ జ్యువెలరీ, బాబూఖాన్ మాల్, అమృతమాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఆత్మీయతకు మారుపేరు అలయ్‌బలయ్



విష్ణు, దత్తాత్రేయలకు శుభాకాంక్షలు చెబుతున్న సురేందర్‌యాదవ్

వెంగళరావునగర్: ఆత్మీయత, అనురాగానికి ప్రతీకగా అలయ్‌బలయ్ నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షుడు సురేందర్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన నాంపల్లిలో జరిగిన అలయ్‌బలయ్ కార్యక్రమానికి హాజరై అక్కడ జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయలను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం కోసం వినతి

లిబర్టీ: ప్రజా వైద్యంను మరింత బలోపేతం చేసి, ప్రజలు ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్యంను అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుకు ఉస్మానియా జేఏసీ నాయకులు దళిత బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుని కలిసి పూల మొక్క అందించి శాలువాతో సత్కరించారు. క్షేత్రస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజా వైద్యాన్ని మరింత బలోపేతం చేయటంతో పాటు పేద మధ్య తరగతి అనగారిన వర్గాలకు దళితులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... ఇప్పటికే ప్రాథమిక ఆసుపత్రి నుంచి పట్టణ ఆసుపత్రుల వరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

వేడుకగా దుర్గాదేవి శోభాయాత్ర



బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనం శోభాయమానంగా కొనసాగుతోంది. అందులోభాగంగా బుధవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, సోమాజిగూడ తదితర ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున శోభాయాత్రలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

'హెబ్రోన్' పేరుతో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు

చిక్కడపల్లి: క్రైస్తవులకు పవిత్రమైన 'హెబ్రోన్ సంస్థ' పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని 'ది సొసైటీ ఆఫ్ ఇండిజినెస్ ఇన్ ఇండియా' బ్రదర్ జోసెఫ్ కురియన్, సొసైటీ అధికార ప్రతినిధి, ప్రధానకార్యదర్శి ఆర్.వీరాచారి హెచ్చరించారు. బుధవారం గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని హెబ్రోన్ చర్చిలో ఆయన మాట్లాడారు. దేశంలోని వేలాది క్రైస్తవ సంఘాలను నిర్వహిస్తున్న హెబ్రోన్ చర్చ్‌ను బ్రదర్ భక్తసింగ్ గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో ది సొసైటీ ఆఫ్ ఇండిజినెస్ చర్చెస్ ఇన్ ఇండియా పేరుతో ఒక మంచి ఆశయంతో 1971లో ఏర్పాటు చేస్తే కొందరు ఈ సంస్థను, చిరునామాను కూడా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ ట్రస్ట్ అనేది ఈ చిరునామాలో పనిచేయడం లేదని స్పష్టం చేసారు. కేఎం. శ్యాంసన్, బానోతు భీమా ఆలియాస్ బర్నబాస్, ట్రస్ట్ సభ్యులు కొందరు తమ ఆధార్ కార్డులతో సొసైటీ చిరునామాను అక్రమంగా వాడుకుంటున్నారన్నారు. అక్రమంగా గ్యాస్ కనెక్షన్‌లు తీసుకుని నేరేడుచర్ల, విద్యానగర్‌లోని బృందావన్ కాలనీలోని సీయోను ప్రార్థనా మందిరంలో ఉంటున్నారన్నారు. ఇదే అంశంపై ముషీరాబాద్ పోస్టు ఆఫీస్, గ్యాస్ ఏజెన్సీ, పోలీసులు, తహసీల్దార్ అధికారులకు వివరించామన్నారు. చర్చ్ సభ్యులు మరోసారి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు..

కేంద్ర బలగాలొచ్చేశాయ్!

చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పారా మిలిటరీ దళాలు
వెస్ట్‌జోన్‌కు రెండు కేంద్ర బలగాలు



షేక్‌పేటలో కేంద్ర బలగాలకు సూచనలిస్తున్న ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రెండు కంపెనీల పారామిలిటరీ దళాలను పంపించారు. ఒక్కో కంపెనీలో 90 మంది ఇన్‌స్పెక్టర్ ఎస్ఎఫ్, ఆర్పీఎస్ఎఫ్ దళాలు ఉంటాయి. ఇప్పటికే వీరికి చెక్‌పోస్టుల వద్ద డ్యూటీలు అప్పగించారు. రేయింబవళ్లు ఈ చెక్‌పోస్టుల వద్ద స్థానిక పోలీసులు, ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌తో కలిసి తనిఖీలు చేపడుతున్నారు.

- జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జూబ్లీహిల్స్ రోడ్ నెం 36 నీరూస్ చౌరస్తా, షేక్‌పేట నారాయణమ్మ కాలేజీ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇక్కడ పోలీసులు నిఘాలో ఉంటున్నారు ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.
- కేంద్ర బలగాలు పూర్తిగా వెస్ట్‌జోన్ డీసీపీతో పాటు నియోజకవర్గాల నోడల్‌అధికారుల పర్యవేక్షణలో పని చేస్తున్నారు. యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్‌లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (ఇన్‌స్పెక్టర్ ఎస్ఎఫ్) బలగాలను, గోల్కొండలో రిజర్వ్ పోలీసు సెక్యూరిటీ ఫోర్స్ (ఆర్పీఎస్ఎఫ్)లను ఉంచారు.
- వంతుల వారీగా ఈ బలగాలు ఒక వైపు చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో మరో వైపు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్న కార్డన్ సర్చ్‌లో పాల్గొంటున్నాయి.
- సాయుధ బలగాల పర్యవేక్షణలో తనిఖీలు జరుగుతుండటంతో సహజంగానే నగదు, మద్యం, ఇతర బహుమతులు రవాణా చేయడానికి నేతలు సాహసించడం లేదు.
- ప్రారంభంలో పెద్ద మొత్తంలో నగదు, మద్యం, బంగారం పట్టుబడగా గత వారం రోజుల నుంచి నగదు పట్టివేతలు పూర్తిగా నిలిచిపోయాయి. తనిఖీలు ముమ్మరం కావడం వల్లనే అప్రమత్తమైనట్లుగా అధికారులు పేర్కొంటున్నారు.
- ఇంకోవైపు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటటిక్ సర్వైలెన్స్ బృందాలు ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాయి. ఏ ఒక్క వాహనాన్ని వదలడం లేదు.
- దీనికి తోడు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.
- ఫలితంగా మద్యం రవాణా కూడా నిలిచిపోయింది. అలాగే బస్తీల్లో ఇన్నాళ్లు నిరాటంకంగా సాగిన బెల్టుషాపులకు కార్డన్ సర్చ్‌లో చెక్‌పెట్టారు.

శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే పోలీస్ శాఖ అప్రమత్తమైంది. అడుగడుగునా నిఘా పెంచారు. మద్యం, నగదు రవాణా అరికట్టేందుకు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కేంద్ర బలగాల పర్యవేక్షణలో తనిఖీలు చేస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

బంజారాహిల్స్: ఎన్నికల సమీపిస్తున్న వేళ ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారుల్లో సైతం పోలీసులు, ఎన్నికల సంఘం అధికారుల తనిఖీలు విస్తృతం అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో బుధవారం ఎన్నికల సంఘం అధికారులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా బ్యాంకులు, బంగారం షాపుల వద్ద అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. సరైన పత్రాలు లేకుండా డబ్బు, నగలు తీసుకెళ్తే సీజ్ చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ 18 బస్తీలలో యువతను ప్రోత్సహించేందుకు డీఎన్ఆర్ దసరా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. డివిజన్‌కు చెందిన సుమారు 300 మంది యువకులు 16 జట్లుగా ఏర్పడి కొద్ది రోజులుగా పోటీల్లో పాల్గొంటున్నారు. ఫిలింనగర్‌లోని బీజేఆర్ కాలనీ ప్లేయింగ్ 11 క్రికెట్ జట్టు మొదటి స్థానాన్ని దక్కించుకోగా గౌతంనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ జట్టు కెప్టెన్ సంతుకు ట్రోఫీతో పాటు రూ. 50 వేల బహుమతిని అందజేశారు. రెండో స్థానంలో పద్మాలయ అంబేడ్కర్ నగర్ క్రికెట్ జట్టు నిలిచింది. ఈ జట్టుకు రూ. 25 వేలను అందజేశారు. ఛత్రపతి శివాజీనగర్ బస్తీ నేత తన్నీరు రాములు ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం





శ్రీవారి ఉత్సవమూర్తులకు చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం విభిన్న ద్రవ్యాలతో స్వామివారి చక్రస్నాన వేడుకలు, పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం స్వామివారిని అశ్వవాహన సేవలో ఊరేగించారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళలతో చిన్నారుల్లో సృజనాత్మకత



ఆర్ట్ ద్వారా ఎలా సృజనాత్మక పెంచుకోవచ్చో చూపుతున్న గీతా భాస్కర్

పంజగుట్ట: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ విజువల్ ఆర్ట్స్ ఉపాధ్యాయురాలు, సినీ నటి గీతా భాస్కర్ అన్నారు. పాఠశాలల్లో 40 నిమిషాలు డ్రాయింగ్ క్లాస్ ఉంటుందని కాని దాన్ని సక్రమంగా వినియోగించుకోవడంలేదని అభిప్రాయపడ్డారు. టెంపర్‌వేరీ బుక్స్ ఇచ్చి పాత బొమ్మలు చూపుతూ వాటినే తిరిగి వెయ్యమంటున్నారని, అలా కాకుండా పిల్లల్లో క్రియేటివిటీ పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... డ్రాయింగ్‌తో అన్ని రకాల సబ్జెక్టులు బోధించవచ్చునని పిల్లలకు మరింత మెదడుకు ఎక్కే అవకాశం ఉంటుందన్నారు. ఇండియన్ ఫైన్ ఆర్ట్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ప్రత్యేక కోర్సును ప్రారంభించినట్లు దీనితో విద్యార్థుల్లో అంతర్లీనంగా సృజనాత్మకత వెలికితీయడంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే నగరంలో పలు పాఠశాలల్లో ఈ కోర్సు విజయవంతంగా సాగుతుందని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని తెలిపారు.

రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

పంజగుట్ట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి పుట్టినరోజు సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు బుధవారం నిమ్స్ ఆస్పత్రిలో అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు మందాడి ప్రవీణ్ యాదవ్, సి.రాజశేఖర్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజలే దైవంగా భావించే విజయారెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలన్నారు. వచ్చే పుట్టినరోజు ఖైరతాబాద్ ఎమ్మెల్యే హోదాలో ఘనంగా చేస్తామని ధీమావ్యక్తం చేశారు.

ఖైరతాబాద్‌లో...

ఖైరతాబాద్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయం వద్ద స్థానిక నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఎస్.కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత గుడిలో హుండీలు చోరీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 1లోని నాగదేవత గుడిలో హుండీలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు ఆలయ ప్రతినిధి రాయ్‌కోడ్ రమేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... రోడ్ నెం 1లో ఉన్న నాగదేవత టెంపుల్‌లోకి ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు ఆగంతకులు ప్రవేశించి గేటు బద్దలకొట్టి లోనికి ప్రవేశించి రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. నెలన్నరకు సంబంధించిన హుండీ ఆదాయం ఈ రెండు హుండీల్లో ఉందని సుమారుగా రూ. 20 వేల వరకు భక్తులు వేసిన నగదు చోరీ అయిందని ఆరోపించారు. సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. నలుపురంగు దుస్తుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తులులోనికి ప్రవేశించి హుండీలు ఎత్తుకెళ్లే దృశ్యాలను పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తల్లీకుమారుడి అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తల్లీకుమారుడిని మధురానగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 35 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో మధురానగర్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో రహమత్‌నగర్‌లో రాచమల్లు సరోజిని, ఆమె కుమారుడు వెంకటేష్‌లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న ఆఫీసర్స్ ఛాయిస్ కంపెనీకి చెందిన 180 ఎంఎల్ 20 బాటిల్స్, 90 ఎంఎల్ 15 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకృష్ణానగర్‌లో అగ్నిప్రమాదం

రూ. లక్ష విలువైన సామగ్రి దగ్ధం

వెంగళరావునగర్: శ్రీకృష్ణానగర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలవీ... శ్రీకృష్ణానగర్ సాయిరాం హైస్కూల్ సమీపంలో బీఆర్ఎస్ నాయకురాలు ఆదిలక్ష్మికి చెందిన బిల్డింగ్ ఉంది. ఆ బిల్డింగ్‌లోని కింద పోర్షన్‌లో వాచ్‌మెన్ ఉంటున్నాడు. వాచ్‌మెన్ ఎస్.రాంబాబు స్వగ్రామం వెళ్లాడు. అతని కుమారులు మాత్రమే ఇంట్లో ఉన్నారు. బుధవారం సాయంత్రం దాదాపు 6 గంటల సమయంలో వాచ్‌మెన్ నివసిస్తున్న రూము పక్కనే ఉన్న మీటర్ బాక్స్‌లు ఒక్కసారిగా పేలిపోయాయి. దాంతో వాచ్‌మెన్ పిల్లలు భయపడి బయటకు వచ్చారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మీటర్ బాక్స్‌లు, వాషింగ్ మిషన్ కాలిపోయింది. పొగ దట్టంగా బిల్డింగ్ మొత్తం వ్యాపించింది. దాంతో బిల్డింగ్‌లో నివాసం ఉంటున్న వారంతా బయటకు వచ్చి బకెట్ల ద్వారా నీటిని తెచ్చి మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. అనంతరం ఫైర్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా ఆ శాఖ సిబ్బంది వచ్చి పూర్తిస్థాయిలో మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో దాదాపు రూ. లక్ష విలువైన (మీటర్లు, వాషింగ్ మిషన్) నష్టం వాటిల్లి ఉండవచ్చని ఫైర్ సిబ్బంది తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

మాస్టర్ ట్రైనర్స్‌కు అవగాహన



మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే

బంజారాహిల్స్: పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్ సమావేశంలో బుధవారం ఖైరతాబాద్ ఎన్నికల కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే ఎనిమిది మంది మాస్టర్ ట్రినర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... ఈ నెల 27, 28 తేదీల్లో బంజారాహిల్స్‌లోని ముఫకంజ కాలేజీలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు నాలుగు సెషన్లలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. మొత్తం 800 మంది ఎన్నికల సిబ్బందికి ఇచ్చే ఈ శిక్షణలో పోలింగ్‌కు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని సందేహాల నివృత్తి కూడా చేస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు ప్రశాంతి, అనితారెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దానంకు దళిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నేతల మద్దతు



మద్దతు తెలుపుతున్న నేతలు

ఫిలింనగర్: పేద ప్రజల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని వెంకటేశ్వరకాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్ కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో ఈ ఎన్నికల్లో కూడా మరోసారి భారీ మెజార్టీని దానం నాగేందర్‌కు కట్టబెడతామని హామీ ఇచ్చారు. నాగేందర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందేకు వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో బడుగు, బలహీన వర్గాలన్నీ ఐకమత్యంగా ఈ ఎన్నికల్లో పని చేస్తాయన్నారు. కేసీఆర్ భీమా ప్రతి ఇంటికి ధీమా, అన్నపూర్ణా పథకం, ఆసరా పెన్షన్లు, గురుకులాలు, ఆరోగ్య రక్షణ, సౌభాగ్యలక్ష్మి, రూ. 400లకే గ్యాస్ సిలిండర్లు ఇవన్నీ పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సంక్షేమ పథకాల రారాజుగా సీఎం కేసీఆర్ వెలుగొందుతున్నారని ఆ పథకాలు నియోజక వర్గంలో అమలుచేయడంలో నాగేందర్ అందరికంటే ముందున్నారని వెల్లడించారు.

'బీఆర్ఎస్ మేనిఫెస్టో'తో ప్రత్యర్థుల్లో వణుకు'

లిబర్టీ: అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నిక మెనిఫెస్టో నిలుస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సబండ వర్గాల సమగ్ర అభివృద్ధి ఆర్థిక ప్రగతి కోసం ఎన్నికల ప్రణాళికలు అనేక అంశాలను పొందుపరిచారన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భారత రాష్ట్ర సమితి విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికను చూసి కాంగ్రెస్, బీజేపీ ఇతర రాజకీయ పార్టీలకు వణుకు పుడుతోందన్నారు. అన్ని పార్టీలో ఓటమి తప్పదని భయం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఎన్నికల ప్రణాళికను చూసిన తరువాత తమ ఓటమి దగ్గరలోనే ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

బీజేఆర్‌నగర్‌లో చింతల ప్రచారం



బీజేఆర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఖైతరాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో బుధవారం ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి బూత్ దర్శన్ కారయక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు.

మూడో దఫా విజయం సాధిస్తా: ఎమ్మెల్యే మాగంటి



శ్రీనగర్‌కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: రెండు పర్యాయాలు తనకు విజయాన్ని చేకూర్చిన ప్రజలు మూడో దఫా కూడా గెలిపిస్తారని నమ్ముతున్నానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శ్రీనగర్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధిని చూసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. శ్రీనగర్‌కాలనీ, సోనాభాయి ఆలయం, ఎల్లారెడ్డిగూడ, సమాజం చౌరస్తా, వడ్డెర బస్తీ, సుభాష్‌నగర్, హబీబ్‌బేగ్, సంజయ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. బీఆర్ఎస్ నేతలు మధుయాదవ్, రజాక్, మారుతీ, చిన్న, బాబూమోహన్, జగన్, సోనీ, ఫయాజ్, సంతోష్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ టికెట్‌ను బీసీలకు కేటాయించాలి



వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ టికెట్‌ను స్థానికంగా ఉన్న బీసీలకే కేటాయించాలని మాజీ కార్పొరేటర్ జి.మురళీగౌడ్ కోరారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మురళీగౌడ్ సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన యూసుఫ్‌గూడలో విలేకరులతో మాట్లాడుతూ... కొంతకాలంగా తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానన్నారు. నియోజకవర్గంలో కార్పొరేటర్లుగా తనతో పాటు తన కుమారుడు కూడా విశేష సేవలందించి ప్రజలకు మరింతగా చేరువైనట్లు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ప్రతి సమస్య పరిష్కరించడంలో శాయశక్తులా కృషి చేసినట్లు తెలియజేశారు. ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలిచాక అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. నియోజకవర్గంలో బీసీలే అధిక శాతం మంది ఉన్నారని, వారంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని, పార్టీ అధిష్టానం కూడా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున స్థానికంగా ఉన్న తనకు ఈ సీటును కేటాయించాలని కోరారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-18లోని శ్రీ సీతారమ స్వామి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ నరసింహం దంపతులు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం, ధ్వజ స్తంభ పతాక ఆవిష్కరణ, గోపూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం కూడా వేడుకలు జరుగుతాయి.

2014 టు 2024... నారా – పవన్ ఉమ్మడి సమర్పణలో...

మోసానికి మళ్లీ రెడీ

- మరోసారి మోసపూరిత హామీలతో ఉమ్మడి మేనిఫెస్టోకు బాబు– పవన్ రెడీ
- 2014 ఎన్నికల్లో కూడా పవన్ ఫొటోతో మేనిఫెస్టోను విడుదల చేసిన టీడీపీ
- హామీలంటూ కరపత్రాలపై చంద్రబాబు–పవన్ ఉమ్మడి సంతకాలు
- ఎన్నికల్లో గెలిచాక హామీలు గాలికి...

(సాక్షి, అమరావతి)



2014 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ ఫొటోలతో పత్రికలకు విడుదల చేసిన టీడీపీ మేనిఫెస్టో

పదేళ్ల కిందట కలసికట్టుగా మేనిఫెస్టో విడుదల చేసి, ఎన్నికల్లో గెలిచాక దాన్ని చెత్తబుట్టలో పడేసిన చంద్రబాబు– పవన్ కల్యాణ్‌ల ద్వయం... మళ్లీ అదే మోసానికి ఒడిగడుతోంది. పైపెచ్చు ఇదేదో ఇప్పుడే తొలిసారి చేస్తున్నట్లుగా... తెలుగుదేశం– జనసేన తొలి ఉమ్మడి మేనిఫెస్టో అనే కలరింగుతో జవన్ కల్యాణ్ ఊదరగొట్టేస్తున్నారు. మరి 2014 ఎన్నికల మేనిఫెస్టో సంగతేంటి పవన్ కల్యాణ్? ఆ మేనిఫెస్టోపై చంద్రబాబుతో పాటు మీ ఫొటో కూడా ఉందిగా? 'టీడీపీకి ఓట్లేయండి.. హామీలు అమలు చేసే బాధ్యత నాది'అని 2014 ఎన్నికల్లో బహిరంగంగా టీడీపీ తరఫున ప్రజలకు పూచీకత్తుగా నిలిచారుగా? టీడీపీ గెలిచిన తరవాత హామీలను అమలు చేయకపోయినా ఒక్కసారైనా ప్రశ్నించారా? అసలు మేనిఫెస్టోనే కనిపించకుండా వెబ్‌సైట్ నుంచి మాయం చేసేసిన చంద్రబాబు నాయుడిని ఎన్నడైనా నిలదీశారా? మళ్లీ ఇపుడు ఏం మొహం పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టో కథ అల్లుతున్నారు? మీరు తెలుగుదేశాన్ని నిలదీస్తారంటే నమ్మేదెవరు? మీరు హీరోలా ఒక్క సీన్లోనూ కనిపించని సినిమాను అదే స్క్రీన్‌ప్లే, డైలాగులతో మళ్లీ మళ్లీ జనం ముందుకు తెస్తే మాత్రం చూసేదెవరు?

ఎప్పుడో పదేళ్ల క్రితం జరిగింది కాబట్టి ఇప్పుడు జనం ఆ మోసాన్ని మర్చిపోయి ఉంటారులే అనుకుంటూ చంద్రబాబు నాయుడు– పవన్ కల్యాణ్ మళ్లీ అదే స్కీముతో జనం ముందుకు రావటం ఆంధ్రప్రదేశ్‌లో ఇపుడు చర్చనీయమవుతోంది. పదేళ్ల కిందట 2014 ఎన్నికల్లో... టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను నెత్తికెత్తుకున్నానని, అమలు చేయకుంటే నిలదీసే బాధ్యత కూడా తనదేనంటూ పవన్‌కళ్యాణ్ ప్రజలకు వాగ్దానమిచ్చారు. 2014–19 మధ్య ఒక్క హామీ విషయంలో కూడా దాన్ని నిలబెట్టుకోకుండా... మళ్లీ ఇపుడు పదేళ్ల కిందటి మాటలే చెబుతుండటం జనాన్ని వంచించటం తప్ప మరొకటి కాదనేది రాజకీయ విశ్లేషకుల మాట. వాస్తవానికి 2014 ఎన్నికల్లో బీజేపీతో కలిసి టీడీపీ– జనసేన ఉమ్మడిగా పోటీ చేశాయి. అప్పట్లో తాము అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీ చేస్తామని, డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామని, ఇంటింటికీ ఓ ఉద్యోగమిస్తామని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని బోలెడన్ని ఆకర్షణీయమైన హామీలు గుప్పించారు. ఈ మోసపూరిత హామీలకు పవన్ కల్యాణ్ గ్యారంటీ ఇచ్చారు. బీజేపీ కూడా వీరితో కలిసి పోటీ చేయటంతో ఈ కూటమి ఎన్నికల్లో గెలిచింది. ఆ వెంటనే చంద్రబాబు హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేశారు. ఏకంగా మేనిఫెస్టోనే తమ పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేశారు. పవన్ సైతం ఈ విషయాన్ని గమనించనట్టే ఉండిపోయారు. అసలు ఏ హామీ గురించి కూడా ఒక్కనాడూ ప్రశ్నించలేదు. గెలిచిన వెంటనే పవన్ ప్యాకేజీ అందుకుని తన వేషాన్ని చాలించారన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి.

మాఫీ జరగకపోయినా పవన్ గప్‌చుప్...

అధికారంలోకి వచ్చాక... బేషరతుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి, ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో 70 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో ఎవ్వరికీ పైసా రుణం కూడా చంద్రబాబు ప్రభుత్వం మాఫీ చేయలేదు. రైతు రుణ మాఫీ విషయంలోనూ అంతే. 2014 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో రైతుల పేరిట రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలుండగా, కోటయ్య కమిటీ పేరుతో కాలయాపన చేసి, ఆ ఐదేళ్లలో కేవలం రూ.15 వేల కోట్ల రుణాలను మాత్రమే నాటి చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల ముందు రైతులకిచ్చిన రుణ బాండ్లు చెల్లని కాగితాలయ్యాయి. బాబు రుణ మాఫీ మోసానికి కరువు కూడా తోడవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి రాష్ట్రమంతటా వేలాది ఎకరాలు పంటలు కూడ వేయక బీడుగా మారాయి. అయినా పవన్‌కళ్యాణ్ ఏనాడు నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇంటింటికీ ఉద్యోగమిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం దాన్ని గాలికొదిలేసింది. నిరుద్యగ భృతి కూడా అమలు చేయలేదు. ఇలా లక్షల మంది యువతను మోసం చేసినా పవన్‌కళ్యాణ్ కనీసం దాని గురించి ప్రశ్నించలేదు. చివరకు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల హామీ అమలు చేయకపోయినా ప్రశ్నించకపోవడాన్ని పలువురు కాపు నేతలు గుర్తు చేస్తున్నారు.

జగన్ తీరే వేరు.. తొలిఏడాదే 80 శాతం, నాలుగేళ్లకు 99 శాతం!

ఎన్నికల్లో గెలిచాక మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు– పవన్‌కల్యాణ్ ఒకపక్క ఉంటే.... 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గెలిచాక తు.చ. తప్పకుండా అమలు చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోవైపున నిలిచిన విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే 80 శాతం హామీలను అమలు చేసి చూపించారు. నాలుగేళ్లు పూర్తయ్యే సరికి 99 శాతం హామీలను అమలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన కోవిడ్ సంక్షోభంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నా కూడా హామీల అమల్లో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఇంతటి చిత్తశుద్ధికి మోకాలడ్డుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు వారికి అనుకూలంగా పనిచేసే కొన్ని పత్రికలు తరుచూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవాస్తవ కథనాలు ప్రచురించడం, వాటి ఆధారంగా కొందరు నేతలు వాటిపై కేంద్రానికి ఫిర్యాదులు చేస్తూ రాష్ట్రానికి నిబంధనల ప్రకారం రావాల్సిన నిధులను కేంద్రం నుంచి రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయటం దేశ రాజకీయాల్లో ఏపీలో తప్ప ఎక్కడా లేదని పలువురు గుర్తు చేస్తున్నారు.

'దేవరగట్టు' రక్తసిక్తం



బన్ని ఉత్సవంలో అపశృతి

- చెట్టు కొమ్మ విరిగి పడి ముగ్గురు మృతి
- వైభవంగా మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం

హొళగుంద/ఆలూరు రూరల్ (కర్నూలు): దేవరగట్టు రక్తసిక్తమైంది. ఎప్పటిలానే సంప్రదాయం పైచేయి సాధించింది. కర్రలు కరాళనృత్యం చేయగా, 84 మందికి పైగా గాయపడ్డారు. బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు ఓ చెట్టుపైకి ఎక్కిన భక్తుల్లో కొమ్మ విరిగిపడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన కర్రలు, అగ్గి కాగడాలు, దివిటీలతో కొండ పైకి చేరిన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు మాత మాళమ్మ, మల్లేశ్వరునికి నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు పల్లకీని మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్టించారు. అక్కడి నుంచి మొదలైన జైత్రయాత్ర ఆద్యంతం ఒళ్లు జలదరించేలా ఉత్కంఠగా సాగింది.

చెట్టు కొమ్మ విరిగిపడి ముగ్గురు మృతి..

ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు సత్యనారాయణ కట్టపై ఉన్న రావి చెట్టుపై కూర్చున్న కొమ్మ విరిగి పడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు.

కర్రల సమరంలో 84 మందికి గాయాలు

విజయదశమిని పురస్కరించుకుని మంగళవా రం రాత్రి దేవరగట్టులో జరిగిన బన్ని మహోత్సవంలో ఆదినుంచి వస్తున్న సంప్రదాయమే గెలిచింది. విజయోత్సవంలో భాగంగా జరిగిన జైత్రయాత్రలో గట్టుపై రక్తం చిందింది. ఉత్సవంలో 84 మందికి గాయాలు కాగా అందులో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళ వారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర బుధవారం తెల్లవారు జాము వరకు జరిగింది.

అమిత్‌షాతో పవన్‌కల్యాణ్ భేటీ!

తెలంగాణలో జనసేనతో పొత్తు, సీట్ల సర్దుబాటుపై సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షాతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. జనసేన, బీజేపీ కలసి తెలంగాణలో పోటీ చేస్తాయన్న ప్రచారం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి నివాసంలో అమిత్‌షాతో కిషన్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో రెండు పార్టీల పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. అనంతరం ఇరు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

20 స్థానాల్లో పోటీ చేసేందుకు జనసేన ఆసక్తి?

రాష్ట్రంలో 32కి పైగా సీట్లలో పోటీ చేసేందుకు జనసేన ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జనసేనకు 32 సీట్లు కేటాయిస్తే బీజేపీని నమ్ముకున్న వారికి అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు బీజేపీ నేతలు అమిత్‌షా దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో కనీసం 20 స్థానాల్లో జనసేన అభ్యర్థుల్ని నిలబెట్టాలనే అభ్యర్థనను పవన్ కల్యాణ్ అమిత్‌షా ముందు ఉంచినట్లు సమాచారం. ఈ విషయంపై తుది నిర్ణయంతో పాటు జనసేనకు సీట్ల సర్దుబాటు వంటి అంశాలన్నీ నవంబర్ 1వ తేదీన జరిగే సీఈసీ సమావేశం అనంతరం తేలనున్నాయి.

పవన్ ట్రాప్‌లో తెలంగాణ బీజేపీ?

- చంద్రబాబు చేతుల్లో పావుకు ఎందుకింత ప్రాధాన్యం
- తెలంగాణలో ఏమాత్రం బలంలేని జనసేనతో పొత్తుకు ఎందుకీ వెంపర్లాట...
- బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబు చేతుల్లో పావుగా పనిచేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ట్రాప్‌లో తెలంగాణ బీజేపీ పడుతోందా? అన్న సందేహాలు కమలనాథులను, ఆ పార్టీ శ్రేణులను వెంటాడుతున్నాయి. తెలంగాణలో ఏ మాత్రం బలం లేని,, కనీసం కేడర్ కూడా లేని జనసేనతో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. మరో 35 రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. అర్థంతరంగా జనసేనతో బీజేపీ పొత్తు అని, ఆ పార్టీ ఏకంగా 32 సీట్లు కోరుతోందనే ప్రచారం పార్టీ శ్రేణులను కలవరానికి గురిచేస్తోంది. తెలంగాణలో పొత్తులపై చర్చ అంటూ బుధవారం ఏకంగా కేంద్రహోంమంత్రి అమిత్‌షా సమక్షంలోనే పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమావేశం కావడం బీజేపీ కేడర్‌ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తెలంగాణలో కనీస బలం లేని జనసేనతో పొత్తుకు ఎందుకీ వెంపర్లాట అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏపీలో పొత్తుకోసం ఒత్తిడి తెచ్చేందుకేనా..

ఏపీలో బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కోసం ఒత్తిడి తెచ్చేందుకే తెలంగాణలో బీజేపీతో కలిసి జనసేన పోటీ చేస్తోందన్న వాదనలు బలంగా ఉన్నాయి. ఇందుకు తెరవెనక టీడీపీ అధినేత చంద్రబాబు పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పవన్ కల్యాణ్‌తో కిషన్‌రెడ్డి, డా.లక్ష్మణ్ భేటీకి రెండురోజుల ముందు... వారిద్దరితో గతంలో టీడీపీ–బీజేపీ పొత్తు ఖరారులో కీలకపాత్ర వహించిన ఓ బడాబాబు(రాజ్యాంగ పదవి నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన వ్యక్తి) భేటీ అయ్యారన్న వార్త ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నో ఏళ్ల టీడీపీ పొత్తును వదిలించుకుని, 2018లో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీకి ఇప్పుడు మళ్లీ జనసేనతో పొత్తు అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి ఇప్పుడు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

నేటి నుంచి 'సామాజిక సాధికార యాత్ర'

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏపీ సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తాం..
- ఏపీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతల వెల్లడి

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఏపీ మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేశ్, మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ వ్యవహారాలు) జియావుద్దీన్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు నాయక్‌లు ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మంచిని వివరించి.. ఆయా వర్గాలను ఏకం చేయాలన్న లక్ష్యంతో సామాజిక సాధికార యాత్ర పేరుతో బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ చేపట్టిందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సామాజిక సాధికార యాత్ర బస్సుకు పూజలు చేసి, ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఏపీ వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో మూడు విడతలుగా సామాజిక సాధికార యాత్ర జరుగుతుందన్నారు. తొలి విడత యాత్ర గురువారం ప్రారంభమవుతుందని.. నవంబర్ 9న ముగుస్తుందని చెప్పారు. రోజూ మూడు ప్రాంతాల్లో ఒక్కో నియోజకవర్గంలో ఈ యాత్ర జరుగుతుందని.. సాయంత్రం బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. తొలి విడతలో మూడు ప్రాంతాల్లోని 39 నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగుతుందని వివరించారు. యాత్రలో పేదలందరినీ ఏకం చేసి పెత్తందార్లపై రణభేరి మోగిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సంగ్రామంలో.. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దన్నుగా నిలిచి, పెత్తందార్లను మట్టికరిపించాలని పిలుపునిచ్చారు.

నగర వార్తలు

గంజాయి, నగదు స్వాధీనం

ఐదుగురి అరెస్ట్

గచ్చిబౌలి: నానక్‌రాంగూడలోని ఓ కిరాణా షాపుపై గచ్చిబౌలి పోలీసులు దాడి చేసి ఏడున్నర కిలోల గంజాయి, నగదు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డీఐ పి.రాఘవేందర్ కథనం ప్రకారం... నానక్‌రాంగూడ లోధా బస్తీ నివాసి కలాపతి నీతూ బాయి (45) తన ఇంట్లో ఉన్న కిరాణా దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. డీఐ తమ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం 11 గంటలకు సదరు ఇంటిపై దాడి చేశారు. రూ.4.95 లక్షల నగదు, 7.5 కిలోల గంజాయి, 10 క్వార్టర్ల మద్యం బాటిళ్లు, 17 బీర్లు స్వాధీనం చేసుకున్నారు. నీతూ బాయితో పాటు కళాపతి సిమ్రాన్(20), కళాపతి మమతా బాయి(55), సురేఖ(40), కళాపతి మనుసింగ్ (53)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నీతూ బాయిపై ఇప్పటికే 6 ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 వరకు ఇఫ్లూ సెలవుల పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ) సెలవులను ఈ నెల 29 వరకు పొడిగిస్తూ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 18న రాత్రి ఇఫ్లూ క్యాంపస్ లేడీస్ హాస్టల్‌లో ఓ విద్యార్థిని పై లైంగిక వేధింపుల కారణంగా విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఈ నెల 25 వరకు యూనివర్సిటీకి సెలవులు ప్రకటించిన విషయం విదితమే. తిరిగి ఇఫ్లూలో తరగతులను ప్రారంభిస్తే విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతాయని గమనించిన అధికారులు 29 వరకు విద్యార్థులకు, అధ్యాపకులకు సెలవులను పొడిగించారు. అయితే కార్యాలయాలు, హాస్టల్స్, మెస్‌లు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

28న దుబాయ్‌లో తెలంగాణ దశాబ్ది వేడుకలు

చిక్కడపల్లి: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మనిషా కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహణలో ఈ నెల 28న స్వాతంత్ర భారతికి తెలంగాణ సంగీత హారతి పేరిట దుబాయ్‌లో గాన విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకుడు బాపు శాస్త్రి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దివ్యకాంతి, ప్రశాంతి, శ్వేత, ప్రగతి, మల్లేష్, శశిధర్‌ల గాన విభావరి, చిన్నారి నైశిత నృత్యంలో పాలు పంచుకుంటారన్నారు. ఈ సందర్భంగా నటుడు సాయి కిరణ్, వ్యాపార వేత్త రాంకుమార్, రామ్‌చంద ర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టీఆర్‌కే రావు తదితరులకు సత్కారం చేస్తామన్నారు.

అయ్యో పాపం.. పెద్దాయన

18 ఏళ్లు పంచాయతీ, మున్సిపాలిటీలో వాటర్‌మెన్‌గా విధులు

- ఏడాది కిందట అకారణంగా తొలగించిన మున్సిపల్ అధికారులు
- నేటికీ అందని పీఎఫ్..
- పస్తులతో బస్టాపులో కాలం వెళ్లదీస్తున్న వైనం
- కనీస మానవత్వం చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు





ఎయిర్‌పోర్టు కాలనీ బస్టాప్‌లోనే నిద్రిస్తున్న రాజిరెడ్డి

శంషాబాద్: బస్తీల్లో మంచి నీరందించే విధులు నిర్వహించిన పెద్దాయన ఇప్పుడే అదే బస్తీలో తెలిసిన వాళ్లు ఇచ్చే ఆహారం.. మంచినీళ్లతో కాలం వెళ్లదీస్తున్నాడు.. అకారణంగా ఉన్న ఉద్యోగం తీసేయడంతో అన్యాయమైపోయి బస్టాపే అడ్డాగా బతుకీడుస్తున్నాడు..పద్దెనిమిదేళ్లుగా సేవలందించిన చోటే ఒక్కోపూట పస్తులతో గడిపేస్తున్నాడు.. ప్రజాప్రతినిధులు కానీ.. అధికారులు కానీ.. కనీస మానత్వాన్ని కూడా చూపకపోవడంతో చెమ్మగిల్లిన కళ్లతో తన ఆవేదనను 'సాక్షి'కి వెళ్లబోసుకున్నాడు.. ఆయన మాటల్లోనే..

నా పేరు రాజిరెడ్డి వయసు 62 బతుకుదెరువు కోసం వరంగల్ జిల్లా నుంచి ఇక్కడి వచ్చాను.. ఓ అధికారి ఎయిర్‌పోర్టు కాలనీ నిర్మాణం సమయంలోనే నన్ను కాపలదారుగా పెట్టాడు.. కాలనీ ఏర్పాటు నాటి నుంచి బస్తీలో అన్ని వీధులకు మంచినీరందించే వాటర్ లైన్‌మెన్‌గా 2005 పంచాయతీలో కార్మికుడిగా చేర్చారు. ఇక్కడే వాటర్ ట్యాంక్ ముందు ఉన్న ఓ చిన్నగదిని కూడా ఇచ్చారు. ఎవరితో చెడ్డ పేరు లేకుండా పని చేసుకుంటూ వచ్చాను. గతేడాది ఉద్దేశపూర్వకంగానే నన్ను తీసి మరో వ్యక్తి ఆ పనిలో పెట్టించేందుకు నన్ను కారణంగా లేకుండా తొలగించారు. ఆ తర్వాత యాక్సిడెంట్‌లో కాలికి గాయమైంది. ప్రజాప్రతినిధులు...అధికారులు చుట్టూ రోజుల బడి తిరిగి కారణం చెప్పలేదు.. ఓ కమిషనర్ కాళ్లమీద పడ్డా కనికరించలేదు. కొన్ని రోజుల చెట్లకు నీళ్లు పోయమన్నారు.. ఇప్పుడు అది కూడా లేదు. రూంలోంచి కూడా వెళ్లగొట్టారు. ఇప్పుడు బస్టాపే దిక్కైంది. తెలిసిన వాళ్లు ఏమైనా ఇస్తే తింటున్నా.. లేకపోతే పస్తులే ఉంటున్నా.. నా కొడుకు కూలి పనిచేసుకుంటుండు. పదో తరగతి దాకా చదివిండు. వాడికైనా ఉద్యోగంలో పెట్టుకోమని బతిమాలినా పెట్టుకోవడం లేదు.

పీఎఫ్ గురించి ఎవరు చెప్పడం లేదు..

పద్దెమిదేళ్లుగా పీఎఫ్ కట్ అయితుంది అని చెప్పిన్రు ఇప్పుడు దాని కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు సరిగా చెప్పడం లేదు.. కొందరు పీఎఫ్ ఎక్కడిది అంటున్నరు.. నాకు సమాధానం ఇచ్చే ఓపిక కూడా మున్సిపాలిటీలోని కార్యాలయంలో ఏ ఒక్కరికికూడా లేకపోవడం బాధగా ఉంది. పద్దెనిమిదేళ్ల పాటు పనిచేసినా కనీసం కూడా దయచూపడం లేదు.. అధికారులు.. ప్రజాప్రతినిధులు స్పందించి నాకు పీఎఫ్ డబ్బులు ఇప్పించడంతో పాటు నా కొడుకును ఉద్యోగంలోకి తీసుకొని న్యాయం చేయాలని వేడుకుంటున్నా.

సీఎం అవినీతిపై విచారణ జరపాలి: ఎస్‌పీఐ

గన్‌ఫౌండ్రీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌పీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్రమోని పురుషోత్తమ్ ఆరోపించారు. సీఎం అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతూ బుధవారం సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి గన్‌పార్కు అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్ మాట్లాడుతూ... నీటి పారుదల ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయాల అవినీతి జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించడానికి అధికారులు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్రప్రభుత్వం సీఎం కేసీఆర్ అవినీతిపై తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.రాజేష్, జిల్లా కార్యదర్శి రావుల యూనీస్, రామస్వామి, పలు జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌పీఐ ప్రతినిధులు

ఎమ్మెల్యే పాషా ఖాద్రీ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు



సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా బుధవారం యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ వాహనాన్ని సంతోష్‌నగర్ పోలీసనులు తనిఖీ చేశారు. సంతోష్ నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర ఆధ్వర్యంలో బుధవారం సంతోష్‌నగర్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. అటు వచ్చిన ఎమ్మెల్యే పాషా ఖాద్రీ వాహనాన్ని సైతం తనిఖీ చేశారు. తనిఖీలకు ఎమ్మెల్యే పాషా ఖాద్రీ పూర్తిగా సహకరించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నవకేతన్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం

- ప్యానెల్ బోర్డు విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్స్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- వెంటనే అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం



కాలిపోతున్న కేబుళ్లు



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని నవకేతన్ కాంప్లెక్స్‌లో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. కాంప్లెక్స్ నిర్వాహకులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాలు.. బుధవారం సాయంత్రం 7.45 గంటల ప్రాంతంలో నవకేతన్ కాంప్లెక్స్‌లోని సెల్లార్‌లో ఉండే ప్యానెల్ బోర్డు, విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్స్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున కేబుళ్లు ఉండటంతో అవి అంటుకుని దట్టమైన పొగ అలుముకుంది. చుట్టు పక్కల ప్రాంతాలకు పొగ వ్యాపించడంతో కొద్దిసేపు స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, డీఆర్‌ఎఫ్ బృందాలు, మార్కెట్ పోలీసులు

హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాంప్లెక్స్‌లోని కార్యాలయాల్లో పనిచేసే వారిని అప్రమత్తం చేయడంతో అందరూ బయటకు వచ్చేశారు. సెల్లార్ నుంచి కేబుల్స్ 8వ అంతస్తు వరకు ఉండటంతో అవి అంటుకుని మంటలు 3వ అంతస్తు వరకు చేరాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. కేబుల్ వైర్లు బాల్కాని నుంచి మాత్రమే వెళ్తుండంతో కార్యాలయాల్లోకి మంటలు వ్యాపించలేదు. మంటలు కార్యాలయాల్లోకి వెళ్లి ఉన్నా, పక్కన ఉన్న ఏసీలకు అంటుకుని ఉన్నా పెను ప్రమాదం జరిగి ఉండేది. అలాగే సెల్లార్‌లో మూడు లిథియం బ్యాటరీలు, కేబుల్, రన్నింగ్ బ్యాటరీలు ఉన్నాయి. వాటికి మంటలు అంటుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టైంది. 8వ అంతస్తు వరకు వెళ్లడంతో పాటు అన్ని కార్యాలయాలు, సెల్లార్‌లో పరిశీలించామని కేబుల్స్ మినహా పెద్ద ప్రమాదం ఏదీ జరగలేదని అదనపు డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి తెలిపారు. మెయింటెనెన్స్ సిబ్బంది కూడా ఫైర్ సేఫ్టీ పరికరాలతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు యత్నించారని ఆయన చెప్పారు. నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చామన్నారు. ఈవీడీఎం డైరెక్టర్ కమిషనర్ ప్రకాష్‌రెడ్డి, మార్కెట్, మహంకాళి, రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, పరశురాం, లింగేశ్వర్ తదితరులు ఘటనా స్థలానికి వచ్చారు.

'ఈజిప్ట్ ఆవిర్భావం' పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ఈజిప్ట్‌లో తెలుగుజాతి మూలాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర భూగర్భ గనుల శాఖ పూర్వ సంచాలకుడు డాక్టర్ రాజగోపాల్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సుధా ప్రచురణాలయం, కళాపత్రికల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఎస్.వేణుగోపాల్ రచించిన ఈజిప్ట్ ఆవిర్భావం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.... 4500 సంవత్సరాల క్రితం ఈజిప్ట్ ఆవిర్భావంలో తెలుగు జాతి వైభవం ఉన్నదని పరిశోధనాత్మకంగా రచయిత వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కళాపత్రిక సంపాదకుడు మహ్మద్ రఫీ, సినీ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, రచయిత్రి శశిబాల, అటవీశాఖ అధికారి ఎల్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజగోపాల్ తదితరులు


● అనుష్త కాలియా

శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ ట్రైనీల్లో 32 మంది మహిళలు

● ఈసారి పరేడ్ కమాండర్‌గా ఎంపికైన టాపర్ అనుష్త కాలియా
● యూట్యూబ్ పాఠాలతో 172 ర్యాంక్ కొట్టిన సిమ్రన్ భరద్వాజ్
● న్యాయవాదిగా సఫాయి కార్మికుల కోసం పోరాడిన ఇషాసింగ్
● ఐఏఎస్ నుంచి ఐపీఎస్‌గా సఫలీకృతురాలైన బి. చైతన్యరెడ్డి

ఎవరికి వారే.. మహిళా 'మణులే'!

హైదరాబాద్ శివార్లలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడెమీలో (ఎస్‌వీపీ ఎన్‌పీఏ) శిక్షణ పూర్తి చేసుకున్న 155 మంది ఐపీఎస్ ట్రైనీల్లో 32 మంది మహిళలు ఉన్నారు. అన్ని విభాగాల్లోనూ తన సత్తా చాటి ఓవరాల్ టాపర్‌గా నిలిచిన అనుష్త కాలీయా శుక్రవారం జరిగే పాసింగ్ ఔట్ పరేడ్‌కు (పీఓపీ) నేతృత్వం వహించనున్నారు. ఇలా ఓ మహిళ ట్రైనీ పీఓపీకి నేతృత్వం వహించడం 75 ఏళ్ల అకాడెమీ చరిత్రలో ఇది మూడోసారి. ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులుగా బయటకు రానున్న మహిళామణుల్లో ఉన్న ప్రత్యేకతల గురించి...

గంటకు 16 కిమీ పరిగెత్తే సత్తా సాధించి...

ఢిల్లీకి చెందిన అనుష్త కాలియా ఢిల్లీ యూనివర్సిటీలోని క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ నుంచి డేటా సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. అక్కడే బ్లింకిట్ అనే స్టార్టప్ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలపై ఉన్న ఆసక్తితో ఆరునెలలకే ఈ ఉద్యోగం వదిలారు. కోవిడ్ ప్రభావంతో కోచింగ్ సెంటర్లకు బదులు ఆన్‌లైన్ క్లాసులకు పరిమితం అయ్యారు. లాక్‌డౌన్ కారణంగా ఇతరుల్ని కలవడం తగ్గిపోవడంతో దాన్ని పాజిటివ్‌గా వాడుకుని చదువుకే పరిమితం అయ్యారు. మొదటి ప్రయత్నంలోనే 143వ ర్యాంకు సాధించారు. స్కూలు, కాలేజీ రోజుల్లో బ్యాడ్మింటన్, కరాటే పోటీల్లో పాల్గొన్నారు. అయినప్పటికీ ఎన్‌పీఏలో అడుగు పెట్టే సమయానికి గంటకు కిలోమీటరు దూరం కూడా పరిగెత్తలేని స్థితిలో ఉన్నారు. ఇక్కడి శిక్షణ కారణంగా ప్రస్తుతం గంటకు 16 కిమీ పరిగెత్తే సామర్థ్యాన్ని సాధించారు. ఈ బ్యాచ్‌లో ఓవరాల్ టాపర్‌గా, ఔట్‌డోర్ టాపర్‌గానే కాకుండా పరేడ్ కమాండర్‌గా నిలిచే అవకాశంతోపాటు స్వోర్డ్ ఆఫ్ ఆనర్ సొంతం చేసుకున్నారు.

ప్రజాసేవలో సాంకేతికతని వినియోగించాలన్నదే తన లక్ష్యమని చెప్తున్నారు. ఎన్‌పీఏ శిక్షణలో ఎన్నో అంశాలు నేర్చుకున్నానని, గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో జరిగిన నెల రోజుల జంగిల్ ట్రైనింగ్ మాత్రం కఠినంగా అనిపించిందని చెప్పారు.


● ఇషా సింగ్


● బి. చైతన్యరెడ్డి

లాయర్‌గానే సఫాయి కార్మికుల కోసం...

ముంబైకి చెందిన ఇషా సింగ్ తండ్రి యోగేష్ ప్రతాప్ (వైపీ) సింగ్ ఐపీఎస్ అధికారి అయినప్పటికీ వీఆర్‌ఎస్ తీసుకుని న్యాయవాదిగా మారారు. తల్లి అభాసింగ్ సైతం న్యాయవాది. వైపీ సింగ్ మహారాష్ట్రలో కలకలం సృష్టించిన ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ స్కామ్‌లో బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తున్నారు. 2018లో బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్శిటీ నుంచి ఇషా పట్టా పొందారు. 26వ ఏటనే పీపుల్స్ లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. అక్కడి గోవాండీలో ఉన్న మౌర్య హౌసింగ్ సొసైటీలో 2019 డిసెంబర్ 3న జరిగి ఉదంతం ఇషా దృష్టికి వచ్చింది. అక్కడ సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి ప్రయత్నించిన ముగ్గురు సఫాయి కార్మికులు చనిపోయారు. చనిపోయిన వారి భార్యలకు న్యాయం చేయడం కోసం అసిస్టెన్స్ ఫర్ సఫాయి కరమ్‌చారీ (ఆస్క్) స్థాపించారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సమీకరించి అందించారు. ఇలా మరణించిన వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని 1993 నుంచి మహారాష్ట్ర లో నిబంధనలు ఉన్నా అమలు కాలేదు. దీనిపై ముంబై హైకోర్టులో 2021లో రిట్ దాఖలు చేసి వారి తరఫున పోరాడి వారికి పరిహారం ఇప్పించారు. ఈ కేసుపై అప్పటి జడ్జ్ ఉజ్వల్ భూయాన్ 1993 నుంచి ఇలా చనిపోయిన వారి జాబితా తయారీకి ఆదేశాలు జారీ చేశారు. తండ్రి చూపిన మార్గంలో ఐపీఎస్ కావాలని భావించిన ఇషా రూ.20 లక్షల ప్యాకేజీతో వచ్చిన ఉద్యోగం వదులుకుని రెండో ప్రయత్నంలో 191వ ర్యాంక్ సాధించింది.


● సిమ్రన్ భరద్వాజ్

యూట్యూబ్ చూసి యూపీఎస్సీ పరీక్షలు క్రాక్ చేసి...

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సమీపంలో ఉన్న మావు పట్టణానికి చెందిన సిమ్రన్ భరద్వాజ్ ఢిల్లీ యూనివర్శిటీ నుంచి జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేశారు. తండ్రి ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పని చేస్తుండటంతో సాధారణంగానే యూనిఫామ్ సర్వీసెస్‌పై మక్కువ ఏర్పడింది. తాను నివసించేది చిన్న పట్టణం కావడంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అవసరమైన కోచింగ్ సెంటర్ల వంటి సదుపాయాలు లేవు. దీనికితోడు 2021 జూన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే సివిల్స్ పరీక్ష రాయాల్సి ఉంది. కరోనా ప్రభావంతో కోచింగ్ సెంటర్లు అన్నీ మూతపడ్డాయి. దీంతో యూట్యూబ్ ఛానల్స్‌లో క్లాసులు వింటూ రోజుకు 8 నుంచి 10 గంటల పాటు సివిల్స్‌కు ప్రిపేర్ అయింది. మిగిలిన సమయం కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షకు వెచ్చించింది. కోవిడ్ కారణంగా వాయిదా పడిన ఈ రెండు పరీక్షలు 2021 అక్టోబర్‌లో జరిగాయి. మొదటి ప్రయత్నాల్లోనే సీడీఎస్‌లో ఆరో ర్యాంక్, సివిల్స్‌లో 172వ ర్యాంక్ సాధించింది. 23 ఏళ్ల వయస్సులోనే ఐపీఎస్‌కు ఎంపికైంది. ఎలాంటి ఇతర యాక్టివిటీస్ లేని కోవిడ్ టైమ్ తనకు కలిసి వచ్చిందని సిమ్రన్ చెప్తున్నారు.

ఐఏఎస్ అనుకున్నా ఐపీఎస్‌గా...

వరంగల్‌కు చెందిన బి. చైతన్య రెడ్డి అక్కడి ఎన్‌ఐటీ నుంచి బీటెక్ పూర్తి చేశారు. తండ్రి గ్రూప్–1 ఆఫీసర్‌గా ఉండటంతో సివిల్ సర్వీసెస్‌పై మక్కువ ఏర్పడింది. సివిల్ సర్వెంట్స్‌గా ఉంటేనే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం దక్కుతుందని అని తండ్రి చెప్పిన మాటలు ఆమెలో స్ఫూర్తి నింపాయి. ఇరిగేషన్ శాఖలో ఏఈగా పని చేస్తూనే ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సివిల్స్ వైపు మొగ్గారు. మెయిన్స్‌లో మూడుసార్లు అపజయం ఎదురైనా కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహంతో ముందుకు వెళ్ళారు. సివిల్స్‌తోపాటు కేంద్ర సాయుధ బలగాల్లో ఎంపికకు సంబంధించిన పరీక్షల్నీ రాశారు. దీంతో ఐఏఎస్ నుంచి దృష్టి ఐపీఎస్ వైపు మళ్ళింది. 2022 లో 161వ ర్యాంక్ సాధించి తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యారు.

– శ్రీరంగం కామేష్, సాక్షి సిటీబ్యూరో, హైదరాబాద్ ; ఫొటోలు: ఎస్.ఎస్.ఠాకూర్

పర్యావరణం

వాటర్ ఉమన్

● నదిలో నీళ్లు కాదు కన్నీళ్లు చూసింది



నదుల గొప్పతనం గురించి చెప్పమంటే మాటల్లో ఎన్ని అయినా చెబుతాం. అలాంటి పుణ్య నదులు నిర్లక్ష్యం బారిన పడి జీవం కోల్పోయే పరిస్థితిలో ఉంటే మాత్రం పట్టించుకోము. ఈ ధోరణికి భిన్నమైన మహిళ శిర్ప పథక్. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శిర్పకు నదులు అంటే ఇష్టం. వాటికి సంబంధించిన పురాణ కథలు అంటే ఇష్టం. ఆ ఇష్టంతోనే రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్న పుణ్యనది గోమతి సంరక్షణ కోసం వెయ్యిన్నొక్క కిలోమీటర్ల పాదయాత్ర చేసింది...

సన్నని ప్రవాహమై బయలుదేరే గోమతి ప్రయాణంలో బలపడుతుంది. 'ప్రయాణం గొప్పతనం బలం' అని ఆ నది మౌనంగానే చెబుతుంది. అందుకేనేమో 'గోమతి నదిని రక్షించుకుందాం' నినాదానికి బలం ఇవ్వడానికి పాదయాత్ర చేసింది శిర్ప పథక్.

పారిశ్రామిక వ్యర్థాలు, నివాసాలలో నుంచి వచ్చే మురుగు నీరు... మొదలైన వాటి వల్ల గోమతి అనేక ప్రాంతాలలో కలుషితం అవుతుంది. మురుగునీటి శుద్ధి కర్మాగారాల వల్ల కూడా పెద్దగా ప్రయోజనం జరగడం లేదు.

'గంగానదితో పోల్చితే గోమతి ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటోంది' అని నివేదికలు తెలియజేస్తున్నాయి.

'ఎవరో వస్తారని... ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మన నదిని మనమే రక్షించుకుందాం' అంటుంది శిర్ప.

పంచతత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలైన శిర్ప పథక్ 'వాటర్ ఉమన్'గా పేరు తెచ్చుకుంది. 'గోమతి నదిని రక్షించుకుందాం' నినాదంతో పదిహేను జిల్లాలలో ఊళ్లు, పల్లెలు, పట్టణాల గుండా సాగిన పాదయాత్రలో ఆ పుణ్య నది ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి ప్రజలకు తెలియజేసింది.

'పరిస్థితి ఇది. మనం చేయాల్సింది ఇది' అంటూ స్పష్టంగా చెప్పింది.

ప్రతిరోజు 30 నుంచి 35 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసింది.

'నది ఒడ్డున మొక్కలు నాటుదాం' అని ప్రజలతో ప్రమాణం చేయించింది.

శిర్ప వెంట ప్రజలు వచ్చేవాళ్లు. పర్యావరణ సంబంధిత విషయాలను చర్చిస్తూ ఆమె పాదయాత్ర ముందుకు సాగేది. 'ఆక్రమణలను అడ్డుకుందాం. పుణ్యనదిని కాపాడుకుందాం' అనే నినాదంతో ఎక్కడికక్కడ స్థానిక ప్రజలు, అధికారులతో మాట్లాడేది. ఈ పాదయాత్రలో పాల్గొన్న వందలాది మంది ప్రజలు మొక్కలు నాటడాన్ని ఒక ఉద్యమంలా చేసుకున్నారు.

'నా పాదయాత్రలో భాగంగా నది చుట్టు పక్కల ప్రాంతాలలో నివసించే ఎంతోమందితో మాట్లాడాను. నది పరిస్థితి తెలిసినప్పటికీ ఏంచేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేశాను' అంటుంది శిర్ప.

శిర్ప విషయానికి వస్తే... నదుల సంరక్షణ గురించి పల్లెలు, పట్టణాల గుండా యాత్ర చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో నర్మద నది సంరక్షణ కోసం 3600 కిలోమీటర్ల యాత్ర చేసింది.

'నదులకు ఏమైతే మనకేమిటి? మనం హాయిగానే ఉన్నాం కదా అనే భావన నుంచి బయటికి రావాలి. నదుల మనుగడలోనే మనుషుల మనుగడ ఉంది. ప్రకృతి వనరులే మన శక్తులు. నదులకు ముప్పు వాటిల్లితే మన కుటుంబ పెద్దలకు ముప్పు వాటిల్లినట్లుగా భావించి తక్షణ చర్యలపై దృష్టి పెట్టాలి. మనిషికి రక్తం ఎంత అవసరమో నది ఆరోగ్యానికి కలుషితం కాని నీరు అంతే అవసరం' అంటోంది శిర్ప.


● పాదయాత్రలో ప్రజలతో...

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుదౌన్ జిల్లాకు చెందిన శిర్ప ఉన్నత చదువులు చదివింది. 'ఏదో ఒక ఉద్యోగం చేయడం కంటే నదుల పరిరక్షణకు నా వంతుగా ఏదైనా చేస్తాను' అంటూ ప్రయాణం మొదలు పెట్టింది. ఆ ప్రయాణం వృథా పోలేదని ఎన్నో ఊళ్లలో వచ్చిన మార్పు తెలియజేస్తుంది.

నదిలో నీళ్ల మాత్రమే కాదు ఆ నది కార్చే కన్నీళ్లు కూడా ఉంటాయి. నీళ్ల అందరికీ కనిపిస్తాయి. కన్నీళ్లు కొందరికి మాత్రమే కనిపిస్తాయి. ఆ కొందరు అందరిలో అవగాహన రావడం కోసం ప్రయత్నిస్తారు. అలాంటి ఒక వ్యక్తి... వాటర్ ఉమన్ శిర్ప పథక్.

'నా వల్ల ఏమవుతుంది అనే మాట బలహీనమైనది. నా వల్ల కూడా అవుతుంది అనేది బలమైనది. బలమైన మాటే మన బాట అయినప్పుడు మార్పు సులభం అవుతుంది' అంటుంది శిర్ప పథక్.

చైతన్యం

బతకడానికి ఇల్లు కావాలి



అద్దెకు ఎన్నో ఇళ్లు, ఫ్లాట్లు ఉంటాయి కదా అనిపించవచ్చు. కాని వీల్‌చైర్‌లో మాత్రమే జీవనం గడిపేవారికి ఆ ఇళ్లేవీ పనికి రావు. బెంగళూరులో ఐటి ఇండస్ట్రీలో పని చేస్తున్న మృణ్మయి తను నివసించడానికి బెంగళూరులో తగిన ఫ్లాటే దొరకడం లేదని 'ఎక్స్'లో చేసిన పోస్ట్ విశేషంగా చాలామంది దృష్టిని ఆకర్షించింది. లిఫ్ట్‌లో అడుగు పెట్టడం దగ్గరి నుంచి బాత్‌రూమ్‌ల వరకూ ప్రతీదీ వీల్‌చైర్‌కు వీల్లేనివేనని ఆమె తెలిపింది. ఆమె మాత్రమే కాదు సాధారణ వ్యక్తులకు జబ్బు చేస్తే వీల్‌చైర్‌లో ఆస్పత్రికి వెళ్లిరావడం కూడా దుర్లభమే. మన నిర్మాణ పద్ధతుల్లో మానవీయత రాదా?

'అందరికీ అందుబాటు' (యాక్సెసిబిలిటీ టు ఆల్) అనే మాట వినడానికి చాలా చిన్నదిగా అనిపించవచ్చు. కాని అది ఆచరణ యోగ్యం కావడం ఇంచుమించు అసాధ్యంగా ఉంది మన దేశంలో. 'మా ఇంటికి రండి' అని ఆహ్వానిస్తే అందరూ ఆ ఆహ్వానాన్ని మన్నించగలరా? మన ఇల్లు దివ్యాంగుల రాకపోకలకు అనువుగా ఉందా? నివసించే ఫ్లాట్స్‌లో సులభంగా వీల్‌చైర్‌తో ప్రవేశించడం సాధ్యమవుతుందా? కట్టుకున్న ఇళ్ల మెయిన్‌గేట్‌నైనా వీల్‌చైర్ దాటగలదా? అందరూ మెట్లు వాడగలరని, మెట్లు ఉంటే సరిపోతుందని ఇప్పటికీ భావిస్తున్నామంటే యాక్సెసిబిలిటీ టు ఆల్ హక్కును నిరాకరిస్తున్నట్టే. ర్యాంప్‌లు కట్టి దివ్యాంగుల రాకపోకలను అన్ని ప్రయివేటు, పబ్లిక్ ప్లేసుల్లో సులభం చేసినప్పుడే మెరుగైన సమాజాన్ని ఏర్పాటుచేసుకున్నట్టు.

ఇల్లు కావాలి

బెంగళూరులో అమేజాన్‌లో పనిచేస్తున్న మృణ్మయి 'నాకు ఇల్లు కావాలి. కాని అలాంటి ఇల్లు దొరకడం లేదు' అని 'ఎక్స్' (ట్విటర్)లో తాజాగా పెట్టిన పోస్టు దివ్యాంగుల ఘోషను మరోసారి బయటపెట్టింది. 'నేను ఇన్నాళ్లు ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఉన్నాను. అందులో ర్యాంప్‌లు ఉన్నాయి. నా మోటర్డ్ వీల్‌చైర్‌తో కిందకు రావడం మళ్లీ ఫ్లాట్‌లోకి వెళ్లడం సులభంగా ఉంటుంది. ఫ్లాట్‌లో కూడా ఎలాంటి ఇబ్బందీ లేదు. కాని ఇప్పుడు మా ఫ్లాట్ ఓనర్ ఏవో కారణాల రీత్యా ఖాళీ చేయమన్నాడు. అప్పటి నుంచి తగిన ఫ్లాట్ కోసం ఎంతో వెతుకుతున్నాను. కాని వీల్‌చైర్‌తో రాకపోకలు సాగించేలా ఒక్క ఫ్లాట్ కూడా లేదని తెలపడానికి చింతిస్తున్నాను' అని ఆమె రాసుకొచ్చింది.


● రెస్టారెంట్‌లోకి వెళ్లలేక ఆగిన మృణ్మయి

అన్ని చోట్లా మెట్లే

చాలా ఫ్లాట్లలో లిఫ్ట్ దగ్గర మెట్లు ఉండటం ఒక సమస్యగా మృణ్మయి చెప్పింది. అంటే ఒకటో రెండో మెట్లు ఎక్కి లిఫ్ట్ ఎక్కాలి. కొన్ని లిఫ్టులు చాలా చిన్నవిగా ఉంటాయి. వీల్‌చైర్‌తో ప్రవేశించి లోపల దానిని తిప్పుకుని డోర్ వైపుకు ముఖం పెట్టడం కష్టం. 'అపార్ట్‌మెంట్స్‌లో చాలా ఫ్లాట్లకు గడప అడ్డంగా ఉంటుంది. వీల్‌చైర్‌తో దాటలేము. దాటినా అన్ని ఫ్లాట్లలో బాత్‌రూమ్‌లు ఒక మెట్టు ఎత్తులో ఎందుకు కడతారో అర్థం కాదు. నేను వీల్‌చైర్‌తోటే బాత్‌రూమ్‌లోకి వెళ్లి స్నానం చేయాలి. కాని సింకో, టాయిలెట్ సీటో అడ్డంగా ఉంటుంది. అదీగాక బాత్‌రూమ్ ద్వారాలు మరీ సన్నగా పెడతారు. నా వీల్‌చైర్‌తో అడుగుపెట్టాలంటే అవి కనీసం 25 అంగుళాల వెడల్పు ఉండాలి. అలా ఉండవు' అంటుంది మృణ్మయి. 'మరో సమస్య ఏమిటంటే... ఇలా వీల్‌చైర్‌కు అనువుగా ఉన్న ఫ్లాట్‌లకు రెంట్ ఎక్కువ అడుగుతున్నారు. 25 వేల రూపాయల ఫ్లాట్ 40 వేలు చెబుతున్నారు' అందామె.

యాక్సిడెంట్ వల్ల

మృణ్మయి అందరిలా హుషారుగా తిరిగే అమ్మాయి. కాని 2011లో జరిగిన కారు ప్రమాదం వల్ల ఆమెకు స్పైనల్ కార్డు ఇంజూరీ జరిగింది. సర్జరీ చేసినా రెండు భుజాల కింద ప్రాంతమంతా అధీనాన్ని కోల్పోయింది. అయినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మోటర్డ్ వీల్‌చైర్ ద్వారా ఆమె మామూలు జీవనం గడపడానికి ప్రయత్నిస్తోంది. 'వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తాను. ఆఫీస్ పని కోసం డిక్టేషన్ సాఫ్ట్‌వేర్ వాడతాను. వేళ్ల మీద అధీనం ఉంది కాబట్టి టచ్ స్క్రీన్ ఉపయోగిస్తాను. కాని నాకూ తిరగాలని ఉంటుంది. బయటికొస్తే రెస్టరెంట్‌కు కూడా పోలేను. ప్రతి రెస్టరెంట్‌కూ మెట్లు ఎక్కి వెళ్లాలి. ఎక్కడా ర్యాంప్‌లు ఉండవు. కాళ్లు చేతులు సక్రమంగా ఉన్నవారికే ప్రవేశం అన్నట్టుగా మన నిర్మాణాలు ఉంటాయి. సినిమా హాళ్లు చెప్పే పనే లేదు. టాక్సీ సర్వీసులు కూడా వీల్‌చైర్ ఫ్రెండ్లీ కావు. అందుకే మాలో చాలామంది యాక్సెసబిలిటీ యాక్టివిస్టులుగా మారి సమాజంలో చైతన్యం కలిగించడానికి ప్రయత్నిస్తుంటాం' అని తెలిపింది మృణ్మయి.

'ఎక్స్'లో మృణ్మయి పెట్టిన పోస్ట్‌కు చాలామంది స్పందించారు. నిజంగా మీ ఇబ్బంది మీరు చెప్తుంటే తెలుస్తోంది అని చాలామంది చెప్పారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ఆఫీసులు, పార్కులు, హాస్పిటళ్లు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిదీ దివ్యాంగుల రాకపోకలకు అనువుగా మారడం, మార్చడం తప్పనిసరి. వాటిని వాడేది ఒకరిద్దరైనా ఆ ఒకరిద్దరి హక్కును నిరాకరించే అధికారం మనకు లేదు.

టిప్స్

● ఆకుకూరలు వాడిపోయినట్టుగా కనిపించినప్పుడు... వాటిని చల్లటినీటిలో వేయాలి. దీనిలో టేబుల్ స్పూను నిమ్మరసం వేసి కలిపి ఐదునిమిషాలు పక్కన పెట్టుకోవాలి. తరువాత నీటి నుంచి తీసేయాలి. ఇలా చేస్తే ఆకుకూరలు తిరిగి తాజాగా కనిపిస్తాయి.

● యాపిల్ ముక్కలు కట్ చేసిన వెంటనే ఆ ముక్కలపైన కాసింత నిమ్మరసం పిండితే రంగు మారకుండా ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి.

● ఇరవై తమలపాకులని తీసుకుని శుభ్రంగా కడిగి పేస్టుచేయాలి. ఈ పేస్టులో టీస్పూను నెయ్యి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. గంట తరువాత నీటితో కడిగేయాలి. ఇలా వారానికి ఒకసారి ఈ మాస్క్ వేసుకోవడం వల్ల తమలపాకులోని పోషకాలు అంది జుట్టు మరింత బలంగా దట్టంగా పెరుగుతుంది. జుట్టురాలే సమస్య కూడా తగ్గుముఖం పడుతుంది.

బిజినెస్

విదేశాలకు మన అత్తరు

యురోపియన్, అమెరికన్ పెర్‌ఫ్యూమ్స్ మన దేశీయ అత్తర్ల తయారీపైన తీవ్ర ప్రభావం చూపాయి. మనదైన కళారూపం కనుమరుగవుతోందని గమనించిన క్రతి, వరుణ్ టాండన్ లు అనే అన్నాచెల్లెళ్లు మన దేశీయ సాంస్కృతిక పరిమళ ద్రవ్యాల తయారీని సంరక్షించాలని పూనుకున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జి20 సమ్మిట్‌లో వీరి బ్రాండ్ అఫీషియల్ కానుకల జాబితాలో చేరింది.


● అన్నాచెల్లెళ్లు క్రతి, వరుణ్ టాండన్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కనౌజ్ నగరంలో చాలా కుటుంబాలు అత్తరు తయారీ కళను తరాలుగా కొనసాగిస్తున్నాయి. అయితే, ఈ సంప్రదాయ పద్ధతుల అత్తరు వాడకాలు విదేశీ బ్రాండ్ పర్‌ఫ్యూమ్‌లతో తగ్గిపోయాయి. కనౌజ్‌లో ఉంటున్న క్రతి, వరుణ్ టాండన్‌లు మనసుల్లో ఈ నిజం ఎప్పుడూ భారంగా కదలాడుతుండేది.


తమ ఆలోచనలను కార్యరూపంలో పెట్టడానికి, చేస్తున్న కృషిని ఈ సోదర ద్వయం ఇలా మన ముందుంచుతున్నారు.

''మా చిన్ననాటి నుంచీ ఈ కళను చూస్తూ పెరిగాం. ఈ ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం, ప్రోత్సహించడం పట్ల మా ఆలోచనలు, చర్చలు మా ఇంట్లో ఎప్పుడూ ఉండేవి. కోవిడ్ మహమ్మారి మన దేశీయ పరిమళ ద్రవ్యాలపైన కోలుకోలేనంత దెబ్బ వేసింది. దీంతో మా ఆలోచనలను అమల్లో పెట్టాలని రెండేళ్ల క్రితం 'బూంద్' పేరుతో పరిమళ ద్రవ్యాల కంపెనీ ప్రారంభించాం. మనదైన సాంస్కృతిక కళపై చిన్న డాక్యుమెంటరీ రూపొందించి, ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేశాం. దీంతో ఆర్డర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది' అని వివరిస్తుంది క్రతి.


● అత్తరు తయారీ

కుటుంబ సభ్యులు కూడా...

కనౌజ్ పరిమళ ద్రవ్యాల కళాకారులు అత్తర్లను తయారుచేయడానికి 'డెగ్–భాప్కా' పద్ధతిని ఉపయోగిస్తారు. సంప్రదాయ ప్రక్రియలో సుగంధద్రవ్యాల ముడిపదార్థాలను ఉపయోగించి, మట్టి పాత్రలలో తయారుచేస్తారు. మార్కెట్‌లోని ఇతర బ్రాండ్స్ ధరలతో పోల్చితే తక్కువ, సువాసనల ఉపయోగాలు ఎక్కువ. పెరుగుతున్న డిమాండ్‌ను బట్టి ధరలలో మార్పు ఉంటుంది. యుఎస్, యూరోప్, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలకు 20 వేల కంటే ఎక్కువ ఆర్డర్లు పంపించాం. ఈకామర్స్ ప్లాట్‌ఫార మ్‌లలో విక్రయించడమే కాకుండా, ముంబై, జైపూర్‌లలో రిటైల్ స్పేస్‌లోకి కూడా ప్రవేశించాం. మా నాన్న రచనలు చేస్తుంటారు. తన అందమైన కవిత్వాన్ని ఈ అత్తరు పరిమళాలతో జోడిస్తాడు. దీంతో సువాసనలకు మరింత ఆకర్షణ తోడైంది. ఇప్పుడు మా బ్రాండ్‌కి 12 మంది కళాకారులతో పాటు మా కుటుంబసభ్యులు కూడా కొత్త పరిమళాలను తయారుచేసేందుకు కృషి చేస్తున్నారు' అని వివరిస్తున్నారు ఈ సోదర సోదరీ ద్వయం.


● క్రతి, వరుణ్‌ల తండ్రి

చేస్తున్న ఉద్యోగాలు వదిలి...

జర్మనీలోని కార్పొరేట్ కంపెనీలో పని చేసే క్రతి అక్కడి నుండి స్వదేశానికి చేరుకుంది. ముంబైలో చిత్రనిర్మాణ రంగంలో ఉన్న వరుణ్ కూడా స్వస్థలానికి చేరుకున్నాడు. 'మేం మొదట ఈ బ్రాండ్‌ను ఏర్పాటు చేయాలనుకోలేదు. అత్తరు తయారీ కళాకారులకు జీవనోపాధి కల్పించాలనుకున్నాం. వీరు ఆదాయ వనరుల కోసం అన్వేషిస్తే ఏదైనా పని దొరుకుతుంది. కానీ, మనదైన కళ కనుమరుగవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బ్రాండ్ తీసుకొచ్చాం. ఒకే రోజులో 100 ఆర్డర్లు వచ్చాయి. ఏడాదిలో యాభై శాతం వృద్ధి వచ్చింది. ఆ తర్వాత నెలవారీ ఆర్డర్లు వెయ్యికి మించిపోయాయి. సెలబ్రిటీలు విక్కీ కౌశల్, కత్రినా కైఫ్‌లతో సహా బాలీవుడ్ వివాహాలలో మా అత్తరు పరిమళాలు వెదజల్లింది. ముఖ్యంగా ఢిల్లీలో నిర్వహించిన జి 20 సమ్మిట్‌లో 2023కి అధికారిక కానుకల భాగస్వామ్యంలో బూంద్ బ్రాండ్ ఒకటిగా ఎంపికయ్యింది. జి20 సమ్మిట్‌లో పాల్గొనడం, మా చిన్న వ్యాపారానికి గొప్ప ముందడుగుగా పనిచేసింది' అని వివరిస్తారు వరుణ్.

ఒక ఆలోచనను అమలులో పెట్టడంతో వారి కుటుంబాన్నే కాదు మరికొన్ని కుటుంబాలకు ఆదాయ వనరుగా మారింది. మన దేశీయ వారసత్వ కళ ముందు తరాలకు మరింత పరిమళాలతో పరిచయం అవుతోంది.



ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కూ హార్దిక్ పాండ్యా దూరం

స్వదేశంలో జరుగుతున్న వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరో మ్యాచ్‌కు దూరం కానున్నాడు. ఈనెల 19న బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయానికి గురైన పాండ్యా 22న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగలేక పోయాడు. ఈనెల 29న లక్నోలో ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌కూ హార్దిక్ దూరమయ్యాడు. నేడు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో పాండ్యా ఫిట్‌నెస్ పరీక్షలో పాల్గొంటాడు. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా పాండ్యా జాతీయ జట్టుకు మళ్లీ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడో తెలుస్తుంది.

టాప్ ర్యాంక్‌కు చేరువలో శుబ్‌మన్ గిల్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ నంబర్‌వన్ స్థానాన్ని అందుకునే దిశగా సాగుతున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ 823 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ (829 పాయింట్లు), గిల్ మధ్య వ్యత్యాసం కేవలం ఆరు పాయింట్లే ఉంది. తదుపరి మ్యాచ్‌ల్లో బాబర్ విఫలమై, గిల్ సఫలమైతే టాప్ ర్యాంక్‌ను అందుకుంటాడు.

భారత మహిళల క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా అమోల్ మజుందార్



న్యూఢిల్లీ: దేశవాళీ దిగ్గజం, ముంబై జట్టు మాజీ కెప్టెన్ అమోల్ మజుందార్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా నియమించారు. కొన్ని నెలల క్రితం సులక్షణ నాయక్, అశోక్ మల్హోత్రా, జతిన్ పరంజపేలతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ ఈ పదవి కోసం పలువురిని ఇంటర్వ్యూ చేసింది. తుదకు 48 ఏళ్ల అమోల్ మజుందార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. అమోల్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచ్‌లు ఆడి 11,167 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 60 అర్ధ సెంచరీలు ఉన్నాయి. రంజీ జట్టు టైటిల్ నెగ్గిన ముంబై జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించిన అమోల్ తదనంతరం దేశవాళీ క్రికెట్‌లో అస్సాం, ఆంధ్ర జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించి 2014లో ఆటకు వీడ్కోలు పలికి కోచింగ్‌వైపు వచ్చాడు. ఐపీఎల్ జట్టు రాజస్తాన్ రాయల్స్‌కు మూడు సీజన్‌లపాటు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించాడు.

ముంబైకి హైదరాబాద్ షాక్

జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు సంచలనం సృష్టించింది. రహానే సారథ్యంలోని డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టును తిలక్ వర్మ కెప్టెన్సీలోని హైదరాబాద్ జట్టు 23 పరుగుల తేడాతో ఓడించింది. ఈ టోర్నీలో హైదరాబాద్‌కిది ఐదో విజయం. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 155 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (46 బంతుల్లో 59; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (26 బంతుల్లో 37; 4 ఫోర్లు), చందన్ సహని (23 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. తిలక్ వర్మ (6), రోహిత్ రాయుడు (8) తక్కువ స్కోరుకే అవుటయ్యారు. అనంతరం 156 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులు చేసి ఓడిపోయింది. మీడియం పేసర్ రవితేజ 32 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... తిలక్ వర్మ 2 వికెట్లు తీసి ముంబై జట్టును దెబ్బ కొట్టారు. ప్రస్తుతం ముంబై, హైదరాబాద్, బరోడా జట్లు 20 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి.



రవితేజ

మ్యాక్స్‌వెల్ విధ్వంసం

- ప్రపంచకప్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ
- 40 బంతుల్లోనే శతకం పూర్తి
- వార్నర్ ఖాతాలో రెండో సెంచరీ
- చెలరేగిన స్మిత్, లబుషేన్
- 309 పరుగులతో నెదర్లాండ్స్‌పై ఆస్ట్రేలియా బ్రహ్మాండ విజయం



న్యూఢిల్లీ: ప్రత్యర్థులు బహు పరాక్! వన్డే ప్రపంచకప్‌లో ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా ఫామ్‌లోకి వచ్చేసింది. క్రికెట్ కూన నెదర్లాండ్స్‌ను హడలెత్తించింది. ఏకంగా 309 పరుగుల తేడాతో అఖండ విజయం సాధించింది. ప్రపంచకప్ చరిత్రలో పరుగుల పరంగా ఇదే అతి పెద్ద విజయం కాగా... వన్డే ఫార్మాట్ చరిత్రలో రెండో అతి పెద్ద విజయంగా నమోదైంది. తన ఫామ్ కొనసాగిస్తూ డేవిడ్ వార్నర్ (93 బంతుల్లో 104; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) వరుసగా రెండో సెంచరీ చేయగా... స్టీవ్ స్మిత్ (68 బంతుల్లో 71; 9 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (47 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. చివర్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ (44 బంతుల్లో 106; 9 ఫోర్లు, 8 సిక్సర్లు) నెదర్లాండ్స్ బౌలర్ల భరతం పట్టి... వీర విధ్వంసం సృష్టించి... ప్రపంచకప్ చరిత్రలోనే వేగవంతమైన సెంచరీని సాధించాడు. 40 బంతుల్లో మ్యాక్స్‌వెల్ 100 పరుగులు పూర్తి చేసి ఇదే టోర్నీలో శ్రీలంకపై దక్షిణాఫ్రికా బ్యాటర్ మార్క్‌రమ్ (49 బంతుల్లో) సాధించిన రికార్డును బద్దలు కొట్టాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీస్కోరు చేసింది. అనంతరం 400 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన నెదర్లాండ్స్ 21 ఓవర్లలో 90 పరుగులకే కుప్పకూలింది. ఆడమ్ జంపా (3-0-8-4) మూడు ఓవర్లతోనే స్పిన్ ఉచ్చు బిగించాడు.

దంచుడు వార్నర్‌తో మొదలైతే...

నాలుగో ఓవర్లోనే ఫామ్‌లో ఉన్న మిచెల్ మార్ష్ (9) అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌లో డచ్ శిబిరానికి కలిగిన ఆనందం ఇదొక్కటే! తర్వాతంతా అలసిపోవడమే! ఎందుకంటే అప్పటికే క్రీజులో ఉన్న వార్నర్‌గానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్మిత్, లబుషేన్‌లు గానీ నెదర్లాండ్స్‌పై కనీస దయ చూపలేదు. బంతిని వదల్లేదు. ఫీల్డర్లను విడిచిపెట్టలేదు. బంతిని, బౌలర్లు, ఫీల్డర్లను కలిపి బలిపీఠం ఎక్కించినట్లుగా వీరబాదుడు బాదేశారు. స్మిత్ 53 బంతుల్లో, వార్నర్ 40 బంతుల్లో అర్ధసెంచరీలు చేశారు. రెండో వికెట్‌కు 132 పరుగుల భాగస్వామ్యం తర్వాత స్మిత్ వెనుదిరిగాడు. తర్వాత లబుషేన్ (42 బంతుల్లో) ఫిఫ్టీ కొడితే... వార్నర్ (91 బంతుల్లో) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరు 84 పరుగులు జోడించారు.



వార్నర్

39వ ఓవర్లో వచ్చి... 40 బంతుల్లో శతక్కొట్టి...

ఓ సెంచరీ, ఇద్దరి ఫిఫ్టీలతోనే ఆసీస్ కథ ముగియలేదు. 39వ ఓవర్లో వచ్చిన మ్యాక్స్‌వెల్ వరల్డ్‌కప్‌లో తన బ్యాట్‌తో కొత్త రాత (రికార్డు) రాశాడు. 48 ఓవర్లలో ఆసీస్ స్కోరు 361/6. మ్యాక్సీ (75 పరుగులతో) సెంచరీకి దూరంగానే ఉన్నాడు. కానీ లీడే వేసిన 49 ఓవర్లో 4, 4, 6, 6, నోబ్ 6, 1, 0లతో ఏకంగా 28 పరుగులు పిండుకోవడంతో 40 బంతుల్లోనే ఎవరి ఊహకందని విధంగా శతకం పూర్తయ్యింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి) అకెర్మన్ (బి) వాన్ బీక్ 9; వార్నర్ (సి) ఆర్యన్ (బి) వాన్ బీక్ 104; స్మిత్ (సి) మెర్వ్ (బి) ఆర్యన్ 71; లబుషేన్ (సి) ఆర్యన్ (బి) లీడే 62; ఇంగ్లిస్ (సి) సైబ్రాండ్ (బి) లీడే 14; మ్యాక్స్‌వెల్ (సి) సైబ్రాండ్ (బి) వాన్ బీక్ 106; గ్రీన్ (రనౌట్) 8; కమిన్స్ (నాటౌట్) 12; స్టార్క్ (సి) అకెర్మన్ (బి) వాన్ బీక్ 0; జంపా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 399. వికెట్ల పతనం:** 1-28, 2-160, 3-244, 4-266, 5-267, 6-290, 7-393, 8-393. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 7-0-59-1, అకెర్మన్ 3-0-19-0, వాన్ బీక్ 10-0-74-4, మికెరన్ 10-0-64-0, విక్రమ్‌జీత్ 4-0-27-0, వాన్‌డెర్ మెర్వ్ 5-0-41-0, బస్ డి లీడే 10-0-115-2.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జీత్ (రనౌట్) 25; మ్యాక్స్ ఓ డౌడ్ (బి) స్టార్క్ 6; అకెర్మన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హాజల్‌వుడ్ 10; సైబ్రాండ్ (సి) వార్నర్ (బి) మార్ష్ 11; లీడే (ఎల్బీడబ్ల్యూ) (బి) కమిన్స్ 4; ఎడ్వర్డ్స్ (నాటౌట్) 12; తేజ (సి) ఇంగ్లిస్ (బి) మార్ష్ 14; వాన్ బీక్ (సి) ఇంగ్లిస్ (బి) జంపా 0; వాన్‌డెర్ మెర్వ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 0; ఆర్యన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 1; మికెరన్ (స్టంప్) ఇంగ్లిస్ (బి) జంపా 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (21 ఓవర్లలో ఆలౌట్) 90. వికెట్ల పతనం:** 1-28, 2-37, 3-47, 4-53, 5-62, 6-84, 7-86, 8-86, 9-90, 10-90. **బౌలింగ్:** స్టార్క్ 4-0-22-1, హాజల్‌వుడ్ 6-0-27-1, కమిన్స్ 4-0-14-1, మార్ష్ 4-0-19-2, జంపా 3-0-8-4.

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X శ్రీలంక
వేదిక: బెంగళూరు
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
దక్షిణాఫ్రికా	5	4	1	8	2.370
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	5	3	2	6	1.193
పాకిస్తాన్	5	2	3	4	-0.400
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253
నెదర్లాండ్స్	5	1	4	2	-1.902

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

115 వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా నెదర్లాండ్స్ ప్లేయర్ లీడే గుర్తింపు పొందాడు. ఈ మ్యాచ్‌లో లీడే 10 ఓవర్లలో 115 పరుగులు ఇచ్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లు మిక్ లూయిస్ (0/113: 2006లో దక్షిణాఫ్రికాపై), ఆడమ్ జంపా (0/113: 2023లో దక్షిణాఫ్రికాపై) పేరిట ఉన్న రికార్డును లీడే అధిగమించాడు.

6 ప్రపంచకప్‌లో ఆరో సెంచరీతో వార్నర్ ఈ టోర్నీలో అత్యధిక శతకాలు సాధించిన క్రికెటర్ల జాబితాలో సచిన్ టెండూల్కర్ సరసన చేరాడు. రోహిత్ శర్మ (7) అగ్రస్థానంలో ఉన్నాడు.

పతకాల పంట

- జావెలిన్ త్రోలో సుమిత్, సుందర్ ప్రపంచ రికార్డులు
- ఆసియా పారా క్రీడల్లో భారత జోరు



సుమిత్

హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. పోటీల మూడో రోజు బుధవారం భారత్ ఖాతాలో 30 పతకాలు చేరాయి. ఇందులో ఆరు స్వర్ణ పతకాలు ఉన్నాయి. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్64 కేటగిరీలో సుమిత్ అంటిల్ కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి పసిడి పతకం గెలిచాడు. సుమిత్ జావెలిన్‌ను 73.29 మీటర్ల దూరం విసిరి 70.83 మీటర్లతో తన పేరిటే ఉన్న పాత ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. జావెలిన్ త్రో ఎఫ్46 కేటగిరీలో భారత్‌కే చెందిన సుందర్ సింగ్ గుర్జర్ కూడా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణ పతకం గెలిచాడు. సుందర్ జావెలిన్‌ను 68.60 మీటర్ల దూరం విసిరి 67.79 మీటర్లతో శ్రీలంక అథ్లెట్ దినేశ్ ముదియన్‌సెలగె పేరిట ఉన్న ప్రపంచ రికార్డును తిరగ రాశాడు. పురుషుల టి11 1500 మీటర్ల విభాగంలో అంకుర్ ధామా, మహిళల టి11 1500 మీటర్ల విభాగంలో రక్షిత రాజు... పురుషుల ఎఫ్37/38 జావెలిన్ త్రో ఈవెంట్‌లో హనే... మహిళల టి47 లాంగ్‌జంప్ ఈవెంట్‌లో నిమిషా బంగారు పతకాలు గెలిచారు.

కాంస్య పతకాలు నెగ్గిన గురు నాయుడు, ప్రియదర్శిని





పనాజీ: జాతీయ క్రీడల్లో భాగంగా బుధవారం వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఒక్కో కాంస్య పతకం లభించింది. పురుషుల 55 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్. గురు నాయుడు ఓవరాల్‌గా 230 కేజీలు బరువెత్తి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. మహిళల 45 కేజీల విభాగంలో తెలంగాణ అమ్మాయి ప్రియదర్శిని మొత్తం 161 కేజీల బరువెత్తి మూడో స్థానంతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

సినిమా

వాస్తవ ఘటనల ఆధారంగా...



● గోపీచంద్ మలినేని, రవితేజ, వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని

'డాన్ శీను, బలుపు, క్రాక్' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా ఓ పవర్‌ఫుల్ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాలోని కీలక పాత్రల్లో దర్శక-నటుడు సెల్వరాఘవన్, ఇందూజ రవిచంద్రన్ నటించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: జీకే విష్ణు.

లీలమ్మో...

వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'ఆదికేశవ'. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నవంబరు 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ చిత్రంలోని 'లీలమ్మో.. లీలమ్మో' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వైష్ణవ్ తేజ్ మాట్లాడుతూ– ''ప్రతిరోజూ సెట్ కళకళలాడుతుండేది. శ్రీలీల, సుదర్శన్‌గారు సెట్‌కి వస్తే ఎక్కువ కళకళలాడేది. ఈ సినిమా షూటింగ్ సరదాగా సాగింది'' అన్నారు. ''ఈ సినిమా ఫస్టాఫ్ వినోదం, సెకండాఫ్ యాక్షన్‌తో ఉంటుంది'' అన్నారు శ్రీకాంత్. ఎన్ రెడ్డి. ''నా పేరుతో ఉన్న తొలి పాట 'లీలమ్మో' నాకు ప్రత్యేకం. పర్‌ఫెక్ట్ మాస్ సాంగ్. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ బాగా కుదిరింది'' అన్నారు శ్రీలీల. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ స్వరపరచిన 'లీలమ్మో..' పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, నకాష్ అజీజ్, ఇంద్రావతి చౌహాన్ పాడారు.



● శ్రీలీల, వైష్ణవ్ తేజ్

ఆనందం ఉప్పొంగుతోంది

\- రజనీకాంత్

రజనీకాంత్ పట్ట లేనంత ఆనందంలో ఉన్నారు. అందుకే ''నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది'' అని ట్వీట్ చేశారాయన. ఈ ఆనందానికి కారణం అమితాబ్ బచ్చన్‌తో 33 ఏళ్ల తర్వాత రజనీ స్క్రీన్ షేర్ చేసుకోవడమే. గతంలో ఈ ఇద్దరూ కలిసి 'అంధా కానూన్ (1983), గిరఫ్తార్ (1985), హమ్' (1991) చిత్రాల్లో నటించారు. ఇన్నేళ్ల తర్వాత వీరి కాంబినేషన్ మళ్లీ కుదిరింది. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనే అమితాబ్ నటిస్తున్నారు. ఈ సందర్భంగా అమితాబ్‌తో తాను ఉన్న ఫొటోను షేర్ చేసి, ''లైకా ప్రొడక్షన్స్‌లో నేను చేస్తున్న నా 170వ సినిమాలో నా గురువు, గొప్ప నటుడు శ్రీ అమితాబ్ బచ్చన్‌తో మళ్లీ కలిసి నటిస్తున్నాను. నా హృదయం ఉప్పొంగుతోంది'' అని ట్వీట్ చేశారు రజనీకాంత్.



● అమితాబ్ బచ్చన్, రజనీకాంత్

కొత్త ప్రయాణం



● రాధిక

కథానాయికగా, ఆ తర్వాత క్యారెక్టర్ నటిగా, నిర్మాతగా చిత్రసీమలో రాధిక ఎన్నో విజయాలు చూశారు. ఇటు బుల్లితెరపైనా నటిగా, నిర్మాతగా ఆమె కెరీర్ హిట్. భారతీరాజా దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కిళక్కే పోగుమ్ రైల్' (1978) ద్వారా కథానాయికగా పరిచయం అయ్యారు రాధిక. ఆ తర్వాత తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో నటించారు. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీగా ఉన్న రాధిక ఫ్రెంచ్‌లో తొలి చిత్రం అంగీకరించారు. ''నా సినిమా కెరీర్‌లో కొత్త ప్రయాణం ఆరంభించాను. ఫ్రెంచ్ సినిమాలో నటించడం నాకో కొత్త అనుభూతి. ఈ కొత్త ప్రయాణానికి ప్రోత్సహించిన శరత్‌కుమార్ (రాధిక భర్త), రేయాన్ (కుమార్తె)లకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు రాధిక. ఈ చిత్రానికి లారెన్స్ వాలిన్ దర్శకుడు.

ఊహకందని సహస్ర

'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా అరుణ్ విక్కీరాల దర్శకత్వంలో రూపొందిన థ్రిల్లింగ్ ఫిల్మ్ 'కాలింగ్ సహస్ర'. వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయాల్, చిరంజీవి పమిడి నిర్మించారు. ''ఈ సినిమాలో సరికొత్త సుధీర్‌ను చూస్తారని నమ్మకంగా చెప్పగలం. ప్రేక్షకులు ఊహించని మలుపులతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా మా సినిమా ఆకట్టుకుంటుంది. సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా పూర్తయ్యాయి. నవంబరులో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని నిర్మాతల్లో ఒకరైన వెంకటేశ్వర్లు కాటూరి వెల్లడించారు. శివబాలాజీ మనోహరన్, రవితేజ నన్నిమాల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: సన్నీ .డి.



● సుడిగాలి సుధీర్

అన్నపూరణి



● నయనతార

అన్నపూరణి (తెలుగులో అన్నపూర్ణ)గా మారారు నయనతార. ఆమె కెరీర్‌లో రూపొందుతున్న 75వ చిత్రానికి 'అన్నపూరణి' టైటిల్‌ను ఖరారు చేసి, టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో బ్రాహ్మణ యువతి అన్నపూరణి పాత్రలో నటిస్తున్నారు నయనతార. అన్నపూరణి పుస్తకం చదువుతూ, ఆ పుస్తకం పేజీల మధ్యలో నాన్ వెజ్ వంటకాల రెసిపీలను చూస్తుండటం, ఆమె అభిరుచులు కుటుంబ సభ్యులకు తెలియకపోవడం వంటి అంశాలు టీజర్‌లో కనిపిస్తాయి. నీలేష్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.

నన్ను తీసేశారా అని భయపడ్డాను

\- చరణ్‌రాజ్



'పలాస' ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. అపర్ణా జనార్దన్, సంకీర్తనా విపిన్ హీరోయిన్లుగా సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా. అజ్జా శ్రీనివాస్ నిర్మించారు. ఈ చిత్రం నవంబరు 3న తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో ఓ కీ రోల్ చేసిన చరణ్‌రాజ్ బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ– ''ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చాను. ఎనిమిదేళ్లు కష్టపడ్డాను. ఆకలి బాధలు అనుభవించాను. ఫలితంగా సినీ ఇండస్ట్రీలో సుదీర్ఘమైన 40 ఏళ్ల కెరీర్ లభించింది. వివిధ భాషల్లో ఐదు వందలకు పైగా సినిమాల్లో విభిన్నమైన పాత్రలు చేశాను. అయితే 'ప్రతిఘటన, జెంటిల్‌మేన్' సినిమాలు నన్నొక నటుడిగా తెలుగు ప్రేక్షకులు గుర్తుపెట్టుకునేలా చేశాయి. ఇక దర్శకుడు సెబాస్టియన్ నాకు 'నరకాసుర' కథ చెప్పినప్పుడు నా పాత్రకు బాగా ఎగ్జయిట్ అయ్యాను. కానీ రెండు నెలలు గడిచినా సెబాస్టియన్‌గారి నుంచి ఫోన్ రాలేదు. మేం చేస్తే కనెక్ట్ కాలేదు. దీంతో 'నరకాసుర'లోంచి నన్ను తీసేశారా అనే భయం కలిగింది. కథా రచనలో భాగంగా జబల్‌పూర్ వెళ్లానని, అందుకే ఫోన్ కలవలేదని, 'నరకాసుర'లో నాకు చెప్పిన పాత్రను నేనే చేస్తున్నట్లుగా సెబాస్టియన్‌గారు ఆ తర్వాత చెప్పారు. అప్పుడు రిలాక్స్ అయ్యాను. ఈ సినిమాలో నా పాత్ర మంచికి మంచి, చెడుకు చెడు అన్నట్లుగా ఉంటుంది. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయని ఓ ప్రత్యేక పాత్రను ఈ సినిమాలో చేశాను. ప్రస్తుతం శ్రీహరిగారి అబ్బాయి మేఘాంశ్ సినిమాలో ఓ కీలక పాత్ర చేస్తున్నాను'' అని అన్నారు.

కళాశాలలో ప్రేమ



● ప్రణవ్, షాజ్ఞ

ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్, రామ్ పటాస్, తేజా గౌడ్, బాంబే పద్మ, శ్రీ మునిచంద్ర, మండపేట మల్లిక జాగుల ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143'. శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించారు. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం టీజర్‌ని డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''ఓ వాస్తవ ఘటన స్ఫూర్తితో ఇంటర్మీడియట్ టీనేజ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందించాం. యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ రోడ్రిగుజ్, నేపథ్య సంగీతం: కమ్రాన్, కెమెరా: నిఖిల్ సురేంద్రన్.

మనిషిలోని వివిధ కోణాలతో..



● అదితీ మైఖేల్, నరేశ్ గౌడ్

'1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం, లజ్జ' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు నరసింహ నంది. తాజాగా 'ప్రభుత్వ సారాయి దుకాణం' టైటిల్‌తో ఆయన తెరకెక్కించనున్న సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి. అదితీ మైఖేల్, వినయ్, మల్లిక్, నరేశ్ గౌడ్, మహంతి, వీరభద్రం, బాలు నాయక్ తదితరులు ప్రధాన పాత్రల్లో ఈ చిత్రం రూపొందనుంది. ''షేక్స్‌పియర్ కథల్లోని పాత్రల ఆధారంగా తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా ఈ సినిమా ఉంటుంది. పగ, ద్వేషం, అసూయ, ప్రేమ.. ఇలా మనిషిలోని వివిధ కోణాలతో ఈ సినిమా కథను తయారు చేశాను. 1980 నాటి పరిస్థితులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలచడం జరిగింది'' అని దర్శకుడు నరసింహ నంది అన్నారు. పరిగి స్రవంతి మల్లిక్, నరేష్ గౌడ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుక్కు, కెమెరా: మహిరెడ్డి పండుగల.

నిజమైన ప్రేమ

గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవీ శర్మ హీరో హీరోయిన్లుగా హర్షా బేజగం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'స్పీడ్ 220'. 'ట్రూ లవ్' అనేది ఉపశీర్షిక. సూర్యనారాయణ, దుర్గారావు, ఆనంద్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసిన నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ– ''అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రం ఉంటుందనిపిస్తోంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ మోపూరి, కెమెరా: క్రాంతికుమార్.



● గణేశ్, ప్రీతి

సాక్షి బిజినెస్
గురువారం
26-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
523	160
64,049	19,122

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,873	▽	267
డోజోన్స్	33,098	▽	43
ఎఫ్‌టీఎస్ఈ 100	7,414	△	25
డాక్స్	14,892	△	12
షాంఘై	2,974	△	12
నికాయ్	31,270	△	208

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	62,334
బంగారం (22 క్యారెట్)	57,140
వెండి (కేజీ)	77,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.33	84.00
£	బ్రిటన్ పౌండ్	[illegible]	99.57	102.92
€	యూరో	[illegible]	86.64	89.73
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.66	56.37
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	51.99	54.28
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.87	61.78
SAR	సౌదీ రియాల్	[illegible]	21.26	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.78	23.51
¥	చైనా యువాన్	[illegible]	10.25	12.22

భారత్‌లోకి దేవూ రీఎంట్రీ...

ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల విభాగంపై దృష్టి

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా దిగ్గజం పోస్కో దేవూ తాజాగా భారత మార్కెట్లోకి రీఎంట్రీ ఇచ్చింది. ఈసారి కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఎలక్ట్రిక్ వాహనాల విభాగంపై దృష్టి పెట్టింది. కెల్వాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయెన్సెస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. లిథియం హైబ్రిడ్ ఇన్వర్టర్లు, ఎల్ఈడీ టీవీలను విక్రయించే కెల్వాన్ .. కొత్తగా దేవూ బ్రాండ్ కింద ఇంధన, విద్యుత్ రంగానికి సంబంధించిన ఉత్పత్తులతో పాటు కన్జూమర్ ఎలక్ట్రానిక్స్‌ను కూడా ప్రవేశపెట్టనుంది. ఇందు కోసం విక్రయాల పరిమాణాన్ని బట్టి తాము సొంతంగా తయారీ ప్లాంటు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, మొత్తం మీద మార్కెటింగ్, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలు మొదలైన వాటిపై వచ్చే మూడేళ్లలో రూ. 300 కోట్ల మేర ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉందని కెల్వాన్ ఎండీ హెచ్ఎస్ భాటియా తెలిపారు. భారత మార్కెట్లో వేగవంతమైన వృద్ధికి అవకాశాలు ఉన్నాయని, కెల్వాన్ ఎలక్ట్రానిక్స్‌తో 10 ఏళ్ల పాటు బ్రాండ్ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నామని దేవూ ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ చాన్ రియు తెలిపారు. తొలి దశలో కార్లు, ద్విచక్ర వాహనాలకు బ్యాటరీలను అందించడంతో పాటు సోలార్ బ్యాటరీలు, ఇన్వర్టర్లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఎల్ఈడీ టీవీలు, ఆడియో స్పీకర్లు, ఎయిర్ ప్యూరిఫయర్లు, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు మొదలైన గృహోపకరణాలను కూడా అందించే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ–బైక్‌లు, ఈ–సైకిల్స్‌నూ ఆవిష్కరించే ప్రణాళికలు ఉన్నట్లు చాన్ రియు వివరించారు.



సియెలోతో ఎంట్రీ..

1995లో దేవూ తొలిసారిగా సియెలో కారుతో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. అటుపైన నెక్సియా, మ్యాటిజ్ కార్లను ప్రవేశపెట్టింది. 2001లో దేవూకి సంబంధించిన చాలా మటుకు అసెట్స్‌ను జనరల్ మోటర్స్ కొనుగోలు చేసింది. అంతిమంగా 2003–04 నుంచి భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. రాబోయే రోజుల్లో భారత్‌లో ఎలక్ట్రిక్ టూ–వీలర్లకు గణనీయంగా డిమాండ్ పెరగవచ్చన్న అంచనాల నేపథ్యంలో, తిరిగి ఇన్నాళ్లకు మళ్లీ దేశీ మార్కెట్లోకి రావడంపై దేవూ కసరత్తు చేస్తోంది.

టెక్ మహీంద్రా లాభం డౌన్

సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 505 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 61 శాతం క్షీణించి రూ. 505 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,299 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 12,864 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 13,130 కోట్ల టర్నోవర్ సాధించింది. ఎన్నో ఆటుపోట్లను చవిచూసిన తన కెరీర్‌లోకెల్లా గత కొన్ని త్రైమాసికాలు అత్యంత క్లిష్టమైనవంటూ టెక్ మహీంద్రా సీఈవో, ఎండీ సీపీ గుర్నానీ పేర్కొన్నారు.



- త్రైమాసికవారీగా 78% వృద్ధితో రూ. 5,300 కోట్లు(64 కోట్ల డాలర్లు) విలువైన డీల్స్ కుదుర్చుకుంది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో రూ. 2,980 కోట్ల విలువైన ఆర్డర్లు పొందింది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 8 శాతంపైగా క్షీణించి 1,50,604కు పరిమితమైంది. గతేడాది క్యూ2లో ఈ సంఖ్య 1,63,912గా నమోదైంది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు వార్షిక ప్రాతిపదికన 20% నుంచి 11%కి దిగివచ్చింది.

ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 1.4% నష్టంతో రూ. 1,140 వద్ద ముగిసింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చేతికి మలేసియా సంస్థ వాటా

11% వాటా కొనుగోలుకు రూ. 831 కోట్ల డీల్

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ సంస్థ జీఎంఆర్ గ్రూప్.. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో వాటాను 74 శాతానికి పెంచుకోనుంది. మలేసియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ బెర్హాద్ (ఎంఏహెచ్‌బీ) నుంచి 11 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు జీఎంఆర్ 10 కోట్ల డాలర్లు (సుమారు రూ. 831 కోట్లు) వెచ్చించనుంది. జీఎంఆర్ నేతృత్వంలో ఏర్పాటైన కన్సార్షియం.. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్(జీహెచ్ఐఏఎల్) ఈ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్)కు జీహెచ్ఐఏఎల్ అనుబంధ సంస్థకాగా.. ఎంఏహెచ్‌బీతో వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది.



కీలక ఆస్తులను కన్సాలిడేట్ చేయడంలో భాగంగా తాజా వాటా కొనుగోలుకి తెరతీసినట్లు జీఎంఆర్ గ్రూప్ తెలియజేసింది. ప్రస్తుతం జీహెచ్ఐఏఎల్‌లో జీఏఎల్‌కు 63 శాతం వాటా ఉంది. తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు 13 శాతం చొప్పున వాటా ఉంది.

సెలెవిదా వెల్‌నెస్ పోర్టల్

Dr.Reddy's

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా సెలెవిదా వెల్‌నెస్ డైరెక్ట్ టు కంజ్యూమర్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా మధుమేహ రోగుల కోసం పలు ఉత్పత్తుల అమ్మకంతోపాటు ఆహార సిఫార్సులు, సమాచారం అందిస్తారు. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ 2019 నుంచి సెలెవిదా బ్రాండ్‌లో న్యూట్రాస్యూటికల్స్ తయారీ చేపడుతోంది. దేశవ్యాప్తంగా 18,000 పైచిలుకు పిన్‌కోడ్స్‌కు వీటిని సరఫరా చేస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-10-2023	
విశాఖ	540–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531–00
విజయవాడ	531–00
రిటైల్ ధర (డజను)	72.00
25-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	515–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

5 రోజులు.. 15 లక్షల కోట్లు!

- మార్కెట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ మరో 523 పాయింట్లు, నిఫ్టీ 160 పాయింట్లు తగ్గుదల



ముంబై: మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో దేశీయంగా కీలక సూచీల పతనం కొనసాగుతోంది. స్టాక్స్ అధిక వేల్యుయేషన్స్‌తో ట్రేడవుతుండటం కూడా దీనికి తోడు కావడంతో బుధవారం మార్కెట్లు మరింత క్షీణించి, ఇన్వెస్టర్ల సంపద ఇంకాస్త కరిగిపోయింది. మొత్తంమీద అయిదు రోజుల్లో రూ. 14.60 లక్షల కోట్ల మేర ఆవిరైపోయింది. బుధవారం సెన్సెక్స్ మరో 523 పాయింట్లు తగ్గి 64,049 పాయింట్ల వద్ద, నిఫ్టీ 160 పాయింట్లు క్షీణించి 19,122 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. గత అయిదు సెషన్లలో సెన్సెక్స్ 2,379 పాయింట్లు, నిఫ్టీ 690 పాయింట్లు పతనమయ్యాయి. బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 309,22,136 కోట్లకు తగ్గింది. 'అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్లు వరుసగా అయిదో సెషన్లోనూ క్షీణించాయి. బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్ దీనికి సారథ్యం వహించాయి. దేశీ స్టాక్స్ అధిక వేల్యుయేషన్స్‌లో ట్రేడవుతుండటం, అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొనడం తదితర పరిణామాల కారణంగా ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు' అని కోటక్ సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగం (రిటైల్) హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. లాభాల స్వీకరణ కోసం ఎదురుచూస్తున్న ఇన్వెస్టర్లకు తగిన పరిస్థితులు ఏర్పడటంతో మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తుతున్నట్లు ఈక్విట్రీ సహ వ్యవస్థాపకుడు పవన్ భరాదియా వివరించారు.

ఇన్ఫీ 3 శాతం డౌన్..

సెన్సెక్స్‌లో ఇన్ఫీ షేర్లు అత్యధికంగా 2.76 శాతం మేర క్షీణించాయి. భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ మొదలైనవి కూడా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎస్‌బీఐ మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ తదితర స్టాక్స్ లాభపడ్డాయి. టెక్ సూచీ 1.39 శాతం, టెలికం 1.29 శాతం, యుటిలిటీస్ 1.25 శాతం మేర క్షీణించగా మెటల్స్ సూచీ మాత్రమే లాభపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 4,237 కోట్లు విక్రయించగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 3,569 కోట్ల మేర కొనుగోళ్లు జరిపారు. అటు అంతర్జాతీయంగా చూస్తే ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై, హాంకాంగ్ లాభపడగా, సియోల్ సూచీలు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు నెగటివ్‌లో ట్రేడయ్యాయి.

యాక్సిస్ బ్యాంక్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 5,864 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 10 శాతం బలపడి రూ. 5,864 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 5,330 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 24,094 కోట్ల నుంచి రూ. 31,660 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 19 శాతం వృద్ధితో రూ. 12,315 కోట్లకు చేరింది.ప్రపంచ భౌగోళిక, రాజకీయ ఆటుపోట్ల మధ్య భారత్ వృద్ధి బాటలోనే సాగుతున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరీ పేర్కొన్నారు.



ఎన్‌పీఏలు డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో యాక్సిస్ బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్లు 0.15% మెరుగై 4.11 శాతాన్ని తాకాయి. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.96% నుంచి రూ. 1.73 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.41 % నుంచి 0.36 శాతానికి వెనకడుగు వేశాయి.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 1% నీరసించి రూ. 955 వద్ద ముగిసింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎఫ్ఎంఎస్‌లో 650 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్).. షార్ట్ సర్వీస్ కమిషన్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన వైద్య అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 650 (పురుషులు–585, మహిళలు–65).
» **అర్హత:** ఎంబీబీఎస్, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి ఎంబీబీఎస్ అభ్యర్థులు 30 ఏళ్లు, పీజీ మెడికల్ అభ్యర్థులు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ,ఫిజికల్, మెడికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.11.2023
» **ఇంటర్వ్యూ తేది:** 21.11.2023 నుంచి
» **ఇంటర్వ్యూ వేదిక:** ఆర్మీ హాస్పిటల్(ఆర్–ఆర్), ఢిల్లీ కంటోన్మెంట్.
» **వెబ్‌సైట్:** www.amcsscentry.gov.in

ఏఏఐ కార్గో లాజిస్టిక్స్‌లో 436 అసిస్టెంట్ సెక్యూరిటీ పోస్టులు

ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్(ఏఏఐసీఎల్ఏఎస్).. దేశవ్యాప్తంగా ఏఏఐసీఎల్ఏఎస్ కేంద్రాల్లో మూడేళ్ల కాలవ్యవధికి ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సెక్యూరిటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 436
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు/ యూనివర్సిటీ/సంస్థ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లిష్, హిందీ లేదా స్థానిక భాషలో మాట్లాడే సామర్థ్యం కలిగి ఉండాలి. **వయసు:** 01.10.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **పోస్టింగ్ స్థలం:** చెన్నై, కోల్‌కతా, గోవా, కోజికోడ్, వారణాసి, శ్రీనగర్, వడోదర, తిరుపతి, వైజాగ్, మధురై,తిరుచ్చి,రాయ్‌పూర్,రాంచీ,భువనేశ్వర్, పోర్ట్ బ్లెయిర్, అగర్తల, గ్వాలియర్, అమృత్‌సర్, లేహ్, డెహ్రాడూన్, పుణె, ఇండోర్, సూరత్.
» **వేతనం:** నెలకు రూ.21,500 నుంచి 22,500
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2023
» **వెబ్‌సైట్:** www.aaiclas.aero

ఐఓసీఎల్‌లో 1720 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) రిఫైనరీ డివిజన్..వివిధ విభాగాల్లో 1720 అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **ఖాళీలున్న రిఫైనరీలు:** గువాహటి, బరౌని, గుజరాత్, హల్దియా, మథుర, పానిపట్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్, డిగ్బోయి, బొంగైగావ్, పారాదీప్.
» **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌లు–869, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు–851. **విభాగాలు:** కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.
» **పోస్టులు:** అటెండెంట్ ఆపరేటర్, ఫిట్టర్, మెకానికల్, సెక్రటేరియల్ అసిస్టెంట్, అకౌంటెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్.
» **అర్హత:** ఖాళీలను అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత ట్రేడ్/విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.10.2023 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2023
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 27.11.2023 నుంచి 02.11.2023 వరకు.
» **రాతపరీక్ష తేది:** 03.12.2023.
» **రాతపరీక్ష ఫలితాల వెల్లడితేది:** 08.12.2023.
» **ధ్రువపత్రాల పరిశీలన తేదీలు:** 13.12.2023 నుంచి 21.12.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.iocl.com

సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023–24

కేంద్ర ప్రభుత్వం.. కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ఉద్దేశించిన 'సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా మొత్తం 82,000 మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తారు. వీటిలో 50 శాతం మహిళలకు కేటాయించారు.

» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్/12వ తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐసీటీఈ/మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/యూనివర్సిటీ/గుర్తింపు పొందిన కళాశాలల్లో డిగ్రీ లేదా పీజీ కోర్సులు చదువుతూ ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం నాలుగున్నర లక్షలకు మించకూడదు. డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులు చేస్తున్న విద్యార్థులు అర్హులు.
» **స్కాలర్‌షిప్:** ఒక్కో విద్యార్థికి ఐదేళ్ల వరకు ఉపకార వేతనం అందిస్తారు. డిగ్రీ స్థాయిలో మూడేళ్ల పాటు ఏటా రూ.12,000, పీజీ స్థాయిలతో రెండేళ్ల పాటు ఏటా రూ.20,000 చెల్లిస్తారు. బీఈ/బీటెక్ కోర్సుల్లో చేరినవారికి మొదటి మూడేళ్లు ఏటా రూ.12,000, చివరి ఏడాది, రూ.20,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** www.scholarships.gov.in

నేరాల గుట్టు విప్పేలా!

» ఫోరెన్సిక్ సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులు
» ఏఐఎఫ్ఎస్ఈటీతో పేరున్న ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం
» కోర్సులు పూర్తి చేసుకుంటే ఉద్యోగావకాశాలు
» ఏఐఎఫ్ఎస్ఈటీ–2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

నేరాలు, ఘోరాల గుట్టు విప్పే నైపుణ్యాలను అందించే ప్రోగ్రామ్స్.. ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు! ఫోరెన్సిక్ సైన్స్‌లో.. బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను దేశంలోని పలు యూనివర్సిటీలు అందిస్తున్నాయి. వీటిల్లో చేరేందుకు మార్గం.. ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎఫ్ఎస్ఈటీ)!! ప్రస్తుతం ఏఐఎఫ్ఎస్ఈటీ-2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఏఐఎఫ్ఎస్ఈటీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, కోర్సులు-కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



ఏఐఎఫ్ఎస్ఈటీ-2024

ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్ స్కోర్ ఆధారంగా దేశ వ్యాప్తంగా 49 యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో ఫోరెన్సిక్ సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. పలు నివేదికలు, గణాంకాల ప్రకారం–ప్రస్తుతం ఫోరెన్సిక్ నిపుణుల డిమాండ్, సప్లయ్‌లో ఎంతో వ్యత్యాసం ఉంది. కాబట్టి ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులను పూర్తి చేసుకుంటే.. మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

అర్హతలు

- **బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్:** ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లతో ఇంటర్మీడియెట్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్:** బీఎస్సీ లేదా బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్)లో ఉత్తీర్ణత సాధించాలి. ఈ కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

జాతీయ స్థాయి పరీక్ష

ఫోరెన్సిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏఐఎఫ్ఎస్ఈటీ పరీక్షను జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. మొత్తం వంద ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు ఫోరెన్సిక్ సైన్స్ నిర్వచనం, నేరాలు, పోలీస్ వ్యవస్థ, నేర ఘటనాస్థలి, జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్ విభాగాల నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి.

బీఎస్సీ ఎంట్రన్స్‌లోని బయాలజీ, మ్యాథమెటిక్స్‌ల్లో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న ఏదో ఒక విభాగాన్ని ఎంచుకునే వెసులుబాటు ఉంది.

ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు

- ఏఐఎఫ్ఎస్ఈటీలో అడిగే ప్రశ్నలు ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ గ్రూప్ సబ్జెక్ట్‌ల సిలబస్ అంశాల నుంచే ఉంటాయి. విద్యార్థులు తమ గ్రూప్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధిస్తే పరీక్షలో మెరుగైన స్కోర్ సొంతం చేసుకోవచ్చు.
- **బోటనీ:** లివింగ్ అండ్ నాన్ లివింగ్; జెనటిక్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్, ఆరిజన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ లైఫ్, హ్యూమన్ డిజార్డర్స్, యానిమల్ ఫిజియాలజీ; సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ప్లాంట్ ఫిజియాలజీ, రీప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ఎకాలజీ అండ్ ఎకో సిస్టమ్స్.
- **ఫిజిక్స్:** యూనిట్స్ అండ్ మెజర్‌మెంట్స్, మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, లైట్ అండ్ సౌండ్, ఎలక్ట్రిసిటీ అండ్ మ్యాగ్నటిజమ్, మోడ్రన్ ఫిజిక్స్.
- **మ్యాథమెటిక్స్:** రిలేషన్స్ అండ్ ఫంక్షన్స్, ట్రిగ్నోమెట్రిక్ ఫంక్షన్స్, మ్యాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్, ఇంటిగ్రల్స్, 3–డి జామెట్రీ, లీనియర్ ప్రోగ్రామింగ్, సెట్స్, మ్యాథమెటిక్ ఇండక్షన్, కాంప్లెక్స్ నంబర్ అండ్ క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, లీనియర్ ఇన్–ఈక్వాలిటీస్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **కెమిస్ట్రీ:** అటామిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, స్టేట్స్ ఆఫ్ మేటర్, మిక్చర్స్ సొల్యూషన్స్ అండ్ సాల్యుబిలిటీ, పిరియాడిక్ టేబుల్, వాటర్ అండ్ ఆర్గానిక్ కాంపౌండ్ ఇన్ ఎన్విరాన్‌మెంట్.

ఎమ్మెస్సీకి ఇలా

ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ కూడా వంద మార్కులకు 100ప్రశ్నలతో నిర్వహిస్తారు.ఇందులో అడిగే ప్రశ్నల క్లిష్టత స్థాయి డిగ్రీ అకడమిక్స్ స్థాయిలో ఉంటుంది. ఎమ్మెస్సీ ఎంట్రన్స్ అభ్యర్థులు బీఎస్సీ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను చదవాలి.

ఉన్నత విద్య

బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. పలు సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర డీమ్డ్ యూనివర్సిటీలు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ స్పెషలైజేషన్‌ను అందిస్తున్నాయి. ఈ కోర్సులో భాగంగా క్రిమినాలజీ, ఫోరెన్సిక్ ఆంత్రోపాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫోరెన్సిక్ టాక్సికాలజీ తదితర సబ్జెక్ట్‌లను కరిక్యులంలో భాగంగా బోధిస్తారు. ఫలితంగా నేర పరిశోధన, నిఘాకు సంబంధించి మరిన్ని నైపుణ్యాలు సొంతమవుతాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** అక్టోబర్ 28, 2023
- **ఏఐఎఫ్ఎస్ఈటీ–2024 పరీక్ష తేదీ:** అక్టోబర్ 29, 2023
- **ఏఐఎఫ్ఎస్ఈటీ–2024 ఫలితాల వెల్లడి:** అక్టోబర్ 31, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://aifset.com

ఉద్యోగ అవకాశాలు

- ఫోరెన్సిక్ సైన్స్ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ, ప్రైవేటు రెండు రంగాల్లోనూ కొలువులు లభిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సీబీఐ, ఐబీ వంటి ప్రభుత్వ శాఖల్లో కొలువులు సాధించొచ్చు. ప్రైవేట్ రంగంలో ఫార్మాస్యూటికల్ సంస్థలు, ఆస్పత్రులు, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

పలు జాబ్ ప్రొఫైల్స్

- **క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్:** నేరం జరిగిన ప్రాంతంలో ఆధారాల సేకరణ, నేరం జరిగిన తీరును అంచనా వేయడం, ఆధారాలను ల్యాబొరేటరీలో శాస్త్రీయంగా విశ్లేషించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్:** నేరస్తులు లేదా నిందితుల మానసిక పరిస్థితిని విశ్లేషించడం, తద్వారా విచారణ పరంగా వారికున్న మానసిక సన్నద్ధతకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారు. దీని ఆధారంగా సదరు విచారణ చేపట్టే విషయంలో నిర్దిష్ట చర్యలు తీసుకుంటారు.
- **ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్:** అనుమానాస్పద హత్యలు జరిగినప్పుడు ముఖ్యంగా ఎలాంటి భౌతిక దాడుల ఉనికి లేని సందర్భాల్లో హతులు ఏదైనా విష ప్రయోగంతో చనిపోయారా? లేదంటే ఇతర డ్రగ్స్ వినియోగం కారణంగా మరణించారా? వంటి విషయాలను పరిశీలిస్తారు.
- **ఫోరెన్సిక్ స్పీచ్ ఎక్స్‌పర్ట్స్:** ఏదైనా నేరం జరిగినప్పుడు.. సదరు ఘటనా స్థలంలో లభించిన పత్రాలు, సీసీటీవీ ఫుటేజ్‌లు, ఆడియో టేప్‌లను పరిశీలించడం.. సంబంధిత వ్యక్తులను గుర్తించడం వంటి విధులు నిర్ధారిస్తారు. దీని ద్వారా అసలు, నకిలీలను గుర్తించి.. వాటికి సంబంధించి నివేదికలు రూపొందించడం ప్రధాన విధులుగా ఉంటాయి.
- **పాథాలజిస్ట్:** అనుమానాస్పద మృతుల విషయంలో పోస్ట్‌మార్టం ఆధారంగా సహజ మరణమా? లేదా హత్యకు గురయ్యారా లేదా ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనా? అనే విషయాలను గుర్తించడం పాథాలజిస్ట్‌ల ముఖ్య విధులుగా ఉంటున్నాయి.
- **ఫోరెన్సిక్ ఆడిటింగ్:** ఇటీవల కాలంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కీలకంగా నిలుస్తున్న మరో జాబ్ ప్రొఫైల్.. ఫోరెన్సిక్ ఆడిటింగ్. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన సంస్థలకు సంబంధించిన పత్రాలను విశ్లేషించడం, అవకతవకలు జరిగిన విభాగాలను లేదా వ్యక్తులను గుర్తించడం వంటి విధులు వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనాలు

నేర నిర్ధారణ, నిందితుల గుర్తింపులో ఎంతో కీలకంగా నిలుస్తున్న ఫోరెన్సిక్ నిపుణులకు వేతనాలు కూడా భారీగానే లభిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ రంగంలో అడుగుపెట్టిన వారికి నైపుణ్యాలను బట్టి నెలకు రూ.50 వేల వరకు వేతనం లభిస్తోంది. పీజీ, పీహెచ్‌డీ పట్టాలతో ఫోరెన్సిక్ లేబొరేటరీల్లో పని చేసే వారికి రూ.లక్ష వరకు వేతనం అందుతోంది.

క్లుప్తంగా...

పద్మశ్రీ శంతన్‌నారాయణ్‌కు ఓయూ గౌరవ డాక్టరేట్

31న స్నాతకోత్సవంలో ప్రదానం



న్యూఢిల్లీ: ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌కు అమెరికాకు చెందిన అడోబ్ కంపెనీ చైర్మన్, అధ్యక్షుడు, సీఈవో పద్మశ్రీ శంతన్‌నారాయణ్‌ను ఎంపిక చేశారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఓయూ 83వ స్నాతకోత్సవంలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. గత స్నాతకోత్సవంలో అప్పటి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణకు ఓయూ 48వ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయగా.. 49వ గౌరవ డాక్టరేట్‌కు అడోబ్ సీఈవో పద్మశ్రీ శంతన్‌నారాయణ్‌ను ఎంపిక చేశారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో ఆన్‌లైన్ కంప్యూటర్ సైన్స్ మాస్టర్స్ ప్రోగ్రామ్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 25వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఎడ్‌టెక్ లీడర్ టాలెంట్‌స్ప్రింట్ సహకారంతో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏఐ ఎంఎల్ డొమైన్‌లో స్పెషలైజేషన్‌తో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్‌ను పరిచయం చేస్తుంది. ఈ ప్రోగ్రామ్ ఇంటరాక్టివ్ వర్చువల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రభావితం చేయనుంది. రెండేళ్ల ఈ ఆన్‌లైన్ మాస్టర్స్ ప్రోగ్రామ్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ షెడ్యూల్‌కు అనుగుణంగా రూపొందించారు. అధ్యాపకులతో ప్రత్యక్షంగా విద్యార్థులు ఇంటరాక్టివ్ సెషన్‌లలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఈ కోర్సు ఉపాధిని మెరుగుపరిచేలా ఉంటుంది. ఈ కోర్సును పూర్తి చేసినవారు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రతిష్టాత్మకమైన సర్టిఫికెట్‌ను అందుకుంటారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టామని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ పీజే నారాయణన్ తెలిపారు. టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ, ఎం.డీ.శాంతను పాల్ మాట్లాడుతూ టెక్ టాలెంట్‌ను పెంపొందించడంలో మా నిబద్ధతకు నిదర్శనం ఈ కోర్సు అని పేర్కొన్నారు.

లండన్ మేయర్ బరిలో తరుణ్ గులాటీ



పంజగుట్ట (హైదరాబాద్): లండన్ మేయర్ పదవికి 2024లో జరగనున్న ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు భారతీయ సంతతికి చెందిన తరుణ్ గులాటీ ప్రకటించారు. ఆయన బుధవారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. లండన్ నగరాన్ని ప్రముఖ గ్లోబల్ సిటీగా మార్చడమే తన లక్ష్యమన్నారు. లండన్ వాసులందరూ సురక్షితంగా ఉండేలా కృషి చేస్తానని, నిరుద్యోగులు, తక్కువ ఆదాయం ఉన్న వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని నమ్మే వ్యక్తిగా తనకు లండన్ మేయర్‌గా అవకాశం ఇస్తే చక్కని పాలనందిస్తానని తెలిపారు. ఒక పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తే విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేమని, అందుకే ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలబడనున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ మహిళా విధానాలు, పరిశోధనల ఇన్‌చార్జి కరుణా గోపాల్ మాట్లాడుతూ.. యూకేలోని 18 లక్షల మంది భారతీయుల మద్దతు గులాటీకి లభిస్తుందని తెలిపారు.

30 వేల పీజీ సీట్లు మిగులు

నిలిచిన ఎంఈడీ, ఎంపీఈడీ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని పీజీ కాలేజీల్లో భారీ సంఖ్యలో వివిధ పీజీ కోర్సుల సీట్లు మిగలనున్నాయి. మొత్తం 50 వేల సీట్లకు ఓయూతో పాటు ఇతర వర్సిటీల క్యాంపస్, ఇతర కాలేజీల్లో 20 వేల సీట్లు భర్తీ కానుండగా ప్రభుత్వ, ప్రవేటు కాలేజీలోని వివిధ పీజీ కోర్సుల్లో 30 వేల సీట్లు మిగలనున్నాయి. హాస్టల్ వసతి, మౌలిక వసతులు, అధ్యాపకులు సరిగాలేని పీజీ కాలేజీల్లో విద్యార్థులు చేరడం లేదు. ఇదిలా ఉండగా యూజీసీ ఆదేశాల మేరకు ఈనెల 30 వరకు పీజీ ప్రవేశాలు పూర్తి చేయాలి. కానీ.. టీఎస్‌సీపీజీఈటీ-2023 కౌన్సెలింగ్‌లో ఎంఈడీ, ఎంపీఈడీ ప్రవేశాలు నిలిచిపోయాయి. ఇంత వరకు బీఈడీ, బీపీఈడీ కోర్సుల పరీక్షల ఫలితాలు విడుదల కానందున ఎంఈడీ, ఎంపీఈడీ ప్రవేశాల్లో జాప్యం జరుగుతున్నట్లు టీఎస్ సీపీజీఈటీ-2023 కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు.

బ్రేకులు జామ్.. నిలిచిన రైలు

కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ రైలుకు సమస్య



పోచారం: బ్రేకులు జామ్ కావడంతో కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు యంనంపేట్‌లోని రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం నిలిచిపోయింది. రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని బ్రేకులను సరిచేశారు. పావుగంట సేపు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. స్వల్ప వ్యవధిలోనే సమస్యను పరిష్కరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.



ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమంలో అభివాదం చేస్తున్న కృష్ణమోహన్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, దైవజ్ఞశర్మ, కోదండరామ్, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, మేకపాటి రాజమోహన్ రెడ్డి, గవర్నర్ హరిబాబు, కేంద్రమంత్రి దాదారావు దాన్వె పాటిల్, విజయలక్ష్మి, వీహెచ్, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్రమంత్రి మురళీధరన్, గవర్నర్ రాధాకృష్ణన్, విద్యాసాగర్‌రావు, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, మీనాక్షి, ఎంపీ లక్ష్మణ్ తదితరులు

ఘనంగా దత్తన్న 'అలయ్ బలయ్'

పాల్గొన్న గవర్నర్లు, మాజీ గవర్నర్లు, పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర నేతలు, వివిధ రంగాల ప్రముఖులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా 'దత్తన్న అలయ్ బలయ్'(దసరా ఆత్మీయ సమ్మేళనం) ఉత్సవం ఘనంగా జరిగింది. బుధవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఫౌండేషన్ ప్రస్తుత చైర్మన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ కళారూపాల ప్రదర్శన, తెలంగాణ ప్రత్యేక వంటకాల రుచులు, ఇలా విభిన్న అంశాల సమాహారంగా ఈ కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. అలయ్‌బలయ్ ఫౌండేషన్ బాధ్యులు విజయలక్ష్మి, డా.జిగ్నేశ్‌రెడ్డి దంపతులు, దత్తాత్రేయ, ఆయన వియ్యంకుడు బి.జనార్దనరెడ్డి, గవర్నర్లు, కేంద్రమంత్రులతో కలిసి పూజలు నిర్వహించారు. మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహా పలువురు కేంద్ర సహాయ మంత్రులు, సినీరచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కాంగ్రెస్ నుంచి కె.జానారెడ్డి, వి.హనుమంతరావు, మధుయాష్కీ, వైఎస్సార్‌సీపీ నుంచి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, టీజేఎస్ నుంచి కోదండరాం, బీజేపీ నుంచి డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, వివేక్ వెంకటస్వామి, ఏపీ జితేందర్‌రెడ్డి, డా.బూరనర్సయ్య గౌడ్ ఇతర పార్టీల నేతలు హాజరయ్యారు.

'అలయ్ బలయ్ లేకుండా దసరా పూర్తికాదు'

అలయ్‌బలయ్ లేకుండా దసరా పండుగ పూర్తి కాదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ సంప్రదాయాలు, గ్రామీణ వాతావరణం, కళలు ఉట్టిపడేలా, తెలంగాణ వంటకాల రుచులు చూపిస్తూ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో అద్భుతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆయన కొనియాడారు. అలయ్ బలయ్ అనే పదానికి దత్తాత్రేయ మరోపేరుగా మారారని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఈ కార్యక్రమం అత్యంత శక్తివంతమైనదని జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా, పశ్చిమ సంస్కృతి ప్రభావంలో ఉన్న కొత్తతరానికి మన సంస్కృతి తెలియజేసేలా దీనిని 17 ఏళ్లుగా నిర్వహించడం గొప్ప విషయమని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బండారు దత్తాత్రేయ ఆశయాలు, ఆదర్శాల పరంపరను ఆయన కుమార్తె విజయలక్ష్మి కొనసాగించాలని ఆకాంక్షించారు. కులాలు, మతాలకు అతీతంగా ఐక్యతకు సంకేతంగా ఈ ఉత్సవాలు జరగడం సంతోషదాయకమని కాంగ్రెస్ నేత కె.జానారెడ్డి చెప్పారు. అలయ్ బలయ్ సంస్కృతిపై పరిశోధన జరిపించే విషయంపై రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు విజయలక్ష్మి లేఖలు రాయాలని సీహెచ్ విద్యాసాగరరావు సూచించారు. కార్యక్రమానికి హాజరైన గవర్నర్లు, కేంద్రమంత్రులు మణిపూర్‌లో సుహృద్భావ వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నేత వీహెచ్ అభిప్రాయపడ్డారు. అనేక సిద్ధాంత రాద్ధాంతాలున్నా ఓ మేలుకలయికగా దీనిని నిర్వహించడం గొప్పవిషయమని డా.లక్ష్మణ్ అన్నారు. తెలంగాణది చాలా గొప్ప సంస్కృతి అని, పూలను గౌరమ్మగా చేసి పూజించే సంస్కృతి అని బండారు విజయలక్ష్మి చెప్పారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని, వారసత్వాన్ని చాటేలా అలయ్‌బలయ్‌ను బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టగా, ఇప్పుడు దానిని తాము కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

అలయ్ బలయ్‌కు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు





సాక్షి, హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా అలయ్‌బలయ్ (దసరా సమ్మేళనం) నిర్వహించడం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అలయ్ బలయ్ పట్ల తెలంగాణ ప్రజలకు ద్రౌపదీముర్ము శుభాకాంక్షలు తెలిపారు. కొన్నేళ్లుగా అంకితభావంతో వీటిని నిర్వహించడం, తెలంగాణ సంస్కృతి, కళలను ప్రతిబింబించేలా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఉత్సవాలు తెలంగాణ ప్రజలను దగ్గర చేస్తాయని, వివిధ వర్గాల ప్రజల మధ్య సంబంధాన్ని పెంచుతాయని ఆమె తెలిపారు. సామూహికశక్తి ద్వారా దేశం, రాష్ట్రం అభివృద్ధిలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాయని తాను విశ్వసిస్తానని దత్తాత్రేయకు పంపిన సందేశంలో మోదీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నూతనోత్సాహంతో ఈ ఉత్సవాలు జరుగుతాయని, అలయ్‌బలయ్ మహోత్సవంలో అందరూ భాగస్వాములవుతారని విశ్వసిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంప్రదాయ కళలు, సంస్కృతి, పలు రకాల వంటకాలను ఆస్వాదించడం అభినందనీయమని పేర్కొన్నారు.

జప్తు చేసింది రూ.1.7 కోట్లే!

- రూ.59.93 కోట్ల నగదును పట్టుకున్న పోలీసులు..
- అందులో లెక్కల్లేని నగదుగా రూ.1.7 కోట్లు ఉన్నట్లు నిర్ధారణ
- ఇప్పటికే యజమానులకు రూ.10.99 కోట్ల అప్పగింత
- ఆదాయ పన్నుల శాఖ డీజీ సంజయ్ బహదూర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ కలిపి మొత్తం రూ.59.93 కోట్ల నగదు, 156 కిలోల బంగారం, 454 కిలోల వెండిని స్వాధీనం చేసుకోగా... అందులో రూ.1.76 కోట్లు మాత్రమే లెక్కలు లేని నగదుగా తేల్చి జప్తు చేశామని ఆదాయపు పన్ను శాఖ హైదరాబాద్ ప్రాంత డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్) సంజయ్ బహదూర్ వెల్లడించారు. ఇప్పటికే రూ.10.99 కోట్ల నగదును సంబంధిత యజమానులకు అప్పగించామని, మిగిలిన నగదు విషయంలో దర్యాప్తు పురోగతిలో ఉందన్నారు. బుధవారం ఆయన ఆయకార్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ 1800-425- 1785తో 24 గంటలు పని చేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ల్యాండ్‌లైన్ నంబర్ 040-234262201/ 23426202 లేదా వాట్సాప్/టెలిగ్రామ్ నంబర్ 7013711399ను సంప్రదించవచ్చని చెప్పారు.

అభ్యర్థుల అఫిడవిట్ల పరిశీలన

నామినేషన్లు ముగిసిన తర్వాత అభ్యర్థులు తమ అఫిడవిట్లలో తెలిపిన ఆస్తులు, అప్పుల వివరాలను ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ సహకారంతో తనిఖీ చేస్తామని డీజీ సంజయ్ బహదూర్ తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆరు నెలల్లోగా అభ్యర్థుల ఖర్చులపై ఈసీకి నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. 'రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సహకారంతో బ్యాంకు ఖాతాల నుంచి రూ.10లక్షలకు పైగా నగదు ఉపసంహరణలను పరిశీలిస్తాం. వీసా కోసం ఎవరైనా బంధువుల ఖాతాల నుంచి తమ ఖాతాకి నగదు బదిలీ చేసుకుంటే వారికి మినహాయింపు ఇస్తున్నాం. వ్యాపారంలో ఎవరికైనా అసాధారణ రీతిలో భారీగా ఆదాయం పెరిగినట్టు చూపినా మూలాలను పరిశీలిస్తాం. బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయిన వెంటనే విత్‌డ్రా చేసినా పరిశీలన జరుపుతాం. శంషాబాద్, బేగంపేట విమానాశ్రయాల్లో ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్స్ ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. ఇతర చిన్న విమానాశ్రయాల్లో విమానాల తనిఖీల బాధ్యత జిల్లా కలెక్టర్లదే' అని ఆయన చెప్పారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) అనే యాప్ ద్వారా స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన లెక్కలను పరిశీలన చేస్తున్నట్టు తెలిపారు.

నేటినుంచి మళ్లీ బడులు

13 రోజుల తర్వాత పునః ప్రారంభం

- వెంటాడుతున్న ఎన్నికల వేడి
- పోలింగ్ శిక్షణలో ఉపాధ్యాయులు
- టెస్ట్ సిలబస్‌పై దృష్టి పెట్టాలని ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: దసరా సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు గురువారం నుంచి తిరిగి తెరుచుకోనున్నాయి. ఈ నెల 13వ తేదీ నుంచి విజయదశమి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎన్నికల వేడి నెలకొనడంతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటికే సిలబస్ అనుకున్న మేర పూర్తవ్వలేదు. చాలా స్కూళ్లల్లో 40 శాతం సిలబస్ కూడా పూర్తవ్వలేదు. దీంతో ఎన్నికల లోపు సిలబస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ సూచించింది. రాష్ట్రంలో దాదాపు 80 శాతం మంది టీచర్లు పోలింగ్ విధులకు హాజరవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయి శిక్షణ కూడా ఎన్నికల కమిషన్ పూర్తి చేసింది. ఇప్పుడు జిల్లాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత మండల స్థాయిలో టీచర్లకు శిక్షణ ఇస్తారు. అంటే మరో 15 రోజుల్లో ఉపాధ్యాయులు పూర్తిగా ఎన్నికల శిక్షణలోనే పెద్ద సంఖ్యలో పాల్గొనే వీలుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సిలబస్ పూర్తి చేసేందుకు కచ్చితమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ముఖ్యంగా టెస్ట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. పబ్లిక్ పరీక్షలు కావడంతో సిలబస్ కోసం అదనపు క్లాసులు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అయితే, ఎన్నికల తర్వాత డిసెంబర్‌లో ఈ ప్రక్రియ చేపట్టే వీలుందని చెబుతున్నారు. దసరా వరకూ 70 శాతం సిలబస్ పూర్తవ్వాల్సి ఉంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టాలని, మిగిలిన సిలబస్‌ను డిసెంబర్‌లో ప్రత్యేక క్లాసుల ద్వారా చేపట్టాలని భావిస్తున్నారు.

దశల వారీగా అల్పాహారం..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పూట అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి దసరా తర్వాత దీన్ని అమలు చేయాలని భావించినా, ఎన్నికల షెడ్యూల్ వస్తుందని తెలియడంతో ముందే ప్రారంభించారు. పూర్తి స్థాయిలో అన్ని స్కూళ్ళల్లో దసరా తర్వాత ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని అనుకున్నారు. కానీ ఇందుకు అవసరమైన ప్రణాళిక పూర్తవ్వలేదని అధికారులు చెబుతున్నారు. ప్రతీ స్కూలులో వంట సామాగ్రి, బడ్జెట్ అంశాలపై స్పష్టత లేదంటున్నారు. దీంతో తొలి రోజు మండలానికి ఒక స్కూల్‌లో సీఎం అల్పాహారం పథకం అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రతీ వారం ప్రతీ మండలంలో ఒక్కో స్కూల్ చొప్పున, దశలవారీగా విస్తరించబోతున్నట్టు అధికారులు తెలిపారు.

రూ.340 కోట్లకు పెరిగిన స్వాధీనాలు

బుధవారం రూ.4.44 కోట్ల నగదు, వస్తువుల స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బుధవారం రూ.4.44 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు స్వాధీనం చేసిన నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.340.11 కోట్లకు పెరిగింది. బుధవారం రూ.2.72 కోట్ల నగదు పట్టుకోగా, ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.119.44 కోట్లకు చేరింది. సీఈఓ కార్యాలయం విడుదల చేసిన వివరాలు ఇలా...

అంశం	బుధవారం స్వాధీనం చేసుకున్నది	మొత్తం
నగదు	రూ.2.72 కోట్లు	రూ.119.44 కోట్లు
మద్యం	రూ.96.89 లక్షలు (2916 లీటర్లు)	రూ.18.67 కోట్లు(78,290 లీటర్లు)
డ్రగ్స్	రూ.37.58 లక్షలు (30.73 కిలోల గంజాయి)	రూ.16.94 కోట్లు (3,800 కిలోల గంజాయి)
బంగారం, ఇతరాలు	రూ.6.78 లక్షలు (4.897 కిలోల బంగారం)	రూ.156.07 కోట్లు (894.52 కిలోల బంగారం)
ఇతర వస్తువులు	రూ.30.32 లక్షలు (18,460 కిలోల బియ్యం)	రూ.28.91 కోట్లు (1,89,202 కిలోల బియ్యం)
మొత్తం జప్తుల విలువ	రూ.4.44 కోట్లు	రూ.340.11 కోట్లు

(ఇతర వస్తువుల్లో ల్యాప్‌టాప్, వాహనాలు, కుక్కర్లు, చీరలు ఉన్నాయి. బంగారం, ఇతరాలలో బంగారంతో పాటు వెండి, వజ్రాలు, ప్లాటినం వంటి విలువైన లోహాలున్నాయి)

తప్పులతడకగా స్వాధీనాల రిపోర్టు..

శాసనసభ ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్వాధీనం చేసుకుంటున్న నగదు, ఇతర వస్తువులకు సంబంధించి రోజువారీగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయం విడుదల చేస్తున్న నివేదికలు తప్పులతడకగా ఉంటున్నాయి. బుధవారం 4.897 కిలోల బంగారం, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు, దాని విలువ కేవలం రూ.6.78 లక్షలు మాత్రమే అని ఇచ్చారు. ప్రస్తుత బంగారం మార్కెట్ ధర ప్రకారం దీని విలువ రూ.28 కోట్లకు పైనే ఉండనుంది. దసరా పండుగకి చివరిసారిగా 21వ తేదీన స్వాధీనాల నివేదికను విడుదల చేయగా, అందులో ఆ రోజు 18,460కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు, అప్పటి వరకు మొత్తం 1,89,202 కిలోల బియ్యం స్వాధీనం చేసినట్టు ఉంది. మళ్లీ బుధవారం కూడా అంతే మొత్తంలో బియ్యం స్వాధీనం చేశారని, దీంతో మొత్తం స్వాధీనం చేసిన బియ్యం 1,89,202 కిలోలకు పెరిగిందని తాజా నివేదికలో ఇచ్చారు. దీనిపై సాక్షి వివరణ కోరగా, అచ్చుతప్పు జరిగి ఉండవచ్చు అని అదనపు సీఈఓ లోకేష్ కుమార్ తెలిపారు.

ఐపీఎస్ పాఠ్యాంశాల్లో ప్రవర్తన, నైతిక విలువలు

ఈ ఏడాది నుంచే అమలు చేసిన నేషనల్ పోలీసు అకాడమీ

- సంచలన కేసులు ఛేదించిన వారితో పాఠాలు
- పంజాబ్‌లో ప్రధాని భద్రతలో లోపమూ కేస్ స్టడీగా ఎంపిక
- రేపు జరిగే పాసింగ్ ఔట్ పరేడ్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్ గార్గ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడమీలో (ఎస్‌వీపీఎన్‌పీఏ) ఐపీఎస్ ట్రైనీలకు ఇచ్చే శిక్షణలో ప్రవర్తనకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు డైరెక్టర్ అమిత్ గార్గ్ చెప్పారు. ఇందులోభాగంగా ఈ ఏడాది నుంచి ప్రవర్తన, నైతి క విలువలు, మానవ హక్కులు అనే కొత్త పాఠ్యాంశాన్ని చేర్చామన్నారు. అకాడమీలో తొలి దశ శిక్షణ పూర్తి చేసుకున్న 75వ రెగ్యులర్ రిక్రూటీస్ (ఆర్ ఆర్) బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్ శుక్రవారం జరగనుందని, దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతారని తెలిపారు. అకాడమీలో శిక్షణ పొందిన వాటిలో ఇది 75వ బ్యాచ్ కావడంతో 'అమృత్‌కాల్ బ్యాచ్'గా పరిగణిస్తూ ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం అకాడమీలో జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన వెల్లడించిన వివరాలివీ...

ఎప్పటికప్పుడు శిక్షణను విశ్లేషిస్తూ...

సమకాలీన అవసరాలకు తగ్గట్టు ట్రైనింగ్, పాఠ్యాంశాల్లో మార్పుచేర్పులు చేస్తున్నారు. ప్రవర్తనకు సంబంధించిన అంశాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సైబర్ క్రైమ్ మాడ్యుల్‌ను కొత్తగా చేర్చారు. దేశంలోని ఒక్కో రాష్ట్ర పోలీసు విభాగం ఒక్కో అంశంలో ప్రత్యేకత కలిగి ఉంది. అవన్నీ సమ్మిళితం చేసి ట్రైనీలకు నేర్పిస్తున్నారు. కీలక, సంచలనాత్మక కేసుల్ని దర్యాప్తు చేసిన వారినే గెస్ట్ ఫ్యాకల్టీలుగా పిలిపించి వారి అనుభవాలను ట్రైనీలకు తెలియజేస్తున్నారు. శిక్షణలో అనుష్త కాలియా ఓవరాల్ టాపర్‌గా నిలిచారు. వచ్చే నెల 14 నుంచి 76వ బ్యాచ్ ట్రైనింగ్ మొదలు కానుంది.

మాక్ కోర్టులు సైతం నిర్వహిస్తూ...

సాధారణంగా ఐపీఎస్ అధికారులకు ఎఫ్ఐఆర్, పంచనామా సహా ఇతర రికార్డులు రాసే అవసరం, అవకాశం ఉండదు. అయితే వీటిపై పట్టు ఉంటేనే భవిష్యత్తులో వారి విధి నిర్వహణ పక్కాగా ఉంటుంది. దీంతో వారితోనే కొన్ని చార్జ్‌షీట్లు తయారు చేయిస్తున్నారు. న్యాయవాదులు, రిటైర్డ్ న్యాయమూర్తులతో మాక్ కోర్టులు నిర్వహిస్తూ విచారణ చేయించి రికార్డుల్లోని లోపాలు వారికి తెలిసేలా చేస్తున్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న 75వ బ్యాచ్‌లో 155 మంది (2021, 2022 బ్యాచ్‌ల ఐపీఎస్‌లు) ఉన్నారు. వీళ్ల శిక్షణలోనే కర్ణాటక ఎన్నికలు, హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు తదితర బందోబస్తుల్లో పాల్గొన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేక ఉద్యమం జరుగుతున్నప్పుడు పంజాబ్‌లో ప్రధాని మోదీ కాన్వాయ్‌ను అడ్డుకోవడం, ఆయన సెక్యూరిటీలో తలెత్తిన లోపాలను ఓ కేస్‌స్టడీగా పరిచయం చేశారు. ఇప్పుడు శిక్షణ పొందిన వారిలో తెలంగాణకు 14 (మహిళలు-5, పురుషులు-9) మంది, ఏపీకి 15 (మహిళలు-5, పురుషులు-10) మందిని కేటాయించారు.

ఐఆర్ఎస్ నుంచి ఐపీఎస్‌కు..

"అల్వాల్ మా స్వస్థలం. బీ ఫార్మసీ, ఎంబీఏ పూర్తి చేశా. తండ్రి రిటైర్డ్ జడ్జి. ఆయనకు ఇచ్చిన మాట కోసమే ఐపీఎస్ కావాలనుకున్నా. 2016లో 10 మార్కులు తక్కువ రావడంతో ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యా. బెంగళూరు, గోవాల్లో ఆదాయపు పన్ను శాఖలో ఐదేళ్ల పాటు పని చేశా. 2021లో చివరి ప్రయత్నంలో 155వ ర్యాంక్‌తో ఐపీఎస్ సాధించా. తెలంగాణ కేడర్‌కే అలాట్ కావడం సంతోషంగా ఉంది.

– ఎస్.చిత్తరంజన్, ఐపీఎస్ ట్రైనీ

తెలుగు నేర్చుకోవడమే తొలి లక్ష్యం

మాది మహారాష్ట్ర. ముంబైలోని ఐసీటీ నుంచి కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. తండ్రి అక్కడే ఏఎస్సై, మేనమామ హెడ్-కానిస్టేబుల్. వీరి ప్రోద్బలంతోనే పోలీసు కావాలనుకున్నా. రెండో ప్రయత్నంలో ఐపీఎస్ వచ్చింది. తెలంగాణ కేడర్‌కు అలాట్ అయ్యా. అందుకే తెలుగు నేర్చుకోవడమే నా తొలి లక్ష్యం. అప్పుడే ఇక్కడి ప్రజలతో మమేకం కాగలం.

– చేతన్ పందేరి, ఐపీఎస్ ట్రైనీ

28 కల్లా యూడైస్ అప్‌డేట్ చేయండి

- విద్యా శాఖాధికారులకు పాఠశాల విద్య డైరెక్టరేట్ సూచన
- ప్రైవేటు విద్యా సంస్థల ఆగడాలకు ముకుతాడు వేయొచ్చని యోచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 'యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్'(యూడైస్)లో సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారులకు పాఠశాల విద్య డైరెక్టరేట్ సూచించింది. ఈ ప్రక్రియను ఈ నెల 28లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో చదివే ప్రతీ విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లోకి తేవడం దీని ఉద్దేశ్యం. దీనికోసం ప్రత్యేకంగా ఓ ఫార్మట్ సిద్ధం చేశారు. అన్ని వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫాంను సంబంధిత స్కూల్ హెచ్ఎంల ఆధ్వర్యంలో భర్తీ చేయాల్సి ఉంటుంది. విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాలపై కచ్చితమైన ప్రణాళికకు ఇది తోడ్పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్లు ఇష్టానుసారం అనుమతి లేని తరగతులు నిర్వహించడాన్ని కట్టడి చేయవచ్చని నిపుణులు అంటున్నారు. యూడైస్‌లో విద్యార్థి 1వ తరగతి నుంచి రికార్డు అందుబాటులో ఉంటుంది. 9వ తరగతి వరకూ అతని పేరు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే యూడైస్‌లోకి చేర్చే అవకాశం ఉండదు. ఈ కారణంగా భవిష్యత్‌లో ప్రైవేటు స్కూళ్లు పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉండదు. అయితే ఇప్పటివరకూ విద్యార్థి ఎక్కడ చదివినా, అందుకు సంబంధించిన టీసీ లేకుండానే ఆరవ తరగతిలో చేర్చుకునే వీలుంది. యూడైస్ డేటా కొలమానంగా తీసుకుంటే ఆ విద్యార్థి గత తరగతుల వివరాలు లేకుంటే ప్రభుత్వ స్కూళ్లు కూడా చేర్చుకునే వీలుకాదు. ఇది సమస్యలకు దారి తీస్తుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. దీనిపై ప్రత్యామ్నాయం ఆలోచించాలని సూచిస్తున్నారు.

డీఎస్సీలో డీపీఎస్ఈల భర్తీ ఎందుకు లేదు?

- వివరణివ్వాలని విద్యాశాఖకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రీస్కూల్ విద్యలో డిప్లొమా (డీపీఎస్ఈ)పోస్టుల భర్తీ లేకపోవడంపై వివరణ ఇవ్వాలని అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 7కు వాయిదా వేస్తూ.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ సభ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులకు ఉచిత విద్య అందించడం, డ్రాపౌట్ రేట్‌ను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం-2020లో పేర్కొన్నా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మెదక్ జిల్లాకు చెందిన ఆకుల సురేశ్‌తో పాటు మరో 35 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రీస్కూల్ విద్య అంశం లేదని పేర్కొన్నారు. 4–6 ఏళ్ల మధ్య చిన్నారులకు బడిని అలవాటు చేయడం, విద్యను బోధించే నిమిత్తం తాము ప్రీస్కూల్ విద్యలో డిప్లొమో పూర్తి చేసినా, తెలంగాణలో ప్రీస్కూల్ విద్య కోసం చర్యలు తీసుకోకపోవడం సరికాదని తెలిపారు. డీఎస్సీ ద్వారా తమ నియామకానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.